
అఖిల

అఖిల భారత పత్రిక

జనవరి 2020



దివ్యమాత సంకేతం

దివ్యమాత సంకేతం

విషయసూచిక

సంపాదకీయం: పాండిచేరికి చివరిసారిగా దివ్యమాత వేంచేసిన శత వార్షికోత్సవ విశేషాన్ని సంతరించుకొన్న సంవత్సరం లోనికి ప్రవేశిస్తున్నాం. దివ్యమాత సంకేతంపై దివ్యమాత, శ్రీఅరవిందుల రచనల నుండి యేర్చి కూర్చిన ఆణిముత్యాల సరంతో యీ సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ గౌరవిద్దాం. లోతైన సత్యాన్ని ప్రకటించేది సంకేతం. తంత్ర శాస్త్రంలో యంత్రంగా పిలువబడే రూపం, ఉన్నత సత్యాన్ని ప్రకటించే ఆకృతి మాత్రమే గాక, అది ప్రకటించే లేక ప్రాతినిధ్యం వహించే శక్తులను, తన వైపుకు లాగే, ఆకర్షించే ఒక ఆలంబనంగా కూడా ఉపయోగించేదానిని సంకేతం అంటారు. దివ్యమాత సంకేతం వ్యక్తం చేసే, అభివ్యక్తం చేసే సత్యాలపై విచారణ చేస్తూ, ధ్యానించడం నిజంగా ఒక అద్భుత విషయం. ఏదేమైనప్పటికీ, దాని లోతైన సత్యాన్ని మన అస్తిత్వంలోనే తిరిగి నెలకొల్పుకొన్నట్లైతే, దివ్యమాత సంకేతంతో, మమేక మయ్యేందుకు జరిగే కృషిగా మన జీవితం మొత్తం తయారైతే, అది అత్యంత ప్రయోజనకరమైన దౌతుంది. దానిలోనే, యోగం మొత్తం, మనం అనుసరించ వలసిన మార్గం, మనం యే క్రియాశక్తులకు ఆధారంగా అవ్వాలో, మనం వృద్ధి చెందించుకోవలసిన విశిష్ట లక్షణాలు ఏవో అవి అందులో వున్నాయి. అహన్ని గద్దె దింపి, ఆమె బృహత్తర అనంత పరమ సత్యాన్ని, మన అస్తిత్వ కేంద్రంలో, హృదయంలో అధివసింపజేస్తూ మన జీవితాన్నే ఆమెకు అర్పితమయ్యే చిహ్నంగా తయారు చేసుకోవాలి.

అనువాదం: కె. వి. రావు (9849929254)

దివ్యమాత సంకేతం

'ది మదర్' అనే గ్రంథంపై ముద్రించిన చక్రంలో, మధ్యలో వున్న వృత్తంలోనూ, దాని చుట్టూ వున్న 'నాలుగు శక్తుల' కు ఏయే రంగులు సరైనవౌతాయి? చుట్టూ వున్న పరిధిలో కొంచెం కలిపి, రంగు చూర్ణంతో ఒక నమూనాను తయారుచేద్దామని ఆలోచిస్తున్నాను.

కేంద్రం, నాలుగు శక్తులు, తెలుపురంగు. మిగతా పన్నెండు మూడు బృందాలుగా విభిన్నరంగులుండాలి. 1. పైనున్న బృందం, నారిజరంగు ద్వారా, పసుపు రంగువైపుకు సాగే యెరుపు రంగు. 2. తరువాతి బృందం నీలంరంగు వైపుకు, ఆకుపచ్చరంగు ద్వారా సాగే పసుపు రంగు. 3. ఎరుపువైపుకు, ఊదారంగు ద్వారా సాగే నీలంరంగు. తెలుపురంగు బాగాలేదనుకొంటే కేంద్రం బంగారం రంగు (చూర్ణం)

*

నేను దివ్యమాత సంకేతపు, (చక్రపు) విశిష్టతను గురించి తరచుగా ఆలోచిస్తున్నాను. నేను దానినిలాఅర్థం చేసుకొన్నాను. కేంద్రీయ వృత్తం: విశ్వాతీతశక్తి నాలుగు ఆంతరదళాలు: అతిమనస్సునుండి అధిమనస్సువరకు పనిచేస్తున్న నాలుగుశక్తులు.


పన్నెండు బాహ్యదళాలు: అధిమనస్సునుండి అంతః స్ఫురణ, మనస్సు వరకు పన్నెండు శక్తులుగా విభాగితమైన నాలుగుశక్తులు.

అసలు నా అవగాహన సమర్థనీయమైనదేనా?

సారతః (సాధారణంగా) సంపూర్ణ అభివ్యక్తికి అవసరమైనవి ఆ పన్నెండు కంపనాలు. దివ్యమాత శిరస్సుపై ఆదినుండి కూడా యీ పన్నెండు దర్శనమిస్తూండేవి. అదే విధంగా సూర్యుని నుండి యేడు గాక పన్నెండు కిరణాలు వెలువడుతూంటాయి. అలాగే గ్రహాలు వగైరా 12

శక్తుల వివరాలకు సంబంధించిన సరైన అన్వయం విషయంలో, నీవు యేర్పాటు చేసిన అమరికను కాదనడానికేం కన్పించడంలేదు. అది చక్కగా వుంది.

CWSA 32: 597-598 శ్రీఅరవిందులు




కేంద్రీయవృత్తం పరామాతను, మహాశక్తిని తెలియజేస్తుంది. కేంద్రీయ నాలుగు దళాలు, దివ్యమాత నాలుగు పార్శ్వాలు - 12 దళాలు ఆమె పన్నెండు ప్రత్యేక లక్షణాలు.

*

మహాశక్తి: (విశ్వసృష్టికి మదర్ రూపం) కేంద్రంగా, తన నాలుగు పార్శ్వాలు, పన్నెండు ప్రత్యేక లక్షణాలతోవున్న పరా చేతనకు సంకేత రూపమైన శ్వేత వర్ణ కమలం చిత్రీకరణ అది.

CWM: 64-65 శ్రీమాత



మహాశక్తి

(పరముని చిచ్ఛక్తి)

దివ్యమాత నాలుగు శక్తులు ప్రముఖమైన ఆమె నాలుగు వ్యక్తిత్వాలు, అంశములు, ఆమె దైవత్వమూర్తులు. వారిద్వారా ఆమె తన జీవులపై పనిచేస్తుంది. తన నుండి విసృజమైన వాటిని లోకాలలో క్రమబద్ధీకరించి సమరసంగావిస్తుంది. తన సహస్రానేక కార్యోన్ముఖ శక్తులను అవి చేయవలసిన కార్యానికి దిశానిర్దేశం చేసి వాటిని నడుపుతుంటుంది. దివ్యమాత ఒక్కరే, కాని ఆమె మనముందు భిన్న రూపాలలో ప్రత్యక్షమౌతుంది. విశ్వంలో ఆమె కార్యం నిర్వహించే ఆమె శక్తులు, వ్యక్తిత్వాలు అనేకం. ఆమెనుండి వెలువడే రూపాలనేకం. విభూతులనేకం. ఎవరిని మనం దివ్యమాతగా ఆరాధిస్తున్నామో ఆమెకనేక పార్శ్వాలున్నాయి. ఆమె వేగాన్ననుసరించడం, అధిక వేగవంతమైన మనస్సుకు, అత్యంత స్వేచ్ఛ కలిగిన బృహత్తమబుద్ధికి సైతం అసాధ్యం. దివ్యమాత పరాత్పరుని చేతన, శక్తి, తాను సృజించిన దానంతటికన్నయెంతో పైన ఉన్నదామె. ఆమె ధరించిన దేహాలద్వారా ఆమె పనిచేసే విధానాలను

కొంతైనా దర్శించవచ్చు, కొంతైనా సంవేదించవచ్చు. ఆమె తన జీవులకు యేయే దేవతా రూపాలద్వారా అభివ్యక్తం గావడానికి అంగీకరించిందో అవి ప్రవృత్తిలోనూ, చేసే కార్యంలోనూ యెంతగా పరిమితమై సృష్టి రూపం ధరిస్తాయో అంతంతగా మాత్రమే వాటిని గ్రహించగలుగుతాము.

దివ్యమాత అస్తిత్వపు మూడు విధానాలు

మనలను, విశ్వాన్ని పరిపోషించు చిచ్ఛక్తితో యేకత్వం సిద్ధించినపుడు దివ్యమాత అస్తిత్వపు త్రివిధ మార్గాలను యెరుగ గలుగుతాము. దివ్యమహాశక్తి విశ్వాతీతమై, లోకాలన్నింటిపైన, అధిష్టించి యెన్నటికీ అభివ్యక్తంకాని గుహ్యాతిగుహ్యమైన పరాత్పరునికి ఈ సృష్టికి మధ్య సంధాన కర్త్రియై ఉంటుంది. విశ్వాత్మక మహాశక్తియై ఆమె ఈ సర్వజీవులనూ సృజిస్తుంది. వాటిని తనలోనే భరిస్తుంది. వాటిలోనికి ప్రవేశించి, వాటికి ఆధారమౌతుంది. ఈ లక్షలాది వ్యక్తులను, శక్తులను నడుపుతుంది. వైయక్తికమై ఆమెఅస్తిత్వపు యీ బృహత్తర ద్వివిధమార్గాల (విశ్వాతీతము, విశ్వాత్మకము అను) శక్తిని దేహంలో నిలుపుకొని వాటిని సజీవం, మనకు సన్నిహితం చేసి మానవ మూర్తిత్వానికి దివ్యప్రకృతికి నడుమ మధ్యవర్తిత్వం నెరపుతుంది.

*

ఏకైక ఆద్య విశ్వాతీతశక్తి

విశ్వాతీత దివ్యశక్తి, దివ్యమాత సర్వలోకాలకుపైన నిలబడి తన శాశ్వత చేతనలో, ఆ సర్వేశ్వరుని భరిస్తుంది. అప్రతిహతశక్తికి, అనిర్వచనీయ పరముని సన్నిధికి ఆమె ఒక్కరే ఆశ్రయమవుతుంది. అభివ్యక్తంగావలసిన పరమసత్యాలను తనలో పొదువుకుంటూ లేదా తనలోనికి ఆవాహనచేస్తూ తన రహస్య స్థావరాలలో దాగిన వాటిని క్రిందికి ఆమె అనంతచేతన వెలుగులోనికి కొనితెస్తుంది. అనంతశక్తిలో, అపరిమిత జీవనంలో వాటికి కార్యకారణశక్తి రూపాన్నిస్తుంది. జగత్తులోఒక దేహాన్ని తయారుచేస్తుంది. సర్వేశ్వరుడామెలో సదా నిలిచి వుండే సచ్చిదానందంగా అభివ్యక్తమయ్యే, ఏకము, ద్వికము నగు ఈశ్వర-శక్తి చేతనగ, ద్విత్వ సూత్రమగు పురుష-ప్రకృతిగ అభివ్యక్తమయ్యాడు. దివ్యలోకాలలో తెలియని ఆ లోకాలలోని సమస్తం ఆమెవల్ల ఆకృతి దాల్చింది. ఈ సృష్టి సమస్తం ఆమె సర్వేశ్వరునితో

ఆడే ఆట. శాశ్వతుని నిగూఢతల, అనంతుని అద్భుతాల అభివ్యక్తి ఆమె చేతనే జరుగుతుంది. సర్వమూ ఆమెయే. ఎందుచేతనంటే సమస్తమూ పరమచిచ్ఛక్తి అంశమే. ఆమె నిర్ణయించినది, సర్వేశ్వరు డనుమతించినది, గాక యిచ్చటగాని, మరెచటగాని, అన్యమేదీ మనలేదు. సర్వేశ్వరునకు ప్రేరితమై దేనిని తన సృజనాత్మక ఆనంద బీజరూపమున నిలిపి, దర్శించి రూపమిస్తుందో అది తప్ప మరేదీ ఆకారం దాల్చలేదు.

*

మహాశక్తి- విశ్వమాత

మహాశక్తి విశ్వమాతయై సర్వేశ్వరుని నుండి తన విశ్వాతీతచేతన సంక్రమింప జేసిన దానిని నిర్వహిస్తుంది. ఆమె తయారు చేసిన లోకాలలోనికి ఆమె ప్రవేశిస్తుంది. వాటినామె తన సన్నిధితో నింపి వేస్తుంది. దివ్య ఆత్మ శక్తితో, సర్వాన్ని పోషించు దివ్యశక్తితో, ఆనందంతో ఆధారమై నిలుస్తుంది. అవి లేక లోకాలు మనజాలవు. మనచే ప్రకృతిగా పిలువబడేది చాలా బాహ్యానికి సంబంధించిన ఆమె కార్యనిర్వహణా పార్శ్వం. ఆమె తన శక్తులను, సంవిధానాలను క్రమబద్ధీకరించి సామరస్యంగా అమరుస్తుంది. ప్రకృతి కార్యకలాపాలను లోనుండి వత్తిడి జేస్తూ జరిపిస్తుంది. దృగ్గోచరమయ్యే దాని లేక అనుభవంలోకొచ్చిన లేదా జీవన గతిలో వుంచబడిన దాని అంతట్లోను రహస్యంగా గాని, లేదా అభివ్యక్త రూపంలో గాని వాటిమధ్య చలిస్తువుంటుంది. ఒక్కొక్కవిశ్వానికి ఒక్కొక్క వ్యవస్థ వుంటుంది. ఆ విశ్వంలోని ఒక్కొక్క ప్రపంచ వ్యవస్థ మహాశక్తి ఖేలనమే. ఆ మహాశక్తి విశ్వాతీత దివ్యమాత, విశ్వాత్మగా మూర్తిత్వంగా అచట నిలిచి వుంటుంది. ప్రతిదీ ఆమె అంతర్దృష్టిలో ఉన్నదే. ఆమె సుందర హృ దయంలో శక్తిలో పొదవుకొన్నదే ఆమె ఆనందంలో సృజించబడిందే.

కాని ఆమె సృష్టికి అనేక స్తరా లున్నాయి. దైవశక్తికి అనేక మెట్లున్నాయి. మనం కూడా ఒక భాగమై వున్న యీ అభివ్యక్తికి శిఖరాగ్రాన అనంత సత్తా, చేతన, శక్తి, ఆనంద లోకాలున్నాయి. వాటికి పైన దివ్యమాత అనాచ్ఛాదిత శాశ్వతశక్తిగా నిలిచి వుంది. అచట సర్వజీవులు, అనిర్వచనీయ సంపూర్ణత యందు యెట్టి మార్పు జరుగని యేకత యందు జీవిస్తాయి, చరిస్తాయి. ఎందుచేతనంటే ఆమె వాటిని తన హస్తములందు సురక్షితంగా, శాశ్వతంగా వుంచుకొని చరిస్తూంటుంది. మనకు

సమీపంగా పరిపూర్ణ అతిమానస సృష్టి లోకాలున్నాయి. వాటి యందు ఆమె అతి మానస మహాశక్తి, దివ్యసర్వజ్ఞ, పరమేచ్ఛ, సర్వ శక్తివంతమైన దివ్యజ్ఞానం, దివ్యశక్తి. వైఫల్యమే లేని కర్మల యందు ఆమె కన్పిస్తుంది. ప్రతిచలనంలోనూ, అప్రయత్నంగా సంప్రాప్తమయ్యే పరిపూర్ణతయై ఆమె విరాజిల్లుతుంది. అచట అన్ని ఉద్యమాలు పరమ సత్య పదఘట్టనలే, అన్ని జీవులు దివ్యప్రకాశపు అంతరాత్మలు, శక్తులు, దేహాలు. అచట సర్వానుభవాలు ప్రగాఢ కేవల దివ్యానంద సాగరాలు, వరదలు, తరంగాలు. ఇక్కడ మనం నివసిస్తున్న ఈ లోకాలు అజ్ఞాన లోకాలు, మనఃప్రాణ దేహాల లోకాలు. ఇవి చేతనలో వాటి మూలం నుంచి వేరైనాయి. ఆ మూలానికి యీ పృథ్వి ఒక విశిష్టత కలిగిన కేంద్రం. దాని పరిణామం ఒక విశిష్ట ప్రక్రియ. ఇది కూడా దాని అజ్ఞానం, సంఘర్షణ, అపరిపూర్ణత లన్నింటితో సహా వైశ్వ దివ్యమాతతో పరిపోషించ బడుతున్నది. ఇది కూడా దాని రహస్య లక్ష్యం వైపుకు, ఆ మహాశక్తిచే ఆంతరం నుండి నెట్టబడుతున్నది, మార్గంపై నడుపబడుతుంది.

మనది త్రివిధ అంటే మనః ప్రాణ దేహాల అజ్ఞాన లోకం. ఈ లోక మహాశక్తిగా దివ్యమాత ఈ అజ్ఞాన లోకానికి, ఊర్ధ్వంలో గల సత్యలోకాలకు మధ్య వున్న స్తరం లో నిలిచి వుంటుంది. ఊర్ధ్వలోక చేతనాస్తరాలు, మన అజ్ఞాన లోక చేతనాస్తరాలు, ఒక వరుసలో నిచ్చెన మెట్లలా అమరి వుంటాయి. ఆ నిచ్చెన, క్రింది మెట్టు పదార్థ జ్ఞానరహితస్థితి లోనికి దిగిపోతుంది. తిరిగి జీవనం, అంతరాత్మ మనస్సుల వికసనం ద్వారా ఆత్మ అనంతత్వం లోనికి యెగ్రబాకుతుంది. ఆమె దేనిని దర్శించి సంవేదించి తన నుండి వెలువరిస్తుందో అది యీ జగత్తులో, యీ పృథ్విపై జరిగే పరిణామంలో పరిణమించవలసిన దానినంతా నిర్దేశిస్తూంటుంది. అచట మహా దేవతలకు పైన తన సర్వ శక్తులను, వ్యక్తిత్వాలను అన్నింటినీ ఆమె తన భవిష్యత్కార్యాచరణ కోసం తన ముందుంచుకొని, వాటి ప్రతిరూపాలను, నిమ్నలోకాలలో జోక్యం చేసు కొనడానికి, వాటిని పరిపాలించడానికి, వాటితో పోరాడడానికి, విజయం సాధించడానికి వాటికి దారి చూపుతూ వాటి పరిణామగతిని నిర్దేశిస్తూ వాటి శక్తుల సమష్టి, వ్యక్తిగత మార్గాలను నియంత్రించ పంపిస్తూంటుంది. ఈ ప్రతిరూపాలు, అనేక దివ్యరూపాలు, వ్యక్తిత్వాలు. వీటినే మనుషులు బహువిధ నామాల్తో యుగాల నుండి ఆరాధించారు. అంతేగాక యీ దివ్యశక్తులు, వాటి ప్రతిరూపాల ద్వారా విభూతుల మనస్సులను, దేహాలను, ఆ మహాశక్తి సిద్ధం చేస్తుంది. ఈశ్వరుని విభూతులకు సైతం మనస్సులను,

దివ్యమాత పైనుండి సర్వాన్నీ పాలించడమే గాక నిమ్నంగా వున్న యీ త్రివిధ విశ్వం లోనికి దిగివస్తుంది. ఇక్కడున్న సమస్తమూ అజ్ఞాన కదలికలతో సహా ఆచ్ఛాదితమైన శక్తిలో గల, ఆమెయే. క్షీణశక్తి గల ద్రవ్యం ప్రకృతి దేహం, ప్రకృతి -శక్తి ఆమె సృష్టులే. అవి మనగలగడానికి కారణం అనంతునిలో గల సాధ్యతలలో కొన్నింటిని అభివ్యక్తం చేయ సర్వేశ్వరుని రహస్య అనుజ్ఞతో ప్రేరేపింప బడుటయే. మహోత్కృష్ట బలిదానానికి ఆమె అంగీకరించి ఒక ముసుగులా అంతరాత్మకు, అజ్ఞాన రూపములను అంగీకరించింది. అంధకారాన్ని దివ్యప్రకాశం లోనికి, అనృతాన్ని పరమ సత్యంగా మార్చడానికి, ఈ మృత్యువును దివ్యజీవనం లోనికి మలచడానికి, ఈ ప్రపంచ బాధవ్యధల దుఃఖాలను తన అత్యున్నత అనంతుని ప్రహర్షంలో అంతమొందించడానికి ఆమె వ్యష్టిగా కూడా వీటి లోనికి దిగివచ్చింది. ఆమె బిడ్డల యందు ఆమెకు గల ఉన్నత ప్రేమచే యీ అజ్ఞానం ముసుగును ధరించ సమ్మతించింది. పరమ అజ్ఞానాంధకారాల శక్తుల దాడులను, దుర్భర ప్రభావాలను సహించడానికామె తనను తాను ఘనీభవింప జేసుకొన్నది. మరణ సదృశమైన యిరుకైన దారి గుండా పయనించి జన్మించ సహించింది. సృష్టి తీవ్ర వేదనలు, సంతాపాలను, వ్యధలను తనపై తానే మోపుకొన్నది. ఆ విధంగా చేస్తేనే సృష్టిని, దివ్య ప్రకాశం లోనికి, దివ్య ప్రహర్షం లోనికి, పరమ సత్యం లోనికి, శాశ్వతంగా సాగిపోయే దివ్యజీవనం లోనికి ఉద్ధరించ వచ్చునని ఆమెకన్పించింది. ఇది మహోన్నత తాగ్యం. కొన్ని సమయాల్లో దీన్నే పురుషుని త్యాగ మన్నారు. కాని లోతుగా తరచి చూస్తే ఇది ప్రకృతి పూర్ణాహుతి, దివ్యమాత మహోత్కృష్ట బలిదానం.

CWSA 32:17 — *శ్రీఅరవిందులు*

అనువాదం: కె. వి. రావు (9849929254)

దేహాలను రూపాలను కల్పిస్తుంది. భౌతికచేతనలో అభివ్యక్తం కాగలందులకు మానవ చేతన మారువేషంలో ఆమె శక్తి, లక్షణం, సన్నిధి, పృధ్వి ఖేలనాల దృశ్యాలన్నీ ఒక నాటకంలో లాగా, విశ్వదేవతలను తన సహాయకులుగా చేసుకొని తానే ప్రచ్ఛన్న నటునిగా ఆమె చేత నటించబడినవే.

CWSA 32:14-17 శ్రీఅరవిందులు

దివ్యమాత నాలుగు మహా శక్తులు

ఈ విశ్వాన్ని నడిపేటందుకు, భౌతిక జగత్తుతో కార్యకలాపాలు సాగించేటందుకు అమ్మ నాలుగు ప్రధాన అంశలు, ప్రస్ఫుటమైన శక్తులు, వ్యక్తిత్వాలు వెలువడినాయి అందు మొదటిది ప్రశాంత, విశాలతర, సర్వ సమన్వయ విజ్ఞానం, నిశ్చల కోమలత్వం, అనంత కరుణ, సార్వభౌమ్య, అనుపమాన వైభవం, సర్వాతీత పరిపాలనా సామర్థ్యం కలది. రెండవది ఉత్కృష్ట శక్తి, అప్రతిహత ఆవేగం, పోరాట పటిమ, ప్రబల సంకల్పం, పట్టరాని వేగం, ప్రపంచాలను వణికింప జేసే శక్తి కలది. మూడవది విశుద్ధత, మాధుర్యం,



అదితి - దివ్యచైతన్యం
బొటానికల్ పేరుఛ నెలమ్‌బొ నుసిఫెరా 'అల్‌బ'

ఆశ్చర్యం కలగలిసిన మార్మిక సౌందర్యం, సామరస్యత, సునిశిత సరళి, సంక్లిష్ట సూక్ష్మ విస్తారత సమ్మోహక ఆకర్షణ, మనోహర చలనశీలత కలది. నాలుగవది, ప్రత్యక్ష, ప్రగాఢ, ఆంతరిక జ్ఞానము శ్రద్ధా సహిత, లోపరహిత కార్యశీలత, అన్ని విషయముల యందు స్థిరమైన నిస్సందేహపూర్వకమైన పరిపూర్ణత కలిగి ఉంటుంది.

జ్ఞానము, శక్తి, సామరస్యత, పరిపూర్ణత వీటి బహువిధ గుణములు, ఈ గుణములను తమతో బాటు భూమి మీదకు తీసుకొని వస్తూ, వారి విభూతులుగా ఏతెంచిన మానవ రూపాల ద్వారా ప్రకటిస్తూ, అమ్మ ప్రత్యక్ష, సజీవ ప్రభావమునకు గురియగుట ద్వారా వారి భౌతిక ప్రకృతి దైవీతత్వమునకు తెరుచుకొని ఎదగ గలిగిన సామర్థ్యానికి తగినట్టు వారియందు నిక్షేపించెదరు. ఈ నలుగురికి మన మిచ్చిన గొప్ప నామములు — మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి,

సర్వాధినేతయైన మహేశ్వరి ఆలోచించే మనస్సుకు సంకల్పానికి పైనున్న విశాల వ్యోమమునందు నివసిస్తూ వానిని పవిత్రీకరిస్తూ, విజ్ఞానముగా వృద్ధి చెందిస్తూ వానికి పైనున్న స్తరాల నుండి వెలువడే కాంతి ప్రవాహాలతో నింపుతుంది. ఆమె మనసు అతిమానస అనంతాలకు, విశ్వవిశాలతలకు, పరమోన్నత కాంతి శోభలకు, అద్భుత విజ్ఞాన భాండాగారాలకు, అవధులు లేని శ్రీమాత శక్తుల ఖేలనానికి తీసుకొనిపోగల మహామయి, జ్ఞానమయి. సదా నిశ్చలంగా, అద్భుతంగా, విశాలంగా, ప్రశాంతంగా ఉండడం ఆమె లక్షణం. సమస్త విజ్ఞానము ఆమె యందుండుట వల న ఆమెను మరేదీ కదపజాలదు. తెలుసుకొన జూచినదేదీ ఆమెకు తెలియక మానదు. అన్ని వస్తువులను, జీవులను, వాని స్వభావాలను, కదలికలను, ప్రాపంచిక నియమాలను, కాల గమనాలను, వాటి భూత భవిష్యత్ వర్తమానాలను ఆమె గ్రహించి ఉంటుంది.

దేనినైనా స్పృశించగల సామర్థ్యం, అధీనం చేసుకోగల శక్తి ఆమె కుంది. ఊహింపజాలని ఆమె విశాల అసమాన విజ్ఞాన అతీత నిశ్చల శక్తి ముందు మరెవ్వరూ కడవరకూ మనజాలరు. సమత్వము, సహనము, మరల్చలేని ఇచ్ఛ సాయంతో ఆ మె మనుష్య లందరితో వారి వారి ప్రకృతిని బట్టి, వస్తు విషయాల పట్ల వాని శక్తి సత్వతలను బట్టి ప్రవర్తించును. ఆమెకు పక్షపాతము లేదు. అయిననూ పరమాత్మ ఆదేశానుసారం కొందరిని ఉన్నతికి, కొందరిని అధోగతికి, ఆమె నుండి దూరముగా గల అంధకారము లోనికి నెట్టివేయును. విజ్ఞానులకు ఆమె మరింత మహత్వపూర్ణ విజ్ఞానము నిచ్చును, ముందుచూపు కలవారిని ఆమె సూచలన ననుసరింప జేయును.



దుష్టుల మీద వారి దుష్టత్వపు పర్యవసానముల నాపాదించును. అజ్ఞానులను, మూఢులను వారి హ్రస్వ దృష్టి ననుసరించి నడిపించును. ఒక్కొక్క వ్యక్తిని ఆమెవారి ఆవశ్యకతను బట్టి, ఆకాంక్షను బట్టి, వారు కోరుకొనే ప్రతిఫలాన్ని బట్టి, అందుకు కావలసిన తపనను కల్పిస్తూ లేక వారు కోరుకున్న స్వేచ్ఛ ననుసరించి అవిద్యా విధానాల యందు వికసించేటందుకు, లేక నశించేటందుకు కావలసిన విధంగా వారిలోని

వేరు వేరు అంశాలను తీర్చిదిద్దును.

ఆమె దేని చేతనూ కట్టుబడి లేదు కనుక, ఈ సృష్టిలో దేనియందు ఆమెకు ఆకర్షణ లేదు కనుక ఇది సాధ్యపడుతుంది. అయిననూ విశ్వజనని హృదయం ఆమెలో అందరినీ మించి వ్యక్తమయ్యి ఉంది. ఆమె దయ అపారం, అనంతం ఆమె కళ్ళకు అందరూ ఆమె బిడ్డలే, పరమాత్ముని అంశలే — అఖరుకు అసురులు, రాక్షసులు, పిశాచాలు, తిరగబడి వ్యతిరేకులుగా మారినవారు కూడా. ఆమె కాదనేది వాయిదా వేయుటకు మాత్రమే, ఆమె విధించే శిక్ష కూడా ఒక వరమే. కాని ఆమె ప్రదర్శించే దయ ఆమె విజ్ఞానాన్ని, ఆమె చేయవలసిన కార్యాన్ని ప్రక్కదోవ పట్టించేదిగా ఉండదు. వస్తువుల్లో ఉండే సత్యతకే ఆమె అత్యధిక ప్రాధాన్యత నిస్తుంది. జ్ఞానమే, ఆమె శక్తికి కేంద్రము. మానవ ఆత్మను, ప్రకృతిని దివ్యసత్యమునకు అనుగుణముగా నిర్మించడమే ఆమె దీక్షాకార్యము.

CWSA 32:18-19

మహాకాళి

మహాకాళి స్వభావం వేరు. విశాలతరం కాకున్నా ఉచ్ఛతరం, జ్ఞానం కాకున్నా శక్తి, ప్రబలత ఆమె ప్రత్యేక లక్షణాలు. ఒక మహత్తర తీవ్రత, లక్ష్యాన్ని సాధించేందుకు మహోత్సాహంతో కూడిన శక్తి, ప్రతి అడ్డంకిని, హద్దుని తుత్తునియలు చేయగల దివ్య ప్రచండత ఆమెలో ఉన్నాయి. ఆమెలోని దివ్యత్వమంతా మహామారుత వేగంతో జరిగే కర్మల శోభగా బహిర్గత మవుతుంది. వేగం, మరుక్షణంలో ప్రభావం చూపగల చర్య, తేజోవంతమైన ప్రత్యక్ష ఉత్పాతం, సర్వ శక్తులను ఏకం చేస్తూ జరిపే ఎదురుదాడి కోసమే ఆమె ఉన్నది. అసురునికి ఆమె ముఖకవళికలు భరింపరానివి, దైవాన్ని అసహ్యించుకొనేవారలకు ఆమె స్మరణ ప్రమాదాన్ని, నిర్దయను గుర్తుకు తెస్తుంది. యుద్ధాని కెన్నడూ వెనుకాడని సర్వలోక యోద్ధ ఆమె.

లోపాలు సహించని దగుట వలన, మానవుని లోని మార్పుకు ఇష్టపడనిదానితో ఆమె కఠినముగా వ్యవహరిస్తుంది. మొండి అజ్ఞానాన్ని, అంధకారాన్ని, ఆమె తీవ్రంగా పరిగణిస్తుంది. మోసం, కాపట్యం, దుష్టత్వం పట్ల ఆమె కోపం సత్వరం, భయంకరం, దుష్టసంకల్పాలు ఆమె దండనతో ఒక్కసారిగా సమసిపోతాయి. దైవకార్యం పట్ల



ఉదాసీనత అశ్రద్ధ, అలసత్వం ఆమె సహించలేదు. కాలాతీతమైనా పట్టక, మొద్దు నిద్రపోయేవాణ్ణి, పనితనం లేనివాణ్ణి ఒక్క దెబ్బతో, ఒకింత నొప్పి కలిగినా, మెలకువ తెప్పిస్తుంది.

వేగంగా, సూటిగా, స్పష్టంగా ఉండే స్పందనలు, వెనుదీయరాని, ఖచ్చితమైన కదలికలు, జ్వాలలా ఎగిసిపడే ఆకాంక్ష మహాకాళి కదలికలను సూచిస్తాయి. ఆమె అస్తిత్వం దేనికీ లొంగదు. గరుడయానం వలె ఆమె ఇచ్ఛ, దృష్టి, ఉన్నతమైనవి,

సుదూరమైనవి. ఆమె నడక వేగంగా ఊర్ధ్వం వైపు సాగుతుంది. సంహరించడానికైనా, సహకరంచడానికైనా ఆమె చేతులు ఎప్పుడూ విశాలంగా చాచి ఉంటాయి. ఆమె కూడా విశ్వజననియే కనుక ఆమె ప్రేమ కూడా క్రోధం లాగానే తీవ్రంగా ఉంటుంది. ఆమె లోతైన, ప్రగాఢమైన దయ కలది.

ఆమె శక్తిని పనిచేయ నీయుటకు సహకరిస్తే, ముందుకు కదలకుండా బంధించే అడ్డంకులు, సాధకులను, బాధించే వైరి వర్గాలు ఒక్క క్షణంలో ఉనికి కూడా లేదన్నట్లు ఛిద్రమవుతాయి. ఒక ప్రక్క ఆమె కోపం దుష్టులకు భయంకరమైనదైతే, ఆమె తాకిడి తీవ్రత బలహీనులకు, భయస్తులకు బాధ కలిగిస్తే మహిమాన్వితులు, ధీరులు, ఉత్తములచే ఆమె పూజ లందుకొంటుంది. వారిలో నున్న తిరగబడే స్వభావాన్ని ఆమె తాకిడి పటుత్వంగాను, సత్యానుగుణ్యంగాను మారుస్తుంది. వారిలోని వక్ర, వికృతత్వాలను ఆమె సమ్మెటపోటులు సరిచేస్తూ చెడును, పనికిరానివాటిని బయటకు నెట్టుతాయని వారి అనుభవం.

ఆమె తోడు లేకపోతే ఒక్క రోజులో జరిగేది శతాబ్దాలు పట్టి ఉండవచ్చు. ఆ మె లేకుంటే ఆనందం అట్టహాసంగానున్నా పేలవంగా నుంటుంది. సున్నితంగా, మధురంగా, అందంగా నున్నా వెచ్చని ఉత్సాహపు తీవ్రతలను కోల్పోతుంది. జ్ఞానానికి ఆమె అజేయ దారుఢ్యాన్ని ఇస్తుంది; అందానికి, సామరస్యతకు ఔన్నత్యాన్ని, సర్వాధిగమనతను ఇస్తుంది; పరిపూర్ణత కోసం నెమ్మదిగా సాగే కఠిన శ్రమకు శక్తిని బహుళీకరిస్తూ, కాలం పట్టే విధానాలకు సులువైన దారులను సృష్టిస్తుంది. అత్యున్నత ఆనందాలకు అధికాధిక ఉన్నతులకు, మహా ఉదాత్త లక్ష్యాలకు, విశాలతర క్షేత్రాలకు ఏ మాత్రం తక్కువైనా ఆమె తృప్తి పడదు. అందువల్ల దైవం విజయం ఆమె వలనే సాధ్యం. ఎప్పుడో జరగబోవు గొప్ప సాఫల్యాలు ఇప్పుడే పొందడమనేది జ్వలనంతో, తీవ్రతతో, వేగంతో కూడిన ఆమె దయతోనే సాధ్యం.

CWSA 32:19-20



మహాలక్ష్మి

జగన్మాత ప్రభావాలు విజ్ఞానం, శక్తి మాత్రమే కాదు. ఆమె స్వభావానికి సంబంధించిన సూక్ష్మ రహస్యం ఒకటుంది. అది లేనిది విజ్ఞానం, శక్తి అసంపూర్ణం. అది లేనిదే పరి పూర్ణత అపరిపూర్ణం. వీటి పైనుండి శాశ్వత సౌందర్యం అద్భుతాలను ఆవిష్కరిస్తూ, దివ్య సామరస్యత యొక్క నిగూఢ రహస్యాన్ని కలిగి ఉంటూ, పట్టరాని విశ్వశోభ,

ఆకర్షణల ఇంద్రజాలంతో తప్పించుకోలేని విధంగా వస్తువులను, శక్తులను, జీవులను దగ్గరకు చేర్చి పట్టి ఉంచుతూ అవి కలిసి మెలిసి ఉండడం ద్వారా అంతర్గతంగా నున్న ఆనందం తెర వెనుకనుండి తన రూపాలను, గమనాలను ప్రదర్శించేలా చేస్తుంది. ఇది మహాలక్ష్మి లక్షణం. భూతల జీవుల హృదయాలను ఇంతగా రంజింప జేసే దివ్యశక్తి పార్శ్వం మరొకటి లేదు.

మహేశ్వరి భూత స్వభావ పరిమితులను సమీపించేటందుకు, ధరించేటందుకు మరీ ప్రశాంతంగా, గంభీరంగా, నిరాదరణీయంగా అనిపించవచ్చు. మహాకాళి దాని దౌర్బల్యాలకు మరీ వేగంగా, దుర్భరంగా అనిపించవచ్చు. కాని అందరూ ఆనందంతో, కోరికతో మహాలక్ష్మి వైపు చేరుకొన చూస్తారు. ఆమె మత్తెక్కించే దైవమాధుర్యాన్ని ప్రదర్శిస్తుంది. ఆమెకు చేరువవ్వడం ఒక గొప్ప ఆనందం, ఆమెను హృదయంలో ధరించడమంటే మన ఉనికినే ముగ్ధంగా, అద్భుతంగా మలచడం, దయ, సౌందర్యం లాలిత్యం ఆమె నుండి సూర్యుని కిరణాలవలె వెలువడతాయి. ఆమె మహిమాన్వితమైన చూపు ఎక్కడ నిలిపినా, ఆమె ప్రేమాన్వితమైన మందహాసం ఎక్కడ కురిపించినా, ఆత్మ, అవధుల్లేని ఆనందాల లోతుల్లోకి పట్టుబడి, మునిగి, చిక్కుకుపోతుంది. ఆమె చేతి స్పర్శ, అయస్కాంతంలా ఆకర్షిస్తుంది. ఆ అదృశ్య మృదు ప్రభావం మనస్సు, ప్రాణ, శరీరాలను పవిత్రీకరిస్తుంది. ఆమె పాదం మోపిన చోట ముగ్ధమనోహరమైన ఆనందం మహిమాన్విత ఝురులుగా, సెలయేళ్ళుగా ప్రవహిస్తుంది.

అయిననూ ఈ సమ్మోహనాశక్తి అభీష్టాలను నెరవేర్చడం ఆమె సామీప్యాన్ని పొందడం అంత సులభం కాదు. మనస్సు, ఆత్మల సామరస్యం, సౌందర్యం — బాహ్య కదలికలు, చేతల ప్రతిదాని యొక్క సామరస్యం, సౌందర్యం — ఇది మహాలక్ష్మి అభీష్టం. ఎక్కడ నిగూఢ వైశ్వానంద స్పందనల పట్ల మక్కువ ఉన్నదో, భగవంతుని వైపు ఆనందంతో తరలివచ్చే జీవసమూహాల సమన్వయం, ఐకమత్యం ఉన్నాయో అటువంటి వాతావరణంలో ఆమె నివసించుటకు ఇష్టపడుతుంది. కాని అసహ్యకరమైన, నీచమైన, పతనమైనవన్నీ, అసంపూర్ణమైన, అనైతికమై, మలినమైనవన్నీ, క్రూరమైన, అనాగరికమైనవన్నీ ఆమె రాకను అడ్డుకుంటాయి.

ఎక్కడైతే ప్రేమ, సౌందర్యం ఉండవో లేక పుట్టనేరవో ఆమె అక్కడ ప్రవేశించదు. ఎక్కడైతే అవి నీచమైనవాటితో కలగలసి, వికృతమౌతాయో, ఆమె అక్కడ నుంచి

నిష్క్రమిస్తూ ఆమె సంపదలను ఇవ్వజాలదు. మనుష్యుల హృదయాలలో స్వార్థం, ద్వేషం, అసూయ, చెడ్డతనం, జుగుప్స, విరోధం చుట్టుముట్టినప్పుడు, ఆ పవిత్రమైన పాత్రలో కుతంత్రం, దురాశ, కృతఘ్నత కలగలసిపోయినపుడు, కోరికల్లో మొరటు దనం, ఆకాంక్షలో అపరిపక్వత భక్తిని అపవిత్రీకరించినపుడు, అటువంటి హృదయాలలో ఈ మహిమాన్విత, సుందర దివ్యత్వం నిలువజాలదు. ఒక దివ్య అప్రసన్నత ఆమెలో నెలకొని అక్కడి నుండి వైదొలగుతుంది. ఎందువల్లనంటే ఒత్తిడి చేయడం, పోరాడడం ఆమె లక్షణం కాదు. ఒక్కొక్కసారి ఈ బాధాకర, విషపూరిత క్షుద్ర శక్తులు బయటకు నెట్టివేయబడి కనుమరుగయ్యేంత వరకు తనను తెరచాటుకావించుకొని వేచిచూస్తూ ఆ తరువాతనే తన ఆహ్లాదకర ప్రభావాన్ని నూతనంగా ప్రభవింప జేస్తుంది.

వైరాగ్యపు పేలవత్వం, పురుషత్వం ఆమెను మెప్పించజాలవు.హృదయం లోని లోతైన భావాలను వెలువరచలేకపోవం, ఆత్మ ప్రాణాలలోని సౌందర్యాన్ని మొండిగా అణచివేయడం ఏమాత్రమూ ఆమె సహించజాలదు. ప్రేమ, సౌంద ర్యాలతోనే భగవంతుని మనుషులతో అనుసంధానం కావిస్తుంది కనుక అవి లేనిదే ఆమె నివసించదు. ఆమె సర్వోత్తమ సృష్టితో జీవనం ఒక స్వర్గలోక కౌశలంగాను, సర్వ అస్తిత్వము దివ్యరస కావ్యంలా మారుతుంది. ఈ భూమిలోని సిరులన్నీ ఒక్కచోటికి చేర్చబడి పొందుపరచబడి ఒక ఉన్నత కార్యం కోసం వినియోగించ బడతాయి. అత్యంత సరళంగా, సామాన్యంగా ఉండే వస్తువులు సైతం ఆమె ఏకత్వస్ఫూర్తితో, ఆమె చైతన్యపు ఉచ్ఛ్వాసతో అద్భుతంగా తయారవుతాయి.

ఆమెను హృదయంలో నిలుపుకొనినంతనే విజ్ఞానాన్ని అద్భుత శిఖరాలకు చేరుస్తూ దానికి జ్ఞానానికి పైన ఉండే పారవశ్యపు నిగూఢ రహస్యాలను విశదీకరిస్తుంది. భక్తిని భగవంతుని మధురాకర్షణతో స్వాగతిస్తుంది. బలానికి, శక్తికి, వాటి చేతలలోనున్న సామరస్యపూర్వక మహత్వానికి లయలను నేర్పుతూ, వాటిని నిర్దేశిస్తుంది. వాటిలోని పరిపూర్ణతకు కలకాలం నిలువగలిగే శోభను ప్రసాదిస్తుంది.

CWSA 32:21-22



మహాసరస్వతి

మహాసరస్వతి దివ్యమాత కర్మల నొనర్చే శక్తి, పరిపూర్ణత, క్రమబద్ధతలను కలిగి ఉండే అంశ, నలుగురి యందు ఆఖరుదైనా కార్యాచరణలో అత్యంత నైపుణ్యం కలిగినదై భౌతిక ప్రకృతికి అతి చేరువగా నుండును. విశ్వశక్తుల మహత్తర కదలికలను మహేశ్వరి నిర్వహిస్తుంది, మహాకాళి వాటికి కావలసిన శక్తిని ప్రేరణను ప్రసాదిస్తుంది, మహాలక్ష్మి వాని లయలను, గమనాన్ని ఆవిష్కరిస్తుంది. కానీ మహాసరస్వతి వాని నిర్వహణా విధానాన్ని, ఆచరణను, పరస్పర సంబంధాన్ని, ఆశక్తుల సంయోజనాన్ని,

ఫలితాల్లో ప్రయోజకతల్లో లెక్క తప్పనటువంటి నిశ్చయతను నిర్దేశిస్తుంది.

వస్తు విజ్ఞానం కళలు, సాంకేతికత మహాసరస్వతి పరిధిలోనివి. ఆమె ఎంచుకున్న వారిని ఆమె ప్రకృతిలోనికి స్వీకరించి వారికి సూక్ష్మపరిజ్ఞానాన్ని, సునిశిత దీక్షను, కర్మయోగి కర్మయోగి కలిగి ఉండే స్ఫురిత మనస్సును, హస్త లాఘువాన్ని, నిశిత దృష్టిని ప్రసాదిస్తుంది. లోకాల శ్రేణి విభజనలో ఈ శక్తి ధృడమైనఅలుపెరగని శ్రద్ధా పూర్వకమైన, సమర్థవంతమైన నిర్మాణశీలత, యోజనాశక్తి, పరిపాలనాశక్తి సాంకేతికత, కళాత్మకత కలిగినది.

ఆమె రూపాంతరీకరణను, ప్రకృతి పునర్వ్యవస్థీకరణను చేపట్టినపుడు, ఆమె కార్యం కష్టసాధ్యంగా సునిశితంగా మన వ్యాకులతకు ఒకింతమందంగా, అనంతంగా సాగినట్టు అనిపిస్తుంది. కానీ అది స్థిరంగా, సమగ్రంగా, దోషరహితంగా సాగుతుంది. కర్మలలో ఆమె ఇచ్ఛ కర్తవ్య నిష్ఠతో, నిరవధికతతో, విరామమెరుగనిదై ఉంటుంది. మన పక్షం వహించి ప్రతి చిన్న వివరాన్ని పరిశీలిస్తూ, స్పృశిస్తూ, ప్రతి చిన్న లోపాన్ని అంతరాన్ని, వక్రతనూ, అపరిపూర్ణతనూ గుర్తించి, ఇంతవరకు జరిగినది, ఇక ముందు చేయవలసి ఉన్నది సుస్పష్టంగా పరికించి, నిశ్చితపరుస్తుంది. ఆమె దృష్టిలో అల్పమైనది, నిరర్థకమైనది అంటూ ఏదీ లేదు. ఎంత పట్టజాలనిదైనా, దాగొని ఉన్నా, నిద్రాణంగా ఉన్నా ఆమెనుండి తప్పించుకోలేదు.

మార్చుతూ, పునర్మార్చుతూ ఒక్కొక్క అంశానికీ దాని సత్యానుగుణ్యమైన రూపాన్నిచ్చేంత వరకూ సమిష్టిలో తన నిర్దేశిత స్థానాన్ని పొంది, తన విధి పూర్వక వస్తు వ్యవస్థీకరణ, పునర్వ్యవస్థీకరణల్లో, ఆమె చూపు అన్ని ఆవశ్యకతలను వాటిని పొందేటందుకునూ ఒకేసారి పనిచేస్తుంది. ఆమె అంతః స్ఫూర్తి ఏది ఎంచుకోవాలో, దేనిని తిరస్కరించాలో తెలుసుకొని, సాఫల్యంతో సరియైన పరికరాన్ని, సరియైన సమయాన్ని, సరియైన పరిస్థితులను, సరియైన పద్ధతిని గుర్తిస్తుంది.

బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం, అలసత్వం ఆమెకు అసహ్యం. సోమరిపని, హడావుడి పని, కలగలుపు పని, గందరగోళం, ఇంచుమించు సరిపెట్టడం, ఒకటనుకొని మరొకటి చేయడం, ఒకదానిని మరొకదానికి వాడడం, వస్తువులను, ఉపకరణాలను దుర్వినియోగపరచడం, పనిని వదిలివేయడం లేక సగం మాత్రమే చేయడం, ఇవన్నీ ఆమె ప్రకృతికి విరుద్ధమైనవి. సహించరానివి. ఆమె పని పూర్తిచేసినతరువాత, ఏ ఒక్కటీ మరచిపోయిగాని, తప్పుగాగాని, విడిచి పెట్టబడిగాని, పాడుచేయబడిగాని

మిగలదు. అంతా ఖచ్చితంగా, సవ్యంగా, పరిపూర్ణంగా, ప్రసంసనీయంగా ఉంటుంది. పరిపూర్ణమైన పరిపూర్ణతమాత్రమే ఆమెను ఒప్పించగలదు. సృష్టి కార్య పూర్ణత్వానికి అనంతమైన శ్రమ కావలసివస్తే, అందుకు ఆమె సిద్ధం. మనిషితోను, అతని వేలాది అసంపూర్ణతలతోనే అనాదిగా బాధింపబడుతున్న దివ్యమాత శక్తులన్నింటిలోను మొదటిది ఆమె.

దయతో, చిరునవ్వుతో, చేరువతో సాయం చేస్తూ, చిన్నవాటికే వెనుదీయక, అసంతృప్తి చెందక, ఎన్నిసార్లు ఓటమిపాలైనా పట్టువిడువక ఉంటూ, మనం చిత్తంలో ఏకోన్ముఖులమై, స్పష్టంగా నిష్కపటంగా ఉన్నంతవరకూ చిత్తంలో ఆమె చేయి మన ప్రతి అడుగులోను పట్టి ఉంచుతుంది. రెండు ధోరణుల మనస్సును ఆమె సహించజాలదు. ఆమె ప్రదర్శించే వ్యంగ్యత్వం నాటకాన్ని, అనుకరణను, ఆత్మవంచనను, భేషజాన్ని నిర్దయతో బయట పెడుతుంది. మన అవసరాలకు తల్లిగా, కష్టాలలో స్నేహితురాలిగా, అలుపెరుగని ప్రశాంత ఉపదేశకురాలిగా, మార్గదర్శకురాలిగా, తన వెచ్చని చిరునవ్వుతో మేఘాలుగా అలుముకున్న దుఃఖాన్ని అసహనాన్ని, నిరాశను పారద్రోలుతూ, నిరంతరసాయాన్ని తరచి తరచి గుర్తుకుతెస్తూ, శాశ్వత సూర్యకాంతివైపు దారి చూపిస్తూ, ఊర్ధ్వప్రకృతి సమగ్రతవైపు నడిపించే ప్రగాఢ, నిరంతర, ప్రేరణను దృఢంగా ప్రశాంతంగా, స్థిరంగా అందిస్తుంది. అన్ని ఇతరశక్తులు తమ కార్యం పూర్తి అయ్యేటందుకు ఆమె మీద ఆధారపడతాయి. ఆమె భౌతికంగా పునాదులను దృఢపరుస్తూ, కార్యరంగ వివరాలను విచారించి, సౌధం రక్షకకవచాన్ని కూర్చి, నిర్మిస్తుంది.

CWSA 32:22-23

దివ్యమాత మహిమాన్విత అంశలు మరెన్నో ఉన్నా వాటిని అనుష్టించడం మరింత కష్టతరం.అంతేకాక, అవి భూమిచైతన్యపరిణామంలో ప్రస్ఫుటంగా ప్రదర్శితం కాలేదు. వాటియందు అతిమానస అవతరణకు కీలకమైన వ్యక్తీకరణలు కూడా ఉన్నాయి. అన్నింటి కంటె ముఖ్యమైనది పరమాత్మ దివ్యప్రేమ నుండి వెలువడుతూ అత్యున్నత శిఖరాల అతిమానసతత్వాన్ని అత్యంత లోతైన పదార్థపు లోయలను సమానం చేస్తూ, అత్యద్భుత దివ్యోత్తమ జీవనానికి ఆధారభూతమై, ఇప్పటి విశ్వశక్తులు కదలికలను కూడా తన నిగూఢ విధానాలద్వారా పట్టి ఉంచే ఆ దివ్యమాత రహస్య, శక్తిమయ పారవశ్యము, ఆనందము కలిగి ఉండే అంశ. కానీ ముడుచుకుపోయి,

అహంకారంతో, అంధకారంలో నున్న మానవ స్వభావం ఈ గొప్ప వ్యక్తీకరణలను పొందజాలదు, వాటి మహత్తర కార్య నిర్వహణను సమర్థించజాలదు.

ఈ నాలుగు శక్తులు వాటి సామరస్యతను, గమన స్వాతంత్ర్యాన్ని రూపాంత రీకరణ చెందిన మనః ప్రాణ శరీరాల్లో ప్రతిష్టిస్తేనే మరింత అరుదైన ఇతరశక్తులు భూమి గమనంలో ప్రకటితమయ్యి అతిమానస విధిగతులు సాధ్యపడతాయి. మరి ఆమె వ్యక్తిత్వాలన్నీ ఒక్కటయ్యి ఆమెలో చేరి అక్కడి నుండే వాటి విడివిడి కార్యక్రమా లను ఒక సమరస ఏకత్వంతో నిర్వహించి వాటికవిగా అతిమానస మహాశక్తిగా ఆవి ష్కారమవుతూ అనంత వ్యోమం నుండి తన కాంతిమయ సర్వోత్కృష్టతలను క్రిందకు తీసుకురాగలదు. అతిమానస సత్య చేతన, సత్యశక్తుల మౌళిక ప్రకారాలు అన్నీ ఒక్కటిగా చేర్చి కూర్చబడి జీవన వీణ అనంతంలోని లయలకు తగినట్టు పలి కే కొలదీ మానవ స్వభావం క్రియాశీలక దివ్య స్వభావంగా మారగలదు.

CWSA 32:23-24

నీవు రూపాంతరీకరణను, కోరుకుంటే వితండవాదం చేయకుండా, ఎదురు తిరగకుండా శ్రీమాతకు ఆమె శక్తులకు సమర్పించుకొని ఆమె కార్యాన్ని నిరాటంకం గా నీలో జరుపుకొనే అవకాశం కల్పించు. నీవు కలిగి ఉండవలసిన మూడు లక్షణాలు - ఎరుక, నమనీయత, నిరపేక్షాపూర్వక సమర్పణ, మనస్సు, ఆత్మలయందు, హృదయం, ప్రాణముల యందు, ఆఖరకు శరీర కణములయందుకూడా శ్రీమాత ఆమె శక్తుల వాటి ప్రభావం ఎరుకను నీవు కలిగియుండాలి. ఆమె నీ అజ్ఞానంలోను, నిద్రాణంగా నున్న భాగాలనూ, ఆదమరచిన క్షణాల్లోనూ కూడా పనిచేస్తూ ఉండి ఉన్నా, నీవు ఎరుకతో, సజీవ సంపర్కంతో ఉన్న దానితో అది సమానం కాదు.

ఆమె స్పర్శకు నీ స్వభావమంతయూ నమనీయంగా ఉండాలి. తనకు తాను సరిపెట్టుకొంటూ తనలోని మార్పును, విజ్ఞతను ప్రశ్నిస్తూ, అనుమానిస్తూ, వ్యతిరేకించే మూర్ఖమనస్సులా ఉండరాదు; అడ్డుపడుతూ, నిస్సహాయతలోనూ, జడత్వంలోనూ కూరుకుపోయి తన అల్పత్వం అజ్ఞానంతోనే మురిసిపోతూ తన ఆత్మ ప్రేరణలేని అలవాట్లను మొద్దు బద్ధకాన్ని, సోమరినిద్రను తట్టి లేపే ప్రతి స్పర్శకు గగ్గోలుపెట్టే మనిషిలోని భౌతికంలా ఉండరాదు.

నీ అస్తిత్వం ఆంతరంలోనూ బాహ్యంలోనూ ఒనర్చిన నిరపేక్షాపూర్వక సమర్పణ ఈ నమనీయతను నీ ప్రకృతిలోని అన్ని బాగాలకూ తీసుకువస్తుంది. పైనుండి

క్రిందకు ప్రవహించే విజ్ఞానం, కాంతి, శక్తి, సామరస్యత, సౌందర్యం, పరిపూర్ణతలకు నిరంతరం తెరచుకొని ఉండటం ద్వారా నీలో అంతటా చైతన్యం మేల్కొంటుంది. చివరకు శరీరం కూడా మేల్కొని అప్పటి వరకూ నిద్రాణంగానున్న అతిమానస అతీత చైతన్యశక్తిచే దాని సర్వ విభూతులచే పైనుండి క్రిందనుంచి, అన్ని దిక్కుల నుంచి చుట్టుముట్టబడి పరమోన్నత ప్రేమానందాలకు పులకించిపోతుంది.

కాని జాగరూకతతో ఉంటూ తన సంకుచిత విశ్లేషణలకు, తప్పుడు అభిప్రాయాలకు లోతే తెలియని పొగరుబోతు అజ్ఞానానికి, అల్పమైన అతి తెలివికి తన స్థాయీ సామర్థ్యాలకు మించిన విషయాలను సైతం గురిచేయడానికి ఇష్టపడే పరిమిత వ్యావహారిక మనస్సుతో దివ్యమాతను అర్థం చేసుకోవాడానికి, అభిప్రాయ పడడానికి ప్రయత్నించకు. చాలీచాలని వెలుగుతో నుండే అంధకారంలో పనిచేసే మానవ మనస్సు, పలు దిశలు స్వేచ్ఛగా పరుగిడే దివ్యశక్తి కదలికలను అనుసరించ లేదు. ఆమె ఒరవడి, ప్రవర్తనల వేగాన్ని, సంక్లిష్టతలు తన తడబడే విజ్ఞతను మించిపోతాయి; ఆమె చలన స్థాయి తన స్థాయికి మించినది.

క్షణాల్లో అనేకానేక రూపాల్లోనికి మారిపోవడం చూసి కళ్ళు చెదిరిపోగా, గమనాలను క్రమబద్ధీకరించడం, మరోవైపు వేరు చేయడం, వేగాన్ని పెంచడం తగ్గించడం, ఒక్కొక్క సమస్యను ఒక్కొక్కవిధంగా పరిష్కరిస్తూఅనేక విధాలుగా ప్రవర్తించడం, మొదలుపెట్టిన దాన్ని విడిచిపెట్టి మరొక పనిలోకి వెళ్తూ చివరకు అన్నింటినీ సమన్వయపరచడం, ఈ విధంగా ఆద్యశక్తి పరిశ్రమల ద్వారా అజ్ఞానపు చిక్కుల నుండి ఊర్ధ్వ కాంతివైపుకు దూసుకుపోవడం మానవ మనస్సు గుర్తించడం కష్టసాధ్యం. అందువల్ల నీ అంతరాత్మను ఆమెకు తెరిచి నీ అంతరాత్మిక ప్రకృతిలో ఆమెను అనుభూతి చెందుతూ, అంతరాత్మిక దర్శనంలో ఆమెను చూస్తూ, ఆనందించడమే సత్యానికి ప్రత్యక్షసమాధానంగా పరిణమిస్తుంది. అప్పుడు శ్రీమాతయే నీ మనస్సును, హృదయాన్ని జీవనాన్ని భౌతిక చైతన్యాన్ని వాటి అంతరాత్మిక గుణాల ద్వారా కాంతివంతం చేస్తూ ఆమె విధానాలను, ప్రకృతిని వాటికి తెలియజేస్తుంది.

దైవం తన సర్వజ్ఞత, సర్వశక్తత ద్వారా మనం కోరిన విధంగా పనిచేస్తుందనే పరిపక్వతలేని పైపై ఆలోచనలకు గురయ్యే మూర్ఖమనస్సు చేసే తప్పుల బారిన పడకు, ప్రతి మలుపు లోనూ అద్భుత శక్తి, అనాయాస విజయం, ధగధగద్ధాయమాన



వైభవం తనను మెప్పించాలని మన మనస్సు వెంపర్లాడుతూ ఉంటుంది. అలా లేకపోతే దైవం ఇక్కడుందని నమ్మదు. శ్రీమాత అజ్ఞాన భూమికల్లోని అజ్ఞానంతోనే వ్యవహరిస్తోంది. ఆమె దిగివచ్చినందున పై లోకాలలో నున్న పైనున్న విధంగా ప్రవర్తించదు. తన జ్ఞానాన్ని శక్తిని కొంత దాచి వుంచుతూ కొంత బహిరంగ పరచుతూ తరచు తన విభూతులనుండి, వ్యక్తిత్వాల నుండి తనను తెరచాటు చేసుకొని గమనిస్తూ ఆకాంక్షిస్తున్న అంతరాత్మను పోరాడుతున్న ప్రాణాన్ని నిర్బంధిత వేదనామయ భౌతికాన్ని వాటి విధానాలను రూపాంతరీకరించేలా పనిచేస్తుంది.


సర్వోన్నత ఇచ్ఛ విధించిన షరతులు, వదులు చేయనలసిన మరెన్నో చిక్కు ముడులు వంటి వాటిని త్రుంచి పారవేయడం వీలుపడదు. ఈ పరిణామము చెందు తున్న భూప్రకృతి అసుర, రాక్షస శక్తులు అధీనంలో ఉన్నది. వారిని ఎదు ర్కోవడం, అధిగమించడం వారి పద్ధతుల్లోనే, ఎంతో కాలంగా వారి అధీనంలో నున్న వారి సామ్రాజ్య ప రిధుల్లోనే జరగాలి. మనలోని మానవత్వం తన పరిమితులను దాటేందుకు ప్రేరేపింపబడి సిద్ధపరచబడాలి., పైగా తనకంటే ఎంతో పైనున్న మరొక రూపాన్ని ఒక్కసారిగా సంతరించుకోవడానికి అది చాలా బలహీనంగా , చేతగానిదిగా ఉంది.

దివ్యచైతన్యం, దివ్యశక్తి అక్కడే ఉంటూ శ్రమించిన దాని కనుగుణంగా కావలసినది

చేసి పెడుతూ, జరగవలసిన విధంగా గమనాన్ని నిర్దేశిస్తూ, ఈ అసంపూర్ణతల నడుమ ఏర్పడవలసిన సంపూర్ణతకు రూపమిస్తాయి. కానీ నీ లోనికి అతిమనస్సు దిగిన తరువాతనే ఆమె ప్రత్యక్షంగా అతిమానసశక్తిగా అతిమానస స్వభావాలతో వ్యవహరించగలదు. నీ మనస్సు ననుసరించి నంతవరకూ శ్రీమాత నీ ముందే యున్నా అది గుర్తించలేదు. కనపడిన వాటిని చూసి అంచనాలు కట్టే మనస్సును కాక, పరమ సత్యానికి ప్రతిస్పందించే నీ ఆత్మను అనుసరించు. దివ్యశక్తిని విశ్వసించు. ఆమె నీలోని దైవీ లక్షణాలను బహిరంగపరచుచూ అన్నింటినీ దివ్యప్రకృతి అభివ్యక్తిగా రూపుదిద్దుతుంది.

CWSA 32:25-26

పృథ్వీ చైతన్య వికాసమునందు అతిమానస పరివర్తనం అనివార్యమైన శాసనముగా నున్నది. ఎందువల్లనంటే ఈ వికాసక్రమము యొక్క ఆరోహణ ముగిసిపోలేదు, పైగా మనస్సు దాని పరాకాష్ఠ కాదు. కానీ ఆ మార్పు రావడానికి, రూపుదాల్చి స్థిరపడడానికి క్రింద నుండి ఆ కాంతిని గుర్తించి అది వెలువడినప్పుడు దానిని తిరస్కరించకుండా ఉండే సంకల్పంతో కూడిన పిలుపు మరియు పైనుండి సర్వోన్నతుని అనుజ్ఞ కావాలి. ఆ అనుజ్ఞను, ఈ పిలుపును అనుసంధానం చేసేది దివ్యమాత శక్తి, సన్నిధియే. ఏదో ఒక మానవ ప్రయత్నమో, తపస్సో కాక అమ్మ శక్తి మాత్రమే ఈ



పుష్పం: అతిమానస అభివ్యక్తి.
ఆహ్వానించ దగినది.
ఆధ్యాత్మిక విశిష్టత వివరణ: అమ్మ
శాస్త్రీయ నామం:
స్కాడోక్సస్ మల్టిఫ్లోరస్
(హెమాన్తస్ మల్టిఫ్లోరస్

అడ్డంకిని బ్రద్దలు చేసి పొరలను తొలగించి, పాత్రకు రూపమిచ్చి అజ్ఞానం, అసత్యం, మృత్యువు, బాధలు గల ఈ ప్రపంచం లోనికి సత్యాన్ని, కాంతిని, దివ్యజీవనాన్ని, అమృతత్వపు ఆనందాన్ని తీసుకురాగలదు.

CWSA 32:17-26 అనువాదం: డా. పి. వెంకటేశ్వర రావు (9440104449)

పన్నెండు విశిష్ట గుణాలు

కిందటి సారి నేను పన్నెండు విశిష్ట గుణాల గురించి చూస్తున్నానని నీకు చెప్పాను. (శ్రీమాత ఒక కాగితాన్ని బయటకు తీసారు). అవి అక్కడున్నాయి, ఎవరికో ఇవి కనబడ్డాయి.

1. చిత్తశుద్ధి 2. వినమ్రత 3. కృతజ్ఞత 4. పట్టుదల 5. ఆకాంక్ష 6. గ్రహణశీలత 7. పురోగతి 8. ధైర్యం 9. మంచితనం 10. ఔదార్యం 11. సమత్వం 12. ప్రశాంతత

మెదటి ఎనిమిది దైవం వైఖరిని చూపిస్తాయి, చివరి నాలుగు మానవజాతి వైపు చూపిస్తాయి.

The Mother: Conversation with a disciple, January 19, 1972

రూపాల గాఢమైన ప్రాముఖ్యత నాకు త్లెమ్సేన్‌లో తెలియవచ్చింది, నేను అధిమనస్సులో ఉన్నప్పుడు. బహుళ సంఖ్యలోని ఆ ప్రపంచాలకు థియాన్ ఏ పేర్లు పెట్టూ వచ్చాడో నాకు గుర్తు లేదు, కాని ఆ ప్రపంచం అత్యున్నతానికి చెందినది, శ్రీఅరవిందుల అధిమనస్సు అత్యంత ప్రకాశవంతమైన ప్రదేశాలకు చెందింది. అది దేవతలకు పైన, సరిగ్గా పైన ఉన్న ప్రదేశం. ఏదో విధంగా అది అధిమనస్సు సృష్టికి అనుగుణ్యమైనది — అది దేవతల ప్రభావంలో ఉన్న భూమి. అక్కడే నాకు రూపాల సజీవ అర్థం పొడసూపింది — మానసికమైన ఊహాగానం కాదు: ఒక సజీవార్థం. అక్కడే నన్ను మేడమ్ థియాన్ గుర్తించడం జరిగింది. దానికి కారణం ఆమె నా తల మీద పన్నెండు ముత్యాలను చూడటం తటస్థించింది. అప్పుడు ఆమె నాతో అన్నది, "నీవు ఆ 'తత్' వి, కారణం నీకు ఇవి ఉన్నాయి. కేవలం ఆ 'తత్' కు మాత్రమే ఇవి ఉండటం సాధ్యం!"

The Mother Conversations with a disciple

చిత్తశుద్ధి

మొట్టమొదటగా తనను తాను మోసగించుకోక పోవటం. దైవాన్ని మోసగించలేరని తెలుసు గదా. అత్యంత తెలివైన అసురులకు కూడా దైవాన్ని మోసగించడం సాధ్యం కాదు. అయితే ఆ విషయం అర్థమైనా కూడా తరచుగా జీవితంలో అనునిత్యం, రోజు వారి కార్యక్రమంలో తమను తాము మోసగించుకొనే ప్రయత్నం, అలా చేస్తున్నామని తెలియకుండానే, చేస్తుంటారు, తనకు తానుగానే చాలా మటుకు యాంత్రికంగానే ఎల్లప్పుడు తాము చేసిన ప్రతిదానిని, తమ మాటలను,చేతలను సమర్థించుకో జూస్తుంటారు. మొదట జరిగేది అదే. స్పష్టంగా వ్యక్తుల మధ్య జరిగే పోట్లాటలు (తగాదాలు), అందులో మాట్లాడే 'తప్పు అవతలివారిదే' అనే వాటిని గురించి నేను చెప్పడం లేదు. నిత్యం జీవితంలో జరిగే చాలా స్వల్ప విషయాల గురించి నేను మాట్లాడుతున్నాను.

నాకు తెలిసిన పిల్లవాడు తలుపును కొట్టుకుని, దాన్ని తిరిగి గట్టిగా తన్నాడు! విషయం అలాగే ఉంటుంది. ఎల్లప్పుడు అవతలివారిదే తప్పిదం అని, వారే పొరపాటు చేశారని అనడం జరుగుతుంది. ఒక వేళ నీవు బాల్యావస్థను దాటినా, నీకున్న కొద్ది పాటి బుద్ధితో, నీవు ఇంకా అత్యంత బుద్ధిహీనమైన సాకును చెప్తావు, "అతడా పని చేయకుంటే నేనీ పనిని చేసి ఉండేవాడిని కాదు." కాని అది అసలు జరిగినదానికి పూర్తిగా వ్యతిరేకం!

దీనినే నేను చిత్తశుద్ధితో ఉండటం అని అంటాను. నీవు ఎవరితోనైనా ఉన్నప్పుడు, నీవు చిత్తశుద్ధితో ఉంటే, నీ ప్రతిచర్య అప్రయత్నంగా సరైన రీతిలోనే ఉంటుంది, ఆ విధంగా చేయనటువంటి వారితో కూడి ఉన్నప్పటికీ కూడా. కోపం తెచ్చుకొనే మనిషి సర్వ సామాన్యమైన ఉదాహరణనే తీసుకో: బాధపెట్టే మాటలు మాట్లాడటానికి బదులుగా, నీవు ఏదీ మాట్లాడకుండా, నిశ్చలంగా, ప్రశాంతంగా ఉండు. ఆ కోపం నీకు సంక్రమించదు. ఇది తెలివైన విషయమేమీ కాదు. కేవలం నీలోనికే నీవు చూచుకోవాలి. ఇది చాలా ప్రాథమికమైన విషయం. నీవు చిత్తశుద్ధితో ఉన్నావా లేవా అనేదానికి ఇది చాలా చిన్న ప్రారంభం. ప్రతి ఒక్క అంటురోగాన్ని అంటించుకొనేవారి సంగతి నేను మాట్లాడటం లేదు. మోటుగా పరిహసించేవారిని లేదా ఇతరులు చే

సే బుద్ధిహీనమైనదానినే చేసేవారిని గురించి కూడా నేను మాట్లాడటం లేదు.

నేను చెప్పేది ఆలకించు. తీక్షణమైన దృక్కులతో నిన్ను నీవు చూచుకుంటే, వందలకొద్దీ కపట బుద్ధులను నీలో నీవు పట్టుకో గలుగుతావు, నీ సర్వ సాధారణమైన వైఖరిలో చిత్తశుద్ధితో ఉండటానికి నీవు ప్రయత్నిస్తున్నా కూడా. నీ కది ఎంత కష్టమో తెలుస్తుంది.

*

సంపూర్ణంగా చిత్తశుద్ధితో ఉండాలంటే తప్పనిసరిగా ఎటువంటి ప్రాధాన్యత, ఎటువంటి కోరిక, ఎటువంటి ఆకర్షణ, ఎటువంటి అయిష్టత, ఎటువంటి దయ లేదా వైరము, ఎటువంటి అనురాగము, ఎటువంటి వికర్షణ ఉండకూడదు. ఒకరు తప్పకుండా విషయాల యెడ సంపూర్ణ, సమగ్ర దృష్టి కలిగి ఉండాలి. అందులో ప్రతిదీ దాని స్థానంలో ఉండి, అన్ని విషయాల మీద ఒకరికి ఒకే విధమైన వైఖరి ఉంటుంది: సత్యదృష్టి వైఖరి.

*

చిత్తశుద్ధి అంటే అస్తిత్వ గమనాలన్నింటినీ అప్పటికే చేరుకున్న ఉన్నతోన్నత చేతనా, సాక్షాత్కార స్థాయికి పైకెత్తటం చేయాలి. చిత్తశుద్ధి అస్తిత్వంలోని అన్ని భాగాలు, గమనాలు దివ్య ఇచ్ఛ కేంద్రం చుట్టూ ఏకీకరణతో, సామరస్యతతో ఉండాలని కచ్చితంగా అడుగుతుంది.

*

ఎప్పుడైతే చిత్తశుద్ధి ఉంటుందో, ఆ సహాయం, ఆ మార్గదర్శనం, ఆ అనుగ్రహం నీకు సమాధానం ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నదని తెలుసుకుంటావు. నీవు ఇంక ఎంతో కాలం పొరపాటు పడవు.

శ్రీమాత



నిరాడంబరమైన చిత్తశుద్ధి
అన్ని పురోభివృద్ధులకు ఆరంభం
(పుష్పం ఆధ్యాత్మిక ప్రాధాన్యత
శ్రీమాతచే ఇవ్వబడింది.)
బొటానికల్ పేరు: అస్టర్ అమెల్లస్

అందరూ ఆ విషయం మాట్లాడుతూనే వుంటారు గాని, యెప్పుడూ సరిగా అర్థం చేసుకొని మాట్లాడరు. అదే వినమ్రత ఆవశ్యకత. అది తప్పుగా తీసుకోబడింది, తప్పుగా అర్థం చేసుకోబడింది, తప్పుగా వినియోగించబడింది. అణకువతో ఉండు, నీవు ఆ విధంగా సరైన పద్ధతిలో ఉండగలిగితే. అన్నింటినీ మించి, తప్పుడు విధానంలో మటుకు ఉండవద్దు, కారణం అది నిన్ను ఎక్కడికీ తీసుకుపోదు. కాని ఒక్క విషయం ఉంది: నీవు గనుక నీ నుంచి దురభిమానమనే ఈ కలుపు మొక్కను పెకలించివేస్తే, అప్పుడు వాస్తవంలో నీవు ఏదో చేసినట్లవుతుంది. కాని అది ఎంత కష్టమైన విషయమో నీకు తెలిసినట్లైతే! నీవు ఒక్క విషయాన్నీ సరిగ్గా చేయలేవు, ఒక్క మంచి ఆలోచననూ చేయలేవు, ఒక్క ఋజువర్తనాన్నీ చేయలేవు. స్వల్ప పురోభివృద్ధినీ సాధించలేవు, లోపల ఉబ్బిపోకుండా (దాని ఎరుక సైతం లేకుండా), పూర్తిగా గర్వంతో నిండిన ఆత్మ-సంతృప్తి లేకుండా. నీవు దానిని సుత్తితో గట్టిగా పగులగొట్టినా, ఇంకా పగిలిన ముక్కలుండి, మొలకెత్తటం మొదలవుతుంది. తప్పకుండా తమ జీవితకాలమంతా అది చేస్తూనే ఉండాలి. కపటంతో మళ్ళీ మళ్ళీ, మళ్ళీ, మళ్ళీ వచ్చే, అది పోయిందని నీవు విశ్వసించే ఈ కలుపుమొక్కను కూకటి వేళ్ళతో సహా పెకలించి వేయటం ఎన్నడూ మరవవద్దు. నీవు ఎంతో నిరాడంబరతానుభూతితో సవినయంగా చెప్తావు, "ఇది నేను చేసిందేమీ కాదు, దైవమే చేశాడు, అంతా ఆయనే, ఆయన లేకపోతే నేననే వాడుండడు". మరుక్షణం, నీకు నీవు ఎంత బాగా ఆలోచించావో కదా అని పొంగిపోతావు.!

ప్రశ్న: వినమ్రతతో ఉండటానికి ఏది సరైన పద్ధతి, ఏది తప్పు పద్ధతి?

ఇది చాలా తేలిక. "వినమ్రతతో ఉండమని" జనానికి చెప్పడం జరిగితే, తక్షణం వారనుకునేది "ఇతరుల ముందు వినయంతో ఉండటం", అటునంటి నమ్రత తప్పే. అసలైన వినమ్రత దైవం ముందు వినమ్రత. అదే కచ్చితంగా, నిశ్చితంగా, సజీవ భావనలో దైవంలేక ఒకరు శూన్యం, ఒకరు ఏమీ చేయలేరు, ఏమీ అర్థం చేసుకోలేరు. ఒకవేళ ఒక వ్యక్తి గనుక అసాధారణ ప్రజ్ఞ కలిగి, సామర్థ్యం కలిగినవాడైనా దివ్యచైతన్యం ముందు అది ఎందుకూ కొరగాదు. ఈ భావనను ఎల్లప్పుడూ తప్పక ఉంచుకోవాలి. ఏలననగా, అప్పుడు ఎల్లప్పుడూ గ్రహించడానికి అసలైన వైఖరిని కలిగిన వారవుతారు

— ఒక వినయపూర్వకమైన గ్రహణశీలత ఏదైతే ఉందో అది దైవానికి వ్యతిరేకంగా వ్యక్తిగతమైన టక్కుటమారాలను ఉంచదు.

*

ప్రశ్న మాతా, మేము ఒక ప్రయత్నం చేస్తే, మాలో ఏదో చాలా ఆత్మ-సంతృప్తిని పొంది, ఆ ప్రయత్నంలో బడాయిలు పోయి, సంతృప్తిని పొందుతుంది. అది సమస్తాన్ని చెడగొడుతుంది. అటువంటప్పుడు మేము దాని నుంచి తప్పించుకోవటం ఎట్లా?

ఆహా, చేసేదాని నంతటినీ చూసే దొకటుంటుంది! ఏదైనా ఒక పని చేస్తుంటే ఎల్లప్పుడూ వారిని కనిపెట్టి చూసేది ఒకటుంటుంది! ఇప్పుడు ఒక్కొక్కప్పుడు, అతడు గర్విస్తాడు. సహజంగానే, ఇది ఆ ప్రయత్నం నుంచి చాలా బలాన్ని లాగేసుకుంటుంది. నేను దానిని ఈ విధంగా అనుకుంటున్నాను: తాను ఏదైనా చేస్తున్నప్పుడు తనను తాను చూసుకొనే అలవాటు, తన జీవనాన్ని చూసుకోవటం. ఒకరు తమను తామే పరిశీలించుకోవటం ఆవశ్యకమైన విషయమే. కాని దానిని మించి ఇంకా ఆవశ్యకమైనది సంపూర్తిగా చిత్తశుద్ధితో ఉండటం, తాను చేసేదానిలో స్వతస్సిద్ధంగా (సహజ సిద్ధంగా) ఉండటం, చాలా స్వతస్సిద్ధంగా ఉండటం: ఎల్లప్పుడూ తనను తాను పరిశీలించుకోకుండా ఉండటం, తానేం చేస్తున్నానోనని చూసుకోకుండా ఉండటం, తనకు తాను న్యాయనిర్ణయం చేసుకుంటూ ఉండకుండా ఉండటం — అదే ఒక్కొక్కప్పుడు చాలా కఠినంగా. అది ఎటువంటిదంటె, యధార్థానికి సంతృప్తితో తనను తాను వెన్ను చరచుకుంటూ ఉండటమంత చెడ్డది, రెండూ సమానంగా చెడ్డవే.



వినమ్రత
దాని నిరాడంబరతలో ఆరాధనీయం
(పుష్పం ఆధ్యాత్మిక ప్రాముఖ్యత శ్రీమాతచే ఇవ్వబడింది)
బొటానికల్ పేరు: అగ్రోస్టిస్ నెబులాసా

ఒకరు ఎంత చిత్తశుద్ధితో ఉండాలంటే, తాను ఆకాంక్షిస్తున్నాననే విషయం కూడా తెలియనంతగా, అతడు తనకు తాను ఆకాంక్ష అయిపోవాలి.

CWM 5;44-45, 6:402 శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ (9441813100)

కృతజ్ఞత

భక్తితో పాటుగా నిరంతరం వెంట ఉండాల్సినది మరొకటి ఉన్నది. అదే 'దైవం' యెడల కృతజ్ఞత. దైవం ఉన్నాడనే బలమైన నమ్మకం నీలో కృతజ్ఞతా భావాన్ని నింపాలి. అది మహదానందంగా నీవు భావించాలి.

ఎంత పాశవిక ప్రవృత్తులను మనం ఎదుర్కొంటున్నా, అంతటా దైవం కూడా ఉన్నాడనే నమ్మకం కూడా బలంగా ఉండాలి. ఆ నమ్మకం అద్భుతమైన, అనంతమైన ఆనందాన్ని నీ హృదయంలో నింపాలి. దాని వలన జనించే కృతజ్ఞతా భావమే ఒక మధురమైన భావన!

కృతజ్ఞతా భావానికి మించిన ఆనందం మరొకటి లేదు. మనం ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తున్నా, పక్షుల పాటలకు పరవశిస్తున్నా, కుసుమాల సౌకుమార్యాన్ని తిలకిస్తున్నా, శిశువుల శైశవశత్వానికి ముగ్ధులమౌతున్నా, దాతృత్వపు కార్యక్రమాలను శ్లాఘిస్తున్నా, చక్కని వాక్యనిర్మాణం చూచి అబ్బురపడుతున్నా, సూర్యోదయ, సూర్యాస్తమయాలను చూచి ఆనందపడుతున్నా, అన్ని చోట్లా వెల్లి విరిసేది 'దివ్యత్వమే' అని భావించాలి. 'దివ్యత్వం' తో సంబంధం లేనిది ఈ ప్రపంచంలో లేనే లేదు. ఇందుకే దైవానికి సదా మనం కృతజ్ఞులమై యుండాలి.

CWM 8:40

ప్రార్థనా మందిరాలకు వెళ్ళేవారిలో బహు కొద్దిమంది మాత్రమే తమకు తాముగా భగవంతునకు సమర్పించుకోవాలనీ, దేవుని సేవలో తరించాలని అనుకుంటారు. అట్టివారు భగవంతుని నుండి దేనినీ ఆశించరు. వారి సంఖ్య మిలియన్‌కు ఒక్కరు ఉంటారేమో!

CWM 6:194-95

దైవం ఎటువంటి వారినైనా, మంచివారు, చెడ్డవారు, జ్ఞాని, అజ్ఞాని, అనే భేదం లే

కుండా, వారిని వీలయినంత దగ్గర మార్గంలో దివ్యత్వం వైపే నడిపిస్తాడు. వారిలో అహంకారము, అయిష్టము ఉన్నా సరే!

మనం దైవానికి 'సర్వదా కృతజ్ఞులమే' అనే భావం మన హృదయాలలో నిరంతరం జ్వలిస్తూనే ఉండాలి. ఆ మధురమైన భావనలో మన 'అహం' 'అజ్ఞానం' కరిగిపోవాలి. అట్టి కృతజ్ఞతా భావపు వెలుగే సాధకుని గమ్యానికి చేర్చగలదు. సాధకుడు ఎంత కృతజ్ఞుడై ఉంటాడో అతని మార్గం అంత చేరువ అవుతుంది.

నిష్కలంక, నిరహంకార కృతజ్ఞత అసంకల్పితంగాను, సహజంగాను ఉంటుంది. అది ప్రేమ వలన జనించే సమర్పణా భావమే కాదు. అదే పరిపూర్ణ ఆనందము. దానికి అదే సాటియైన ఒక ప్రత్యేక ప్రతిస్పందన. అది నీ విస్తృతిని పెంచుతుంది; నీ అంతఃకరణాన్ని పూర్తిగా నింపుతుంది. దాని తీవ్రత వర్ణించలేము!

మానవుని చేతనా పరిధిలో నున్న మరే ఇతర స్పందనల కన్నా ఇది మాత్రమే నీలోని 'అహం' నుండి నిన్ను బయట పడవేయ గలదు. దీని పరిశుద్ధ ప్రతిస్పందనలోనికి నీవు రాగానే, ఇదే ప్రేమైక ప్రతిస్పందన అని నీవు గ్రహిస్తావు. ఇది సర్వవ్యాపియైన విస్తృతి. నిజమైన ప్రేమ యొక్క స్పందన ఏ వర్ణంలో ఉంటుందో కృతజ్ఞతా భావం ఆ విధంగా ఉంటుంది.

శ్రీమాత: శిష్యునితో సంభాషణలు, 21-12-1963



పట్టుదల

'పట్టుదల' ను 'సహనం' అని కూడా అనవచ్చు. ఇది చాలా ముఖ్యమైనది. ధృడ సంకల్పం ఉంటే నీ పట్టు సడలదు. నిరుత్సాహము, దుఃఖము, నీ దరి చేరవు. ఎన్ని కష్టాలనైనా నీవు చిరునవ్వుతో ఎదుర్కొనగలవు. ఈ భావాన్ని ఆంగ్లంలో 'cheer-fulness' (ఆహ్లాదం) అంటారు. అటువంటిది చక్కని మనస్తత్వం.

అట్టి తత్వం నీలో ఉంటే నీవు దేన్నయినా ఎదిరించగలవు. నీలో పోరాట పటిమ వస్తుంది. దీని వెలుగు అవరోధం కలిగించే ప్రభావాల నుండి తప్పించి నిన్ను త్వరగా గమ్యానికి చేరుస్తుంది.

*

ఎవరి అంతరంగంపై, వారికి ధృడమైన నమ్మకం ఉండాలి. ఎంత కష్టమైనా, ఏమి జరిగినా, నీ దారిన నీవు పయనించి గమ్యం చేరాలి. 'విజయము అత్యంత సహిష్ణువునకే'.

భరించే శక్తి నీలో ఇతోధికంగా ఉండాలంటే అచంచలమైన ధృడత్వం కూడా అవసరమే. 'మహోత్కృష్ట సత్యం' పై బలీయమైన విశ్వాసం విధిగా ఉండాలి. మిగతా విషయాలపై దృష్టి సారించకూడదు. ఈ ఒక్కటి చాలు. ఇది ఎప్పుడూ విఫలం కాదు, విఫలం కానివ్వదు.

కష్టాలను ఎదుర్కొనే సమయంలో నీవు నిరుత్సాహ పడ్డా, వాటికి వెరచి ప్రయత్నం విరమించినా, ఎదురుదెబ్బలను తట్టుకునే సామర్థ్యం నీకు సన్నగిల్లినా, వాటిని తట్టుకొని ముందుకు సాగకపోతే ఏమాత్రం పురోగతి సాధించలేవు. ఏ మలుపు వద్దనైనా నీ గమ్యం నీకు కనపడకపోతే, నీవు నిరాశలో మునిగిపోతావు. ఇక నీ కథ కంచికి వెళ్ళినట్లే!

ఎలా చెప్పాలో నాకు తెలియటం లేదు. కాని 'పట్టుదల' మాత్రమే నీకు సహాయపడుతుందని మాత్రమే చెప్పగలను. అవసరాన్ని బట్టి ఎన్ని సార్లైనా మరల, మరల ప్రారంభించాల్సిందే! కొన్ని వందల సార్లైనా సరే!

నా దగ్గరకు వచ్చేవారిలో చాలామంది, "అమ్మా, దాన్ని సాధించాలని అనుకుంటున్నాను. కాని ప్రయత్నంలో మళ్ళీ, మళ్ళీ ప్రారంభించవలసి వస్తున్నది", అంటారు.

నేను చెప్పేది ఏమిటంటే, "ఎన్నిసార్లయినా సరే, వందల, వేల సంఖ్యలోనైనా పట్టువదలని విక్రమార్కుని విధంగా నీవు మళ్ళీ, మళ్ళీ ప్రారంభించాల్సిందే. ఒక్క అడుగు మాత్రమే ముందుకు నడచి "నాకేం పరవాలేదు" అనుకుంటే కుదరదు. మున్ముందు నీవు ఊహించని ఆటంకాలు ఏవో ఎదురౌతాయి. అవి నిన్ను వెనుకకు లాగుతాయి. "సమస్యను పరిష్కరించానని" నీ వనుకుంటావు. కాని దానిని మరల, మరల పరిష్కరించవలసి వస్తుంది. ప్రతి సమస్య క్రొత్తగా ఉన్నట్లు అనిపించవచ్చు. కాని నిజానికి అది క్రొత్తది కాదు: ప్రాతదే.


"ఎన్ని లక్షల సార్లు ఆటంకాలు ఎదురైనా, అన్ని లక్షల సార్లు నేను సిద్ధపడతాను. ఎట్టి పరిస్థితులలోనూ సాధించి తీరుతాను", అని ధృడనిశ్చయంతో ఉండకపోతే, ఈ యోగం నీకు సాధ్యపడదు. దీన్ని ఎవరూ కాదనలేరు.

*

పట్టుదలతో మాత్రమే కష్టాలను అధిగమించవచ్చు. వాటిని చూచి పారిపోకూడదు. పట్టు పట్టినవారే జయిస్తారు. ఓపికతో సాహసించినవారికే విజయం దక్కుతుంది. శక్తివంచన లేకుండా కృషి చేస్తే, భగవంతుడే ఫలితాన్ని గురించి ఆలోచిస్తాడు.

CWM 8:23, 9:255, 8:41-42, 14:163

అనువాదం: కె. ఆర్. యల్. నరసింహారావు (9848848291)



ఆకాంక్ష అనేది ఒక వ్యక్తికి ఉన్నత విషయాల వైపుకు పిలుపు — భగవంతుని కోసం, ఉన్నతమైన లేదా దివ్యచేతనకు సంబంధించిన దానంతటి కోసం పిలుపు.

*

ఆకాంక్ష ఒక కోరిక రూపంలో ఉండకూడదు, అది ఆంతరిక అంతరాత్మ అవసరపు సంవేదన కావాలి. భగవదోన్ముఖమైన నిశ్శబ్దంగా నెలకొన్న సంకల్పమై భగవంతుణ్ణి కోరుకోవాలి.

CWSA 29:60-61

ఆదర్శవంతమైన సాధకుడు పవిత్ర బైబిల్ ప్రవచనంలా 'ప్రభువు కోసం తపన నన్ను తినివేసింది' అనుకోగలగాలి. ప్రభువు కోసం ఈ తపన, ఉత్సాహం దైవికమయిన ఫలితాల కోసం మొత్తం ప్రకృతి స్వభావ ఉత్సాహం. వ్యాకులత అనేది భగవంతుని పొందటానికి హృదయపు ఆతురత. తాను కోరుకొనే సంపూర్ణమూ, విశాలమూ అయినదానిని స్వీకరించటానికి తన అహాన్ని త్యజించి, తన అల్పమైన సంకుచితమైన మూసను ఛేదించుకుంటుంది. అది విశ్వజనీనం కావటం వలన అన్నిటినీ అతిశయించి వుంటుంది. విశ్వాతీతం కావటం వలన బృహత్తరమూ, ఉన్నతమయిన వ్యక్తిగత ఆత్మను, స్వభావాన్నీ అధిగమిస్తుంది.

CWSA 23:58

ఆధ్యాత్మికమైన ఆకాంక్ష మానవునిలో నిబిడీకృతమై ఉంది. ఎందుకంటే జంతువులా కాక అతను తన అపరిపూర్ణత తన పరిమితుల ఎరుకను, యిప్పుడు తాను ఉన్న స్థితి కన్నా మరేదో సాధించాలనే భావనను కలిగి ఉన్నాడు.

పదార్థ పరిణామంలో యింతవరకు ప్రవృద్ధమానమయిన వివేచనాయుతమైన మనసు ఉద్భవించటం సంభవించింది. ఇది ఆత్మ చేతనాయుత ఆకాంక్ష, ఉద్దేశం, సంకల్పం, ప్రాణి కోరిక వలన కాక ఉపచేతనచే లేదా అవచేతనచే ప్రకృతి స్వయం చోదిత వ్యవహారం వలన జరిగింది. తన కన్నా ఉన్నత స్తరానికి చెందిన చేతన ఉం డగలదని మానవుడు గ్రహించాడు. పరిణామం చెందాలనే ఉత్సుకత తన మనసు,

ప్రాణ అంశాలలో ఉండి, తనను తాను అధిగమించాలనే ఆకాంక్ష అతనిలో జన్మించి రూపుదిద్దుకుంటుంది.

CWSA 21:875-76 శ్రీఅరవిందులు

మాటలకు అతీతంగా, ఆలోచనలకు పైగా తీవ్రమైన ఆకాంక్ష జ్వాల నిలకడగా తేజోవంతంగా జ్వలించాలి.


*

ప్రశ్న: శ్రీమాతా! నిజాయితీ అయిన ఆకాంక్ష అంటే సరియైన అర్థం ఏమిటి? అహంకార పూరితమయిన స్వలాభాపేక్షతో సమ్మిళితం కాని ఆకాంక్ష.

*

మీరొక చేతనా యుతమయిన ఆకాంక్ష స్థితిలో ఉండి చాలా నిజాయితీగా ఉన్నప్పుడు మీ చుట్టూ ఉన్నవన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మీ ఆకాంక్షకు సహాయ కరంగా ఏర్పడతాయి. మిమ్మల్ని ప్రగతి చెందించటానికో, మిమ్మల్ని నూతనమయిన విషయంతో సంస్పర్శలో ఉంచటానికో లేక మీ ప్రకృతినుండి అంతర్థానం కావలసిన ఒక విషయాన్ని తొలగించటానికో సహాయ పడుతుంది. ఇది చాలా గుర్తించవలసిన విషయం. మీరు నిజంగా ఒక తీవ్రమయిన ఆకాంక్షతో ఉంటే మీ ఆకాంక్షను సఫలీ కృతం చేయటానికి దోహదం చేయని పరిస్థితులు ఉండవు. అన్నీ కదలివస్తాయి. ఒక పరిపూర్ణమయిన సంపూర్ణమయిన చైతన్యం మీ చుట్టూ అన్నిటినీ వ్యవస్థీకరిస్తున్నట్లుగా అన్నీ కదలివస్తాయి.

CWM 14: 75 72 *CWM 6: 176*



ఆకాంక్ష

అసంఖ్యాకం, ధృఢం, నిర్విరామంగా, పదేపదే పునరావృతం అవుతూ వుంటుంది. (శ్రీమాత యిచ్చిన ఆధ్యాత్మిక సంకేతం)

వృక్షశాస్త్రియ నామం: నిక్టాంథస్ ఆర్బొర్ - ట్రిస్టిస్

స్వీకరణం (గ్రాహ్యత)

దివ్యక్రియాశక్తిని స్వీకరించగల సామర్థ్యం, ఆశక్తి ఉనికిని అందులో శ్రీమాత సన్నిధిని అనుభూతి చెందగలగటం వ్యక్తి దృష్టి, సంకల్పం, కార్యాచరణలో మార్గదర్శకంగా దానిని పనిచేయనివ్వడం.

*

ఈ వికాసం ప్రకృతి నంతటినీ తన అన్ని స్తరాలలోనూ, అన్ని అంశాలలోనూ విశాలంగా విస్తరింపజేసి సంసిద్ధంగా ఉపరితలములోనూ వెనుక మర్త్య అర్థ-చైతన్యపు ఉనికిని ఆవరించి ఉన్న మహత్తరమైన దివ్యచేతనను అపరిమితంగా తనలోకి స్వీకరించేటట్లు చేస్తుంది.

SABCL 29: 266: CWM 12: 169 — *శ్రీఅరవిందులు*

నా ప్రేమ ఎల్లప్పుడు మీతో ఉంటుంది. మీరు దాని నెందుకు అనుభూతి చెందలేకపోతున్నారంటే మీరు దానిని స్వీకరించలేక పోవటం వలన, మీ గ్రహణతాలోపం వలన. దానిని పెంపొందించుకోవాలి అందుకు మిమ్మల్ని మీరు తెరుచుకోవాలి. మిమ్మల్ని మీరు సమర్పించుకున్నపుడే అలా తెరుచుకోగలుగుతారు. ఖచ్చితంగా మీరు ఎంతో కొంత చైతన్యవంతంగా శక్తులను దివ్యప్రేమను పొందటానికి ప్రయత్నిస్తున్నారు. ఈ పద్ధతి సరియైనది కాదు. మీరు లెక్కలు వేసుకోకుండా, తిరిగి ఏమీ ఆశించకుండా సమర్పణ చేస్తున్నప్పుడు మీరు స్వీకరించగల సామర్థ్యాన్ని పొందుతారు.

*

అగ్నిని వెలిగించటం మీ పని కాదు. మీకు చెప్పినట్లుగా నేను దానిని ప్రజ్వలింపచేస్తూ, ఉంటాను. మీరు మిమ్మల్ని తెరచి ఉంచుకొని మీ సత్సంకల్పంతో దానిని స్వీకరించి నిలబెట్టు కోవాలి.

*

శ్రీమాతా! గ్రాహ్యత దేనిపై ఆధారపడిఉంటుంది?

అది మొదట నిజాయితీపై నిజంగా స్వీకరించాలనుకుంటున్నారా లేదా అనే విషయంపై

అవును నిజాయితీ, విధేయత అనే రెండు ముఖ్యమయిన విషయాలని నేను విశ్వసిస్తాను.

అహంకారాన్ని మించి మిమ్మల్ని మూసివేసేది మరేదీ ఉండదు. మీతో మీరు సంతృప్తి పడిపోయినపుడు మీ లోపాలను అంగీకరించలేనటువంటి అహంభావాన్ని కలిగి ఉన్నప్పుడు మీరు తప్పులు చేస్తారు. మీరు అసంపూర్తిగా, అపరిపూర్ణంగా ఉంటారు. మీ స్వభావంలో ఏదో యిలా బిగువుగా తయారవుతుంది. అది ఒప్పుకోదు. ఇదే మిమ్మల్ని స్వీకరించకుండా నివారిస్తుంది. మీరు ఎలా అయినా ప్రయత్నించి మీలోని ఎంత చిన్న అంశమయినా అంగీకరించేటట్లు చేయగలిగితే "అవును, నేను పొరపాటు పడ్డాను. నేను అలా చేయకుండా ఉండవలసింది. నేనలా చేయకూడదు. నేనలా భావించకూడదు. అవును అది పొరపాటే," మీరిలా అంగీకరించ గలిగితే, మొదట నేనిపుడు చెప్పినట్లుగా మీకు చాలా బాధగా అనిపిస్తుంది. కానీ మీరు అంగీకరించేంతవరకూ గట్టిగా పట్టుకొని ఉన్నపుడు వెంటనే అది తెరుచుకుంటుంది. విచిత్రంగా తెరుచుకొని వెలుగు వరదలా ప్రవేశిస్తుంది. ఆ తరువాత మీరు చాలా ఆనందిస్తారు. ఎంత సంతోషపడతారంటే మిమ్మల్ని మీరే ప్రశ్నించుకుంటారు. "నేనెందుకు యింతకాలం మూర్ఖంగా వద్దనుకున్నాను?" అని.

CWM 14: 148, 17: 126, 6: 117



స్వీకరణ (గ్రాహ్యత)

దివ్య సంకల్పపు ఎరుక కలిగి దానికి సమర్పితం కావటం (శ్రీమాత యిచ్చిన ఆధ్యాత్మిక సంకేతం)

వృక్ష శాస్త్రీయ నామం: గ్లాడియోలస్ గ్రోర్టులానస్

కదలకుండా వుండే స్థితి గాక, పురోగతి (వ్యక్తి) జీవితంలో అవసరమైన, అభిలషణీయమైన నియమం. నూతనత్వం వైపు ఊపరిసలపని విధంగా కాదు, గొప్ప మహత్తర, ఆధ్యాత్మిక సత్యం వైపుగా ఒక స్థిరమైన గమనం. దృక్పథం, వ్యక్తిగతంగా మాత్రమే గాక సమష్టిగా కూడా, సామూహిక ప్రయాసలో, జీవన మలుపులో, ఆదర్శాలలో, స్వభావంలో సమాజాన్ని నిర్మించడం జీవితం. దాని కఠోర ప్రయత్నాలలో పరిపూర్ణత వైపు స్థిరమైన పయనం.

అంతరంగిక పురోగతిలో మొదటి నియమం ప్రకృతిలోని ఏదైనా భాగంలో అనుచిత చర్య, జరిగిన లేదా జరుగుతున్న, అనుచిత కదలిక — అనుచిత ఆలోచన, అనుచిత భావన, అనుచిత సంభాషణ, అనుచిత చర్య — అనుచితం అనగా సత్యం నుండి, ఉన్నత చైతన్యం మరియు ఉన్నత వ్యక్తిత్వం నుండి, దైవమార్గం నుండి మరలించేదానిని గుర్తించడం. ఒకసారి దీనిని గుర్తించినట్లయితే దానికి వ్యాఖ్యానంతో పని లేదు లేదా వాదించ నవసరం లేదు. దివ్యప్రకాశం, దివ్యానుగ్రహం అవతరించుటకు వాస్తవ చైతన్యం వైపు సరైన పయనం కొరకు ప్రత్యామ్నాయంగా మారుటకు అది దైవానికి అర్పించబడుతుంది.

CWSA 25:195; 29:131 — శ్రీఅరవిందులు

సృష్టిలో దైవప్రభావ చిహ్నమే పురోగతి.

*

భౌతిక జీవన ఉద్దేశ్యం పురోగతి. మీరు పురోగతిని ఆపివేస్తే మీరు మరణించుతారు. పురోగతి చెందకుండా మీరు గడిపే ప్రతిక్షణం మీ మరణానికి మరింత చేరువవుతుంది. మీరు సంతృప్తి చెందుతూ, ఇకపై అభిలషించకుండా ఉండే క్షణం నుండీ మీరు మరణించుట ప్రారంభిస్తారు. జీవితం ఒక ప్రయాణం, జీవితం ఒక ప్రయత్నం, అది భవిష్యత్తులోని ఈశ్వర ఆదేశాలు, జ్ఞానాన్ని అందుకునేందుకు ముందుకు సాగుతూనే ఉంటుంది. విశ్రాంతి కోరుకోవడం కంటే మరేది మరింత ప్రమాదకరం కాదు.

ప్రతి ఒక్కరికీ నేర్చుకోవడానికి, పురోగతి చెందటానికి ఎల్లప్పుడూ అవకాశం ఉంటుంది. ప్రతీ సందర్భంలో అనుభవ పాఠం నేర్చుకునేందుకు, పురోగతి సాధించేం


దుకు మనకు అవకాశం లభిస్తూనే ఉంటుంది.

*

పురోగతి: ప్రతీ క్షణం మార్గంలో పురోగమనం సాధించేందుకు మనం కలిగి ఉన్న అంతటినీ, అన్నింటినీ త్యజించుటకు సంసిద్ధుడై ఉండటమే.

*

వాస్తవమైన పురోగతి అంటే దైవ సామీప్యానికి చేరువ అవుతూ ఉండటమే.
CWM 15:75, 77



పురోగతి: మనము ఈ భూమిపై దీని కోసమే ఉన్నాము.
శ్రీమాత తెలిపిన పుష్పం ఆధ్యాత్మిక ప్రాధాన్యత), శాస్త్రీయ నామం: కాథారాంథస్ రోస్యూస్

ధైర్యం

ఏ విధమైన రూపంలోనూ భయం లేకపోవడమే ధైర్యం.
CWM 10:282

భయం ఒక విధమైన మాలిన్యం, అతి పెద్ద భయంకరమైన మాలిన్యాలలో ఒకటి. భూమిపై దైవకార్యాన్ని విధ్వంసం చేయుటకు ప్రయత్నించే అదైవిక శక్తుల నుండి నేరుగా వచ్చేవాటిలో ఒకటి. యోగాన్ని యథార్థంగా చేయాలనుకునేవారు, వారి చైతన్యం నుండి పూర్తి శక్తితో, పూర్తి చిత్తశుద్ధితో మరియు పూర్తిగా వారి సామర్థ్య మంతటిని ఉపయోగించి సహనశీలతతో ఛాయా మాత్రంగానైనా ఉన్న భయాన్ని తొలగించుకోవడమే ప్రధాన కర్తవ్యం. ఆ మార్గంలో పయనించేందుకు ప్రతీ ఒక్కరూ ధైర్యంగా ఉండాలి మరియు అటువంటి స్వల్పమైన, అతి చిన్నదైన, దుర్బలమైన, నీచమైన కుంచించుకుపోయేలా చేసే భయాన్ని ఎప్పటికీ దరి చేర్చరాదు.

ప్రబలమైన ధైర్యం, సంపూర్ణమైన చిత్తశుద్ధి, చిత్తశుద్ధితో కూడిన సమర్పణ కా

వాలి. దానితో లెక్కలు కట్టరు లేదా బేరసారాలు జరుపరు, మళ్ళీ తీసుకోవాలనే భావనతో ఏదీ ఇవ్వరు. రక్షించబడతామనే ఆలోచనతో విశ్వసించరు, రుజువులు కోరుకునే విశ్వాసం కలిగి ఉండరు — ఇదే, మార్గంలో ప్రయాణించేందుకు ఆవశ్యక్మైనది, ఇది మాత్రమే మీకు అన్ని విపత్తుల నుండి వాస్తవంగా రక్షణ కల్పిస్తుంది

CWM 8:260-61

సంపూర్ణ ధైర్యం: ఏ రంగమైనా, ఏ ప్రమాదమైనా, ధోరణి మాత్రం అలాగే శాంతంగా, ధీమాగా ఉంటుంది.

CWM 14:169

ఒక దీపపు జ్వాల మరొక దీపాన్ని వెలిగించే విధంగా ధైర్యమున్నవారు ఇతరులకు కూడా ధైర్య మివ్వగలరు.

గొప్ప ధైర్యం అనగా మనలోని దోషాలను గుర్తించడమే.

CWM 14; 170


పరిపూర్ణతలలో ఒక అంశం ధైర్యమని మనం సంభాషించుకున్నట్లు నాకు గుర్తుకు వస్తోంది. కానీ ఈ ధైర్యం అనగా అత్యున్నత సాహసంలోని రుచిని తెలుసుకొనుట. అత్యున్నత సాహసం పట్ల ఈ రుచి... మిమ్మల్ని పూర్తిగా వశపరచుకుటుంది, ఇబ్బంది పెడుతుంది. లెక్కింపులు లేకుండా, ప్రత్యేకతలు లేకుండా ఉపసంహారణకు అవకాశం లేకుండా, దైవాన్వేషణ అనే ఉత్తమ సాహస క్రీడలోకి, దైవంతో కలయిక అనే ఉత్తమ సాహస క్రీడలోకి, దైవజ్ఞానమనే ఉత్తమ సాహస క్రీడలోకి మీరు వెనుదిరిగి చూడకుండా "ఏమి జరుగుతుంది" అని ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా సాహసక్రీడలోకి మీకుగా మీరు మిమ్మల్ని నెట్టివేసుకుంటారు. ఏమి జరుగుతుంది అని మీరు అడిగినట్లయితే మీరు ఎప్పటికీ ప్రారంభించ లేరు. సమతుల్యతను కోల్పోతామని, ఏదో కోల్పోతామని భయపడుతూ ఉంటే మీరు ఎప్పటికీ అక్కడే ఉండిపోతారు.

CWM 8:40-41

పురోగతి నెమ్మదిగా ఉండవచ్చు, లోపాలు పునరావృతం కావచ్చు. కానీ ధైర్యంగా సంకల్పాన్ని నిలబెట్టుకుంటూ ఉంటే ఒక రోజున ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా విజ

యం సాధించగలరు. సత్య-చైతన్య ప్రకాశంలో అన్ని ఇబ్బందులు కరిగిపోయి, మాయమవుతాయి.

CWM 12;7.



ధైర్యం. నిర్భీతి, ఇది అన్ని ప్రమాదాలను ఎదుర్కొంటుంది. (శ్రీమాత తెలిపిన పుష్పం ఆధ్యాత్మిక ప్రాధాన్యత)
శాస్త్రీయ నామం: కాలో్ట్రోపస్ గిగాంటే.
హోతా ఈశ్వర కృష్ణ (98866757576)

మంచితనం

కొంతమంది మనుషులు ఇలా అనడం తరచు వింటుంటాను — "నేను మంచిగా ఉండడం మొదలుపెట్టిన దగ్గరి నుండి అందరూ నాకు చెడ్డవారిగా కనపడుతున్నారు." కాని ఆ అనుభవం నుండి మీరు నేర్చుకోవలసిన పాఠం సరిగ్గా అదే. మనసులో ఏదో ఉద్దేశం పెట్టుకుని మంచిగా ఉండాలని ప్రయత్నించ కూడదు. అవతలివారు మనతో మంచిగా ఉంటారని ఆశిస్తూ మనం మంచిగా ఉండకూడదు. కేవలం మంచిగా ఉండడం కోసమని మంచిగా ఉండడానికి ప్రయత్నించాలి.

ప్రతీ సందర్భంలోనూ ఇదే పాఠం వర్తిస్తుంది. మనం చేసే పనిని వీలైనంత మంచిగా, నాణ్యవంతంగా, ఏ ఫలితమూ ఆశించకుండా, ఫలాపేక్ష లేకుండా చెయ్యాలి. చేసిన మంచిపనికి ప్రతిఫలం ఆశించే ఉద్దేశం ఉంటే — మంచిగా ఉంటే జీవితం సాఫీగా అయిపోతుందనే ఉద్దేశంతో మంచిగా ఉంటే — దాని వల్ల చేసిన మంచి పనిలోని విలువ ఎగిరిపోతుంది,

మంచితనం మీద ఉన్న ప్రేమ కొద్దీ మంచిగా ఉండాలి. న్యాయం మీద ఉన్న ప్రేమకొద్దీ న్యాయబద్ధంగా ఉండాలి. నిర్మలత్వం మీద ఉన్న ప్రేమకొద్దీ నిర్మలంగా

ఉండాలి నిరాసక్తత మీద ఉన్న ప్రేమ కొద్దీ నిరాసక్తంగా ఉండాలి. అలా జీవించ గలిగితే చాలా వేగంగా పురోగమిస్తారు.

CWM 3:264-65

ఈ యోగం చెయ్యాలంటే, అన్నిటి కన్నా కఠినమైన ఈ రూపాంతరీకరణ యోగం చెయ్యాలంటే — దాని కోసమే ఇక్కడికి వచ్చాం (నా ఉద్దేశం ఈ భూమి మీదకి వచ్చాం) అని మనసులో అనిపించినప్పుడు, అది తప్ప సాధించవలసినది మరొకటి లేదని అనిపించినప్పుడు, మన ఉనికికి పరమార్థం అదేనని అనిపించినప్పుడు — "నాకు ఇదే కావాలి, మరింకేమీ వద్దు," అని అనగలిగినప్పుడు, అప్పుడు వేరు. లేకపోతే నేను ఏమంటానంటే — "మీరు సంతోషంగా ఉండండి, మంచిగా ఉండండి, అంతకు మించి మీనుండి నేను ఏమీ ఆశించడం లేదు. మంచిగా ఉండడం అంటే మీరు ఉంటున్న పరిస్థితులు అసాధారణమైనవని తెలిసి, ఆ అవగాహనతో జీవించడం. మామూలు జీవితం కన్నా మరింత ఉన్నతమైన, ఉదాత్తమైన, సత్యవంతమైన జీవితాన్ని జీవించడం. ఈ చైతన్యంలో, ఈ తేజంలో, ఈ మంచితనంలో ఒక రవంత అయినా ప్రపంచంలో వ్యక్తం అయ్యేలా జీవించడం. అలా చెయ్యగలిగితే చాలా బావుంటుంది."

CWM 7:200

నోట్లోని మిఠాయి కన్నా చేసిన మంచిపని హృదయానికి మరింత మధురమైనది.

ఏదో ఒక మంచిపని చెయ్యకుండా గడపిన రోజు సారంలేని రోజు అవుతుంది.

CWM 15:225

హృదయాన్ని మంచితనంతో, సద్భావనతో సదా పూరితం చేసుకుని, నిశ్చల



సద్భావన

వినమ్రంగా ఉండేది, అట్టహాసం లేనిది, ఏదో విధంగా ఉపయోగపడాలని సదా సిద్ధంగా ఉండేది. (శ్రీమాత ఇచ్చిన ఒక పూవుయొక్క ఆధ్యాత్మిక అంతరార్థం)

చిత్తంతో, సమత్వంతో దాన్ని అందరి మీద ప్రసరింప జేయాలి.

CWM 14:186

స్పష్టమైన, సమగ్రమైన దృష్టి కలిగి, ఏ వ్యక్తిగత ప్రతిస్పందనలు లేనిదై, అలుపెరుగని సేవాతత్పరతే భూమి మీద భగవంతుణ్ణి ప్రేమించి, సేవించడానికి అతిశ్రేష్ఠమైన మార్గము.

CWM 14:187

దయాగుణం

"ఔన్నత్యం, దయాగుణం అంతరాత్మ యొక్క పరంధామం. అవి లేని పక్షంలో మనం చూసేది బురదలోని పురుగును."

— శ్రీఅరబిందో (సూక్తులు, సుభాషితాలు)

శ్రీమాత వివరణ –

"ఔన్నత్యం అంటే వ్యక్తిగత స్వలాభాపేక్షని త్రోసిపుచ్చడం. దయాగుణం అంటే ఇతరుల సంతృప్తిలో మన సంతృప్తిని వెతుక్కోవడం."

ప్రశ్న: శ్రీఅరబిందో మహాలక్ష్మి గురించి అలా అంటారు... "దారిద్ర్యపు ఛాయ కలిగినది అంతా... ఆమె రాకని త్రోసిపుచ్చుతుంది."

జ: అవును. దరిద్రమైనది, దయారహితమైనది, ఆర్తిలేనిది, వైశాల్యం లేనిది, అంతరిక సంపత్తి లేనిది; శుష్కమైనది, జడమైనది, సంకుచితమైనది మహాలక్ష్మి రాకను నివారిస్తుంది. ఇది కేవలం ధనానికి సంబంధించిన విషయం కాదు సుమా! మహాలక్ష్మి దృక్పథంలో బాగా ధనికుడైనవాడు పరమ దరిద్రుడు అయ్యుండొచ్చు! అలాగే హృదయంలో దయాగుణం మెండుగా గల పేదవాడు గొప్ప ఐశ్వర్యవంతుడై ఉండొచ్చు...

దరిద్రుడు అంటే ఏ సుగుణాలు లేనివాడు, శక్తిసామర్థ్యాలు లేనివాడు, దయా గుణాలు లేనివాడు అన్న మాట. సంతోషం అంటే ఏంటో తెలియక దీనంగా బతికేవాడు. దయలేనప్పుడు సంతోషం కూడా ఉండదు — ముందు వెనుక చూసుకోకుండా మనస్ఫూర్తిగా ఇచ్చే గుణం ఉన్నవాళ్ళు ఎప్పుడూ సంతోషంగా ఉంటారు. వాళ్ళ అవసరాలు తప్ప మరొకటి తెలియని కుటిల స్వభావులు. అన్నిటినీ వాళ్ళ

వైపు లాక్కోవాలని ప్రయత్నించేవాళ్ళు, ప్రపంచాన్ని జీవితాన్ని తమ ప్రత్యేక కోణం నుండి మాత్రమే చూచేవాళ్ళు – వీళ్లకి సంతోషం అనేది ఉండదు. కాని ముందు వెనుక చూచుకోకుండా, మనస్ఫూర్తిగా, దయతో తమని తాము సమర్పించుకునేవాళ్లకి శోకం అంటే ఏమిటో తెలియదు. తీసుకోవాలని అనుకునేవాడికి సంతోషం ఉండదు; ఇచ్చే గుణం కలవాడికి ఆ సమస్యే ఉండదు.

ప్ర: దయాగుణం సత్యంయొక్క వికారరూపం అవుతుందా?

జ: మానవ లక్షణాలన్నీ వాటి వెనుక ఉన్న ఒక సత్యంయొక్క వికారరూపాలే. ఆ సత్యం ఇదా అదా అని ఇదమిత్థంగా చెప్పలేం. అది రెండింటికీ అతీతమైన సత్యం. అయితే దయాగుణం వెనుక ఉండే సత్యం ఏమిటో వివరిస్తాను – అది వ్యాపకగుణం గల శక్తుల చలనం. కాని ఆ శక్తులు వ్యాపించాలంటే, అంతకు ముందు అవి కేంద్రీకృతం కావాలి. కాబట్టి ఒక విధమైన లయబద్ధమైన చలనం కనిపిస్తుంది. శక్తులు ముందు కేంద్రీకృతం అవుతాయి. మళ్ళీ వ్యాపిస్తాయి... కాని అసలు కేంద్రీకృతం కాకుండా ఎప్పుడూ వ్యాపిస్తూ పోవాలనుకుంటే, కొంతకాలం తరువాత వ్యాపించడానికి ఇక ఏమీ ఉండదు. మరి శక్తుల లక్షణం అటువంటిది.

నైతికమైన దయాగుణం గురించి చెప్తాను. తోటివాడు ఏదైనా విజయం సాధిస్తే మనం కూడా సంతోషించడం అందుకు ఉదాహరణ. ధైర్యంతో, నిస్వార్థంతో, త్యాగభావంతో చేసే పనిలో గొప్ప సౌందర్యం ఉంటుంది. అది ఆనందాన్నిస్తుంది. అవతలివారి ఔన్నత్యాన్ని, ఆధిక్యతను గుర్తించడమే నైతిక దయాగుణం అని చెప్పుకోవచ్చు.



దయ
బేరసారాలు లేకుండా తనని
తాను సమర్పించుకుంటుంది.

అనువాదం: డా. వి. శ్రీనివాస చక్రవర్తి (9500069322)

సమచిత్తత

సమానత అంటే మనసు, ప్రాణికాలు నిశ్శబ్దంగా, నిశ్చలంగా వుండటం. జరిగిన విషయాల చేత, నీకు చెప్పిన విషయాలచేత, లేదా నీకు సంభవించిన వాటి చేత ప్రభావితం కాకుండా, కలత చెందకుండా వాటి వంక వేరుగా చూడటం, వ్యక్తిగత అనుభూతులు సృష్టించే విరూపాల నుండి స్వేచ్ఛగా వుండటం, వాటి వెనుక వున్న దానిని అర్థం చేసుకోవటం, అవి ఎందుకు జరిగాయి. వాటినుండి నేర్చుకోవలసినది ఏమిటి? వాటికి వ్యతిరేకంగా మనలో వున్నదేంటి? వాటిద్వారా ఎటువంటి ఆంతరిక లాభము, పురోగతి జరుగుతుంది అన్నది అవగాహన చేసికోవటం సమానతకు అర్థం: ప్రాణిక చలనాల మీద స్వీయాధిపత్యం పొందాలి — కోపము, సున్నితత్వము, గర్వము, కోరిక, అలాంటి తక్కినవి — ఇవి మన భావోద్వేగ అస్తిత్వాన్ని తమ స్వాధీనం చేసుకోకుండా, ఆంతరిక శాంతిని కలత పెట్టకుండా చూడాలి. ఈ విషయాలను, ఆవేశంతో, వత్తిడికి లోనై మాట్లాడకుండా, చేయకుండా ఎప్పటికీ ఒక ఆత్మ నిశ్శబ్దంతో ఆంతరిక నిశ్చలత నుండి మాట్లాడటం పనిచేయడం సమానత. ఈ సమానతను ఎంత పరిమాణంలోనైనా కలిగి వుండటం కూడ అంత సులభం కాదు. కానీ దీనిని ఆంతరిక స్థితికి, బాహ్యచలనాలకు ఆధారంగా చేసుకోవటానికి ఎప్పటికీ ప్రయత్నిస్తూ వుండాలి.

సమానతకు ఇంకో అర్థం కూడా వుంది. మనుష్యుల స్వభావాల పట్ల చర్యల పట్ల భావనలను, న్యాయ విచారణను, మొత్తం మానసిక పక్షపాతాన్ని మనసు నుండి తోసివేసి వాటి గురించిన సత్యాన్ని చూడడానికి సహాయం చేస్తుంది. వ్యక్తిగత భావం యెప్పటికీ విరూపం చేస్తూ వ్యక్తిని కేవలం అతడి చర్యలలో మాత్రమే చూసేటట్లు చేస్తుంది. చర్యలను మాత్రమే కాదు, వాటి వెనుకనున్న విషయాలను, తరచుగా అక్కడ లేనివి చూస్తాము. దాని ఫలితంగా తొలగించవలసిన విషయాలైన తప్పుగా అర్థం చేసుకోవడం, తప్పుగా నిర్ణయించడాలు అక్కడ వుంటాయి; అల్ప పర్యవసానాలు విస్తృత భాగాలను ఆరోపిస్తాయి. ఈ కారణంగా ఇటువంటి జీవనవిధానంలో వ్యక్తిగత అనుభూతి, సున్నితత్వం మానవస్వభావంలోని ఒక స్థిరమైన భాగంగా, స్వీయరక్షణకు అవసరమైనవిగా కనిపిస్తాయి. అయినప్పటికీ అక్కడ కూడా మనుష్యుల పట్ల, విషయాలపట్ల, ఒక విస్తృత సమాన దృక్పథం అన్నది

రక్షణకు ఇంకా ఉత్తమమైన చలనం. దానిని అధిగమించడానికి సాధకుడు ఆత్మ నిశ్శబ్ద శక్తిలో జీవించడం అత డి పురోగమనానికి అవసరం.

*

సమానత అంటే తాజా అజ్ఞానము కాదు. లేక అంధత్వము కాదు. అది దృష్టిలో ఒక అస్పష్టతను, అన్ని రంగులలో ఒక కళంకాన్ని కోరుకోదు, ఆవశ్యకంగా ప్రవేశపెట్టదు. అక్కడ భేదముంటుంది. ప్రకటనలో వైవిధ్యముంటుంది. ఈవైవిధ్యాన్ని మనం ప్రశంసించాలి. ఎందుకంటే మన నేత్రం ఒక పాక్షికమైన తప్పు ప్రేమ, ద్వేషం, ప్రశంస, జాలి, అనిష్టత, ఆకర్షణ, వికర్షణలతో అస్పష్టమైనప్పటికన్నా, ఇంకా ఎక్కువ యుక్తంగా సమానతలో ఉన్నప్పుడు చేయగలుగుతాము. ఈ వైవిధ్యతకు వెనుక దాని అంతరంలో నివసించే పూర్ణతను, నిశ్చలతను ఎప్పుడూ చూడాలి. అనుభూతించాలి. కనీసం తెలుసుకొని వుండాలి. ఒకవేళ ఇది మన నుండి దాగి వున్నా, మన మానవ పరిమాణాలకు సమత్వంతో పరిపూర్ణంగా లేదా అపరిణితంగా, పూర్తి కాకుండా కనిపించినా, లేదా చెడు, అసత్యాలను కనిపించినా వివేచనాత్మక ప్రయోజనం మీద ప్రత్యేక అభివ్యక్త దివ్యావశ్యకతల మీద విశ్వాసముంచాలి.

CWSA 29:130-31; 23:224-25 — శ్రీఅరవిందులు



సమచిత్తత

మార్పుకు లోనుగాని శాంతి, స్థిరత

(మదర్ తెలిపిన ఆధ్యాత్మిక విశిష్టత)

శాస్త్రీయ నామం: ఐబెరిస్

శాంతి

అస్తిత్వంలో దైవ ఉనికి వుందనటానికి ప్రథమ సంకేతం వ్యక్తిలోని శాంతి.

*

నీ అస్తిత్వలోతులలో హృదయలోతుల్లో, అక్కడ ఎప్పటికీ నిండైన ప్రేమ, జ్ఞానములతో ప్రకాశమానంగా, శాంతితో వున్న దివ్య సన్నిధి వుంది. అది అక్కడ వుంది కాబట్టి నువ్వు దానితో సంయోగం చెందవచ్చు. అది నిన్ను దేదీప్యమానంగా ప్రకాశించే ఒక చైతన్యంలోకి పరివర్తన చెందిస్తుంది.

నీవు నేను కలిసి నీ అస్తిత్వ ఉపరితలంలోని సమస్త బాహ్య శబ్దాన్ని నిశ్శబ్దం చేయడానికి ప్రయత్నించాలి. తత్ఫలితంగా ఆ నిశ్శబ్దంలో, శాంతిలో నీవు ఆంతరిక వైభవంతో సంయోగం చెందుతావు.

ఆ రోజు నీ నూతన జన్మదినమవుతుంది.

*

ప్రశ్న: అమ్మా, నన్ను ఇంకా ప్రశాంతంగా వుండేటట్లు చేయండి.

నీకు అలజడిగా వున్నప్పుడల్లా బాహ్య శబ్దం లేకుండా నీలో నీవు మాట్లాడుకోవడము, అదే సమయంలో నన్ను తలచుకోవడము పునరావృతం చేస్తూ వుండాలి.

ఓ నా హృదయమా! "శాంతి, శాంతి" అంటూ ఫలితంతో సంతృప్తి చెందేవరకూ నిలకడగా చేయాలి.

*

...కొద్ది నిముషాలు నిశ్శబ్దాన్ని పాటించడము ఎప్పటికీ మంచిది. కనీసం రోజులో రెండుమార్లు అలా చేయాలి. కానీ అది నిజమైన నిశ్శబ్దం కావడం తప్ప మాట్లాడటం నుండి విముఖత చూపించడం కాకూడదు.

*

జబ్బుకి గొప్ప ఔషధము శాంతి, నిశ్చలతలు.

మన కణాలలోకి శాంతిని తీసుకురాగలిగినపుడు మన జబ్బు నయమవుతుంది.

CWSA 12:114; 17:365-66; 16:150; 3:196; 15;151 — శ్రీమాత

శాంతి అనేది ఒక ప్రశాంత కెరటరహిత మహదానందానికి సమానమైన సునిశ్చిత మొత్తంలోకి చేర్చబడిన ఒక నిశ్శబ్ద గాఢత.

*

ఒక నిర్దిష్ట అర్థంలో ఈ జడత, శమ, తమసులకు కాంతి, అంధకారాల ప్రతిరూపాలు — ఉన్నత తత్వం శాంతిలో విశ్రాంతిని కనుగొంటుంది, నిమ్నతత్వం శక్తికి విశ్రాంతి నివ్వడంలో తిరిగి అధోచేతనకు, తమసుకు చేరుకోవడంలో శాంతిని పొందాలను కొంటుంది.

*

ఉన్నత ఆధ్యాత్మిక చైతన్యానికి చెందిన శాంతి, శక్తి, కాంతి, ఆనందాలు అన్నీ ఊర్ధ్వంలో ముసుగుతో వుంటాయి. అది దిగి రావడానికి ఊర్ధ్వం వైపుగా ఒక ఉన్మీలనం అవసరం — క్రిందకి దిగివచ్చే ప్రభావానికి ఉత్తమ స్థితి మనసు నిశ్చలత, ఏకీకృతమైన ఒక నిర్దిష్ట విస్తార ఉదాసీనత.

CWSA 29:137; 30:477, 482 — శ్రీఅరవిందులు



శాంతి సదా, ప్రతి స్థితి యందు నీవు కోరుదానినే, (నేను) కోరట మొక్కటే అచంచలమైన శాంతిని భోగించుటకు యేకైక మార్గం (మదర్ తెలిపిన ఆధ్యాత్మిక విశిష్టత)

శాస్త్రీయ నామం: కుర్కుమా డెడో ఆరియా

అనువాదం: సునీత శేఖర్ (9346235467)

ఐదు మానసిక పరిపూర్ణతలు

(నిజాయితీ, విశ్వాసం, భక్తి, ఆకాంక్ష, సమర్పణ)

(తెల్లని చంపక పుష్పాన్ని చూపుతూ, రేకులను లెక్కించుతూ) ఒకటి రెండు, మూడు, నాలుగు, ఐదు మానసిక పరిపూర్ణతలు అన్నారు. ఐదు మానసిక పరిపూర్ణతలు యేవి? ఎందుకంటే అవి మారవచ్చు. వాస్తవంగా నా రహస్యాలను చెప్పాలంటే, దాని నెవరికయినా యిచ్చిన ప్రతిసారి, ఒకే రకమైన పరిపూర్ణతలు గావు. అది మనుషుల అవసరాల మీద ఆధారపడి ఉంటుంది. ఒకే వ్యక్తికి యిచ్చినప్పటికీ భి న్న సమయాలలలో భిన్నమయిన మానసిక పరిపూర్ణతల నివ్వవచ్చు, కాబట్టి అది నిర్దిష్టంగా ఒకేలా ఉండదు. కాని మొదటిసారి ఈ పూవుకు 'మానసిక పరిపూర్ణత' అని పేరు నిచ్చినప్పుడు ఆ పరిపూర్ణతలను వ్రాసి పెట్టుకొన్నారు. కాని నాకు సంబంధించినంత వరకు దానర్థం చాలా అస్థిరమైనది — పరిస్థితుల మీద, అవసరాల మీద ఆధారపడి ఉంటుందని చెప్పాను గదా...

విషయం యేదైనా గాని అసలు సంగతేమిటంటె, ఎన్ని రకాలుగా కలిపి అన్నీ చెప్పినప్పటికీ, చివరికి యిచ్చినప్పటికీ వాటన్నింటిలో మొట్ట మొదటిది నిజాయితీ. ఎందుకంటె నిజాయితీ లేకుంటే, తాను అర అడుగు గూడా ముందు కెళ్ళ లేడు. కాబట్టి అదెప్పుడూ మొదటిదిగా ఉంటుంది.

కాని మీరు కావాలనుకుంటే దానిని 'పారదర్శకత' అనే మరొక పదంతో తర్జుమా జేసుకోవడం సాధ్యమే.

ఇహ రెండవది, ముందుకు వెళ్ళాలనుకుంటే ఆవశ్యకమయింది, తప్పనిసరి అయినది విశ్వాసం. లేక మరొక మాట, అది బహు పరిమితంగా కన్పించినప్పటికీ నాకదెంతో ప్రధానమయింది. ఎందుకంటే (ఇది అనుభవానికి చెందిన ప్రశ్న) దివ్యత్వం పట్ల పూర్తి నమ్మకంతో ఉండకపోతే ఎంతో సులభంగా మీకు విశ్వాసమున్నదన్న భావంతోనే ఉండిపోతారు. అయినప్పటికీ దివ్యశక్తిలో, దివ్య సహృదయతలో నమ్మ కాన్ని, లేక దైవానికి మీపై ఉండే దృఢ నమ్మకాన్ని పోగొట్టుకుంటారు. కాబట్టి, దివ్య అనుగ్రహానికి సమగ్ర, సంపూర్ణ విశ్వాసాన్ని జోడించకపోతే కష్టా లుంటాయి. కాబట్టి రెండూ అవసరం.

ఈ వరుసలో యిప్పుడు భక్తి నుంచాము, అవును, అంతా భక్తి మయమవడం,

ఎంతో బాగుంటుంది, కాని దీనిని వెన్నంటి యితర విషయాలెన్నో ఉండకపోతే, అది గూడా పలు తప్పులను చేయవచ్చు. అది గూడా పలు కష్టాల నెదుర్కోవచ్చు.

మీకు భక్తి ఉన్నది, అహంభావాన్నీ ఉంచుకున్నారు. అప్పుడు మీ భక్తిలో నుండి భయంకరమైన అహంభావిక విషయాలు అన్ని రకాలవీ బయటపడ్తాయి. చెప్తున్నదేమంటే మీ గురించే ఆలోచిస్తారు, యితరుల గురించి కాదు, ప్రపంచాన్ని గురించి గాదు, పని గురించి గాదు, చేయవలసినదేదో దాన్ని గురించీ గాదు — మీ భక్తి గురించే మీరాలోచిస్తారు.

కాని నిరంతరం భక్తితో పాటుండవలసిన మరొక చలనమున్న దక్కడ... అన్నింటికీ దైవం ఉన్నాడన్న కృతజ్ఞతా భావం; ఆ అద్భుతమయిన కృతజ్ఞతా సూచిక స్మరణ యొక్క అనుభూతి. దైవం ఉన్నాడన్న వాస్తవం పట్ల, విశ్వంలో దివ్యమైనదేదో ఉన్నదని, కేవలం మనం చూచే రాక్షసత్వమే గాదని, అక్కడ దైవత్వమున్నదని, దైవమున్నాడని — భావన మిమ్మల్ని ఉదాత్తమైన ఆనందంతో నింపుతుంది. ప్రతిసారి ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని దివ్య ఉనికి యొక్క ఈ ఉదాత్తమైన సత్యంతో మీరే కొంచెం సంపర్కంలోకి వచ్చినా, ప్రతిసారి హృదయమెంతో గాఢమయిన, ఎంతో అద్భుతమయిన ఆనందంతో, విషయాలన్నీ అమిత ఉల్లాసభరితంగా రుచించుతుండడం వలన అటువంటి ఓ కృతజ్ఞతతో నిండిపోతుంది.

కాబట్టి కృతజ్ఞత లేని భక్తి ఎంతో అపరిపూర్ణమయినదని గ్రహించాను. భక్తితో పాటు కృతజ్ఞత గూడా రావాలి.

పరిపూర్ణతలలో ధైర్యం ఒకటని మన మొకసారి మాట్లాడుకున్నట్లు గుర్తు; జాబితాలో ఒకసారి వ్రాసినట్లు గుర్తు. కాని ఈ ధైర్యమంటే అర్థం ఉత్తమోత్తమ సాహసం పట్ల అభిరుచి ఉండడం. ఉత్తమోత్తమ సాహసం పట్ల ఈ అభిరుచి ఉండడమనేది ఆకాంక్ష — మిమ్మల్నేది పూర్తిగా ఆక్రమించుకుంటుందో, ఎటువంటి గణన చేయకుండా, ఎటువంటి మినహాయింపు లేకుండా, విరమించకుండా; దైవాన్ని కనిపెట్టే గొప్ప సాహసానికి, దైవాన్ని కలుసుకునే గొప్ప సాహసానికి, దివ్య సాక్షాత్కారమనే మరింత గొప్ప సాహసానికి నడిపే ఆకాంక్ష. వెనుకకు చూడకుండా, "జరుగబోతున్న దేమిటని ఒక్క నిమిషమైనా అడుగకుండా ఆ సాహసం లోనికి మిమ్మల్ని మీరు నెట్టివేసుకోండి. ఎందుకంటే జరుగబోతున్న దేమిటని మీ రడిగితే ఎప్పటికీ ఆరంభింపరు, అక్కడే ఆగిపోయి, ఉన్నచోటే వ్రేళ్ళూనుకుని, ఎప్పుడూ ఏదో పోగొట్టుకుంటామన్న మీ

సమతుల్యతను కోల్పోతామన్న భయంతో ఉండిపోతారు.

అందువల్ల ధైర్యాన్ని గురించి మాట్లాడాను. కాని నిజాని కది ఆకాంక్ష. అవి రెండూ కలిసే ఉంటాయి. నిజమయిన ఆకాంక్ష ఏదో ధైర్యంతో నిండి ఉంటుంది.

ఇప్పుడిక సమర్పణ. ఆంగ్లంలోని ఈ 'సమర్పణ' పదానికి ఖచ్చితంగా అదే అర్థాన్నిచ్చే ఫ్రెంచి పదం లేదు. కాని, శ్రీఅరవిందులు చెప్పారు. మన మిది చదివినట్లున్నాము. – యోగం చేయడంలో మొట్ట మొదటి, తప్పనిసరిగా ఉండవలసిన స్థితి సమర్పణ అని. కాబట్టి, వారేమి చెప్పారో అది మన మనుసరించితే, అవసరమయిన లక్షణాలలో వుండవలసినది యిదొక్కటే గాదని, ఇది యోగం ఆరంభించడానిక ఆవశ్యకమయిన ప్రథమ వైఖరి అని తెలుస్తుంది. తాను సంపూర్ణంగా సమర్పించుకోవాలని నిర్ణయించుకోకపోతే యోగాన్ని ఆరంభింప లేరు.



మానసిక పరిపూర్ణత,

అక్కడున్నది ఒకే ఒక పరిపూర్ణత గాదు, ఐదు. అవి నిజాయితీ, విశ్వాసం, భక్తి, ఆకాంక్ష, సమర్పణలు. (అమ్మచే యివ్వబడిన ఆధ్యాత్మిక విశిష్టత, వివరణ)
శాస్త్రీయ నామం: ప్లూమేరియా రుబ్రా

కాని ఈ సమర్పణ సంపూర్ణంగా ఉండడానికి ఈ లక్షణాలన్నీ అవసరము, మరొకటి జోడిస్తాను — ఎందుకంటే మన కింతవరకు ఉన్నది నాలుగు మాత్రమే — సహిష్ణుత, తట్టుకుని ఉండడాన్ని జోడిస్తాను. అది చాలా కష్టం గనుక, నిరుత్సాహపడి విడిచిపెట్టకుండా కష్టాల నెదుర్కొనే సామర్థ్యం లేకపోతే, అశక్తుడవైతే... దెబ్బలు తింటూ కూడా, యెవరో అన్నట్లు వాటిని కప్పిపుచ్చుకొంటూ — నీలోని లోపాల కారణంగా దెబ్బలు తిన్నపుడు, వాటిని జేబులో వేసుకొంటే — నీ వెంతో దూరం పోలేవు. నీ కలవాటైన అల్ప జీవితానికి సంబంధించిన దృష్టిని కోల్పోయే మొదటి మలుపులోనే, క్రుంగుబాటుకు లోనై నీ ఆట ముగిస్తావు. జీవితం పట్ల మీకెక్కడ సరైన దృష్టి లేదో ఆ మొదటి మలుపులో నిరుత్సాహపడి ఆట వదిలేస్తారు.

అమితంగా... దీనినెలా చెప్పాలి? మనకు బాగా తెలిసిన రూపంలో దీన్ని 'తదేక దీక్ష' లేక 'పట్టుదల' అంటారు. అవసరమయితే అదే విషయాన్ని మళ్ళీ మళ్ళీ వేయిసార్లయినా ఆరంభించాలని నిర్ధారించుకోగలిగినది తప్ప....

CWM 8:36-41

అమ్మ

పరీక్షకులు

(పూర్ణయోగంలో ఉపయోగపడు లక్షణాలు)

పూర్ణయోగంలో ఎటువంటి ముందు హెచ్చరిక లేకుండా, అవిరామంగా జరిగే వరుస పరీక్ష లుంటాయి. ఆ విధంగా నిన్ను నిరంతరం మెలకువుతో, సావధానంగా ఉంచుతుంది.

మూడు పరీక్షక బృందాలు మనకీ పరీక్షలు పెడతాయి. అవి ఒకరితో మరొకరికి పనేమీ లేనట్లు, వారి పద్ధతు లెంతో భిన్నమయినట్లు, కొన్నిసార్లు పరస్పర విరుద్ధంగా ఉన్నట్లు కన్పిస్తాయి, ఒకే గమ్యం వైపు తీసుకువెళ్ళడం లేదేమో నన్నట్లు వారి పని కన్పిస్తుంది. అయినప్పటికీ ఒకదాని నొకటి పరిపూర్తి జేసుకుని, ఒకే అంతం వైపు కృషి జేస్తాయి. పరిపూర్ణతకు అన్నీ ఆవశ్యకమయినవే.

మూడు రకాల పరీక్షలు: ప్రకృతి శక్తుల పరీక్షలు, ఆధ్యాత్మిక, దివ్యశక్తుల పరీక్షలు, అసురశక్తుల పరీక్షలు. ఈ చివరి వెంతో మోసపూరితంగా కన్పించుతాయి.

తెలియక, సిద్ధమవక, చిక్కుకోకుండా తప్పించుకోవడానికి కావలసిన స్థితులు నిరంతర గమనిక, నిజాయితీ, నమ్రతలు.

అమిత సర్వ సాధారణమయిన పరిస్థితులు, నిత్యజీవిత సన్నివేశాలు, ఎంతో అప్రధానంగా కన్పించే మనుషులు, విషయాలు అన్నీ ఈ మూడు రకాలయిన పరీక్షకులలో ఎవరో ఒకరికి చెంది ఉంటాయి. ఈ విస్తార, క్లిష్ట పరీక్షల నిర్వహణలో సాధారణంగా జీవితంలో ఎంతో ముఖ్యమని భావించే ఆ సన్నివేశాలు ఎంతో సులభమయిన పరీక్షలు, ఎందుకంటే అవి మీరు సిద్ధంగా, రక్షణలో ఉన్నట్లు తెలుసుకుంటాయి. మీ దారిలో చిన్న రాళ్ళ పైన తడబడడం సులభం, ఎందుకంటే అవి మీ సావధానత నాకర్షించవు.

తట్టుకునే శక్తి, పారదర్శకతలు, ఉత్సాహం, నిర్భీతితో ఉండడాలు, భౌతిక స్వభావ పరీక్షలకు ప్రత్యేకంగా అవసరమైన లక్షణాలు ఆకాంక్ష, నమ్మకం, ఆదర్శం, అత్యంత ఆసక్తి, ఉదారంగా ఆధ్యాత్మిక పరీక్షలకు తనను తానర్పించుకోవడం, జాగరూకత, నిజాయితీ, అసురశక్తుల నుండి వచ్చే పరీక్షలకు వినమ్రత అవసరమయిన లక్షణాలు.

CWM 14:42-43 అమ్మ

వీరత్వ సమయం

మనుషులేమి చెప్తున్నారో అది వీరత్వం గాదు, అది సంపూర్ణంగా ఐక్యమయి ఉండడం — వీరుడిగా ఉండాలని పూర్తి నిజాయితీతో ఎవరు నిశ్చయించుకున్నారో వారికి దైవ సహాయం ఎల్లప్పుడు ఉంటుంది. అదీ సంగతి.

మీరిప్పు డిక్కడ అంటే భూమి మీద ఉన్నారు. ఎందుకంటె మీరొక సారలా ఉండాలని ఎంచుకున్నారు — మీ కది గుర్తుండదు, కాని నాకు తెలుసు; అందుకోసం మీ రిక్కడున్నారు. మంచిది, ఆ పనికి మీరు నిలబడాలి. మీరు ప్రయత్నించాలి, అల్పత్వాన్ని, పరిమితులను గెలవాలి, అన్నింటిని మించి అహంభావానికి; 'మీ పని అయిపోయింది, మాకు అహం స్థానంలో దివ్యచైతన్యం ఉన్న అహంలేని జాతి కావాలి. మా కేది కావాలంటే అదే, ఏది జాతి అభివృద్ధి చెందేటట్లు, అతీత మానవుడు జనించేటట్లు చేస్తుందో ఆ దివ్యచైతన్యం' అని చెప్పాలి.

నేను కట్టబడి ఉండడం వలన యిక్కడ ఉన్నట్లు మీ రనుకుంటుంటే అది తప్పు, నేను బద్ధురాలిని గాదు, నే నిక్కడున్న దెందుకంటే రూపాంతరీకరణ మొదటి ప్ర యత్నం కోసం నా దేహం తన నిచ్చి వేసుకున్నది. శ్రీఅరవిందులు నాకిలా చె ప్పారు, "ఎవరు చేయగలరో నాకు తెలిసిన వారొక్కరూ లేరు, నీవు తప్ప" అని నాతో చెప్పారు. "సరే, నేనిది చేస్తాను" అన్నాను. ఇదే కాదు... నా స్థానంలో మ రొక రెవరూ చేయగూడదని గాదు, ఎందుకంటే యిదెంతో సుఖంగా ఉండదు, కాని నే నానందంగా చేస్తున్నాను, ఎందుకంటే ఫలితాల నుండి ప్రతి ఒక్కరూ లా భం పొందుతారు, నే నడిగేది కేవలం ఒక్కటే: అహాన్ని వినవద్దు. మొత్తం అదే, అ హం సమయం ముగిసింది. అహంలేని జాతి, అహం స్థానంలో దివ్యచైతన్యంతో ఉన్న జాతి మనకు కావాలి. అంతే ఏమైనా చెప్పాలా?

మీ హృదయాలలో నిజాయితీగా 'ఔను' అని అంటే నన్ను పూర్తిగా సంతృప్తి పరచినట్లు. నాకు మాటలు వద్దు, ఆ మాటకు కట్టువడి వుండే మీ హృదయాల నిజా యితీ నా కవసరం.

అమ్మ: శిష్యునితో సంభాషణ, ఏప్రియల్, 2, 1972

అనువాదం: జి. అరుణా మోహన్ (9866117137)


అఖిల
అఖిల భారత పత్రిక
ఫిబ్రవరి 2020
శక్తి నడకలు

శక్తి నడకలు

విషయసూచిక



శ్రీమాత ఫ్రాన్సులో

శ్రీఅరవిందులకు ఫ్రాన్సు అంటే చాలా ఇష్టం. నేను అక్కడే జన్మించాను — కచ్చితంగా ఒక కారణంగా, నా విషయంలో, అది నాకు బాగా తెలుసు: సంస్కృతి, స్వచ్ఛమైన, కచ్చితమైన మనస్సు, పరిశుభ్రమైన ఆలోచన, మానసిక అభిరుచి స్పష్టతల అవసరం కోసం అక్కడ జన్మించటం జరిగింది – అందుకు తగిన దేశం ప్రపంచంలో మరొకటి లేదు. ఏదీ లేదు. ఆ కారణంగానే శ్రీఅరవిందులకు ఫ్రాన్సు అంటే చాలా ఇష్టం.... తన మేధోలక్షణంతో, మనఃలక్షణాలతో ఫ్రాన్సు నిజంగా ఆధ్యాత్మికంగా స్పృశించబడిన రోజు (ఆమె ఎన్నడూ అలా స్పృశించబడి లేదు), ఆమె ఆధ్యాత్మికంగా స్పృశించబడిన రోజు వస్తే అది ఏదో అపూర్వ విషయమే అవుతుంది.

The Mother: Conversation with a disciple, July 3, 1963

ఫ్రాన్సు

తేజః పుంజం రక్షణ

ఒకసారి పారిస్‌లో నేను బోల్‌వార్డ్ సైంట్ మైఖేల్‌ను తాటుతున్నాను. కొన్ని నెలల్లో చైత్యపురుష సన్నిధియైన, అంతరంగ దైవంతో ఐక్యతను సాధించటానికి నిశ్చయించుకున్నాను. నాది ఏ ఇతర ఆలోచనా లేని, దేనితోనూ సంబంధం లేని స్థితి. నేను లక్సన్ బర్గ్ ఉద్యానవనాల దగ్గర ఉన్నాను, ఎల్లప్పుడూ గాఢంగా అంతరంగంలో మునిగిపోయి. ప్రతి సాయంత్రమూ అక్కడ నడవటం నా కలవాటు — అక్కడ ఒక విధమైన కూడలి ఉన్నది. ఒకరు గాఢంగా అంతరంగంలో మునిగిపోయినప్పుడు అది దాటే స్థలం కాదు, అది ఏమాత్రం తెలివిగల పని కాదు. ఆ విధంగా ఉన్న నేను, నడుస్తున్నాను, హఠాత్తుగా నేను ఒక షాక్ కు లోనయ్యాను. నేను ఏదో ఒక గట్టి దెబ్బ తిన్నట్టు, ఏదో నన్ను గట్టిగా కొట్టింది, నేను సహజమైన బుద్ధితో ఒక్కసారిగా వెనక్కి దూకాను, నేను వెనక్కి దూకానో లేదో, ఒక ట్రాము వేగంగా వెళ్ళింది — నేను అనుభూతిని పొందింది నా చేతి నిడివి కంటే కాస్త దూరంలో ఉన్న ఆ ట్రామును. అది నా తేజఃపుంజాన్ని (ఆరాను) స్పృశించింది, రక్షణ తేజఃపుంజం — అది అప్పుడు చాలా బలంగా ఉంది, నేను గాఢమైన మార్మికత (అతీంద్రియత) లో మునిగిపోయి ఉన్నాను, దానిని ఎలా ఉంచుకోవాలో నాకు తెలుసు — అది నా రక్షణ తేజఃపుంజాన్ని గుద్దుకుంది, అది నన్ను ఉన్న ఫళంగా పూర్తిగా వెనక్కి విసిరివేసింది, అదేదో భౌతికంగా దెబ్బతిన్నట్లుగా. కాని చోదకుని (డ్రైవరు) నుండి ఎన్ని చీవాట్లు! నేను సమయానికి వెనక్కి గెంతాను, ట్రాము వెళ్లిపోయింది.

CWM 10:130-31

ప్రార్థనాలయం మీద చిత్రలేఖనం

నాకు దక్షిణ ఫ్రాన్సులోని 'పా' లో కారుణ్యశీలి అయిన ఒక మతాచార్యుడు తెలుసు. అతడు కళాభిరుచి కలిగినవాడు. అతడు తన చర్చిని అందంగా తీర్చిదిద్దాలనుకున్నాడు. (అది ఒక చిన్న క్రైస్తవ ప్రార్థనాలయం). దాని గురించి అతడు

స్థానికుడైన ఒక విచ్చలవిడిగా తిరిగేవాడిని, కాని గొప్ప కళాకారుడిని సంప్రదించారు, అతడు ఆంద్రే తండ్రితోను, నాతోను బాగా పరిచయం ఉన్నవాడు. అతడు మతాచార్యుడితో 'నేను చిత్రలేఖనానికి వీరిని సిఫార్సు చేస్తున్నాను — వీరు నిజమైన కళాకారులు' అని మమ్మల్ని సిఫార్సు చేసాడు. కుడ్యాలను చిత్రాలతో అలంకరణ చేస్తున్నాడు — నాకు తెలిసి, మొత్తం కలుపుకుని ఎనిమిది ఫలకాలున్నాయి. ఆ విధంగా వాటిలో ఒక ఫలకం మీద నేను పని మొదలుపెట్టాను (ఆ చర్చి శాన్ జువాన్ డి కంపోస్టెల్లో, స్పానిష్ చరిత్రలోని ఒక వీరునికి అంకితం చేయబడింది; అతడు క్రైస్తవులకు, మూరులకు జరిగిన యుద్ధంలో ప్రత్యక్షమైనాడు, అతడి దివ్యదర్శనం మూరులను ఓడించింది. అతడెంతో వైభవోపేతం! అతడు తెల్లగుర్రం మీద బంగారు కాంతితో వెలిగిపోతూ ప్రత్యక్షమైనాడు, చాలా మటుకు కల్కి లాగా). సంహరించబడిన, సంఘర్షిస్తున్న మూరులు చిత్రం క్రింది భాగంలో చిత్రీకరించబడ్డారు, వాటిని నేను చిత్రీకరించాను; అంత ఎత్తున నిచ్చెన మీద ఎక్కి రంగువేయడం నాకు చాలా కఠిన కార్యం, కనుక కిందివాటిని మటుకే నేను వేశాను! ఏమైనా గాని, అంతా సజావుగా సాగిపోయింది. తరవాత, సహజంగానే, మతాచార్యులు విచ్చలవిడిగా తిరిగేవానితో సహా మమ్మల్ని భోజనానికి ఆహ్వానించాడు. అతడు చాలా మంచివాడు — నిజంగా కారుణ్యహృదయంగల మనిషి! నేను అప్పటికే శాకాహారినినే కాకుండా, మద్యం సైతం ముట్టనిదానిని. ఆ విషయంగా, ఆయన నన్ను ఎంతో సౌమ్యంగా చీవాట్లు పెట్టాడు. "కాని, వీటన్నింటిని మనకు ఇచ్చేది మన ప్రభువు, కాబట్టి తీసుకొనకపోవటానికి కారణం ఏమిటి?" ...నా కతడు ఆకర్షణీయంగా కనిపించాడు. తరువాత చిత్తరువులు చూసి, అతడు మోరిసెట్ భుజం మీద తడ్తూ (మోరిసెట్ నాస్తికుడు), దక్షిణ ఫ్రాన్సు ఉచ్చారణతో అన్నాడు, "నీవేం మాట్లాడినా గాని నీకు మా ప్రభువు తెలుసు, లేకపోతే నీవు ఆ విధంగా ఎన్నటికీ చిత్రీకరించ లేవు!"

The Mother: Conversation with a disciple, April 29, 1961

చిన్నపిల్లగా ఉన్నప్పుడు సమాధి స్థితి

ఇంకొక విషయం ఉంది (నవ్వుతూ): చిన్నపిల్లగా ఉన్నప్పుడే, నేను ఏదైనా చేస్తున్న మధ్యలో పని లేక ఒక మాట పలుకుతున్నప్పుడు లేక మరేదైనా

సందర్భంలో హఠాత్తుగా, సమాధిలోకి వెళ్ళేదాన్ని — కాని ఎవ్వరికీ అదేమిటో తెలియదు! వాళ్ళంతా నేను నిద్రలోకి జారుకున్నానని అనుకునేవారు! కాని నేను ఎరుకలోనే ఉండేదాన్ని, ఒక చేతిని పైకి లేపి లేదా మాట మధ్యలో — ఏం చెప్పను! అక్కడ ఎవ్వరూ ఉండేవారు కాదు (నవ్వుతూ శ్రీమాత). బాహ్యంలో ఎవ్వరూ ఉండరు, కాని ఆంతరంగికంగా చాలా తీవ్రమైన, ఆసక్తిదాయకమైన అను భవం. అది నేను బాగా చిన్నదానిగా ఉన్నప్పుడు కూడా జరుగుతూ ఉండేది.

నాకు బాగా గుర్తుంది, ఒకసారి (అప్పుడు నాకు పదో, పన్నెండో ఏళ్ళుం టాయి), మా తల్లిదండ్రుల ఇంట్లో అల్పాహార విందు, సుమారు పన్నెండు మంది కి, అందరూ ఆదివారం నాడు ఏ విధంగా తయారవుతారో అలాగే చక్కగా అలం కరించుకుని వచ్చారు — వారంతా కుటుంబీకులే, కాని అది 'అల్పాహార విందు'. దానికి కచ్చితంగా మర్యాదతో కూడిన కట్టుబాటు ఉంటుంది. క్లుప్తంగా, ప్రవర్తన స రిగ్గా ఉండాలి. నేను మేజా బల్లకు ఒక చివరన, నా పెదతండ్రి కొడుకుతో (తరువాత అతడు కొంతకాలం లావర్ కు డైరెక్టర్ గా ఉన్నాడు) కూర్చున్నాను. (అతడికి కళాకారుడి మేధస్సు ఉంది, బాగా సమర్థుడైన యువకుడు). అలా మేమందరం ఆసీనులై ఉన్నాం, నా జ్ఞాపకం ప్రకారం నేను అతడి చుట్టూ ఉన్న వాతావరణంలో ఏదో ఒక ఆసక్తిదాయకమైన దానిని పరిశీలనగా చూస్తున్నాను. (బాగా విను) ఆ నైపుణ్యాలు నా కప్పటికే ఉన్నప్పటికీ, నాకు మార్మిక (తాంత్రిక) విషయా ల గురించి ఏమాత్రం తెలియదు, ఎవరైనా నాతో 'తేజఃపుంజాలు' (ఆరాలు) వగైరాల గురించి మాట్లాడితే... నా కేమీ తెలియదు. ఒక రకమైన అనుభూతి అ తని వాతావరణంలో నాకు కలుగుతున్నది, అప్పుడు నేను నా ఫోర్కును నా నోటిలో పెట్టబోతున్నాను, అంతే నేను దానిని ఒక్కసారిగా ధభాల్న వదిలేశాను! అంతే నాకు ఎటువంటి చీవాట్లు పడ్డాయో! సరిగ్గా ప్రవర్తించడం చేతకాకపోతే, మేజాబల్ల దగ్గరకే రాకూడదని నాకు చెప్పారు.

The Mother

శరీరంలో నుంచి బయటకు వెళ్ళడం

ఈ సమయంలోనే నేను ప్రతి రాత్రి నా శరీరంలో నుంచి బయటకు వె ళ్ళేదాన్ని, ప్రార్థనలు, ధ్యానాలలో చెప్పినట్లుగా (నేను దానిని అక్కడక్కడ ప్రస్తా

వించడం జరిగింది). అప్పుడు నేను నా కార్యక్రమాన్ని చేయడం జరుగుతూ ఉండేది. ప్రతి రాత్రి ఒకే సమయాన, మొత్తం ఇల్లంతా ప్రశాంతంగా ఉన్నప్పుడు, నేను నా శరీరం నుంచి బయటకు వెళ్ళి, అన్ని రకాల అనుభవాలు పొందేదానిని. అలా నా శరీరం క్రమక్రమంగా నిద్రలో నడిచేదిగా తయారయింది (అనగా, రూపం యొక్క చేతన ఎక్కువెక్కువగా ఎరుకలోకి వస్తూండేది, లంకె చాలా ధృఢంగా ఉండి కొనసాగుతూ ఉండగానే). నాకు నిద్రలో లేవటం అలవాటయింది — కాని సాధారణంగా నిద్రలో నడిచేవారిలాగా కాకుండా, నేను లేచి, నా సొరుగు తెరిచి, ఒక కాగితం ముక్కను తీసుకుని, వ్రాసేదాన్ని.... పద్యాలు, అవును పద్యాలే — కాని, నాలో ఎటువంటి కవి లేడు! నేను కొన్నింటిని వ్రాసి, చాలా ఎరుకతో ప్రతిదానిని జాగ్రత్తగా సొరుగులో పెట్టేదాన్ని, చాలా జాగ్రత్తగా అన్నింటికీ తాళం వేసి, తిరిగి వెళ్ళి పడుకునేదాన్ని. ఒక రాత్రి, ఏదో ఒక కారణాన, నేను సొరుగు మూయడం మరచిపోయి, దానిని తెరచే ఉంచాను. (ఫ్రాన్సులో కిటికీలు మందమైన పరదాలతో కప్పబడి ఉంటాయి, విసురుగా పరదా లన్నింటినీ పక్కకు నెట్టి, నన్ను లేపుతున్నది. అబ్బా! ఎటువంటి హెచ్చరికా లేకుండా, కాని నేను దానికి అలవాటు పడే ఉన్నాను, అప్పటికే నేను లేవడానికి తయారుగా ఉన్నాను — లేకపోతే పరిస్థితి ఇంకా చాలా అధ్వాన్నంగా తయారయేది). మా అమ్మ లోపలికి వచ్చి, ఎదురులేని అధికారంతో నన్ను పిలుస్తూ ఉన్నది. తరువాత ఆమె సొరుగు తెరిచి ఉండటం గమనించింది. దానితో పాటు కాగితం ముక్కను కూడా: 'ఏమిటది?' అంటూ దాన్ని చేతిలో తీసుకుని 'నిన్ను నీవు ఏమిటనుకుంటున్నావు?'! నేనేం సమాధాన మిచ్చానో నాకు గుర్తు లేదు. కాని ఆమె డాక్టరు వద్దకు వెళ్ళింది. 'నా కూతురు నిద్రలో నడిచేదిగా తయారయింది! ఆమెకు మీరు మందివ్వాలి!'

The Mother: Conversation with a disciple, August 5, 1961

అదే నేను జీవించవలసి వున్నది

వాస్తవంగా, నా యోగం ఏ విధంగా క్రమంగా ముందుకు సాగిందో చూస్తే,... నేనప్పుడు ఐదేళ్ళదాన్ని (ఇంకా ముందే మొదలుపెట్టాను, కాని జ్ఞాపకం కొంత సందిగ్ధంగా, అస్పష్టంగా ఉంది).... కాని ఐదునుంచి, నా చేతనలో (అ

ది మానసిక జ్ఞాపకం కాదు కాని... ఏ విధంగా చెప్పను? — అది ఆనవాలు, నా చేతనలో ఆనవాలు)... సరే, నేను చేతనతో మొదలుపెట్టాను. సహజంగానే అదే మిటో నాకు తెలియదు. కాని నా మొదటి అనుభవం ఇక్కడ ఉన్న చైతన్యానిది (తల మీద సంజ్ఞ), నేను దానిని దివ్యప్రకాశంగాను, దివ్యశక్తిగాను అనుభూతి పొందాను, నేను దానిని అక్కడ అనుభూతి పొందాను (అదే సంజ్ఞ), ఐదేళ్ళ వయ సులో. అది చాలా మధురానుభూతి. ప్రత్యేకించి నా కోసమే తయారుచేయబడి న, చేతులుండే కుర్చీలో కూర్చునేదానిని, ఒక్కదాన్నే పూర్తిగా ఏకాంతంగా, నేను... (అదేమిటో నాకు తెలియదు, కాస్త కూడా, ఎంత మాత్రమూ — మాన సికంగా సున్నా) నాకు చాలా మధురమైనది, ఏదో చాలా బలమైన అను భూతి, ఎంతో దేదీప్యమానమైన ప్రకాశం, అది ఇక్కడ (తల మీద), దివ్య చైతన్యం. నాకు ఈ విధమైన అనుభూతి, "అదే నేను జీవించాల్సింది, నే ను తప్పక అలాగే ఉండాలి". సహజంగానే, ఆ మాట లన్నింటితో కాదు. కాని... (శ్రీమాత పైకి ఆకాంక్షను సంజ్ఞగా చూపిస్తూ). అప్పుడు నేను దానిని కిందికి లాగే దానిని, ఏలనంటే అది... నిజంగా నా అస్తిత్వ కారణం.

The Mother: Conversation with a disciple, July 25, 1962

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ (9441813100)

కళలు, సంగీతం, చిత్రకళ

చాలా చిన్నప్పుడు (ఎనిమిది, పది యేళ్ళ వయసు) నా చదువుతో పాటే చిత్రలేఖనం మొదలుపెట్టాను. పన్నెండేళ్ళ ప్రాయం నుండే ప్రతి కృతి చిత్రణ చేస్తూ ఉన్నాను. కళ, సౌందర్యానికి సంబంధించిన వివిధ రూపాల్లో ముఖ్యంగా సంగీత, చిత్రకళలే నన్ను బాగా ఆకర్షించాయి. ఆ కాలంలో ఒక విశేషమైన ప్రా ణిక అభివృద్ధిని చూచాను. ఆ ముందటి సంవత్సరాల్లో ఒక విధమైన ఆంతరిక మార్గదర్శి సమక్షంలో నే నున్నట్లుగా ఉండేది. అప్పుడే వివిధ అధ్యయనాల పైన నా దృష్టి కేంద్రీకృత మయ్యింది. ఇంద్రియ స్పందనల, పరిశీలనల అధ్యయ నం, సాంకేతిక, యుక్తిపరమైన తులనాత్మక అధ్యయనాలు, ఆఖరికి వినికిడి, వా సన, రుచికి సంబంధించిన మొత్తం పరిధి అధ్యయనం — ఒక రకంగా అన్ని అనుభవాలను వర్గీకరించుకోవడం. ఈ వర్గీకరణ జీవితానికి చెందిన పార్శ్వాలు, అ

లాగే జీవితం తెచ్చివ్వగల అన్ని అనుభవాల వరకు విస్తరించింది — బాధలు, దుఃఖాలు, సంతోషాలు, కష్టాలు, వేదనలు ఇలా అన్నీ — ఓహ్! అంతా అధ్యయనాల క్షేత్రమే! సర్వవేళలా ఈ సన్నిధి నాలోనే ఉండి ప్రతిదాన్ని విభజిస్తూ, క్రమబద్ధీకరిస్తూ, నిర్ణయిస్తూ, తీర్పు చేస్తూ వ్యవస్థీకరిస్తూ ఉంది.

The Mother: Conversation with a disciple, July 25, 1962

సంబంధం కలుపబడింది

చాలా కాలం క్రితమే జీవితానికి అన్వయించుకొని జీవించదగినదిగా నేను భావించిన అంశం — చైతన్యం. నేను మాక్స్ థియోన్‌ని కలిసినప్పుడే ఆ యంత్రాంగాన్ని అర్థం చేసుకొన్నాను. ఒక నిర్దిష్ట స్థాయి పట్ల ఎందుకు ఎరుకతో లేనో కూడా అర్థం చేసుకొన్నాను. రెండు స్థాయిల్ని కలపడానికి పది నెలలు, సంవత్సరం పాటు వెచ్చించానని నీకు చెప్పాననుకొంటాను. చేతనకు చెందిన రెండు స్థాయిలు; అప్పుడు సంబంధం ఏర్పడ లేదు. కాబట్టి వస్తుజాల పరిధికి సంబంధించి కలిగే స్వతః సిద్ధమైన అనుభవాన్ని నేను పొంద లేకపోయాను. “ఎందుకంటే ఈ భాగానికి ఆ భాగానికి మధ్య వికాసం చెందని ఒక పొర ఉన్నద” ని మేడమ్ థియోన్ నాతో చెప్పింది. శ్రేణు లన్నింటి గూర్చి ఎరుకతో ఉన్నాను: మాక్స్ థియోన్ దీన్నంతా చాలా తేలికైన పదాలతో వివరించారు. కాబట్టి నేనన్నట్లు దీనిని అర్థం చేసుకోవడానికి నీవు మేధావివి కానవసరం లేదు. జీవి అస్తిత్వాన్ని ఆయన చతుర్విధ విభజన చేసాడు. దానిలో ప్రతి భాగాన్ని మళ్ళీ నాలుగు భాగాలుగా చేశాడు. ఇలా లెక్కలేనన్ని భాగాలుగా చేశాడు. ఇలా మానసిక సరళీకరణ వల్ల నిన్ను నీవు లోతైన మానసిక అధ్యయనం చేయగలవు. శోధించడం, తప్పించి వేయడం ద్వారా అఖరికి ఈ శ్రేణికి ఆ శ్రేణికి (శ్రీమాత చేతనకు సంబంధించి రెండు స్థాయిల్ని సంకేతాత్మకంగా సూచిస్తూ) మధ్యస్థ చేతనను కనుగొన్నాను. అక్కడ ఒకానొక వికాసం చెందని పొర ఉన్నది. అది సచేతనం కాలేదు. కాబట్టి మరొకటి చేయకుండా పది నెలల పాటు దానిపైనే ఉండి పని చేశాను. ఎలాంటి ఫలితమూ కల్గలేదు. కాని దాన్ని లక్ష్యపెట్ట లేదు. నిబ్బరంగా ఉండి “మంచిదే.... ఏ కాస్తైనా తెలుసుకోడానికి 50 ఏళ్ళైనా పట్టనీ, ఎవరికి తెలుసు?” అని నాకు నేను చెప్పుకొన్నాను. ఇక పల్లె ప్రాంతానికి వచ్చేశాను. (అప్పుడు మేము

పారిస్‌లో నివసించేవారము) ఒకసారి నేను గరికపై పడుకొన్నాను. ఉన్నట్టుండి ఒక్కసారి భూమితోనూ, గరికతోనూ బాంధవ్యం ఏర్పడింది. ఓహ్! అక్కడ ఒక రకమైన ఆంతరిక విస్ఫోటనం — సంబంధం స్థాపితమైయ్యింది. తరువాత కల్గ బోయే అనుభవాలతో పాటుగా పూర్తి చైతన్యం ప్రాప్తించింది. " మంచిది. ఎంత శ్రమైనా పడి సాధించవలసిన అర్హత దీని కున్నది" అని నాకు నేను చెప్పుకొ న్నాను. ఆ పని ఎలా బయటకు కనబడకుండా నెమ్మదిగా జరుగుతుందో నాకు ఖచ్చితంగా తెలుసు. అది గుడ్డులో పిల్ల ఆకారాన్ని తీసుకొంటున్నట్లు ఉంటుంది. నీవు గుడ్డుపై పెంకునే చూస్తావు. గుడ్డు లోపల ఏమున్నదో నీ వెరుగవు. అది గుడ్డు అవ్వనీ లేదా పిల్ల అవ్వనీ. (అయితే కొన్ని ప్రత్యేక ఉపకరణాల ద్వారా నీవు చూడగలవు) ఇక గుడ్డు పెంకును పొడుచుకొంటూ ఒక ముక్కు కియ్యో, కియ్యో మంటూ రావడం కనిపిస్తుంది! ఆపై పక్షి కూన బయటికి, అలా కోడిపిల్ల బయట కొచ్చినట్లే.... అంతరాత్మతో కల్గే సంబంధం కూడా అలాగే ఉంటుంది. నెలల తరబడి, ఒక్కొక్కసారి సంవత్సరాల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. నీ వొక మూసి ఉన్న తలుపు వద్ద కూర్చున్నావ్ అనుకో... నెట్టు దానిని, ఇంకా నెట్టు నెట్టుతూ పో,.. ఇక్కడ ఒక ఒత్తిడిని అనుభవించడం (అది బాధిస్తుంది) అ యినా ఏమీ జరుగలేదు, ఎలాంటి ఫలితం లేదు. అప్పుడే ఒక్కసారిగా ఎందు కో, ఎలాగో నీ వెరుగవు. అలా కూర్చుండి పోతావు. ప్రతిదీ పగులగొట్టుకొంటూ తెరుచుకొంటుంది. అంతా అప్పుడు సిద్ధమౌతుంది. సమస్తం నెరవేర్చబడుతుంది. ఇక ముగిసినట్లే — నీవు సంపూర్ణమైన అంతరాత్మిక చేతనలో ఉద్భవిస్తావు. నీ చైత్యపురుషతో సాన్నిహిత్యాన్ని పొందుతావు. అప్పుడు ప్రతిదీ మారిపోతుంది — ప్రతి అంశమూ కూడా — నీ జీవితం సాంతం పరివర్తనం చెందుతుంది.. ఇది సమస్త అస్తిత్వాన్ని తలక్రిందులు చేసి భిన్న మైనదిగా చేస్తుంది.

The Mother: Conversation with a disciple, September 5, 1962

సంగీత లోకం

మొదటిసారి నేను బీత్ ఓవెన్ సంగీత కచ్చేరీని డీ లో విన్నాను. వాయు లీనం, వాయిద్యకారుల బృందం... అకస్మాత్తుగా వాయులీనం మ్రోగడం మొద లయ్యింది — (కాని అది మొదట్లో కాదు. మొదట ఒక ఆర్కెస్ట్రా స్వరాలాపన

అంశం సాగింది. ఆ పైన వయోలిన్ అందుకొన్నది). తొట్ట తొలిగా వాయులీన రాగం (ఇజాయె దానిని పలికిస్తున్నాడు. అబ్బ! ఎట్లాంటి వాయిద్యకారు డాయన) ఆ ధ్వనితోనే నా శిరస్సు హఠాత్తుగా తెరుచుకొన్నట్లుగా అయ్యింది. ఒక రకమైన కాంతిలోకి పడవేయబడ్డాను. ఓహ్! అది ఎంత ఆశ్చర్యకరమైనదో. గంటకు పైగా నేను అదే ఆనందమయ స్థితిలో ఉండిపోయాను. ఇజాయే నిజమైన సంగీతజ్ఞుడు. నీకు తెలుసా! ఆ లోకాల గురించి కొంచె కూడ నే నెరుగను. కొద్దిపాటి జ్ఞానం కూడా లేదు. నేనేదీ కోరకుండానే అనూహ్యంగా నా అనుభవాలు వాటి మార్గంలో అవి కల్గసాగాయి. ఒక చిత్తరువుని చూచినా అదే జరిగింది. నా శిరస్సు లోపల ఏదో అకస్మాత్తుగా విస్ఫోటనం చెంది, నేను ఆ చిత్రానికి ఉన్న మూలాన్ని చూచేదాన్ని – అబ్బ! ఎలాంటి రంగులు అవి.... అన్ని మానసిక స్తరాల నుండి ప్రయాణించకుండానే నేరుగా ప్రాణికం నుండి ఆ లోకానికి చేరుకోవచ్చు.

The Mother: Conversation with a disciple, October 27, 1962

సంగీతం నుండి ఆకాంక్ష పుట్టుతుంది

పారిస్‌లో ఉండగా ఒక యూదుల ప్రార్థనాలయంలో ఎంత చక్కని సంగీతం వినవచ్చేదో! ఎంత శ్రవణానందకరమది! నాకు కల్గిన అనుభవాల్లో మొదటి అనుభవం, ఒక ఆలయంలో సంభవించింది, అది ఒక వివాహ వేడుక. ఆ శుభవేళ ఏర్పాటు చేసిన ఆ సంగీత కార్యక్రమం అద్భుతమైనది – సెయింట్ సెయిన్స్, ఆర్గన్ వాయిద్య సంగీతమని తరువాత తెలిసింది. అప్పుడు నాకు 14 ఏళ్ళ వయసు, మా అమ్మతో పాటు ఆలయంలోని ఎత్తైన గేలరీలో కూర్చొన్నాను. ఆ సంగీతం వీనుల విందు చేస్తున్నది. అక్కడే ఆ ప్రక్కన తెల్లగా ఎలాంటి డిజైన్ లేని కొన్ని సీసపు చట్రాల గ్లాసు కిటికీ లున్నాయి. వాటిల్లో ఒకదాని వైపు నా దృష్టి పడింది. ఆ సంగీతంతో నా భావస్పందన ఉద్దీప్త మవ్వసాగింది. అకస్మాత్తుగా ఆ కిటికీలో నుంచి ఒక మెరుపు, ఒక సౌదామిని చొచ్చుకొచ్చింది. నా కళ్ళు తెరచుకొనే ఉన్నాయి. అది ఇలా (శ్రీమాత తమ ఛాతీని బలంగా గుచ్చినట్లు చూపిస్తున్నారు.) అన్న మాట! దాంతో నేను చాలా విశాలంగా, అమిత శక్తివంతంగా అయిపోతున్నాను. ఈ అనుభవం రెండు రోజుల పాటు ఉంది. ఆ

మెరుపు గుండా గతం నుండీ ఒక జీవి సంగీతంలో నుండి పుట్టిన ఆకాంక్ష ద్వారా నా లోకి మళ్ళీ తిరిగి వచ్చింది.

The Mother: Conversation with a disciple, April 29, 1961

శ్రీమాత సంగీతం

నేను వినిపించేది సంగీతం కాదు. నేను సంగీతాన్ని అభివ్యక్తం చేయాలని ప్రయత్నించను. అది సింపుల్‌గా ధ్వని మాధ్యమంగా చేసే ఒక ధ్యానం. నేను నిరంతరం ఏదో గొప్ప సంగీత లహరి వంటి దీనికి నాలోకి నేను కొంత ఉపసంహరించుకోవాలి. అది అక్కడుంటుంది. దాన్ని నేను వింటాను. అది ఎప్పుడూ అక్కడే నెలకొని ఉంది. అది సంగీతం , సవ్వడి లేనిది. అవి సంగీత మహా తరంగాలు.... ఎప్పుడైతే ఆ తరంగాలను వింటానో అప్పుడు నా హస్తాలు సంగీత ప్రక్రియకు ప్రేరణ పొందుతాయి.

CWSA 32:571

నేను వాయించేటప్పుడు సాధారణంగా ఆ వాయిద్య సంగీతాన్ని వింటాను. దానిని మాటల్లో పెట్టడం చాలా కష్టం.... అది ఒక మామూలు ధ్వని కాదు. అది వివిధ ధ్వనుల మేళవింపు. నిజం, అది వినపడే ధ్వని కాదు ధ్వని సారం వలె ఉంటుంది. నా కొక రకమైన భావం కల్గుతూ ఉంటుంది. అది ఏమిటంటే: "నేను వింటూ ఉన్న దాన్ని పెద్ద పెద్ద వాయిద్యాలు, వాయిద్య బృందం చేత వ్యక్తపర్చబడాలి." నీకు తెలుసా! నేను చూస్తున్నాను నా చుట్టుతా, నా ఎడమ ప్రక్క, నా కుడి ప్రక్క ఏదో పెద్ద ఆర్కెస్ట్రా ఉన్నట్లు నేను తిలకిస్తాను. దానిని హార్మోనియం మీద శ్రుతి చేయడానికి నేను ఉద్దేశింపబడినట్లుగా ఉంటుంది. అది వాయిద్యకారుల బృందాలతో కూడిన ఆర్కెస్ట్రాలా, దానిలో ప్రతి బృందం ఆ సమ్మేళనంలోని ఒక భాగాన్ని వ్యక్తీకరిస్తున్నట్లుగా ఉంటుంది. అది ఒక చెవి ఆకర్షించగల్గే దానికంటే మినుమిక్కిలి సంపూర్ణమైన ధ్వని. అది ఎలాంటిదంటే ఝుమ్మని ఒక స్వరంలో వ్యక్తపరిచేది కాదు. సంగీత ప్రకంపనాభరిత మవ్వాలి దేహం మొత్తం. నేను దానిని వింటున్నప్పుడు ఎలా 'దాని నెలా అభివ్యక్తం చేయాలి' అని చూస్తాను. పెద్ద పెద్ద ఆర్కెస్ట్రాలు, వాయిద్య బృందాలు నా చుట్టూ ఉన్నట్లుగా దర్శిస్తాను. కాని ఇది వేరొక దర్శనం. ఈ చర్మ చక్షువుకి అగుపించేంత

స్పష్టమైన దర్శనం కాదు. అది చాలా... ఎలా 'చేతన' చూస్తుందో ఆ విధంగా. దాన్ని నేనెలా వర్ణించను! దానిని మామూలుగా మీ చూపుకు లేదా వినికిడికి కుద రదని మీ రంటారు. ఇది పూర్తిగా పరిపూర్ణమైన జ్ఞానం. ఒక దర్శనం, ధ్వనుల సమ్మేళనానికి చెందిన ఒక ఎరుక. ఆ ధ్వనులు ఎలా వ్యక్తమౌతాయి అన్నదంతా ఆ జ్ఞానంలో కలిసి ఉంటుంది.

The Mother: Conversation with a disciple, October 27, 1962

శ్రీఅరవిందుల వద్ద చైత్యపురుషను వదలివేయడం

శ్రీఅరవిందుల సన్నిధిలో సంవత్సర కాలం నివసించి, మొదటి ప్రపంచ యుద్ధ తరుణంలో ఇక్కడ నుండి వెళ్ళిపోయాను. యుద్ధం కారణంగా నాడీతంత్రు లన్నీ వ్యాధికి గురైయ్యాయి. ఇవి ఎంతో చిర చిరలాడుతూ తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొన్నాయి. (ఈ జబ్బును న్యూరైటిస్ అంటా రనుకుంటా) దాంతో అన్ని నరాలు జబ్బుపడ్డాయి. ఇది ప్రత్యేకించి బహు బాధాకరం. ఇక ప్రతిదీ అస్తవ్యస్తమైపోయింది. రక్తప్రసరణ వ్యవస్థ, జీర్ణవ్యవస్థ ఇలా ప్రతిదీ దెబ్బతిని పోయింది. (ఇదంతా ఫ్రాన్స్‌లో... దక్షిణ ఫ్రాన్సులో జరిగింది) నరాల సముదా యాని కా స్ఫురణ ఉన్నది. ఇలా ఎందుకన్నది నాకు తెలియలేదు. ఇక్కడ పరి స్థితులన్నీ కష్టంగా తోచిన సమయాన్ని నాడీతంత్రులు మాత్రం జ్ఞప్తిలో ఉంచు కొన్నాయి. అక్కడే వున్న శ్రీఅరవిందులకు ఆ విషయం చెప్పాను (ఈ కథ నీక్కూడా చెప్పాననుకుంటా) ఒక హస్తం వచ్చి మొత్తం బాధ నంతా తీసివేసిన అనుభవం కల్గింది — ఒక్క క్షణంలో అంతా మటుమాయమైనట్లుగా అయ్యిం ది. మళ్ళీ అది తిరిగి కనిపించలేదు. నేడు, వివిధ సమయాల్లో ఎప్పుడైతే మను షుల్లో సంతులనం దెబ్బతిని లేదా, ఆలోచనలు చెదిరి, దానికి తోడు తగిన విశ్రాంతి, తిండి, నిద్ర లేకుండా ఉంటారో అటువంటప్పుడు నాడీవ్యవస్థ అల సటకు గురౌతుంది. వేదన తారాస్థాయికి చేరుతుంది. ఇలాంటి స్థితిని నేను ఫ్రాన్సులో ఉండగా వారాల తరబడి అనుభవించాను. అప్పుడప్పుడు, అట్లాం టి వేదన కల్గినప్పుడు అలా నిశ్చలంగా, పరమాత్మ సన్నిధిలో నిమగ్నమై తీ రుతాను. అంతే ఎటువంటి గుర్తు లేకుండా మాయమైపోతుంది.

The Mother: Conversation with a disciple, February 20, 19628

ఇది 'ఒక జబ్బు' దీనిని వాళ్ళు నరాల జబ్బుగా చెబుతారు. నాడీతంత్రులన్నీ ఎంతో బలహీనంగా మారిపోయి, భయంకరమైన వేదనకు గురౌతాయి. మొదటిసారి దీనికి నేను లోనైనప్పుడు అస్సలు దేనిని వినగల్గేదాన్ని కాదు, నిద్రపోగల్గేదాన్ని కాదు. ఇలా ఎందుకు జరిగిందంటే నేనొక పిచ్చి పొరపాటు చేశాను. నా చైత్యపురుషను ఇక్కడ వదిలి ఫ్రాన్స్‌కి వెళ్ళాను. నేనీ వాతావరణానికి దూరమైపోతూ వుండగా అది నన్ను పట్టుకుంది. నేను మెడిటేరియన్ లోకి ప్రవేశించానో లేదో దాని పని మొదలైంది. పరిస్థితి చాలా ప్రమాదం కల్గించేదిగా అయ్యింది.

The Mother: Conversation with a disciple, November 12, 1969

అనువాదం: సి. హెచ్. హర్షవర్ధన్ (9346614070)

మతాలలో అధికార దుర్వినియోగం

నా తల్లి ఖచ్చితమైన, పూర్తి భౌతికవాది, దైవానికి ధన్యవాదాలు! అగోచరమైన విషయాల గురించి ఆమెతో మాట్లాడటం అసాధ్యము ఆమె కలవరపడే మనసుకు నిదర్శనముగా వాటిని భావిస్తుంది. ఆమె స్వయముగా స్పర్శించి దర్శించితే గాని లెక్కలోనికి తీసుకోదు. అది కూడా దైవానుగ్రహమే — ఏ విషయాన్నైనా చెప్పడానికి ఎప్పుడూ నాకు అవకాశము లేదు. నా అనుభవాలను నాలోనే ఉంచుకొన్నాను — కాని ఒకదానితోనే మొదటి పరిచయము — గతము నందు నా పరిధిలోని సంగీతము మీద గల అభిలాష ద్వారా గతానికి సంబంధించిన ఒక అస్తిత్వ మేదో తిరిగొచ్చినట్లు నేను తర్వాత తెలుసుకొన్నాను.

కాని చర్చిల్లో అరుదుగా కలిగిన అనుభవాలున్నాయి విశేషించి తద్విరుద్ధమైనవి ఓదార్పు కనుగొనడముతో, దైవ కరుణను పొందడానికి చేసిన మానవ ప్రయత్నంలో చాలా తప్పుడు హస్తాలలో పడిపోవడం వల్ల నాకు తరచుగా బాధావహమైన అనుభవాలు ఎదురైనవి.

నాకు కలిగిన భయంకరమైన అనుభవాల్లో ఒకటి వెనిస్ నగరములో కలిగింది. (అవి చాలా పెద్ద చర్చిలు, అందమైనవి, అద్భుతమైనవి కూడా) నేను రంగుల బొమ్మ చిత్రీకరణలో నిమగ్న మైనట్లు జ్ఞాపకము, నేను ఒక మూల చిత్రించడానికి కూర్చొన్నాను. నాకు కొంచెము సమీపములో (వారేమని పిలుస్తారో?)... తప్పు, బాధ విన్నవించి క్షమాభిక్ష కోరే గది వుంది. ఒక నిస్సహాయురాలైన స్త్రీ బాధతో

మోకరిల్లి వుంది. పాపం చేసాననే భయంకరమైన భావనతో! ఆమె దయనీయంగా ఏడుస్తూనే వుంది. నేను అప్పుడు చూసాను ఒక మతగురువు రావడము, ఓహ్ ఒక రాక్షసుడిలా వున్నాడు, కఠిన హృదయుడైన రాక్షసుడు! అతడు లోపలికి వెళ్ళాడు. అతనొక ఇనుప కడ్డీలా వున్నాడు. అచట ఆ పేద వనిత వెక్కి వెక్కి ఏడుస్తుంది మరొకరి కఠినమైన నిర్దయ నిండిన స్వరము.... నన్ను నేను నిలువరించుకోవడం కష్ట మనిపించింది.

ఎందుచేతనో తెలియదు కాని, నాకు ఈ విధమైన అనుభవాలు చాలా సార్లు కలిగాయి. శత్రుశక్తులు ప్రచ్ఛన్నముగా సర్వస్వాన్ని కబళించి వేయడమో, లేక మానవుడు క్రూరముగా అధికారాన్ని దుర్వినియోగం చేయడమో యిది. నిజానికి, దీన్ని ప్రపంచం మొత్తం మీద చూచాను. యూరపులో గాని, ఆఫ్రికాలో గాని, జపానులోగాని, ఇక్కడ సైతం, నా కెప్పుడూ మతాలతో సత్సంబంధాలు లేవు.

The Mother: Conversation with a disciple, April 29, 1961

అత్యంత పరస్పర విరుద్ధమైన అనుభవాలు

నాకు చాలా పరస్పర విరుద్ధమైన అనుభవా లున్నాయి! నా బాల్యము నుండి ఒక విషయము నిరంతరము కొనసాగుతూనే వుంది. (నేను ఎంత ఎక్కువగా చూస్తే చూస్తున్న కొద్దీ, నిరంతరంగా ఎలా కొనసాగిందో తెలిసింది.) దైవసాన్నిధ్యం "దేవుడా? అదేమి తెలివి తక్కువతనము! దేవుడనేవాడు మనుగడలోనే లేడు" అని బాహ్య జీవితంలో జీవించే ఒకామె ఇలా చక్కగా చెప్పింది. దీనిని బట్టి నీవు అర్థం చేసుకోవచ్చు! నాకు, అసలు వాస్తవ పరిస్థితి యిలా వుంది.

మీకు తెలుసు, అదొక అద్భుతము, నిరంతరము దైవానుగ్రహము ఎల్లప్పుడూ అనుభవము లోనికి రావడము, అద్భుతమైనదే, చాలా శక్తివంతమైనది కూడా — వేరొక బలమైన శక్తి ప్రతిదానికీ వ్యతిరేకంగా, గట్టిగా పట్టుకొన్నట్లు, ప్రతి విషయమునందు: అదే ఈ దివ్య సన్నిధి. నా బాహ్య చేతనలో దానికి సంబంధించిన అన్నింటిని పూర్తిగా తిరస్కరిస్తుంది. ఆ తర్వాత కూడా నే ననుకొనేదాన్ని "మంచిది. దేవు డున్నట్లయితే ఆయన నిజముగా దుష్టుడు! అతడొక దౌర్భాగ్యుడు — ఈ సృష్టికర్త గురించి ఆలోచించవలసింది, చేయవలసిన దేమీ లేదు." చూడండి, భగవంతుడంటే ప్రశాంతంగా, సుఖముగా తన స్వర్గములో తాను కూ

ర్థాని, ఈ ప్రపంచాన్ని సృష్టించి దాన్ని చూస్తూ ఆనందిస్తూ మనతో "ఎంత బాగా జరిగింది" అంటాడు. "ఓహ్! అటువంటి అమానుష దైవంతో నాకేం పని లేదు!" అన్నాను.

The Mother: Conversation with a disciple, April 29, 1961

జ్ఞానతృష్ణ

పద్దనిమిదేళ్ళ ప్రాయములో తెలుసుకోవాలనే తృష్ణ తీవ్రమైన అవసరముగా ఉండేదని నాకు జ్ఞాపక మున్నది. ఎందుకంటే నాకు కలిగిన అనుభవాలు — అనేక రకములై అనుభవాలు — కాని నా పరిసరాలు మేధోపరమైన దానంతటి అర్థాన్ని తెలిపే జ్ఞానము పొందడానికి అవకాశ మివ్వలేదు. వాటిని గురించి ఏమీ మాట్లాడనూ మాట్లాడ లేము. నాకు ఒక అనుభవము తర్వాత మరొక అనుభవం కలిగాయి.... కొన్ని సంవత్సరాలు నాకు రాత్రి సమయములో అనుభవాలు కలిగాయి. (నేను వాటి గురించి ఎప్పుడూ మాట్లాడకుండా జాగ్రత్త పడ్డాను.) అవి గత జన్మ స్మృతులు, అన్ని రకాల సంగతులు, ఏ విధమైన మేధోపరమైన జ్ఞానము మీద ఆధారపడి లేవు. (బహుశా, వాటి ప్రయోజన మేమిటంటే, నా అనుభవాలన్నీ మానసిక నైపుణ్యముతో అల్లబడ లేదు, అని పూర్తిగా సహజముగా, అప్రయత్నంగా ఏర్పడినవి.) కాని వాటిని తెలుసుకోవడము నాకు అవసరమే! ఒక గృహములో నివసించినప్పుడు (అది ఒక గృహసముదాయములో ఒక ఇల్లు) మా ఇంటి ప్రక్కన ఇంటిలో ఒక యువ కాథలిక్‌కు అపారమైన విశ్వాసము... బలమైన గట్టి నమ్మకము గలవాడు. ఒక రోజు నేను తల దువ్వుకొంటున్నప్పుడు నాలో నేను అనుకొన్నట్లు "వారు ఆ మతములో జన్మించడము, నిస్సందేహులై నమ్మడం వాళ్ళ అదృష్టం. అది చాలా తేలిక. మనము నమ్మక ఏమీ చేయలేము... అలా అనుకోవడము చాలా సులువు. అని అనుకున్నాను. నాకు గ్రహింపు కలిగిన తర్వాత, నేను అప్పట్లో అలా ఆలోచించడం గురించి (నవ్వుతూ), నన్ను నేను తిట్టుకున్నాను, సోమరిపోతునని."

తెలుసుకో, తెలుసుకుంటూనే వుండాలి. ఇంకా తెలుసుకోవాలి — "వాస్తవానికి నాకేమీ తెలియదు, సాధారణ జీవిత విషయాలు కూడా నాకు తెలియదు, బయట వ్యవహార జ్ఞానము కూడా లేదు. కాని నేను ప్రతి విషయాన్ని

నేర్చుకున్నాను. నేను నేర్చుకోవడానికి ఎల్లవేళలా సిద్ధపడి వున్నాను. నాకు బోధించినది తెలుసుకోవడమే గాక, నా సోదరుడి దగ్గర కూడా నేర్చుకున్నాను — ఉన్నత గణితాన్ని అంతా నేర్చుకున్నాను. నేర్చుకుంటూనే వున్నాను, నేర్చుకొంటున్నానే కాని నాకు ఏమీ అర్థము కాలేదు. ఏ విషయాన్ని కూడా నేను అర్థము చేసుకో లేకపోయాను."

తెలుసుకోవడము!

దైవం మన లోపలే వున్నాడని నాకు చెప్పారు. పాశ్చాత్యుడికి కూడా అర్థమయ్యే మాటల్లో గీతా ప్రబోధము కూడా అదే తెలియ చేసింది. ఒక ఆంతరిక దివ్యసన్నిధి వున్నదని ప్రతివాడూ తనలోనే ఒక దైవసన్నిధిని భరించి వున్నాడనీ నాకు తెలిపారు. ఓహ్! ఎటువంటి వివేకవంతమైన మాట. కొద్ది నిమిషాలలోనే ఉన్నట్లుండి సమస్తం అర్థం చేసుకొన్నాను, సర్వం, సర్వం అర్థమైంది. ప్రతిదీ అర్థమైంది. అప్పటి కప్పుడు అది (ఆంతర దైవంతో) సంపర్కం కలిగించింది.

The Mother: Conversation with a disciple, April 21, 1961

అబ్దుల్‌బాహా

నాకు అబ్దుల్ బాహా బాగా తెలుసు. ఆయన 'బహాయి' మత స్థాపకుడైన బాహావుల్లా గారి వారసుడు. అబ్దుల్ ఆయన కుమారుడే. నాకు తెలిసినంత వరకు ఆయన పుట్టింది, తన 40 వ సంవత్సరం వరకు ఉన్నది కారాగారం లోనే! ఆయన ఖైదు నుండి విడుదల అయ్యే నాటికి వారి తండ్రి మరణించారు. అందువలన అబ్దుల్ గారే తన తండ్రి స్థాపించిన 'బహాయి' మతాన్ని ప్రచారం చెయ్యవలసి వచ్చింది.

'సూఫీ' ల కంటె ఎక్కువ కాలం విశాల దృక్పథం కలిగిన మత సిద్ధాంతాలను ప్రచారం చేయుట వలన, ఛాందస వాదులైన ఇస్లాం పెద్దలు బహావుల్లా గారిని వ్యతిరేకించారు. అందువలన ఆయన మరణానంతరం ఆయన ఏకైక కుమారుడైన అబ్దుల్ బాహా తండ్రిగారి మతాన్ని ప్రచారం చేయటానికి కంకణం కట్టుకొని ఆ కారణంగా అనేక దేశాలు తిరిగాడు. ఆయన నిర్వహించే ఉద్యమం ఎంత గొప్పదో ఆయన జీవనశైలి కూడా అంత ఉదాత్తంగా, వినయంగా ఉండేది.

దైవం పట్ల ఆయనకు గల ఆకాంక్ష ఎంత నిజాయితీతో ఉండేదో, అంత సహ

జంగానూ ఉండేది. ఒక రోజు ఆయనను కలుసుకోటానికి నేను వెళ్ళాను. అది ఆయన తన శిష్యులను ఉద్దేశించి ప్రసంగించవలసిన రోజు. కాని ఆయన అస్వస్థులుగా వుండడం వలన, లేచే ఓపిక కూడా లేదు. సమావేశం వాయిదా వేయవలసి వచ్చిన పరిస్థితి.

కాని ఆయన అలా కాకుండా, తనకు బదులుగా నన్ను ఆ కార్యక్రమం నిర్వహించమని సూచించారు. ఉన్నట్లుండి అడగడం వలన నేను అందుకు సిద్ధపడ లేనని భావించాను. అందువలన నేను అందుకు సిద్ధంగా లేనని, వారి మత సిద్ధాంతాలపై నాకు తగినంత అవగాహన లేదని, నా అశక్తతను ఆయనకు విన్నవించాను. కాని, నాతో ఆయన ఏకీభవించ లేదు. "ఫరవా లేదులే, ఏదో ఒకటి చెప్పు, సరిపోతుంది, మనసు కేంద్రీకరించి మాట్లాడు, చాలు" అని ఎట్లాగో నన్ను ఒప్పించారు.

అదే విధంగా ఒక రోజు 'పారిస్' లో కూడా నేనే ఆయన శిష్యులను ఉద్దేశించి ప్రసంగించవలసి వచ్చింది. కాని ఆయన మతవిశ్వాసాలపై నాకు తగినంత నమ్మకం లేకపోవటం వలన, ఆ సాహసానికి నేను పూనుకోలేదు.

CWM 2:108-09

అబ్దుల్‌బాహా బలవంతం వలన నేను ప్రసంగించటం

దైవవాణిని మానవాళికి వినిపించటానికి వచ్చే ప్రవక్త లెవరైనా కనీసం ఒక విషయంలో అంతా ఏకీభవిస్తారు! వారందరూ ముక్త కంఠంతో చెప్పేది ఒకటే. "కార్యరూపం దాల్చకపోతే, ఎంత గొప్ప సత్యాలైనా నిరర్థకాలే" — అనేది వారందరి భావన. అదే విధంగా వారంతా వారి సూక్తులకు బద్ధులై తమ తమ జీవితాలు గడిపారు. తాము కేవలం మార్గదర్శనం మాత్రమే చేయగలమనీ, ఆ బాటన నడువ వలసినది సాధకులేననీ ఉద్బోధించారు. ఎంత గొప్పవారైనా వారు ఇతరుల విధిని నిర్వహించలేరు గదా! ఈ విషయంలో ప్రవక్తలంతా ఒకటే!

బహావుల్లా మహాశయుడు కూడా దీనికి భిన్నం కాదు. ఆయన మాటలను మళ్ళీ ఏకరువు పెట్టాలని కాదు గాని, మీకు ఈ విషయం నా కంటె ఎక్కువే తెలుసు. ఆ మహాశయుడు ఎన్ని సార్లు చెప్పలేదు: క్రియాశీలత లేని సూక్తులు

ఎన్ని చెప్పినా వృధాయే; చేతల ద్వారానే మనం ప్రపంచానికి ఆదర్శంగా వుండాలి! అని.

అందువలన మనలో ప్రతివారూ అందరికీ ఆదర్శంగా వుండేటట్లు ప్రవర్తించాలి. మనం శాశ్వత సత్యాలతో సంబంధాలు పెట్టుకుంటే అస్తవ్యస్తమైన వ్యవస్థలో కూడా సామరస్యాన్ని సాధించగలం; బాధలలో కూడా శాంతిని పొందగలం! వీటి వలననే మనకు విముక్తి సాధ్యపడుతుంది.

అబ్దుల్ బాహా కేవలం మాటలకే పరిమితం కాలేదు. చేతలలో కూడా వాటిని నిరూపించారు. చేతలలో నిరూపించటం వలననే ఆయన అందరినీ ఒప్పించ గలిగారు.

అబ్దుల్ బాహాగారిని చూచిన వారెవరైనా, ఆయనలోని మధురమైన, సర్వోత్కృష్టమైన మంచితనాన్నీ, ప్రశాంతతను, పెల్లుబుకుతున్న శాంతిని గమనించ కుండా ఉండగలరా!

తన తండ్రిగారైన బాహావుల్లాగారి ప్రవచనాలు వారి కుమారుని వలన ఇంకా స్పష్టంగా, అర్థవంతంగా, నమ్మకాన్ని చూరగొనేలా వున్నాయనటంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు. ఆయన ఏది బోధించారో, ఆ విధంగానే జీవించారు కూడా!

మీలో కొందరికీ ఈ సందేహం రావచ్చు: అబ్దుల్ బాహా అసామాన్యమైన వ్యక్తి. అందువలననే ఆయన ఆ మాధుర్యాన్ని ఆస్వాదించ గలిగారు. మరి అందరకూ అది ఎలా సాధ్యపడుతుంది?

కాని ఇది బద్ధకస్తులు అనే మాట, వారు ఇంత కంటె బాగా మాట్లాడలేరు గదా!

నిస్సందేహంగా, వ్యక్తుల మధ్య అనివార్యమైన భేదాలు ఉండవచ్చు. ఒక విధంగా, వారి స్థాయి, అంతస్తు, వారిదైన ప్రత్యేక స్థానం ఈ 'నిచ్చెన మెట్ల' వ్యవస్థలో ఉండటం సహజమే! కాని, ఎవరికి వారు ప్రయత్నిస్తే, పరిపూర్ణ స్వచ్ఛత, నిజాయితీ, సామరస్యాలను అభివృద్ధి చేసుకొని, 'వసుధైక కుటుంబం' లాగా మెలగవచ్చు గదా!

ఇంతకు ముందు, నాకు తెలిసిన ఒక మహనీయుడు మానవులను "లోన బంగారం కలిగియున్న ముడి ఖనిజాల" తో పోల్చేవాడు. పైకి మోటుగా కనబడినా, అవి విలువైన ఖనిజాలే. ఎందుకంటే వాటిలో అంతర్లీనంగా సువర్ణమే ఉండేది!

ఇటువంటి లోహాలను 'ఆధ్యాత్మికత' అనే అగ్నిలో పుటం పెట్టినపుడు చివరలో మిగిలేది స్వచ్ఛమైన, సాంద్రమైన బంగారమే!
CWM 2:109-10

అబ్దుల్‌బాహాగారి అవసానదశ

గత సోమవారం అబ్దుల్ బాహాగారు మా వద్ద సెలవు తీసుకున్నారు. కొద్ది రోజుల్లో 'ప్యారిస్' ను కూడా వదిలేవారేమో! వారి కోసం ఎందరో లో లోపల శోకతప్తులౌతారని నాకు తెలుసు.

నిజంగా జీవి వదిలేది కేవలం దేహాన్నే. అసలు 'దేహం' ఎవరికైనా, అంటే హెచ్చు-తగ్గులు, పేదలు, ధనికులు; జ్ఞానులు, అజ్ఞానులు; దైహిక, దైవిక భావాలతో వుండేవారు, వారందరూ పైకి ధరించే దుస్తుల వంటిదే ఈ దేహం! అందువలన, బాహాగారు వదిలి వేసింది కేవలం పై తొడుగునే.

కాని ఆయన ఎక్కడికీ పోలేదు. ఆయన భావాలు ఎప్పుడూ మనతోనే వుంటాయి; ఆయన వాత్సల్యం ఎప్పుడూ మన చుట్టూ పరిభ్రమిస్తూనే ఉంటుంది. ఆయన ఆధ్యాత్మిక చేతన ఎక్కడికీ పోదు. ఆయన భౌతికంగా మనకు 'దగ్గరగా వున్నారా, దూరంగా వున్నారా' అనేది అర్థం లేని ప్రశ్న. దైవత్వ శక్తులు ఎప్పుడూ భౌతికానికి అల్లంత దూరంలోనే వుంటాయి. అంతటా నిండియున్న శక్తులు, ఆకాంక్ష ఉన్న చోట ఎప్పుడూ అందుబాటులోనే వుంటాయి.

ఆయనను భౌతికంగా చూడ గలగటం, వారి ప్రవచనాలను స్వయంగా వినాలనుకోవటం, వారి సాన్నిధ్యాన్ని కోరటం అందరకూ సహజమే. కాని వారి అంతర్గత జీవితానికి మనం అచేతనంగానే వున్నామనటానికి కూడా ఇది నిదర్శనమే కదా!

దివ్యజీవనంలోని గూఢమైన అద్భుతాలకు మనం భౌతికంగా అనంత దూరంలోనే వున్నా, ఆలోచనలలో కూడా దానికి దూరంగానే ఉంటున్నాము. ఏదో కొద్దిమంది మాత్రమే ఆ దివ్యచేతనకు జాగరూకులై యుండగలరు.

భౌతికంగా సమీపంలో ఉంటేనే మనం దగ్గర ఉన్నట్లు కాదు. వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నా ఒకరి గురించి మరొకరు ఆలోచిస్తున్నారంటే, వారు నిజంగా సన్నిహితంగా ఉన్నట్లే! మనం ఏకాగ్రతతో ఆలోచించ గలిగితే — అది ఏ విష

యమైనా — ఆ విషయానికి సంబంధించిన చేతన మనలో కూడా ఉన్నట్లే. కొన్ని సందర్భాలలో మనం ఆలోచిస్తున్న వ్యక్తిని కళ్ళారా చూచినట్లున్నూ, వారి మాటలను చెవులారా విన్నట్లున్నూ అనిపిస్తుంది. అట్లాగే ఎట్టి పరిస్థితులలోనూ ఆ వ్యక్తి యొక్క ఆలోచనా పరంపరను కూడా గ్రహించవచ్చు.

అందువలన వేరుగా ఉండటం అనేది లేనే లేదు. అది కేవలం మన భ్రమ. ఇక్కడ ఫ్రాన్స్ లోనూ, ఆమెరిగా, పర్షియా చైనాలలో ఎవరిని మనం ప్రేమగా చూస్తామో వారికి సన్నిహితంగా వున్నట్లే.

ఇక మన విషయంలో ఇది వాస్తవం. ఏ చేతనలో అనంత ప్రేమ ఉంటుందో, ఏ చేతన ప్రపంచం మొత్తాన్నీ ఆవరించి ఉంటుందో, ఏ చేతన పితృప్రేమతో మనలను ఊరడిస్తుందో, ఏ ప్రేమ ఆకాంక్షించే వారందరకూ సహాయకారిగా ఉంటుందో, అటువంటి ఆధ్యాత్మిక చేతనను మనం పొందుదాం. అటువంటి మానసిక సాన్నిధ్యాన్ని, ఆనందాన్ని అనుభవించండి. ఇక మీకు దుఃఖం ఉండనే ఉండదు.

CWM 2:114-15 *అనువాదం:* కె. ఆర్.యల్. నరసింహారావ (*9848848291*)

ప్రతీ విషయంలో ప్రావీణ్యత పొందే కళ

ఇరవై లేదా ఇరవై ఒక్క సంవత్సరాల వయస్సు వరకు నేను చాలా తక్కువగా మాట్లాడేదానిని. ఎప్పుడూ కూడా ఒక ప్రసంగంలా మాట్లాడలేదు. నేను చర్చలలో పాల్గొనేదానిని కాదు. నేను వింటూ ఉండేదానిని అయితే చాలా తక్కువగా మాట్లాడటం జరిగేది. అప్పుడు అబ్దుల్ బహా (బహాయి) తో పరిచయం కలిగింది. అప్పు డు వారు పారిస్‌లో ఉండేవారు. మా మధ్య ఒక విధమైన సాన్నిహిత్యం ఏర్పడింది. నాకు ఆసక్తి ఏర్పడటం వలన వారి సత్సంగాలకు హాజరవుతూ ఉండేదానిని. ఒక రోజు నేను వారి గదిలో ఉండగా ఆయన, "నాకు ఆరోగ్యం సరిగా లేదు, నేను మాట్లాడలేను. నీవు వెళ్ళి నా తరఫున మాట్లాడు" అన్నారు. "నేనా! నేను మాట్లాడను' అన్నాను. "నువ్వు అక్కడకు వెళ్ళు. ప్రశాంతంగా కూర్చుని దృష్టిని కేంద్రీకరించు. నువ్వు ఏమి మాట్లాడాలో నీకే తెలుస్తుంది. నువ్వు వెళ్ళి చెప్పినట్లు చెయ్యి, నీవే గమనిస్తావు" అని పలికారు. అప్పుడు (నవ్వుతూ) నేను వారు చెప్పినట్లే చేసాను. అక్కడ ముప్పై లేదా నలభై మంది ఉన్నారు. నేను

అక్కడకు వెళ్లి వారి మధ్యలో కూర్చున్నాను. చాలా స్థిరంగా, ప్రశాంతంగా కూర్చున్నాను. నేను అలా కూర్చుండగానే, ఎటువంటి ఆలోచనా లేకుండా, ఏమీ లేకుండా అకస్మాత్తుగా నేను మాట్లాడటం ప్రారంభించాను. వారితో నేను అరగంట సేపు మాట్లాడాను. (వారికి ఏమి చెప్పానో కూడా నాకు తెలియదు) సంభాషణ పూర్తయిన వెంటనే అక్కడున్న ప్రతీ ఒక్కరూ చాలా సంతోషించారు. నేను అబ్దుల్ బహా దగ్గరకు వెళ్లినప్పుడు "నువ్వు చాలా బాగా మాట్లాడావు" అన్నారు. "అది నేను కాదని'; సమాధాన మిచ్చాను. ఆ రోజు నుండి (వారి నుండి నేను ఆ ప్రావీణ్యతను పొందాను, మీకు అర్థవయ్యియ్యింది కదా!) నేను ఆ విధంగా ప్రశాంతంగా కూర్చునేదానిని, ప్రతీ విషయం తెలియవచ్చేది. ప్రత్యేకించి 'నేను' అనే భావన నశించాలి, ప్రతీ విషయంలో అదే అద్భుత కళ, ప్రతీ విషయంలో, మీరు ఏమి చేస్తున్నా: చిత్రకళ, (నేను చిత్రలేఖనం, శిల్పకళ, వాస్తుకళ నేర్చుకున్నాను. సంగీతం కూడా తెలుసు.) ప్రతీ విషయంలో దేనికోసమైనా 'నేను' అనే భావనను తొలగించ గలిగితే... ఆ విషయంలో పరిజ్ఞానం (శిల్పకళ, చిత్రకళ మొదలైనవి)... అవి ప్రాణులే అయి ఉండవలసిన అవసరం లేదు, వాటి చైతన్యం ద్వారా పనిచేస్తుంది.

అలాగే, భాష విషయంలో కూడా అదే విధంగా జరుగుతుందని నేను అనుకుంటున్నాను. ప్రతీ ఒక్కరూ మరియొకదానితో ఆ విధంగా మమేకమవ్వాలి లేదా ఆ మరియొకదాని సహాయంతో ఇంకా ఉన్నతమైన స్థితికి, మూలానికి చేరాలి. అప్పుడు ఇంకా, ఇంకా సాత్త్వికత ఏర్పడుతుంది. జడమైన సాత్త్వికత కాదు; ఉత్తేజపూరితమైన సాత్త్వికత, గ్రహణశీలత ఆ విధంగా, శ్రద్ధ ద్వారా 'అది' ప్రవేశిస్తుంది మరియు వ్యక్తమౌతుంది. ఫలితాలు మీరే గమనించవచ్చు. నేను చెప్పినట్లు, మనకు తెలిసిన దానితోనే మనము పరిమితమై ఉన్నాము. అయితే మనము ఇంకా 'ప్రత్యేక వ్యక్తి' గా ఉండటమే దానికి కారణమై ఉండొచ్చు. మనము సంపూర్ణంగా, సరళంగా ఉన్నట్లయితే అప్పుడు వేరే విధంగా ఉంటుంది. మనుష్యులు వారికి అర్థం కాని భాషలో మాట్లాడేటటువంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అందువలన...

ప్రతీ దానితో పాటు, చైతన్యానికి సంబంధించి అత్యంత కీలకమైన రహస్యం... చైతన్యం... అపరిమితమైన చైతన్యంగా మారడమే. అప్పుడు దీనిని (వాహ

కాన్ని క్రియాశీలంగా అది తీర్చిదిద్దుతుంది. తరువాత, క్రమేణా — రూపాంతరీకరణ పూర్తయిన పిమ్మట, దాని సంపూర్ణ ప్రభావంతో చైతన్యం సమ్మిళితమైపోవచ్చు. కానీ ఇప్పుడు అది సమర్పణ, ఆత్మార్పణ మాత్రమే. చైతన్యం వినియోగించుకునేందుకు ఉత్సాహాన్ని, ఆనందాన్ని అది అందిస్తుంది. అది ఆలా ఉన్నప్పుడు, అంతా మంచిగానే జరుగుతుంది.

The Mother; Converstion with a disciple, February 18, 1967

రాజయోగం; గీత

నేను ఈ రోజు ఎవరి గురించి మాట్లాడుతున్నానో అతను నాకు తెలియదు. ఈ రోజు వరకు నాకు తెలియదు. అతనికి 18 సంవత్సరాల వయస్సు ఉంటుందని ఎవరో నాకు చెప్పారు. 18 మరియు 20 సం.ల మధ్య దైవంతో స్థిరమైన, చైతన్యవంతమైన కలయికను నేను పొందినట్లు తెలిపాను దీని నంతటినీ నేను ఒంటరిగానే సాధించాను. ఎవరి సహాయం లేకుండా, పుస్తకాల సహాయం కూడా లేదు. కొంతకాలం తరువాత వివేకానందుని రాజయోగం నాకు దొరికింది. అది చదువుతుంటే ఎవరో నాకు ఏదో వివరిస్తున్నంత అద్భుతంగా అనిపించింది. సాధారణంగా ఎన్నో సంవత్సరాలు పట్టేది నేను కొన్ని నెలలలోనే గ్రహించేందుకు అది తోడ్పడింది.

యూరప్ వచ్చిన ఒక భారతీయుడిని నేను కలిసాను. (అప్పటికి నా వయస్సు 20 లేదా 21 ఉంటుంది.) అతనే నాకు గీత గురించి తెలిపాడు. దానిని ఫ్రెంచ్ అనువాదం కూడా ఉంది. (అది సరిగా లేదని నేను చెప్పగలను.) దాని చదవమని అతను చెప్పాడు. (గీతకు ఈ అనువాదం అంత మంచిగా లేదు. కానీ ఆ సమయంలో అది ఒకటే లభించేది. ఆ రోజుల్లో ఇతర భాషలలో దేనినీ నేను అర్థం చేసుకోలేకపోయేదాన్ని. అంతే కాకుండా ఆంగ్ల అనువాదాలు కూడా మంచిగా ఉండేవి కావు. అయితే శ్రీఅరవిందులు ఇంకా ఆ పనికి పూనుకొనలేదు) సర్వాంతర్యామి అయిన భగవంతునికి, అంతర్యామి అయిన భగవంతునికి కృష్ణుడు ప్రతీకని తెలుసుకొని గీతను చదవమని అతను చెప్పాడు, "ఆ విధమైన జ్ఞానంతో దానిని చదవండి. ఆ జ్ఞానంతోనే సర్వాంతర్యామిగా, అంతర్యామిగా కృష్ణుడు దర్శన

మిస్తాడు". అదంతా ఒక నెలలోనే జరిగింది.

The Mother; Converstion with a disciple, August 25, 1954

అనువాదం: హోతా ఈశ్వరకృష్ణ (9866757576)

అల్జీరియా

శ్రీమతి, శ్రీ థియోన్

అతడికి రెండు పేర్లు ఉండేవి. ఒకటి అరబిక్ పేరు. ఆల్జీరియాలో ఆశ్రయం తీసుకున్నప్పుడు (మరి ఎందుచేతనో తెలియదు) ఆ పేరు స్వీకరించాడు. బ్లవాట్స్కీ తో పనిచేశాక, ఈజిప్టులో ఒక గూఢ విద్యా సదస్సును స్థాపించాక, ఆల్జీరియా వెళ్లిపోయి అక్కడ 'అలా అజీచ్' (అరబిక్ మూలాలు గల ఆ పదానికి 'ప్రియతముడు' అనే అర్థం వుందిరి) అనే పేరుని స్వీకరించాడు. ఆ తరువాత తన 'విశ్వసమీక్ష' (Cosmic Review) మరియు విశ్వబృందం (Cosmic group) మొ దలైనవి స్థాపించడం మొదలెట్టాక తనని తాను మాక్స్ థియాన్ అని పిలుచుకోవడం మొదలెట్టాడు. పరమ దైవం అని, దేవదేవుడు అని ఆ పేరుకి అర్థం. ఈ రెండు పేర్లు తప్ప మరే ఇతర పేరుతోను అతణ్ణి ఎవరూ పిలువరు.

అతని భార్య ఆంగ్లేయ స్త్రీ.

భారతదేశంలో అతడు మొట్టమొదట దీక్ష పొందాడని అంటారు. (అతడికి కొంచెం సంస్కృతం కూడా తెలుసు, ఋగ్వేదం క్షుణ్ణంగా చదివాడు.) తరువాత 'విశ్వ సాంప్రదాయం' (Cosmic Tradition) అనే పేరుతో ఒక సాంప్రదాయాన్ని మొదలెట్టాడు. కబాలా కన్నా, వేదాల కన్నా ప్రాచీనమైన ఒక సాంప్రదాయం నుండి ఈ సాంప్రదాయం అతడికి వరప్రసాదంలా దొరికిందని చెప్పుకుంటాడు. (ఆ వరప్రసాదం ఎలా జరిగిందో మరి తెలియదు.) అయితే నేను చాలా విషయాలు చూశాను. (శ్రీమతి థియాన్‌కి దివ్యదృష్టి ఉండేది. ఆమెకి దర్శనాలు కలిగేవి. అబ్బ, ఆవిడ నిజంగా చాలా గొప్పది!) వాళ్ళు నాకు తెలియక ముందే నాకు తెలిసిన ఎన్నో విషయాలని బట్టి కొన్ని సంగతులు రూఢి అయ్యాయి.

కాబట్టి ఆ రెండు సాంప్రదాయాల కన్నా ప్రాచీనమైన సాంప్రదాయం ఒకటి ఉందని, సమగ్ర జ్ఞానానికి (Integral Knowledge) అది చాలా సన్నిహితంగా

వస్తుందని, వ్యక్తిగతంగా నేను నమ్ముతున్నాను. అనుభవాలలో అయితే తప్ప కుండా పోలిక వుంది. నేను ఇక్కడికి వచ్చిన తరువాత, గూఢవిద్యా నేపథ్యం బట్టి నాకు తెలిసిన కొన్ని విషయాలు శ్రీఅరబిందోకి విన్నవించుకున్నప్పుడు, అవి వైదిక సాంప్రదాయాలతో పూర్తిగా సరిపోతున్నాయని అనేవారు. ఇక కొన్ని గూఢవిద్యా విధానాల గురించి అయితే అనవీ్న పూర్తిగా తంత్రవిద్యకి సంబంధించినవి అనేవారు. కాని అప్పటికి నాకు ఏమీ తెలియదు. వేదాల గురించి గాని, తంత్రవిద్య గురించి గాని ఏమీ తెలియదు.

The Mother; Converstion with a disciple, November 4, 1958

నాకు ఎప్పుడూ భయం వెయ్యదు

థియోన్‌కి బ్రహ్మాండమైన శక్తి ఉండేది.... ఆ రోజు తుఫాను వాతావరణం నెలకొంది (అక్కడ తరచుగా తుఫానులు వచ్చేవి). ముందు గది మీద ఉన్న ఎత్తయిన మేడ మీదకి ఎక్కాడు. "ఈ సమయంలో అలా పైకి ఎక్కడం మంచిది కాదేమో," అన్నాన్నేను. అతడు నవ్వాడు "ఏం ఫరవాలేదు, నువ్వు కూడా రా," అన్నాడు. అప్పుడు నేను కూడా పైకి వెళ్ళాను. అప్పుడేవో మంత్రాలు చదివాడు. అంతలో మా వైపుగా దూసుకు వస్తున్న ఓ మెరుపు ఉన్నట్లుండి దారిమధ్యలో పక్కకి మళ్లడం స్పష్టంగా చూశాను. నువ్వు అసంభవం అనుకుంటావేమో గాని ఆ మెరుపు పక్కకి తిరిగి దూరాన ఉన్న ఒ చెట్టు మీద పడడం చూశాను. "అది చేసింది మీరేనా?" అని అడిగాను. అతను తలూపాడు.

అబ్బా! ఆ మనిషి భయంకరుడు! అతడికి భయంకరమైన శక్తి ఉండేది! బయటకి చూడడానికి మాత్రం బాగానే ఉండేవాడు.

అతని ఫొటో ఎప్పుడైనా చూశావా? లేదా? నీకు ఈ సారి చూపిస్తాను. చాలా బావుంటాడు — అరవై ఏళ్లవాడు. యాభైకి, అరవైకి మధ్య ఉంటాయేమో.

నేను అతడి దగ్గరకు మొట్టమొదటి సారి వెళ్లినప్పుడు నన్ను ఎలా స్వాగతించాడో తెలుసా?... నేను ఒంటరిగా ప్రయాణించడం అదే మొదటిసారి. మొట్టమొదటి సారి మధ్యధరా సముద్రం దాటి ప్రయాణించాను. ఆ తర్వాత ఓరాన్‌కి, త్లెమ్సెన్‌కి మధ్య సుదీర్ఘమైన రైలు ప్రయాణం. అంతవరకు అంతా సవ్యంగానే సాగింది. అక్కడికి చేరుకున్నాను. అతను స్టేషన్‌కి వచ్చాడు. అతడి కార్లో వాళ్లు

ఉండే చోటికి బయల్దేరాం. ఆ ప్రదేశం కొంచెం దూరమే. మొత్తం మీద అతడి ఎస్టేటు చేరుకున్నాం. చాలా చక్కని ఎస్టేటు అది! కొండవాలు మీద విస్తరించిన ఆ ఎస్టేటు నుండి చూస్తే మొత్తం త్లెమ్సేన్ లోయ అంతా కనిపిస్తుంది! మేము కొండ దిగువ నుండి బయల్దేరి కొన్ని విశాలమైన దారుల వెంట పైకి ఎక్కడం మొదలెట్టాం. నేను ఏమీ మాట్లాడకుండా నడుస్తున్నాను. కేవలం స్థూలదృష్టితో చూస్తే అవి చాలా మనోహమైన భౌతిక పరిసరాలు. ఎంతో హాయి కలిగించిన అనుభూతి. కొంతసేపు నడిచాక అల్లంత దూరంలో ఇల్లు కనిపించింది. అతడు ఆగి అన్నాడు, "అదుగో నా ఇల్లు." అది ఎరుపు రంగులో ఉంది! అంతా ఎర్రని రంగు పూసి వుంది! అప్పుడు అతడు ఇంకా ఇలా అన్నాడు. "బార్లీ ఇక్కడికి వచ్చినప్పుడు 'ఎందుకు నీ ఇంటికి ఎర్ర రంగు వేసుకున్నావు!' అని అడిగాడు." (బార్లీ ఒక గూఢ విద్యావేత్త. ఫ్రెంచ్ వాడు. థియోన్‌ని ఫ్రాన్స్‌కి పరిచయం చేసినవాడు. అతడు థియోన్‌కి మొదటి శిష్యుడు.) అతడి కళ్లల్లో ఒక కపటమైన జిలుగు కనిపించింది. వ్యంగ్యంగా ఇలా అన్నాడు, "అప్పుడు నేను బార్లీతో, 'ఎరుపుకి, ఆకుపచ్చకి సరిగ్గా సరిపోతుంది కనుక' అన్నాను." దాంతో ఆ పెద్దమనిషి మనస్తత్వం అర్థం కావడం మొదలయ్యింది.... మేం అలా కొండవాలు వెంట నడుస్తూ ఉంటే, అతడు ఉన్నట్లుండి వెనక్కి తిరిగి, నా ఎదుట స్థిరంగా నిలబడి అడిగాను "ఇప్పుడు నువ్వు నా దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి వున్నావు. నీకు భయం వెయ్యడం లేదా?" నేను అతడి వైపు చూసి, చిరునవ్వు నవ్వి అన్నాను – "నాకు ఎప్పుడూ భయం వెయ్యదు. నా హృదయంలో దైవం ఉన్నాడు."(శ్రీమాత తన హృదయాన్ని తాకుతుంది.) అతడి ముఖం వెలవెలబోయింది.

The Mother; Converstion with a disciple, February 4, 1961

పైన్ చెట్టు కథ

ఈ పైన్ చెట్టు వృత్తాంతం కూడా త్లెమ్సేన్‌లో జరిగినదే.

ఎవరో పైన్ చెట్లు నాటాలని అనుకున్నారు. స్కాచ్ ఫర్ చెట్లు అనుకుంటా. కాని పొరపాటున నార్వే స్ప్రూస్ చెట్లు పంపారు. ఇక మంచు కురవడం మొదలుపెట్టింది. అక్కడ మునుపు ఎన్నడూ మంచు కురవలేదు తెలుసా? సహారా ఎడారి నుండి కేవలం కొద్ది కిలోమీటర్ల దూరంలో వుందా ప్రదేశం. ఎండాకాలంలో

అయితే ఎండలోను, నీడలోను కూడా సలసల కాలిపోతుంటుంది! ఒక రోజు రాత్రి శ్రీమతి థియాన్ నిద్రపోతోంది. ఒక చిన్న నోమ్ (gnome) వంటి విచిత్ర జీవి చేసిన అలికిడికి ఆమెకి తెలివి వచ్చింది. అది నార్వేకి చెందిన నోమ్. కూసు టోపితో, కూసు చెప్పులతో ఆమె పాదాల దగ్గర ప్రత్యక్షమయ్యాడు! తల నుండి పాదాల దాక మంచుతో కప్పబడి వున్నాడు. మంచు కరిగి నేలంతా తడవడం మొదలెట్టింది. అది చూసి ఆమె వాడి మీద కళ్లెర్ర జేస్తూ ఇలా అంది —

"ఏయ్! ఏం చేస్తున్నా విక్కడ? తడిసి ముద్దయ్యి వున్నావు. నా నేలంతా పాడు చేస్తున్నావు!"

"ఈ పర్వతం వద్దకి మమ్మల్ని పిలిచారు. అందుకే వచ్చాము మేము. అది చెప్పడానికి వచ్చాను," అన్నాడు వాడు.

"ఇంతకీ ఎవరు నువ్వు?"

"నేను మంచు దేవతని."

"సరే బావుంది," అంది శ్రీమతి థియాన్. "విషయం ఏంటో నేను లేచాక చూస్తాను. ఇప్పటికి నువ్విక వెళ్లొచ్చు. నా గదంతా పాడు చేస్తున్నావు."

అప్పుడా చిట్టి నోమ్ వెళ్లిపోయాడు. కిటికీ వద్దకు వెళ్లి బయటికి చూస్తే చుట్టూ కొండలు హిమావృతమై ఉన్నాయి!

అదే మొదటిసారి. అక్కడ వాళ్లు ఏళ్ళుగా ఉంటున్నారు. కాని ఎప్పుడూ మంచు కురవలేదు. అప్పటి నుండి ప్రతీ శీతాకాలం కొండ వాలు మీద మంచు కురవడం జరుగుతోంది.

కాబట్టి మనుషులు గూఢచైతన్యంలో ఉన్నప్పుడు ఏదైనా సంభవమే — అ లాంటి వాతావరణంలో ఏదైనా, ఏదైనా సాధ్యమే.

మన సామాన్య యూరోపియన్ దృక్పథంతో చూసినప్పుడు అసంభవం అని పించేది అంతా... సంభవమే.

The Mother; Converstion with a disciple, February 4, 1961

పన్నెండు శరీరాలు — అమలిన శ్వేతకాంతి

శ్రీ మరియు శ్రీమతి థియాన్‌లు ఇది కూడా అంటూ ఉండేవారు. వాళ్లు ఎప్పుడూ 'సూపర్ మైండ్' (Supermind, అతిమనస్సు) గురించి మాట్లాడ

లేదు కాని వేదాల్లో చెప్పిందే వాళ్లూ చెప్పారు. సత్యం భూమి మీద అవతరించి నవ్యప్రపంచాన్ని సృజించాలని అన్నారు. బైబిలు ప్రవచనం నుండి ఒక పాత వాక్యాన్ని తీసుకున్నారు కూడా 'నవ్య దివి, నవ్య భువి.' వేదాలు చెప్పింది కూడా అదే. శ్రీమతి థియాన్‌కి ఆ అనుభవం ఉండేది. అది ఎలా సాధ్యమో ఆ విషయం గురించి నాకొక సూచన ఇచ్చింది అంతే. (అయితే నాకా విషయం ఆమె వివరంగా బోధించలేదు). ఆమె తన శరీరంలో నుండి బయటికి వెళ్లి ప్రాణప్రపంచం గురించిన అనుభూతి పొందేది. (మనకి శోధించే ఓపిక ఉండాలే గాని ఆ మధ్యన ఎన్నో మధ్యంతర దశలు కూడా ఉన్నాయి). ప్రాణతలం తరువాత మనోతలం వస్తుంది. ప్రాణశరీరాన్ని వదిలి (దాన్ని చూడొచ్చు కూడా) మనోప్రపంచంలోకి ప్రవేశించాలి. ఆ తరువాత మనోశరీరాన్ని వదిలి మరో తలంలోకి... వాటిని వేరే పరిభాషతో పిలిచేవారు. వేరే వర్గీకరణ ఉండేది. కాని అనుభూతి ఒక్కటే ఆ విధంగా ఆమె వరుసగా పన్నెండు శరీరాలని ఒకదాని తరువాత ఒకటిగా వదిలి వెళ్లగలిగేది. ఆమె చాలా పరిపక్వత గల మనిషి. గొప్ప ఆత్మవ్యక్తీకరణ, ఆంతరిక వ్యవస్థీకరణ గలది. ఒక శరీరాన్ని వదిలి మరో తలానికి చెందిన చైతన్యంలోకి ప్రవేశించ గలిగేది. అక్కడ ఉన్న విషయాలని అన్నీ అనుభూతి చెందేది. అలా వరుసగా పన్నెండు సార్లు.

నేను కూడా అదెలా చెయ్యాలో నేర్చుకున్నాను. ఎంతో కౌశలాన్ని సంపాదించాను! ఏ తలంలోనైనా ఆగి, అక్కడ పని చెయ్యవల్సినది చేసి, అక్కడ స్వేచ్ఛగా సంచరించి, చూసి, పరిశీలించి, చూసినదాన్ని మౌఖికంగా ప్రకటించేదాన్ని. ఆ క్రమంలో చరమ దశకే థియాన్ 'పథెటిస్మ్' అని పేరు పెట్టాడు. అది వికారమైన పేరే గాని, అర్థవంతమైన పేరు. దాని అర్థం చూచాయిగా 'నిరాకారం' అని వస్తుంది. అతడు కొన్ని సార్లు యూదు మతానికి చెందిన పరిభాషని వాడేవాడు. ఆ పరిభాష ప్రకారం పరమాత్మని 'నిరాకారుడు' అని పిలిచేవాడు. (ఆ చరమ దశ నుండి నిరాకారం లోకి ప్రవేశించినప్పుడు ఇక వదిలి వెళ్లడానికి ఏ శరీరమూ ఉండదు. అది రూపాలకి అతీతమైన స్థితి, భావ రూపాలకి కూడా అతీతమైనది.) ఆ తలంలో (నిరాకారానికి ముందు వచ్చే ఆఖరు తలం) సంపూర్ణమైన ఏకత్వం అనుభవం అవుతుంది — ఆ ఏకత్వపు సారంలో ప్రేమ అనుభవం అవుతుంది; ఆ 'తత్' యొక్క మరింత సాంద్రమైన అభివ్యక్తీకరణే ప్రేమ. తత్ అంటే సంపూర్ణ

ఏకత్వపు భావన, — ఏకత్వం, అనన్యత — దిగువ ప్రపంచాలలో ఉండే రూపాలేవీ అక్కడ ఉండవు. అది తేజం!... అమలిన శ్వేత కాంతి. అయితే అందులో బంగరు గులాబి వన్నె కూడా కనిపిస్తుంది (పదాలు కరుకైనవి సుమా). ఆ కాంతి, ఆ అనుభవం నిజంగా అత్యద్భుతమైనవి. మాటలకి అతీతమైనవి.

Novembber 7, 1961

అతిమానస రూప, మౌలిక నమూనా

సరే, ఒకసారి నేనక్కడ ఉన్నాను, (ఈ పరిధిని దాటి ఆవలకు పోకూడదని, పోతే అక్కడి నుండి తిరిగి రాలేనని థియోను నన్నెప్పుడూ హెచ్చరించేవాడు) కానీ, అక్కడికి చేరుకున్నాను, ఆవలకు దాటాలనే కోరికతో — అది అనూహ్యామైన, ఆశ్చర్యకరమైన విధంగా జరిగింది — నాకుగా నేను 'ప్రధాన తత్వం', మానవాకృతి మౌలిక సూత్రం సన్నిధిలో వున్నాను. మనిషిని మనం మామూలుగా చూడటానికి అలవాటు పడిన విధంగా అది లేదు, కానీ అది ఒక నిటారుగా నిలుచున్న ఆకారం, దాదాపుగా సాకార, నిరాకారాల అంచుల మధ్య ఒక ఆధారభూతమైన ప్రమాణంగా నుండింది. అప్పటి వరకు దానిని గురించి ఎవరూ నా వద్ద ప్రస్తావించ లేదు. మేడమ్ థియోను సైతం దానిని ఎప్పుడూ చూడ లేదు — ఎవరూ, ఎప్పుడూ దానిని దర్శించలేదు. కానీ నేను మాత్రం ఏదో ఒక రహస్యాన్ని కనుగొన బోతున్నటువంటి అనుభూతికి లోనయ్యాను.

తరువాత నేను శ్రీఅరవిందులను కలుసుకొని దానిని గురించి ప్రస్తావించినప్పుడు వారు అన్నారు, "అది తప్పక అతిమానస ప్రధాన తత్వపు నమూనా", అని. అటు పిమ్మట అనేక మార్లు నేను దానిని చూచాను. వారన్నది సత్యమేనని రుజువయింది.

కానీ సహజంగానే, నీ కర్థమవుతుందా, ఒక్కసారి సరిహద్దు దాటినట్లయితే, అటు పైన 'ఆరోహణ' గాని 'అవరోహణ' గాని ఉండవు. ప్రారంభంలోనే, పృథ్వీ చేతనను వదిలి ఉన్నతతర మానససీమలోకి ఎదుగుతున్న సమయంలో మాత్రమే పైకి ఎగుర్తున్నటు వంటి అనుభూతి ఉంటుంది. కానీ ఒకసారి ఆ పరిధిని అధిగమించితే ఎగురుతున్నటు వంటి అనుభూతి ఉండదు. దాని బదులు ఒక విధమైన అంతర్గత పరివర్తన కలుగుతున్న భావన ఏర్పడుతుంది.

ఇక అక్కడి నుండి నేను తిరిగి దిగిరావడం ప్రారంభించాను. నా శరీరాల లోకి, ఒకదాని తరువాత ఒకదాని లోకి, పునః ప్రవేశించాను. పునః ప్రవేశిస్తున్నటు వంటి వాస్తవానుభూతి కలిగింది. అది వాస్తవమైన రాపిడిని కలుగజేస్తుంది.

ఆ ఉన్నతోన్నతమైన ఎత్తుకు చేరినపుడు శరీరం ఒక అపస్మారక స్థితికి చేరు కొంటుంది.

నేనీ ప్రయోగాన్ని 1904 లో చేసా ననుకుంటాను. కాబట్టి, ఇక్కడికి చేరి నప్పుడు అదంతా పూర్తిగా అదివరకే సాధించబడినదిగా, అదంతా బాగా తెలిసి వున్న పరగణాగా అయ్యింది. దివ్యమానసాన్ని కనుగొనే ప్రశ్న తలెత్తినప్పుడు అ ది నాకు అలవాటైన అనుభవాన్ని పునః ప్రారంభించడంగానే ఉండింది. ఒకదాని తర్వాత మరొకటిగా అమూర్తస్థితుల నుండి బయటపడుతూ, సంకల్పించి చేయ డం తిరిగి నేర్చుకొన్నాను. అది బుద్ధిపూర్వకంగా సాగిన ప్రక్రియ.

The Mother: Conversation with a disciple, November 7, 1961

నిశ్చేతన లోనికి, అంతర్యామి భగవంతుని దగ్గరకు అవరోహణ

అది మొదటిసారి కాదు. నేను రెండవ మారు ట్లిమ్‌సెన్‌లో థియోనుతో పనిచేస్తున్నప్పుడు, నేను సంపూర్ణమైన, ఎలాంటి వ్యక్తిగత ప్రత్యేకత లేనటువంటి — అనగా సర్వ సాధారణమైన — నిశ్చేతన లోనికి దిగాను. (నన్ను ప్రాణ మహామంత్రాన్ని కనుగొనమని అతడు కోరిన సమయం అది). అక్కడ అకస్మా త్తుగా నన్ను నేను ఒక భూగృహం లేక గుహ లాంటి దాని ముందున్నట్టుగా కనుగొన్నాను, (అయితే అది 'అలాంటి' దేదో మాత్రమే). అది తెరుచుకోగానే ఇంద్రధనుస్సు లాంటి రంగు రంగుల కాంతు లీనుతున్న తన తల క్రింద చేతిని పెట్టుకొని అర్ధశయనుడై, గాఢ నిద్రలో మునగి ఉన్న దివ్యపురుషుడిని చూసాను. అతన్ని అలముకొని వున్న కాంతి ఇంద్రధనుస్సు రంగు అవుతుండింది. నేను ఏమి చూస్తున్నానో దానిని థియోనుగారికి తెలియచేసినప్పుడు, "అది నిశ్చేతన లోతుల్లో వున్న అంతర్యామి దైవం" తన కాంతి ప్రసరణల ద్వారా నిశ్చేతనను దివ్యచేతనలోనిక మేల్కొల్పుతున్నాడని అన్నాడు.

కానీ, అప్పుడే, ఒక విధంగా చెప్పుకోదగిన విశేషం జరిగింది. నేనతడి వంక

చూడగానే అతడు మేల్కొని కళ్ళు తెరిచాడు. అది చేతనాపూర్వక జాగ్రదావస్థ చర్యను వ్యక్తపరచడంలా ఉండింది.

నాకు నిశ్చేతన లోకి అవరోహించిన అనుభవం అనేక మార్లు కలిగింది. (నీకు జ్ఞాపకముందా, అది జరిగిన ఒక రోజున నీ పక్కడ ఉన్నావు — అది దివ్య ప్రేమకు సంబంధించిన విషయం) అసత్తు అట్టడుగు భాగానికి దిగివచ్చి అక్కడ దివ్యచేతనను, దైవసాన్నిధ్యాన్ని ఏదో ఒక రూపంలో కనుగొన్న అనుభవం అది. అది అతి తరచుగా జరుగుతుండేది.

The Mother: Ccovnerstion with a disciple, November 7, 1961

ప్రాణికం ద్వారా ఒక మార్గాన్ని ఏర్పరచడం

ఈ విషయాలు అత్యాసక్తికరంగా నుంటాయి. నేను భువి పైకి ఏ కార్యనిర్వహణార్థం విచ్చేసానో దానిలో అవి భాగం కావాలి. ఎందుకనగా థియోను మహాశయుణ్ణి కలుసుకొనక పూర్వమే, ఏదీ తెలుసుకొనక పూర్వమే, రాత్రుళ్ళు నాకు అనుభవాలు కలిగేవి — శరీరాలను వదలి వెళ్తున్న మనుషులకు సంబంధించిన కొన్ని రకాల కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నటువంటి అనుభవాలు అవి — ఆ ప్రక్రియను గురించి పూర్తి అవగాహన కలిగిన స్థితిలో, నేనేమి చేస్తున్నానో నాకు తెలిసేది కాదు, తెలుసుకొనే ప్రయత్నం కూడా నేను చేయలేదు. అయినప్పటికి చేయవలసిందేమిటో నాకు తెలిసేది. అది చేసేదాన్ని. అప్పుడు నాకు షుమారు ఇరవై ఏళ్ళుండవచ్చు.

నాకు థియోను బోధనలతో పరిచయం ఏర్పడిన వెంటనే (అతడిని వ్యక్తిగతంగా కలుసుకోక మునుపే) ఇతః పూర్వం నేను చదవని, తెలియని ఎన్నో విషయాలను గురించి నేను ఒక పద్ధతి ప్రకారం పనిచేయడం ప్రారంభించాను. ప్రతి రాత్రి, అదే సమయంలో, పూర్తిగా ఇహలోక సంబంధమైన వాతావరణానికి మానసిక సంబంధమైన వాతావరణానికి మధ్య ప్రాణికం ద్వారా సాగే టప్పుడు రక్షణగా నుండే విధంగా ఒక మార్గాన్ని నిర్మించడానికి కృషి సల్పాను. (ఎవరికైతే ఎరుక ఉన్నప్పటికీ దాయడానికి తగినంత తెలివితేటలు లేనివారికి అది కష్టసాధ్యమైన మార్గం — అనుమానాస్పదమైనది). ఆ మార్గాన్ని తయారుచేస్తూ (బహుశా అది 1903 లేదా 1904 ప్రాంతం, కచ్చితంగా జ్ఞాపకము లేదు)

నెలల తరబడి గడిపాను. రకరకాల అసాధారణ సంఘటనలు ఆ కాలంలో సంభ వించాయి — అత్యంత అసాధారణమైనవి. వాటిని గురించి పెద్ద పెద్ద కథలను చెప్పగలను....

అప్పుడు, నేను ట్లమ్‌సెన్‌కు వళ్ళినప్పుడు, నేను మేడమ్ థియోన్‌కు వాటిని గురించి చెప్పాను. "అవును. నీవు ఏ కార్యార్థమై ఈ భువి పైకి విచ్చేసావో అం దులో భాగం అవి. ఏమాత్రమైనా జాగృతమైన మానసిక అస్తిత్వం గల యెవరు నీ కాంతిని చూడగలుగుతారో వారు వారి మరణకాలమందు ఆ దివ్యకాంతి దిశగా తరలి వస్తారు — వారెక్కడనైనా మరణించనీ — మరణావస్థను దాటడానికి వారికి నీవు సహాయపడ్తావు." ఈ పని స్థిరంగా కొనసాగుతుంది. నిరంతరం. మనుషులు వారి శరీరాలను త్యజించిన తదుపరి ఏమి జరుగుతుందనే విషయాలను గురించి నాకు గణనీయమైన అనుభవాలు కలిగాయి. ఎన్నో రకాల అనుభవాలు, ఎన్నో రకాల దృష్టాంతాలు — అది చాలా ఆసక్తిదాయకంగా నుండింది.

The Mother: Conversation with a disciple, May 17, 1969

ఎరుక గల సమాధి స్థితి

కానీ నాకు స్వయంగా అది పారవశ్యక స్థితిలో సిద్ధించ లేదు, శ్రీఅరవిందు లకు కూడా — మా ఇద్దరిలో ఎవరికీ, ఎప్పుడూ పారవశ్య స్థితి కలుగలేదు! ఎ లాంటి పారవశ్య స్థితి అనగా శరీరంతో సంబంధం కోల్పోయే స్థితి అని అర్థం. వారు ఎప్పుడూ అదే చెప్పేవారు. మేము కలిసినప్పుడు నేను మొట్టమొదట వారికి చెప్పే విషయాలలో ఒకటి ఏమిటనగా, "సరే, ప్రతివారు పారవశ్య స్థితి, సమాధి స్థితి లాంటి వాటిని గురించి మాట్లాడుతారు, కానీ నా కెప్పుడూ అవి సిద్ధిం చ లేదు! నేనెప్పుడూ చైతన్యాన్ని కోల్పోలేదు". వారి సమాధానం, "ఆహా, నాకూ సరిగ్గా అలాగే జరుగుతుంది!"

అది పరిణామ స్థాయిపై ఆధారపడి ఉంటుందని థియోను చెప్పేవారు. "ఒక రు పారవశ్య స్థితిలోకి ఎప్పుడు చేరుకుంటారంటే, కొన్ని సంబంధాలు తప్పి పోయినప్పుడు మాత్రమే", వారు మనుషులను ఏ విధంగా పరిగణించేవారు. "ఒక వేళ నీకు వృద్ధి చెందనటువంటి మధ్యంతర దశ కలిగినట్లయితే, నీకు ఎరు క లేనటువంటి దశ, ఎందుకనగా అది వ్యక్తిగతమైన ప్రత్యేకత లేనిది కాబట్టి, దాని

ని దాటినప్పుడు నీవు సమాధి స్థితిలో నుంటావు". సమాధి స్థితి వ్యక్తిగతమైన ప్రత్యేకత లేని స్థితికి సంకేతం — చైతన్యం జాగృతం కాకపోవడంతో శరీరం సమాధిస్థితి లోకి జారుకుంటుంది.

The Mother: Conversation with a disciple, November 7, 1961

అనువాదం: అందుగులపాటి కైలాసపతి (040 24240669)

రూపపు చేతన

దహనకాండ జరిపించే తొందరలో కొన్ని సార్లు మృతులను సజీవంగా దహనం చేయటం జరుగుతుంది. వాళ్ళు కొంత సేపు నిరీక్షించాలి.

ఎందుకంటే రూపానికి ఒక చేతన ఉంటుంది, రూపానికి ఒక ప్రాణం ఉంటుంది. కణాలు ధరించిన రూపంలో ఒక చేతన ఉంటుంది. అది బయటకు రావటానికి ఏడు రోజులు పడతుంది. అందుకనే దహనక్రియ జరిపేటపుడు ఒక్కొక్కసారి శరీరం అకస్మాత్తుగా కదులుతుంది. జనులు అవి యాంత్రికమయిన కదలికలు అంటారు. నాకు తెలుసు అవి కాదని.

రూపచేతన ఉంటుందని నాకు తెలుసు. ఎందుకంటె నేను స్వయంగా, అనుభవపూర్వకంగా దాని నుండి బయట పడ్డాను కనుక. ఒకసారి చాలా కాలం క్రితం నేను ప్రాణరహిత స్థితిలో ఉన్నాను. కొంత సేపయిన తర్వాత, యింకా అదే స్థితిలో ఉండగా శరీరం తిరిగి సజీవం కావటం ప్రారంభించింది. అంటే మాట్లాడటం, కదలటం మొదలు పెట్టింది. (నాకు ఈ శిక్షణ నిచ్చింది థియోన్) శరీరం పైకి లేచి నడవటం, కదలటం చేసింది కానీ అప్పటికే అందులోంచి అన్నీ బయటకు వెళ్ళిపోయాయి.

అన్నీ బయటకు వెళ్ళగానే సహజంగా శరీరం చల్లబడిపోతుంది, కానీ శరీర చేతన కొంత శక్తిని చుట్టూ ఉన్న గాలి నుండి తీసుకో గలుగుతుంది దాని నుండో దేని నుండో. ఆ స్థితిలో నేను మాట్లాడాను. నేను చక్కగా మాట్లాడాను. అంతే కాకుండా వేరే చోట చూస్తున్నదంతా చెప్పగలిగాను.

అందుకే నాకు మనుషులను దహనం చేయటం అంతగా నచ్చదు.

ఇక్కడ అలా చేస్తారు ఎందుకంటే (జనులు భయంకరమైన వ్యాధులతో మరణించినప్పుడు పారిశుద్ధ్యత కోసం) భారతదేశంలో ముఖ్యంగా కోరికలు,

ఆవేశం నుండి వచ్చే చిన్న చిన్న భూతాలు గాలిలో వ్యాపించి దెయ్యాలు మొదలయినవి ఏర్పడతాయని భయంతో అలా చేస్తారు. అన్ని కోరికలూ, అనుబంధాలు ముక్కలు ముక్కలుగా తమ తమ మార్గంలో విడివడి చుట్టూ వున్న ఆవరణలో శక్తిని పుంజుకొని ఎవరినైనా పట్టుకొని పీడించటం మొదలు పెడ తాయి. తమ కోరికలు తీర్చుకోవటానికి ప్రయత్నిస్తాయి.

ఈ ప్రపంచం, భూవాతావరణ మంతా ఎంతో కల్మషాలతో నిండి ఉంది.

The Mother: Conversation with a disciple, May 28, 1960

ప్రాణతంత్రి తెగిన తరువాత జీవితం

నే నొకసారి త్లెమ్‌సెన్‌లో థియోన్ దగ్గర ఉన్నప్పుడు (ఇలా రెండు సార్లు జరిగింది. కాని రెండో సారి గురించి కచ్చితంగా చెప్పలేను, నేనప్పుడు ఒంటరిని.) నా శరీరం ప్రాణరహిత స్థితిలో ఉంది. నేను చేతనాయుత సమాధిలో ఉన్నాను. అది చాలా విచిత్రమయిన అచేతన స్థితి. నా శరీరం మాట్లాడ గలుగుతుంది. కాని చాలా మంద్ర స్వరంలో. నా కది ఎలా చేయాలో థియోన్ నేర్పించాడు. ఇది ఎలా జరుగుతుందంటే రూపచేతన యింకా పనిచేస్తూ ఉండటం వలన ఇది శరీరాన్ని వదలటానికి ఏడు రోజులు పడుతుంది. ఇది శరీరాన్ని కదపగలిగేటట్లు శిక్షణ ఇవ్వవచ్చు. ఆత్మ ఉండదు గానీ రూపంలోని ప్రాణశక్తి అది కదిలేటట్టు చేయ గలుగుతుంది (లేదా మాట్లాడేటట్లు చేస్తుంది, కానీ ఈ స్థితి ప్రమాదరహితం కాదు. దీనికి ఋజు వేమిటంటే నేను సమాధిస్థితిలో పని చేస్తుండగా ఏదో కారణం వలన, నాకు సరిగా గుర్తు లేదు గానీ, నేననుకోవటం నన్ను జాగ్రత్తగా చూడవలసిన థి యోన్ నిర్లక్ష్యం వలన — ఆ ప్రాణతంత్రి,. దాని నేమనాలో తెలియదు. దుర్బుద్ధి తో తెగగొట్టబడింది. దాని వలన సంబంధం తెగిపోయింది. నేను తిరిగి రావలసిన సమయం వచ్చినప్పుడు నేను నా శరీరం లోకి ప్రవేశించ లేకపోయాను. కానీ నేనతనిని హెచ్చరించ గలిగాను. 'ప్రాణతంత్రి తెగిపోయింది' అని. అప్పుడతను తన శక్తినీ, జ్ఞానాన్నీ ఉపయోగించి నేను వెనుకకు శరీరంలోకి రావటానికి సా యం చేసాడు. అది ఏ మాత్రం ఒక తమాషా కాదు. చాలా కష్టతరం. అప్పుడే నాకు రెండు విభిన్నమయి స్థితులలో ఉండే అనుభవం కలిగింది. ఎందుకంటే బ యటకు వెళ్ళిపోయిన. సూక్ష్మ దేహాంశాలకు శరీరం యొక్క ఆధారం లేదు. అను

బంధం తెగిపోయింది. అప్పుడు నాకు తెలిసింది. నేనొక ప్రత్యేకమయిన స్థితిలో ఉన్నానని. నేను ప్రాణశక్తి అంతటితో సంపూర్ణ చేతనతో పని చేస్తున్నాను. నా పరిసరాల నియంత్రణలో ఉండటమే కాక అక్కడ ఏం జరిగిందంటే — అదొక విధమయిన చైతన్యం తలక్రిందులు కావటం వంటిది. మీరు మరొక ప్రపంచానికి చెందటం ప్రారంభిస్తారు. దానిని మీరు చాలా స్పష్టంగా అనుభూతి చెందుతారు. థియోన్ వెంటనే నన్ను ఏకాగ్రం కావాలని చెప్పాడు. (నా కిదంతా చాలా ఆశ్చ ర్యకరంగా ఉంది. శ్రీమాత నవ్వుతూ — నేను ప్రయోగాలు చేస్తూ అటూ యి టూ తిరగటానికి సంసిద్ధ మవుతున్నాను. కానీ నేను అతని వలన మరణిస్తానని చాలా భయపడ్డాడు.) నన్ను కేంద్రీకరించమని ప్రాధేయపడ్డాడు — అప్పుడు నేను శరీరంపై కేంద్రీకరించాను.

నేను తిరిగి శరీరంలోకి ప్రవేశించినపుడు చాలా భయంకరంగా — భయం కరంగా, బాధగా అనిపించింది. చాలా తీవ్రమైన నొప్పి — ఏదో నరకంలోకి దిగి పోతున్నట్లుగా.

The Mother: Conversation with a disciple, August 5, 1961

నలుగురు అసురులు — జీవన మంత్రాన్ని కలుసుకోవడం

నేను నలుగురు అసురులను కలిసాను. అది నేను ఎంచుకోలేదు. పరమాత్మ నిర్ణయం. మొదటి అసురుడు మతాలు సైతాను అని పిలిచే చేతనాసురుడు (సా తాన్) మార్పు చెంది యింకా పని చేస్తూనే ఉన్నాడు. రెండవవాడు 'బాధాసు రుడు' — పరమాత్మలో కలిసిపోయాడు. మూడవవాడు మరణాసురుడు (అత డే థియోన్) నాలుగవవాడు ప్రపంచాసురుడు — అసత్యానికి ప్రభువు 'ఆర్'. ఈ అసురుడి విభూతే, హిందువులు పిలిచే విధంగా థియోన్ మృత్యుప్రభువు యొ క్క విభూతి.

అదొక అద్భుతమైన కథ, నిజమైన ప్రబంధం. ఒక రోజు వస్తుంది అది చెప్ప డానికి — ఏ రాక్షసులు లేని రోజు. ఆ రోజు ఆ కథ చెప్పవచ్చు.

ఏది ఏమైనప్పటికీ థియోన్ వలననే నేను 'జీవన మంత్రాన్ని' కనుగొన్నా ను. జీవితాన్ని ప్రసాదించే మంత్రం. అతను ఆ మంత్రాన్ని నా నుండి తీసుకో వాలనుకున్నాడు. ఆ మంత్రాన్ని కైవసం చేసుకోవా లనుకున్నాడు. కానీ అది చా

లా విపత్కారం. అది ప్రాణాన్ని యిచ్చే మంత్రం (ఎవరినైనా పునరుజ్జీవింప చేసే మంత్రం. అది ఆ మంత్రశక్తి యొక్క ఒక చిన్న అంశం మాత్రమే!) ఆ మంత్రం ఒక ప్రత్యేకమయిన ప్రదేశంలో భద్రపరచబడి, ముద్రవేసి మూయబడి ఉంది. దానిపై సంస్కృతంలో నా పేరు వ్రాయబడి ఉంది. నాకా సమయంలో సంస్కృతం తెలియదు. కానీ థియోన్‌కు తెలుసు. అతను నన్నక్కడకు తీసుకువెళ్ళాడు. ఏదో ఒక డిజైన్‌లా ఉంది. సంస్కృతంలా ఉంది. (అది సంస్కృత అక్షరాలని నేను గుర్తించాను) అని. చూసినవి చూసినట్టుగా చెప్పమన్నాడు. నేను అలానే చేసాను. అది సంస్కృతంలో నా పేరు 'మిర్రా'. ఆ మంత్రం నా కోసమే ఉంచబడింది. కేవలం నేను మాత్రమే దానిని తెరవగలను. థియోన్ 'అది తెరిచి అందులో ఏముందే చెప్పు' మన్నాడు.

(ఇదంతా నేనొక భావాతీత స్థితిలో ఉండగా జరిగింది.) ఇంతలో వెంటనే నాకు స్ఫురణ వచ్చింది. నేను సమాధానం చెప్పాను 'చెప్పను' అని. నేను పైకి చదవలేదు.

నేను శ్రీఅరవిందుల వారితో ఉన్నప్పుడు ఈ మంత్రం మళ్ళీ దొరికింది. అప్పుడు దానిని శ్రీఅరవిందులకు యిచ్చేసాను.

The Mother: Conversation with a disciple, November 5, 1961

అనువాదం: డా. సరోజా ప్రసాద్ (9704198298)

జపాన్

పుష్పాలు, కూరగాయలు

ఎల్లప్పుడు ఉదయమే వాటిని అమర్చుతాను (ఆ పని కనీసం ముప్పావు గంట పడుతుంది. విభిన్న వాజుల్లో వంద కంటే ఎక్కువ పూవుల నమర్చవలసుంటుంది, ప్రతి మనిషికి ఒక ప్రత్యేక రకమయిన పూవు నిస్తాను — అందంగా అమర్చుతాను.) వాజుల్లో కొన్ని పూవులు 'నన్ను' అంటాయి. నాకేవి అవసరమో అవే అలా అంటాయి. 'నన్ను' అని చెప్పడానికవి నన్ను పిలుస్తాయి — కాని అది క్రొత్త గాదు, ఎందుకంటే జపానులో ఉన్నప్పుడు, పెద్ద ఉద్యానవన ముండేది, అందులో కొంత భాగాన్ని సిద్ధం చేసి కూరగాయలు పెంచాను; ఆ రోజు తినవలసిన కూరగాయ

లు తీసుకురావడానికి ఉదయమే క్రిందికి, ఉద్యానవనానికి వెళ్లేదానిని, వాటిలో కొన్ని యిక్కడ, అక్కడ, అక్కడ (అక్కడ యిక్కడ చోట్లన్న సైగ) "నన్ను! నన్ను!" అనేవి. కాబట్టి నేను వెళ్ళి వాటిని సేకరించేదానిని. అవి వాస్తవంగా నన్ను పిలిచేవి, నన్ను పిలిచేవి.

అది చాలా కాలం క్రితం, పందొమ్మిది వందల... ఎప్పుడది? 1916-17 లో, అంటే అదీ... నలభై సంవత్సరాల క్రిందట. యాభై

(అమ్మ నవ్వుతూ) యాభై సంవత్సరాల క్రిందట!

కాని యిప్పుడు, ఉదయం నేనసలు ఆలోచించను, మౌనంగా ఉంటా, పూవుల దగ్గరకు సూటిగా వెళతాను, అవి 'నన్ను! నన్ను!' అంటాయి. "అద్భుతం, అదే నేను కావాలనుకున్నది" అని ఆశ్చర్యపోయేదాన్ని.

The Mother: Covnversation with a disciple, February 7, 1968

ఠాగూర్ నిర్వాణం

ఇదంతా చివరికి తన ఆకాంక్ష మీద లేక అంతకు ముందుగా దేనితో తల మునకలై వున్నారో దాని ప్రభావం క్రింద లేక ఏది తన పని కవసరమో దాని మీద ఆధారపడి ఉంటుంది. ఇదెలాగంటే మిగిలిన దేనినీ పట్టించుకోకుండా, దానిని గుర్తించకుండా, అవసరమయితే దాని ద్వారా వెళ్తున్నప్పటికీ దాని పైన ధ్యాస నుంచకుండా, తానెక్కడికి వెళ్ళా లనుకుంటున్నాడో సూటిగా అక్కడికి వెళ్ళడం వంటిది. వర్గీకరించే అవసరం, సరే.... అది తర్వాత వస్తుంది, విషయాలను తాను వర్ణించాలనుకుంటేనే, కాని అవసరం లేదు.

ఇది ప్రఖ్యాతి వహించిన నిర్వాణం వంటిది — ప్రతిదాని వెనుక దానిని తెలుసుకోగలవు, ఓ చైత్యపురుష నిర్వాణం, ఓ మానసిక నిర్వాణం, ఓ ప్రాణిక నిర్వాణం కూడా ఉంటుంది. జపాన్‌లో ఠాగూర్‌తో నాకున్న అనుభవం గురించి యిప్పటికే చెప్పినట్లున్నాను. ఠాగూర్ ఎప్పుడూ చెప్తుండేవారు, ఆయన ధ్యానం గురించి, ధ్యానం జేయుడ మారంభించగానే నిర్వాణం లోనికి ప్రవేశించేవారని, ఆయనతో పాటు ధ్యానం చేయమనేవారు. ధ్యానానికి యిరువురం కలిసి కూర్చున్నాం. నేను చాలా లోతైన ఆరోహణ చేయాలని ఆశించాను. కాని ఆయన కేవలం మనసు లోనికి వెళ్ళేవారు, అక్కడ... (నేనేమి చేసేదాని నంటే, చూడండి, కలిసి ధ్యానం

చేస్తున్న వ్యక్తికి అనువుగా అతడితో ఏకీకృతం జేసుకునే దానిని — ఆ విధంగా జరుగుతున్నదేమిటో తెలుస్తుడేది.) మంచిది, ఆయన ధ్యాన మారంభించేవారు, ప్రతిదీ ఎంతో వేగంగా ఆగిపోయేది, పూర్తిగా నిశ్చలం అయేది. (ఇదాయన ఎంతో బాగా చేసేవారు). అక్కడి నుండి ఓ రకంగా వెనుకకు పడిపోవడం. అది శూన్యం. ఆయన అందులో ఎంత సేపయినా ఉండగలిగేవారు, వాస్తవంగా ఆ రీతిలో దీర్ఘ సమయం పాటుండే ఓరిమి, ఎంత సేపన్నది గుర్తు లేదు, ముప్పావు గంట లేక ఓ గంట, ఏదేమైనా ఎక్కువ సమయమనే చెప్పాలి. ఆయన అనుకోకుండా మరొక దాని లోనికి వెళ్తారేమో చూడడం కోసం సమయమంతా చురుగ్గా ఉంచుకునేదానిని, కాని అక్కడే ఉండేవారు — ఆయన ఎంతో మౌనంగా అటూయిటూ కదలకుండా అక్కడే ఉండేవారు. అప్పుడు వెనుకకు వచ్చేవారు, తిరిగి ఆయన మనసు మొదలయ్యేది. అదలా ఉండేది.

ఆయనతో నేనేమీ చెప్పలేదు.

కాని అది నిజమయిన నిర్వాణం, ఏమీ లేకపోవడం, కనీసం ఒక్క సంవేదన, ఒక్క కదలిక లేకుండా ఆలోచనలు లేకుండా ననుకోండి — ఏదీ ఉండకుండా; ఒక్క ప్రకంపనయినా లేకుండా: అదలా, నిర్వాణం అంతే. కాబట్టి ఎంతో సహజంగా మనసు వెనుక ఓ నిర్వాణ ముంటుందన్న నిర్ణయాని కొచ్చాను, ఆయన సూటిగా అక్కడికే వెళ్ళినందు వలన.

The Mother: Copnversation with a disciple, October 30, 1962

మాడమ్ డేవిడ్ నీల్, బుద్ధుడు

ఒకసారి మాడమ్ డేవిడ్ నీల్‌తో జరిగిన విషయం నాకు జ్ఞాపకం వుంది. ఇదెంతో ఆసక్తికరంగా ఉంటుంది. ఓ ఉపన్యాస మివ్వడానికామె వచ్చారు. (నాకామెతో పరిచయం లేదు. అక్కడే మొట్టమొదటిసారి కలుసుకున్నాను.) థియోసాఫికల్ సొసైటీ దగ్గరనుకుంటాను. (మరిచాను) ఆ ఉపన్యాసాని కెళ్ళాను, ఆమె మాట్లాడేటప్పుడు బుద్ధు-డిని చూశాను. ఆమె తలపై కాదు, కొంచెం ప్రక్కగా, ఆయ నుండడం స్పష్టంగా చూచాను. కాబట్టి ఉపన్యాసమయిన తర్వాత ఆమెకు పరిచయం చేసుకున్నాను. (ఆమె ఎటువంటి మనిషో తెలియదు!) ఆమెతో, "ఓహ్, మాడమ్, మీరు మాట్లాడుతున్నప్పుడు బుద్ధుడు ఉండడం చూశాను, అ

ని" చెప్పాను. ఆమె (అమిత కోపంతో) "అసంభవం! బుద్ధుడు నిర్వాణంలో ఉన్నాడు!" అన్నారు సమాధానంగా. (అమ్మ నవ్వుతూ) "ఓహ్!... మౌనంగా ఉండడం మంచిది" అనుకున్నాను.

కాని ఆమేమనుకున్నప్పటికీ, ఆయన నిజంగా అక్కడున్నారు.

The Mother: Conversation with a disciple, November 9, 1966

గౌతమ బుద్ధుడి నుండి సమాచార ప్రసారం

(సాయంకాల ధ్యానం తర్వాత 5.30 కు సమాచారాన్నందుకున్నాను)

"నన్ను ధ్యానించుతున్నందు వలన ఈ సాయంకాలం నీతో మాట్లాడాలి. నీ హృదయంలో బంగారు కాంతితో ఆవరింపబడి ఉన్న ఓ వజ్రాన్ని చూశాను. అది వ్యక్తిగతం గాని ప్రేమ నేదో వ్యక్తం జేసేదన్నట్లు ఏకకాలంలో శుద్ధంగా, నును వెచ్చగా ఉన్నది. కాని ఈ నిధి నెందుకు గాఢ రక్తవర్ణపు అంచున్న నల్లని పేటికలో మూసిపెట్టి ఉంటావు? మిక్కిలి బయటి మూత కాంతి హీనమయిన గాఢ నీలివర్ణంతో చిమ్మ చీకటికి నిజమయిన కప్పుగా ఉన్నది. నీ ప్రకాశాన్ని చూపడానికి భయపడుతున్నట్లుగా కన్పిస్తున్నది. ప్రసరింపజేయడం నేర్చుకో, తుఫానుకు భయపడొద్దు: వాయువు ఒడ్డు నుండి మనల నెంతో దూరంగా తీసు కెళ్తుంది, కాని ప్రపంచ మంతటినీ చూపుతుంది. నీ కరుణాంతరంగాన్ని మి తంగా వెచ్చించుతావా? కాని ప్రేమ మూలం అనంతమయినది. అపార్థం చేసు కుంటారని భయపడుతున్నావా? దైవాన్ని అర్థం జేసుకునే సామర్థ్యమున్న మని షి నెక్కడయినా చూశావా? నీలో అనంత సత్యం తన నభివ్యక్తం జేసుకునే మాధ్యమాన్ని కనుగొంటే మిగిలిన వాటన్నింటినీ లక్ష్య పెట్టడమేమిటి? గర్భగుడి నుండి బయటి కొచ్చిన యాత్రికురాలి వంటిదానివి, సమూహం ముందు ప్రేర ణ కలిగించే స్థానంలో నిలుచుని ఉన్నావు, ఆయన అపురూప రహస్యాన్ని, ఉత్త మోత్తమ ఆవిష్కారాన్ని వెల్లడించే ముందు సంకోచిస్తున్నావు. విను, ఎందుకంటే నా బోధనను దాని ఫలితాన్ని ముందుగానే చూడగలిగినందు వలన: దాని అ పరిపూర్ణ ప్రకటనను, ఇంకా అపరిపూర్ణ గ్రహణశక్తిని చూసిన నేమ గూడా కొన్ని రోజుల పాటు సంకోచించాను. అయినప్పటికీ పృథ్వి వైపు, మానవుల వైపు తిరి గి నా సందేశాన్ని తెచ్చాను. పృథ్వి వైపు, మానవుల వైపు తిరుగు — ఇది

నీ హృదయంలో నుండి ఎల్లప్పుడూ వస్తున్న ఆజ్ఞాపన గాదా? — ఎందుకంటే ఎవరు కరుణ కోసం తపిస్తున్నారో వారి కోసం ఆశీర్వదింపబడిన సందేశమేదో అది యిదే. కనుక వజ్రాన్నేదీ ఏమీ చేయలేదు. దానిది అబేధ్యమైన నిర్మాణం, దాని నుండి మెరుపుల్లా వచ్చే మృదువయిన కిరణ ప్రకాశాలు మనుషుల హృదయాలలోని విషయా లెన్నింటినో మార్చగలవు. నీ శక్తిని సందేహించడం, భయపడడం నీ మూర్ఖత్వం గాదా? క్లుప్తంగా నక్షత్రాలు లేని రాత్రి ఆ నల్లని పేటికతో నీ బలమంతా చుట్టివేయబడింది. సంకొచిస్తున్నావు, ఓ రహస్య ప్రాంగణం మీద ఉన్నట్లు వణికిపోతున్నావు. ఎందుకంటే సృష్టి రహస్య మిప్పుడు 'శాశ్వత కారణం' కంటే ఎంతో భయంకరంగా అవగాహన కందని మార్మికతతో ఉన్నట్లు కనిపిస్తున్నది. కాని నీవు ధైర్యాన్ని తిరిగి తెచ్చుకోవాలి, లోతులలో నుండి వస్తున్న ఆజ్ఞలకు విధేయురాలివి గావాలి. నీ కిది చెప్తున్న దెవరంటే నేను, ఎందుకంటే ఒకసారి నన్నెరిగి, నన్ను నీవు ప్రేమించినట్లు నాకు తెలుసు, నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నీ దృష్టి ముందుకు సష్టంగా వచ్చి కన్పించాను, ఆ విధంగా నా మాటను ఏ విధంగానూ సందేహించకుండా ఉంటావేమోనని. ఉత్తమోత్తమ సత్యం నీ హృదయం కోసం ఏమి సంకల్పించిందో దానిని చూడగలగడానికి నీ హృదయాన్ని గూడా నీ కళ్ళ ముందు చూపాను, ఆ విధంగా నీ ఉనికి నియమాన్ని అందులో కనిపెట్టవచ్చు. విషయమింకా ఎంతో కష్టంగా ఉన్నట్లు కన్పిస్తున్నది: ఇంతకాలం పాటు మరొక విధంగా ఎలా ఉండగల్గిందా అని నీ వెప్పుడో ఆశ్చర్యపోయే రోజొకటి వస్తుంది." — శాక్యముని

CWM 1:332-33

(1916 వ సంవత్సరం డిశెంబరు 20 న ఆమె ప్రార్థనలో, శాక్యముని నుండి సాయంకాల ధ్యానంలో అందుకున్న సుదీర్ఘ 'సమాచార ప్రసారాన్ని' అమ్మ వ్రాసి పెట్టారు (పుటలు 366-67). ఓ శిష్యుడు అతడెవరని అడిగాడు.)

బుద్ధుడికి శాక్యముని అని పేరు — 'శాక్యుల జ్ఞాని' — పుట్టుకతో బుద్ధుడే వంశానికి చెందుతాడో ఆ దానికి ఆయన తండ్రి 'మహారాజు'.

CWSA 32:607

"కుండలిని శక్తిని మేలుకొలుపుట" అనేది నా విషయంలో జరిగింది. అప్పటికి నేనింకా పారిస్ నగరంలోనే వున్నాను. నేను భారతదేశానికి రాక ముందు అది జరిగింది. ఆ విషయాన్ని గురించి వివేకానందుడు వ్రాసిన పుస్తకాలను నేను చదివాను. ఆ ప్రబల శక్తి లేచి, దీని (శిరస్సు పైన అన్నట్లు సంజ్ఞ) ద్వారా వెలువడింది. (ప్రామాణిక) అనుభవం మాత్రం దానినలా విశదీకరించ లేదు. ఆ ప్రబల శక్తి వెలువడింది, చేతన యిచట (తలకు పైన యెనిమిది అంగుళాల యెత్తును సూచిస్తూ సంజ్ఞ) స్థిరపడింది. నేనిచటి కొచ్చిన తరువాత, దానిని గురించి శ్రీఅరవిందులకు చెప్పాను. తనకు కూడా అదే అనుభవం కలిగిందని వారు చెప్పారు. (పురాతన) గ్రంథాలలో బోధనను అనుసరించి, అది జరిగినపుడు ఆ వ్యక్తి జీవించ 'లేడని' తెలుస్తుంది, నీవు చనిపోతావు! కాబట్టి... (నవ్వుతూ) "అలా చనిపోనివారు యిక్కడ యిద్దరున్నారు!" అన్నారు. చేతన అచ్చటే వుండిపోయింది (పైన అనే సంజ్ఞ) అది తిరిగి క్రిందికి రాలేదు; అదక్కడే వుండిపోయింది, యెప్పుడూ అదక్కడే వుండిపోయింది....

ఇచటి నుండి నేను (1915 లో పారిస్‌కు) తిరిగి వెళ్ళినప్పుడు, కావాలనే నేను యేదో చేసాను. చిట్టచివరి కేంద్రం (వెన్నెముక క్రింది భాగంలో దాని కాధారంగా వున్న) లోని ఊర్జాల నన్నింటినీ యిచటకి (హృదయకేంద్రం లోనికి సంజ్ఞ) తీసుకొచ్చాను.

కాని, పాదాలకు క్రింద వున్న కేంద్రాలను కూడా నేను సంవేదించాను. పాదాలకు క్రిందుగా ఒక కేంద్రాన్ని సంవేదించాను, మోకాళ్ళ వద్ద ఒక కేంద్రాన్ని, మరో కేంద్రాన్ని (వెన్నెముక మొదట్లో సంజ్ఞ) సంవేదించాను; (వాటి ఊర్జాల నన్నింటినీ పైగి లాగుతున్నట్లు ఆమ్మ సంజ్ఞ చేసారు.) దాన్నంతా పైకి లాగాను, అది వచ్చి యిక్కడ స్థిరపడింది (హృదయాన్ని చూపే సంజ్ఞ).

నేనిక్కడి కొచ్చిన క్షణం నుండీ నా దేహాన్ని గురించి నేను పట్టించుకోవడం మానేసాను. నా ధ్యాసంతా నేను చేయవలసిన కార్యం మీదే. కాని యిచటకి రాక ముందు, ముఖ్యంగా యిచటి నుండి వెళ్ళిపోయి, తిరిగివచ్చే దానికి మధ్య... (ఎంత కాలం'?... నేను 1920 లో తిరిగొచ్చాను: మొదట నేను 1914 లో

వచ్చి 1915 లో వెళ్ళిపోయాను — 1916 నుండి 1920 వరకు జపానులో వున్నాను). అప్పట్నించి ఆ అనుభవాలన్నీ (కుండలినీ వగైరా) ఫ్రాన్సులోనూ, జపానులోనూ కలిగాయి.

The Mother: Covversations with a disciple, July 11, 1970

శ్రీఅరవిందుల తేజోవలయం

నేను జపాను నుండి వచ్చినప్పుడు కలిగిన అనుభవం చెప్తాను విను. నేను సముద్రంపై నావలో వున్నాను. దేని కోసమూ యెదురు చూడ్డం లేదు. (నిజమే, నేను ఆంతరిక జీవితంతో తీరుబడి లేకుండా వున్నాను, కాని భౌతికంగా నావ మీద ఉన్నాను). అప్పుడు వున్నట్లుండి, ఆకస్మికంగా పాండిచ్చేరి నుండి సుమారు రెండున్నర మైళ్ళ దూరంలో, వాతావరణ గాలి లక్షణం, భౌతిక లక్షణం అని కూడా చెప్పవచ్చు, యెంతో మారిపోయింది, మేం శ్రీఅరవిందుల తేజోవలయం లోనికి ప్రవేశిస్తున్నామని నాకు తెలిసింది. అది ఒక భౌతికానుభవం. చాలినంతగా జాగృతమైన చేతన కలవారెవరైనా అదే అనుభవాన్ని పొందగలరని నిక్కచ్చిగా చెప్పగలను.

CWM 4:223

నిత్యం ఒక ఉన్నతచేతనలో నివసించే వాళ్ళున్నారు, కాని యితరులు అచటికి ప్రవేశించాలంటే కృషి చేయవలసి వుంటుంది. కాని యిక్కడ అది పూర్తిగా మరో విధంగా ఉంటుంది. నేనిప్పటి వరకు చెప్పిన అనుభవానికి అంత విలువ యెందుకున్నదంటే, దాన్ని నేను ఆశించలేదు, ఏ మాత్రం కూడా ఆశించడం లేదు. నాకు బాగా తెలుసు, చాలా కాలం నుండి, నిర్విరామంగా, శ్రీఅరవిందుల వాతావరణంతో నాకు 'ఆధ్యాత్మిక' సంపర్కం వుంది. భౌతిక గాలి కూడా మార్పుకు లోనవుతుందని నేనెన్నడూ అనుకోలేదు. ఇదిగో దీని మీదే ఆ అనుభవానికున్న విలువంతా ఆధారపడి వుంది. అది అలా అలా చాలా అకస్మాత్తుగా, యేదో మరో యెత్తైన లేక మరో ఉష్ణోగ్రత వున్న చోటికి ప్రవేశించినట్లైంది. నీవు పీల్చే గాలి యెప్పుడూ ఒకే రకంగా వుండదనేది నీవు గ్రహించావో లేదో నాకు తెలియదు గాని ఒక దేశపు గాలిలో, మరో దేశపు గాలిలో విభిన్న కంపనా లుంటాయి. సూక్ష్మ భౌతికానికి సంబంధించిన యీ అవగాహనకు నీవు నిజంగా అలవాటు పడి

వుంటే వెంటనే "ఆం ఈ గాలి ఫ్రాన్సులో గాలిలా వుంది" అనో లేక "ఇది జపాను గాలి" అనో అంటావు. రుచి, వాసన లాగే దీనిని నిర్వచించలేం. ఈ సందర్భంలో ఇది వేరు, ఇది మరో యింద్రియానికి సంబంధించిన అవగాహన. ఇది భౌతికేంద్రియం, ప్రాణిక లేక మానసిక యింద్రియం కాదు. అది భౌతిక ప్రపంచానికి సంబంధించిన యింద్రియం. మన కందుబాటులో వున్న పంచేద్రియాల కన్న యితర యింద్రియా లున్నాయి. ఇంకా చాలా వున్నాయి.

CWM 4:229-30

ఒక రకమైన స్వర్గం

నగరాలలో, ఉదాహరణకు టోక్యో లాంటి నగరం, ప్రపంచంలోని మహానగరాలన్నింటి కన్నా పెద్దది, లండను కన్న పెద్దది, అది చాలా, చాలా దూరం వరకు విస్తరించి వుంది. (ఇప్పుడు ఇళ్ళు ఆధునీకరించబడి నందువల్ల మొత్తం నగర కేంద్రం అసౌకర్యంగా తయారైంది, కాని నేనక్క డున్నప్పుడు అది యింకా బాగానే వుండేది.) నగర శివారుల్లో, వ్యాపార సంబంధ భవనాలు ఉండేవి కావు. ప్రతి యింటికి బాగా వుంటే రెండు అంతస్తులు, ఒక తోట వుండేవి — తోట తప్పనిసరిగా వుండేది, అందులో బాగా అందంగా వుండే ఒకటి రెండు చెట్లుండేవి. నీవు నడకకు వెళ్తే... టోక్యోలో నీ దారి నీకు తెలియడం చాలా కష్టం. ఇంటిని గుర్తించే అంకె వేసి రోడ్డు కిరుప్రక్కలా యిళ్ళున్న, తిన్నని బజార్లుండేవి గాదు, అందుచేత నీవు తేలికగా దారి తప్పిపోతావు. అప్పుడు దారి తెలియక తిరుగుతూనే వుండిపోతావు — యెప్పుడూ అ దేశంలో దిక్కు తెలియక తిరుగుతూండడం జరుగుతుంది — అలా తిరుగుతూ పోతుంటే, అకస్మాత్తుగా ఒక మూలకు తిరగ్గానే, ఒక రకమైన స్వర్గం దగ్గరకు చేరుకొంటావు. అక్కడ అద్భుతమైన వృక్షాలుంటాయి, నిజంగా అందమైన ఒక దేవాలయం వుంటుంది. నీకు, నగరానికి సంబంధించినది గాని, రవాణా యంత్రాంగంగాని, ట్రాము కార్లు గాని కన్పించవు. అద్భుతమైన రంగులున్న వృక్షాలు గల ఒక మూల కన్పిస్తుంది. అది నిజంగా అందమైనది. అచటి కెలా చేరావో నీకే తెలియదు, అదృష్టం కొద్దీ అక్కడకు చేరాననుకొంటావు. ఆ తరువాత నీవు వెనుదిరిగి నీ దారి కోసం చూస్తావు, మళ్ళీ అలాగే తిరిగి తిరిగి యెక్కడికో చేరుకొంటావు. కొన్నాళ్ళ తర్వాత యీ స్థలానికి రావా

లని అనుకొంటావు, కాని అసాధ్యం, అది అదృశ్యమైపోయి నట్లనిపిస్తుంది. ఇలా చాలా తరచుగా జరుగుతుంటుంది, ఇదెంతో నిజం, అటువంటి కథలను జపానులో తరచుగా వింటాం. వారి సాహిత్యమంతా ఉల్లాసభరితంగా వుంటుంది. వాళ్ళొక కథ చెప్తే, అందులో కథానాయకుడు ఒక గమ్మత్తైన చోటికి చేరుకొంటాడు. అక్కడ అతనికి గాలిలో తేలియాడే దేవతలు, అద్భుతమైన జీవులు కన్పిస్తాయి. పుష్పాల మధ్య, సంగీతం మధ్య ఆహ్లాదంగా గంటలు గడుపుతాడు, అంతా అద్భుతంగా వుంటుంది. మరుసటి రోజు అతడక్కడ నుంచి వెళ్ళవలసి వుంటుంది. ఆ ప్రదేశంలో వుండే చట్టమది, అందుచేత వెళ్ళిపోతాడు. అతడు తిరిగి రావాలని ప్రయత్నిస్తాడు, కాని రాలేడెప్పుడూ. అతడా ప్రదేశాన్ని కనిపెట్ట లేకపోతాడు, అదక్కడే వుండేది, కాని అదృశ్యమై పోయింది.... ఈ పట్టణంలో , యీ దేశంలో, మొదటి నుండి చివరి దాకా, ప్రతిదీ అశాశ్వతం, అనూహ్యం, అపురూపం అనే భావాన్ని కలిగిస్తుంది. నీవు ఆశించనివాటి దగ్గరకే యెప్పుడూ చేరుకొంటావు. మళ్ళీ వాటి దగ్గరకు వెళ్ళాలనుకొంటావు, అవి కన్పించవు — అవి అదివరకటి వాటిలాగే సమ్మోహనపరచే మరేవోగా అవుతాయి. కళాత్మక దృక్పథం నుండి, సౌందర్యం దృక్పథం నుండి చూస్తే అంతటి సుందరమైన మరో దేశం వుంటుందని నేననుకోను.

CWM 4:307-08

నైతిక నిర్మాణం, ఆధ్యాత్మికత

నా చిత్రీకరణను పూర్తి చేయడానికి నేనో విషయం చెప్పి తీరాలి. నేనక్కడున్న నాలుగు సంవత్సరాలలో. యెంత క్షుణ్ణంగా వీలైతే అంతగా, అక్కడ ఆధ్యాత్మికత అనేది లోపించిందో తెలుసుకున్నాననే విషయం చెప్పి తీరాలి. వాళ్ళకో అద్భుతమైన నైతికత వుంది. వాళ్ళు చాలా కచ్చితమైన నైతిక నియమాల ప్రకారం నివసిస్తారు. జీవితానికి సంబంధించిన అతి స్వల్ప విషయంలో కూడా ఒక మానసిక కట్టుబాటును యేర్పరచుకొన్నారు. ఒక విధంగానే వంగాలి గాని మరో విధంగా కాదు, ప్రత్యేకించి కొన్ని పదాలే పలకాలి గాని అన్నీ కాదు. ఒక రకమైన మనుష్యులను సంబోధించేటప్పుడు, ఒకానొక విధంగానే సంబోధించాలి. ఒకానొక విధంగానే ఆహారాన్ని భుజించాలి గాని మరో విధంగా కాదు.

ఇతరులతో మాట్లాడేటప్పుడు, మరో రకంగా తనను తాను వ్యక్తపరచుకోవాలి. దుకాణంలో యేదైనా కొనడానికి వెళ్ళినప్పుడు, ఒక ప్రత్యేక వాక్యాన్నే పలకాలి, ఆ వాక్యం చెప్పకపోతే నిన్ను పట్టించుకోరు. వాళ్ళు నీ వంక వింత మనిషిని చూచినట్లు చూస్తారు, కదలరు! కాని నీవా మాట చెప్తే నీ మీద పూర్తి శ్రద్ధ పెడ్తారు. అవసరమైతే నీవు కూర్చొనడానికి ఒక మెత్త తీసుకొచ్చి పెట్టి, సేవించడానికో కప్పు టీ కూడా తీసుకొస్తారు. ప్రతిదీ అలాగే వుంటుంది. అద్భుతంగా వ్యవస్థీకరించబడిన మనో-భౌతిక పరగణాకు చెందిన మరేదో దానితో నీవు సంపర్కంలో కొచ్చినట్లు అనుభూతి ఒక్కసారే కాదు కలిగేది. పైగా వాళ్ళ కెటువంటి శక్తి వుందనుకున్నావు! మొత్తం ప్రాణిక అస్తిత్వం శక్తిగా అయ్యినట్లుంటుంది. వాళ్ళకు అసాధారణమైన సహిష్ణుత వుంది, కాని తిన్ననైన ఆకాంక్ష లేదు. నియమానికి విధేయుడై వుండాలి, తప్పదు. తనను తాను నియమాలకు బద్ధుని చేసుకొననివానిని, అనాగరికులుగా, పూర్తిగా చొరబాటుదారులుగా వారిచే పరిగణించబడే ఐరోపావాసులుగా వాళ్ళక్కడ బ్రతకాల్సి వుంటుంది. కాని జపాను దేశీయుల మధ్య జపానువానిలా నివసించా లనుకొంటే, వాళ్ళు చేసినట్లే నీవూ చేయాలి. లేకపోతే నీ వల్ల వాళ్ళెంతో అసౌకర్యానికి లోనై నీతో యే సంబంధమూ పెట్టుకోరు. వాళ్ళింట్లో నీవొకానొక ప్రత్యేక పద్ధతిలో పలుకరించాలి. మాకు సన్నిహిత మిత్రుడైన, ఒక జపాను దేశీయుని గురించిన కథ మీ కదివరకు చెప్పా ననుకొంటాను. అతని అంతరాత్మతో అతడు సంపర్కం లోని కొచ్చేటట్లు నేనతనికి సహాయం చేస్తే — అతను పారిపోయాడు, అతనిని గురించి మీ కిదివరకు చెప్పా ననుకొంటాను. అతడు మాతో పాటు పల్లె ప్రాంతంలో వుండేవాడు, అతని చైత్య పురుషతో అతనికి సంబంధం కలిగించాను. అతనికి ఆదొక అనుభవం, ఒక జ్ఞానోదయం, ఒక సంపర్కం, కనులు మిరుమిట్లుగొలిపే సంపర్కం కలిగింది.

మరుచటి రోజుదయం చూస్తే అతడు లేడు, పలాయనం చిత్తగించాడు. శెలవులనంతరం నేనతన్ని నగరంలో మళ్ళీ చూచాను. "ఏమైంది, నీకు, నీ వెందుకు వెళ్ళిపోయావు" అని అడిగాను. అప్పుడతడు "ఓహ్! మీకు తెలుసు, నా అంతరాత్మను ఆవిష్కరించుకొన్నాను, నా దేశం యెడల మికాడో యెడల నాకున్న విశ్వాసం కంటె నా అంతరాత్మ అత్యంత శక్తివంతమైనదని గ్రహించాను. నేను గనుక నా అంతరాత్మకు విధేయుడ నవ్వడం జరిగితే, నా చక్రవర్తికి యింకనెంత

మాత్రం విశ్వాసపాత్రుడనుగా దాసునిగా వుండలేను. అందుకని పారిపోవలసి వచ్చింది", అన్నాడు. అదీ సంగతి, ఇదంతా ముమ్మాటికీ సత్యం.

CWM 4:308-09 అనువాదం: కె. వి. రావు *(9849929254)*

పుదుచ్చేరి

ఒక ఘన సంయోజనం వైపుగా

నేను దీనిని స్వల్పంగా ప్రకటిస్తున్నానేమో నాకు తెలియదు. కానీ భౌతిక విషయ సంబంధంగా ఈ అనుభవం యథార్థమైనది. ఇది జపాను దేశంలోని గ్రామ ప్రాంతంలో ఒక చెరువుకు దగ్గరగా మేము నివసిస్తున్న గృహంలో జరిగింది. అక్కడ పరిస్థితులకు, సంఘటనలకు చెందిన అన్ని రకాల విషయాలు జరిగాయి — అది ఒక నవల లాంటి దీర్ఘ కథ. ఒక రోజు నేను ఒంటరిగా ధ్యానం చేస్తున్నాను. (నేను ఎప్పుడూ గాఢ ధ్యానాలు చేయను, కేవలం చైతన్యం మీద ఏకాగ్రత పెట్టడం చేస్తాను — శ్రీమాత హఠాత్తుగా మొత్తం అస్తిత్వాన్ని లోపలకు కూడ దీసుకునే ఒక ఆకస్మిక సంజ్ఞను చేస్తారు.); నేను చూస్తున్నాను... నేను అసత్య ప్రభువు పరివర్తన కార్యాన్ని నిర్వరిస్తున్నానని మీకు తెలుసు; దానిని భౌతిక అస్తిత్వంలో ఒక నా రూపాన్ని బహిర్గతం చేయడం ద్వారా చేయడానికి ప్రయత్నించాను. జపాన్ దేశంలో వున్న ఆ నాలుగు సంవత్సరాలలో దాని కోసం అత్యధిక కృషి జరిగింది. ఇక అక్కడ చేయవలసిందేమీ లేదు అనే ఒక సంపూర్ణ ఆంతరిక విశ్వాసంతో ఆ నాలుగు సంవత్సరాల కాలం ఒక అంతానికి వచ్చింది — అది అసాధ్యం, ఈ విధానంలో చేయటం అసాధ్యం. అక్కడ ఇంక చేయవలసినదేమీ లేదు. నేను పూర్తిగా నాలో నిమగ్నమై భగవంతుడిని అడిగాను "దీనిని నిర్వర్తిస్తానని నేను నీకు వాగ్దానం చేసాను, ఒక వేళ దీని కోసం నరకంలోనికి దిగవలసివస్తే దిగుతాను. ఇప్పుడు చెప్పు, నేను ఏమి చేయాలి?" ... శక్తి వుందనేది స్పష్టం. హఠాత్తుగా నాలోని సమస్తము నిశ్శబ్దమయ్యింది; బాహ్య అస్తిత్వం మొత్తము పూర్తిగా నిశ్చలంగా మారి, సర్వోన్నతుడి దర్శనమైంది. ఆ సర్వోత్కృష్టుడి రూపం గీతలో కన్న సుందరమైనది. పురుషోత్తముడి దర్శనం అది. పురుషోత్తముడు నన్ను తన హస్తాల్లోనికి తీసుకొన్నాడు, పశ్చిమం వైపు, భారత

దేశం వైపుతరిగి, నన్ను అర్పించారు. అక్షరాలా శ్రీఅరవిందులను దర్శించాను. దీనిని భౌతికంగానే అనుభూతి చెందాను. నా కళ్ళు మూసుకుని చూశాను. (రెండు మార్లు ఈ సర్వోన్నతుడి దర్శన మయ్యింది... ఒక సారి ఇక్కడ, చాలా కాలం తర్వాత... కానీ ఇది మొదటిసారి.) ...అనిర్వచనీ యం. ఇది ఎలా వుందంటే ఈ అపరిమితత్వం ఒక బ్రహ్మాండమైన జీవిగా తనను తాను క్షయీకరించుకొని ఒక జీవిగా గడ్డిపరక లాగ నన్ను పైకి లేపి అర్పించింది. ఒక్క మాట కూడ లేదు. అక్కడ మరేం లేదు. అది మాత్రమే వుంది.

అప్పుడు అంతా అదృశ్యమయ్యింది.

మరుసటి రోజు మేము భారతదేశానికి తిరిగి రావడానికి సిద్ధమయ్యాము.

ఆ దృశ్యం పిదప, నేను జపాన్ దేశం నుండి తిరిగి వచ్చినప్పుడు భగవత్ నిర్ణీత కార్యం సఫలమవుతుందనే సంపూర్ణ విశ్వాసంతో, శ్రీఅరవిందులను కలవటం జరిగింది.

The Mother: Conversation with a disciple, December 20, 1961

దివ్యమూల కారణంతో భూసంగమం

సమస్త చైతన్యము దైవధ్యానంలో నిమగ్నమయ్యింది. అస్తిత్వం మొత్తం ఒక సర్వోన్నత, విస్తారానందాన్ని అనుభవించింది.

అప్పుడు భౌతిక శరీరం మొదట తన నిమ్న భాగాలలో, ఆ తర్వాత మొత్తంగా, అత్యంత భౌతిక సంవేదనలలో కూడా వ్యక్తిగత పరిమితులన్నీ కొంచెం కొంచెంగా పడిపోయేటట్లు చేసే ఒక పవిత్ర స్పందనతో నన్ను బంధించింది. అస్తిత్వము గొప్పతనంలో క్రమంగా, పద్ధతి ప్రకారం వృద్ధి చెందింది. ఇది ప్రతి అవరోధాన్ని ఛేదించుకుంటూ, ప్రతి అంతరాయాన్ని చెదరగొడుతూ అపారతలో, తీవ్రతలో నిరంతరాయంగా వృద్ధిచెందుతూ ఒక బలాన్ని, శక్తిని కలిగి వుంటూ దాన్ని అభివ్యక్తం చేయగలదు. అది భూమితో సంపూర్ణ ఏకతను పొందేవరకూ భౌతిక కణాలలో పురోగమనాత్మకంగా జరిగే విస్తరణ; జాగృత చేతనా దేహం అంతరిక్షంలో సామరస్యంగా చలించే భూగోళం తన భౌగోళిక శరీరము విశ్వ పురుషుడి హస్తాలలో చలిస్తున్నదని చైతన్యానికి తెలుసు. అది తనను తాను ఇచ్చుకుంది, ప్రశాంత ఆనంత పారవశ్యతలో తనను తాను త్యజించుకొం

ది. అప్పుడు తన దేహం విశ్వదేహంలో లీనమైనట్లుగా, దానితో ఒకటైనట్లు అనుభూతి చెందింది; తన పూర్ణతలో నిశ్చలంగా వుంటూ, తన ఆంతరిక క్లిష్టతలో అనంతంగా చలిస్తూ, చైతన్యం విశ్వచైతన్యంగా మారింది. విశ్వచైతన్యం ఒక తీవ్ర ఆకాంక్షలో పరిపూర్ణ సమర్పణతో దైవం వైపుగా ప్రేరేపితమయ్యింది. ఇది విశ్వాన్ని అనంతంగా చుట్టుకున్న బహు శిరస్సుల సర్పం మీద స్వచ్ఛమైన కాంతి వైభవంలో నిలబడి వున్న ఉజ్వలిత పురుషుడిని చూసింది. ఈ పురుషుడు శాశ్వత విజయ సంకేతంతో సర్పమును, తన నుండి బహిర్గతమైన విశ్వమును, ఒకే సమయంలో శాసిస్తూ, సృష్టిస్తూ వున్నాడు; సర్పం మీద నిటారుగా నిలబడి, తన సమస్త విజయోపేత పరాక్రమంతో దానిని అణచివేసాడు, అదే విశ్వానికి శాశ్వత జన్మను ఇచ్చింది. అప్పుడు చైతన్యము పురుషుడిగా మారి తన రూపము ఇంకోసారి పరివర్తన చెందుతున్నదని గ్రహించింది; అది ఇక నెంత మాత్రం రూపం కాలేనిది అన్ని రూపాలను కలిగివున్న దానిలో లీనమైంది. అదేదో మార్పు లేనిది చూచేది — దివ్యనేత్రం, దివ్యసాక్షి. అది దేనిని చూస్తుందో అదే వుంటుంది, వుంది. అప్పుడు ఈ రూపం యొక్క చివరి చిహ్నము అదృశ్యమయ్యి, చైతన్యం తనంతట తానే — అవర్ణనీయం, అనిర్వచనీయంలో నిమజ్జనమైంది.

ఇది ఎంతో నిదానంగా కాంతి, శక్తి, సంతోషము, ఆరాధనల స్థిరమైన నిశ్చల వైభవంతో అనుక్రమిక దశలలో వ్యక్తిగత దైహిక చైతన్యం వైపుగా మళ్ళింది, కానీ తిరిగి వైశ్విక, భౌతిక రూపాల ద్వారా కాకుండా ప్రత్యక్షంగా జరిగింది. అది ఎలా వుందంటే ఎంతో అణుకువగల భౌతిక రూపము ఎటువంటి మధ్యవర్తిత్వము లేకుండా సర్వోన్నత, శాశ్వత సాక్షి ప్రత్యక్ష, తక్షణ ఆచ్ఛాదనలాగ వుంది.

CWM 1:311-12 *అనువాదం: సునీతశేఖర్ (9395327337)*



అఖిల

అఖిల భారత పత్రిక – మార్చి 2020

భిన్నత్వంలో యేకత్వం


భిన్నత్వంలో యేకత్వం

విషయసూచిక

సంపాదకీయం:

ఈనాటి సత్యం, వివాదాలు, యుద్ధాలు అయినట్లైతే మానవజాతి అనివార్య భవిష్యత్తు యేకత్వం. ఇదలా యెందుకనంటే బయట మనం, భేదాలను, చీలికలను చూస్తున్నప్పటికీ అంతరాంతర లోతులలో ఒక రహస్య యేకత్వం వున్నందుచేత. ఈ భిన్నత్వం కూడా మహాకార్యంలోని భాగమే. అది భిన్నత్వంలో యేకత్వాన్ని సృజించడానికున్నది. ఏకత్వ ఆధారంపై ఒక అనంత అభివ్యక్తి, సృష్టి మహాకార్యంగా కన్పిస్తోంది. మన ఆంతరిక స్థలాలలో, అత్యాశ, ద్వేషం, భయాలకు వ్యతిరేకంగా మహా పోరాటాలు సాగుతున్నట్లుగానే, మన అస్తిత్వాన్ని ఒకటిగా చేయడంలో, యేకత్వరహస్య ఆవిష్కరణ కూడా జరుగుతూనేవుంది. భిన్నత్వంలో ఏకత్వమనే విషయానికి యీ సంచికనంకితం చేస్తున్నాం.

అనువాదం: కె.వి.రావు (9849929254)



ఇక్కడి సర్వస్వం ఓ నాటి కామె ప్రేమ ధామంగా మారు.
సర్వ వైరుధ్యతలు ఆమె సామరస్యతను తయారుచేయు,
మన జ్ఞానమామె దిశగా ఎగ్రబాకు ఆవేశము తడబడుతు సాగు
ఆమె మహిమాన్విత ప్రహర్షంలో వసించెదము,
ఆమె కౌగిలియందు మన బాధ మహదానందముగ మారు.
మన ఆత్మ ఆమె ద్వారా సమస్త యేకాత్మ యగును
సావిత్రి, పు. 314 అనువాదం: అందుగులపాటి. కైలాసపతి

భువికై, మానవులకై మదర్ కార్యక్రమం

సార్వత్రిక లక్ష్యం

సాధించవలసిన సార్వత్రిక లక్ష్యం ఏమిటనగా అభ్యుదయం దిశగా సాగే సార్వత్రిక సామరస్య స్థాపన.

ఈ లక్ష్యాన్ని సాధించటానికి గల మార్గాలు:

ప్రపంచానికి సంబంధించి, అద్వైతంగా అంతర్భూతమై ఉన్న దివ్యత్వాన్ని అందరిలో జాగృతం చేయడం ద్వారా అందరిలో ఆమోదింప చేయడం ద్వారా మానవ జాతి ఐక్యతను సాదించాలి.

అనగా మనందరిలో దైవ సామ్రాజ్యం స్థాపితమై ఉన్నదనే సత్యాన్ని బలపరచడం ద్వారా ఐక్యతను సాధించడం.

అందుచేత ప్రధానంగా నిర్వర్తించవలసిన అత్యంత ప్రయోజనకరమైన కార్యం:

1. ప్రతి ఒక్కరు వ్యక్తిగతంగా, తనలో దైవసన్నిధి ఉన్నదనే ఎరుకను పొంది దాని తో స్వయంగా తాదాత్మ్యం చెందాలి.

2. మనిషి లో నేటివరకు తెలియని తన అస్తిత్వ స్థితులను, వ్యక్తీకరించి తద్వార ప్రపంచానికి ఇప్పటికీ దాని కందుబాటులో లేకుండా నుంచబడిన విశ్వ క్రియాశక్తి ఉత్పత్తి స్థానాలలో ఒకటి లేక మరిన్నింటితో సంబంధం నెలకొల్పాలి.

3. లోక వర్థమాన మనః ప్రవృత్తికి అనుగుణమైన విధంగా మలచబడిన భగవ దాదేశాన్ని లోకానికి తెలిసేటట్లుగా పునః ప్రకటించాలి.

ఈ కార్యం సమస్త మానవజాతి జ్ఞానసంపదయొక్క సంయోజనమవుతుంది.

4. సమష్టిగా ఒక ఆదర్శవంతమైన సమాజాన్ని ఒక నూతన జాతిని, దైవసంతతికి చెందిన జాతిని, పరిణతి చెందడానికి అనువైన కేంద్రంలో స్థాపించాలి.

ద్వివిధ ప్రక్రియలు

ప్రాపంచిక పరివర్తనను, సామరస్య వాతావరణ స్థాపనను రెండువిధాలుగా చేయవచ్చు. అవి పైకి పరస్పర విరుద్ధమైనవిగా కనిపించినప్పటికీ ఏకమై తీరాలి. ఒక దానినొకటి ప్రభావితంగావించుకొని, రెండూ పరిపూర్ణ పరిపూర్ణమౌతాయి.

1. దైవసన్నిదితో కలిసిపోవడానికి దారితీసే వ్యక్తిగత పరివర్తనను అంతర్గత అభివృద్ధిని సాధించాలి.

2. సామాజిక పరివర్తనకు, వ్యక్తిగత అభివృద్ధికి వికసనానికి అనుకూలమైన వాతావరణం ఏర్పాటు చేయాలి.

ఒక వైపు వాతావరణం వ్యక్తిపై ప్రభావం చూపుతుంటే, మరొకవైపు వాతావరణం విలువ, వ్యక్తికున్న విలువపై ఆధారపడి వుంటుంది గనుక, ఈ రెండు ప్రక్రియలు సమాంతరంగా సాగాలి. కాని అది నెరవేరడానికి శ్రమ విభజన జరగాలి. అందుకు బృందాలు రూపొందటం ఆవశ్యక మౌతుంది, సాధ్యమైతే అది అంచెలంచలుగా వుండాలి.

ముప్పేట కార్యక్రమం

బృందాలకు చెందిన వ్యక్తుల కార్యక్రమం మూడు విధాలుగా సాగాలి:

1. సాధించవలసిన లక్ష్యాన్ని ప్రతి ఒక్కరు వారిలో వారు స్పష్ట పరచుకోవాలి. అనూహ్యమైన దివ్యత్వ ప్రప్రథమ సాక్షాత్కారం సర్వవిధ సంభావ్యతలకు, ప్రత్యేక లక్షణాలకు, గుణగణాలకు వ్యక్తి ప్రాపంచిక ప్రతినిధి కావాలి.

2. ఈ ఆదర్శాన్ని మౌఖికంగా ప్రచారం చేయాలి. కానీ అన్నింటిని మించి ఉదాహరణ ద్వారా ఆ విధంగా దానిని వాస్తవం చేసుకొని తిరిగి తాము ఆ ముక్తిని చాటేవారిగా తయారుకావడానికి సన్నద్ధులైన వారినందరిని కనుగొనాలి.

3. ఒక నమూనా సమాజాన్ని స్థాపించాలి. లేక ఈ వరకే స్థాపించబడిన వాటిని పునః వ్యవస్థీకరించాలి.

ద్వివిధ కృషి

ప్రతి ఒక్క వ్యక్తి సైతం రెండు విధాలుగా శ్రమించవలసి ఉంటుంది. సమాం తరంగా ఒక పార్శ్వం మరొక దానికి సహాయపడుతూ, పరిపూర్ణంగావిస్తూ:

1. ఒక అంతర్గతమైన అభివృద్ధి, దివ్యతేజోమయ చేతనతో సంస్కారణాత్మకమైన సంయోగం ఏర్పరుచు కోవాలి. మహోన్నతమైన విశ్వజీవన స్రవంతితో సామరస్య పూర్వకంగా సాగడానికి ఇది ఏకైక నిబంధన.

2. బహిర్ముఖంగా సాగే కార్యక్రమం దేనినైతే ప్రతి ఒక్కరు వారివారి సమర్థతను,

వ్యక్తిగత ఇష్టాయిష్టాలననుసరించ యెన్నుకోవలసివున్నదో, అందులో వ్యక్తి తనకు అనుగుణమైన స్థానం, ఏదైతే తానొక్కడే నిర్వహించగలడో దానిని కనుగొని, దానికి తనంతటతానుగా అంకితం చేసుకోవాలి. ఆ కార్యక్రమం ఒక సామూహిక స్వర సమ్మేళనమైనట్లయితే, తాను అలపిస్తున్న స్వరం ఒక్కటే అయినప్పటికీ, అది ఆ స్వరసమ్మేళన సర్వతోముఖ పరిపూర్ణతకు ఆవశ్యకమైనదని, దాని విలువ దాని ఔచిత్యంపై ఆధారపడి ఉంటుందనే విషయాన్ని విస్మరించకూడదు.

CWM 2: 49-50

శ్రీమాత

వ్యక్తిలోని భిన్నపార్శ్వాల మధ్య పొందిక, మన అస్తిత్వంలో ఐక్యతను, సమత్వమును ఏర్పరచుకొనే మార్గం?

సంకల్పశక్తిని దృఢపరచాలి. నీలో నియమనిబంధనలను పాటించని పార్శ్వాలపట్ల చెప్పిన మాటవినని పిల్లలతో ప్రవర్తించినట్లుగా వ్యవహరించాలి. ఓరిమితో వారిపై నిరంతరం నిఘానుంచాలి. వారు చేసింది పొరపాటని వారు సమ్మతించేటట్లుగా నచ్చ చెప్పాలి.

నీ చేతనలోని లోతుల్లో నీలోని దైవానికి నిలయమైన చైత్యపురుషుడున్నాడు. దానిని కేంద్రంగా చేసుకొని దానిచుట్టూ నీ అస్తిత్వ పరస్పర విరుద్ధమైన చర్యలమధ్య, పరస్పరం విభేదించుకొనే పార్శ్వాలమధ్య ఐకమత్యత ఏర్పడాలి. ఒక్కమాటు నీ చైత్యపురుష చేతనను, దాని అభిలాషను నీవు అందుకోగలిగినావంటే, ఈ సందేహాలను సంక్లిష్టతలను నిర్మూలించవచ్చు. అందుకు ఎంతో కొంత సమయం పడుతుంది కానీ చివరికి నీవు తప్పక జయిస్తావు. ఒక్కమారు నీవు "నేను నీ దానిగా నుండ కోరుతాను"అని దైవం దిశగా మళ్ళినప్పుడు, "సరే" నని దైవం ఒప్పుకున్నట్లయితే, ప్రపంచమంతా ఏకమయినప్పటికీ అది నిన్ను అతడినుండి దూరం చేయలేదు. ఎప్పుడైతే అతి ప్రధానమైన అస్తిత్వం శరణాగతి చెందిందో, కీలకమైన అవరోధం తొలగిపోయినట్లే. బాహ్యమైన అస్తిత్వం గట్టి పొరలాంటిది. సామాన్య జనుల్లో అది ఎంత మందంగా, గట్టిగా నుంటుందంటే వారికి వారిలోనే ఉన్న దైవాన్ని గురించిన ఎరుక ఉండదు. ఒక్కసారి క్షణమాత్రం, అంతర్భూతమై ఉన్న అస్తిత్వం, "నేనిక్కడే ఉన్నాను, నేను నీ దానిని" అని అన్నట్లయితే, అది ఒక వంతెన నిర్మించినట్లుగా నుంటుంది. కొద్ది కొద్దిగా పైపొర ఎంతగా సన్నబడుతుదంటే ఆ రెండు విభిన్న

పార్శ్వాలు పూర్తిగా కలిసిపోయి, అంతర్గతమైనది, బాహ్యమైనది ఒక్కటి అవుతాయి.

CWM 3: 6- 7 *అనువాదం: అందుగులపాటి కైలాసపతి (040 24240669)*

విభజన, అశాంతులను నిర్మూలించుట

ఏకైక యధార్థ సామరస్యత:

ఉన్నది ఒకే ఒక యధార్థ సామరస్యత మాత్రమే, అది అతిమానసికం — సత్య పాలన, దివ్యనియమ వ్యక్తీకరణ. కాబట్టి అతి మానసంలో యాదృచ్ఛికతకు స్థానంలేదు. కాని నిమ్న ప్రకృతిలో ఉత్తమోత్తమ సత్యం మరుగున ఉంటుంది. అందువలన దేనియందు కార్యకర్తల క్రమబద్ధత వున్నదో, ఆ దివ్య యేకత లుప్తమై పోయింది. ఈ ఐక్యత లేకపోవడంతో నిమ్నప్రకృతి క్షేత్రం యాధృచ్ఛికమని మనమనుకుంటున్న దానితో పాలింపబడుతుంది. అంటే నిర్దిష్టమయిన ఒక్క లక్ష్యం కూడా లేకుండా ఘర్షించుకొనే వివిధ శక్తులు పరస్పరం కలిసిపోయే రాజ్యమిది, శక్తులు కలిసినటువంటి వేగగతినుండి ఉత్పన్నమయేదేదైనా గందరగోళానికి పొందిక లేక పోవడానికి అసత్యానికి ఫలితం — యాదృచ్ఛికంగా సంభవించేదే. ఇది పని చేస్తున్న కారణాల గురించిన మన అజ్ఞానాన్ని కప్పి పుచ్చుకునేందుకు కేవలం ఒక భావన గాదు, యాదృచ్ఛికత. అంటే ఇది దివ్యసత్యంయొక్క స్థిరమయిన, సునిశితత్వం లోపించిన ఆ నిమ్న ప్రకృతియొక్క అనిశ్చితమయిన జగడపు వర్ణన. ప్రపంచం తన దివ్య ఆరంభాన్ని మరచిపోయి అహంభావశక్తుల రాజ్యమైంది. కాని సత్యానికి తెరుచుకుని ఉండడం, ఆకాంక్షతో క్రిందికి పిలవడం, యాదృచ్ఛికతా భ్రమణంలో మార్పు తీసుకురావడం యింకా సంభవమే. మనుషులు వారి మానసిక సహవాసాలు, అనుభవాలు, సాధారణీకరణాల వలన యాంత్రికమయిన వరుస సన్ని వేశాలుగా వేటిని పరిగణిస్తున్నారో అది నిజానికి సూక్ష్మ మాధ్యమాలతో కూర్చబడు తున్నది. ఆ మాధ్యమాల్లో ప్రతి ఒక్కటీ తన సంకల్పం ప్రకారం చేయాలని ప్రయత్నిస్తు న్నది. ప్రపంచం ఈ అదివ్యప్రతినిధుల కెంతగానో లొంగిపోతున్నది. సత్యంయొక్క గెలుపు, పోరాడితే తప్ప సాధింపలేనిదయింది. అందుకు దీనికి హక్కులేదు. అసత్యాన్ని, అక్రమ నడతను కాదని దానినది పొందాలి, విషయాలన్నింటి ప్రారంభం చివరికి

దివ్యత్వానికే చెందుతుందన్న సులభమయిన అభిప్రాయం ఒక ప్రధానమయిన భాగమవడంవలన వారి తక్షణ కార్యకలాపాలన్నీ గూడా సూటిగా దానినుండే జరగాలి. వాస్తవమేమిటంటే ఇక్కడ నిమ్నప్రకృతిలో జగత్సంబంధ మూర్ఖత్వంలో దివ్యత కప్పబడి ఉంటుంది. ఏది జరిగినప్పటికీ అది సూటిగా దివ్యజ్ఞానంనుండి రావడం జరుగదు. ప్రతి ఒక్కటీ సమానంగా దైవసంకల్ప మనడం శత్రుప్రభావాలకెంతో సౌకర్యవంతమైన సలహా. దేనికి, ఏది, ఎంత సాధ్యమయితే అంత అప్రకమానికి, కురూపానికి, తగ్గించి, దానిని ఎంతో గట్టిగా సృష్టికి అంటిపెట్టుకునేటట్లు చేస్తుంది. కాబట్టి చేయవలసిందేమిటని మీరడగరా? మంచిది, వెలుగును క్రిందకి పిలవండి, రూపాంతర శక్తికి మిమ్ములను తెరచి ఉంచండి.... పాత, క్రొత్తల మధ్య పోరాటం యోగానికి కీలకాంశమవుతుంది. కాని మీకు వెల్లడయే ఉత్తమనియమంపట్ల, క్రమతపట్ల విశ్వాసంతో ఉన్నట్లయితే అదృష్టసంకల్ప సంస్థానానికి చెందిన మీ ఉనికి యొక్క భాగాలు ఎంతో నెమ్మదిగానయినప్పటికీ, , మార్చబడతాయి. దివ్యంజేయబడతాయి.

CWM 3: 163-64

ఒకింత వెనుదగ్గి, అంతర్విచారణ చేయండి

ఎప్పుడయినా మీరు తప్పు చేసినట్లు అప్రయత్నంగా — ఎటువంటి ప్రయత్నం లేకుండా అప్రయత్నంగా — గ్రహించారా? మిమ్మల్ని అకస్మాత్తుగా తట్టి లేపే బాహ్యప్రతి చర్య గురించిగాదు నేను మాట్లాడుతున్నది, “అయ్యో, దేవుడా, నేనేం చేశాను?” అని మీరనడం గురించికాదు నేను మాట్లాడుతున్నది. మీరేదైనా చేస్తే, ఏదైనా అనుభూతి చెందితే ఏదయినా చెప్తే, సరళంగా రోజుకోడజను (కనీసం) స్వల్పమయిన జగడాలగురించి, మూఢమయినవాటి గురించి వింటుంటే వాటిని తీసుకుందాం, (తన కొక కారణం ఉండడం వలన అటువంటి వాటి కోసం ఎలా పోట్లాడగలిగానని ఆశ్చర్యంగా ఉంటుంది) సరే, ఆ సమయంలో మీరనగూడని మాట లంటున్నప్పుడు, అవెంత వివేకహీనమో, నిజంగా మీరెంత మూర్ఖంగా ఉన్నదీ అప్రయత్నంగా గమనిస్తారా? (అంతకంటే హీనంగా అనకుండా ఉండాలన్నది).... మీరెప్పుడూ సాకు చూపిస్తారు. ఇతరులదే తప్పన్న భావముంటుంది. మీదే సరయినదని పైగా అతడిదే తప్పని చెప్పాలన్నభ్రమ, అవును, ఉండదా? అలా చేయకపోతే అతడికెప్పటికీ తెలియదని! అంతేగదూ? ఆ విషయాన్ని స్పష్టంగా

ఓ చిన్న మైక్రోస్కోపు క్రింద ఉన్నట్లు పెడుతున్నాను. కాబట్టి అది కొంత పెద్దదిగా కన్పించవచ్చు. కాని అది అటువంటిది. అదలా ఉన్నంతవరకు, సత్యచైతన్యాన్నుండి ఓ మిలియన్ మైళ్ళ దూరంలో ఉన్నట్లు మీరు వెంటనే, తక్షణమే అడుగు వెనుకకు వేయలేక, మరొక వ్యక్తి స్థానంలో మిమ్మల్ని ఉంచుకుని, అతనికీ భావ మెందుకొచ్చిందో అర్థం జేసుకొని, మీ బలహీనతనో క్షణకాలంపాటు చూసి, ఈ రెండింటినీ పోల్చి చూచుకోలేనప్పుడు, "మంచిది, ఇది అదే, అది నిజమయిన విషయం" అంటూ ఓ ముగింపుకొస్తారు. దీనర్థం మీరింకా ఎంతో దుడుకుగా ఉన్నారని. మీరిది అప్రయత్నంగా, తక్షణమే చేయగల్గితే, అప్పుడు మీరు కొంత పురోభివృద్ధి చెందినట్లు సంతృప్తి చెందవచ్చు.

CWM 5: 63- 64

వాదించేబదులు అర్థం చేసుకోండి

వాదించడమారంభించినప్పుడు, వెంటనే, తక్షణమే నెమ్మదిగా ఉండండి. మీరు మౌనంగా ఉండాలి. ఏమీ అనగూడదు, దానినప్పుడు మరొకవ్యక్తి చూస్తున్నట్లు చూడడానికి ప్రయత్నించండి. మీరు చూసే విధానాన్నది మరువ నివ్వదు, ఎంత మాత్రం చేయదు! కాని ఆ రెండింటిని కలిపి ఉంచగలుగుతారు. నిజంగా మీరభివృద్ధి చెందినట్లు, నిజమయిన అభివృద్ధి.

ప్రతి దానికీ యింతే ఇతరులతో కలిసి చేసే దానంతటితో, మీ రామోదించకుంటే, అది దివ్యకృపన్నట్లు, అభివృద్ధి చెందడంకోసం మీ కొక అద్భుతమైన అవకాశాన్ని ఇచ్చినట్లు భావించండి. ఇది సరళమయింది. ఇటువైపుండే బదులు అటువైపుంటారు. మీ వంక చూసుకుంటుండే బదులు అవతలవ్యక్తిలోకి ప్రవేశించి చూస్తారు. మీకేదో కొంత ఊహ ఉండాలి. మీ ఆలోచనలమీద, మీ కదలికలమీద మరికొంత నియంత్రణ ఉండాలి. కాని అదెంతో కష్టంగాదు. దానిని కొంత ప్రయత్నించి ఉంటే, కొంతకాలాని కదెంతో సులభమని తెలుసుకుంటారు.

ఊరక చూడడం, అప్పుడు మానసిక ప్రయత్నంచేసి, మీకు మీరు; 'ఇదెంతుకిలా ఉన్నది, అలా ఉన్నది? అతడెందుకలా చేశాడు? అతడెందుకలా వున్నాడు?' అని చెప్పడంగాదు, మీరెక్కడికీ చేరలేరు, మీరర్థం చేసుకోలేరు, అన్ని రకాలయిన విలువలేని వివరణలనూ ఊహిస్తారు, "ఆవ్యక్తి మూర్ఖుడులేక దుష్టుడు" అని అనుకోవడం

కంటే మీకేదీ బోధించదు, విషయాలెక్కడికీ దారి దీయవు. మరొకప్రక్క ఆ చిన్న కదలిక మాత్రమే చేసి, మీ కెంతో సంబంధమున్న వస్తువును, చూస్తున్నట్లుగా అతడిని చూడకుండా, అందులోనికి, మీ ముందున్న ఆ చిన్న తలలోనికి ప్రవేశించడానికి ప్రయత్నిస్తే అప్పుడకస్మాత్తుగా మీరావైపున్నట్లు తెలుసుకుంటారు. మీ వంక చూసుకుంటారు. అతడు చెప్తున్నదేమిటో బాగా అర్థం చేసుకుంటారు. ప్రతిదీ ఎందుకు, ఎలా, దానికి కారణం, ఆ మొత్తం వెనుక ఏ భావమున్నదో, స్పష్టంగా తెలుస్తుంది.

CWM 5:219- 220

సహనం పెంచుకోవడం

ప్రజలకు జ్ఞానంయొక్క సాపేక్షత, విశ్వాసంయొక్క సాపేక్షత, బోధనలసాపేక్షత, పరిస్థితుల సాపేక్షత, ఒక విషయం యెంత సాపేక్షంగా ఎంతవరకు ప్రధానమైందో తెలిస్తే, ప్రపంచంలోని పలు హైన్యతలు, విపత్తులు లేకుండా పోతాయి. ఇదాక్షణానముఖ్యమైనదనిపించవచ్చు. ఇది మీ జీవితానికి,మరణానికి దారి తీయవచ్చు—నేను మాట్లాడుతున్నది భౌతిక జీవతం, మరణాల గురించి కాదు, ఆధ్యాత్మ జీవితం మరణాల గురించి. కాని యిది కేవలం క్షణికం. మీరు కొంత అభివృద్ధి చెందినప్పుడు ఆధ్యాత్మిక వైఖరిలో కొన్ని సంవత్సరాలు యెదిగివుంటే, యీ విషయంగురించి ఒకసారి వెనక్కు చూస్తారు. ఈ పరిస్థితి లేక భావం, బహుశా మీ జీవితాన్ని నిర్ణయించి ఉండవచ్చు. అదెంతో సాపేక్షకంగా, యెంతో ప్రధానంగా కన్పిస్తుంది. ఓ నూతన పురోగతికోసం యింకా ఉన్నతమైనదేదో మీ కవసరమౌతుంది.

తానిది ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటే ఒకమతంలో వేర్వేరు తెగల పోరాటాన్ని ఎంతో అసహనాన్ని లేకుండా జేసి, వెంటనే తగవులన్నింటినీ లేకుండా జేస్తాడు. ఎందుకంటే కేవలం యిదే తగవులంటే, ఒక రొకవిధంగా మరొకరు మరొక విధంగా విషయాన్ని కలిగి ఉండడం, వాటి నొక్క చోటుకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించి వాటిని సామరస్యం జేయడమెలాగో తెలుసుకోకుండా, ఒకదానికి విరుద్ధంగా మరొకటుంచి పిడికిళ్ళు బిగించి పోట్లాడుకోవడం. ఇది తప్ప మరేమీ ఉండదు.

కాని మీ దృష్టి, మీ ఆలోచన, ఏది మంచన్నదానిపట్ల యీ నిశ్చయం పూర్తిగా సాపేక్షకమని, విశ్వనడతలో యిదెంతవరకు సాపేక్షకమో తెలుసుకుంటే అప్పుడు

మీ ప్రతి చర్యలలో తక్కువ కఠినంగా ఎక్కువ సహనంతో ఉంటారు.

CWM 5: 63- 64 శ్రీమాత

అనువాదం: జి. అరుణామోహన్ (9866117137)

ఇతరులను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించు

ఇంకో వ్యక్తి చైతన్యంలో ఏం జరుగుతున్నది తెలుసుకోవటానికి నీవు వారి చైతన్యంలోకి ప్రవేశించే ప్రయత్నం ఎప్పుడైనా చేశావా? ఇంకొకరిలోకి నీ చైతన్యాన్ని ప్రక్షేపించడం ద్వారా కాదు, అప్పుడు అతడిలో నిన్ను నువ్వు కనుక్కొంటావు. అది అంత ఆసక్తిదాయకమైనది కాదు. అతడిలోని చైతన్యంతో అనుబంధంలోకి ప్రవేశించడం ద్వారా తెలుసుకోవాలి. ఉదాహరణకు ఏదో ఒక కారణంచేత నువ్వు అన్ని విధాలా చూడనంత వరకూ దాని వలన ప్రయోజనం లేదు; ఒకరు ఒక విధంగా ఇంకొకరు ఇంకొక విధంగా గ్రహించడం వుంటుంది. మనుష్యులు విచక్షణతో వుంటే ఘర్షించరు. విచక్షణ లేకపోతేనే ఘర్షణ ప్రారంభిస్తారు. అలా కలహించే బదులు ఇతరుల చైతన్యంలోకి ప్రవేశించి, ఆ వ్యక్తి విషయాలను ఎందుకు అలా చెబుతున్నాడు, ఇలా చేయటానికి గానీ, మాట్లాడటానికి గానీ అతడిని వత్తిడి చేస్తున్నది ఏది? అని నిన్ను నీవు ప్రశ్నించుకోవటం ఉత్తమం. దీని అంతర్యమేమిటి, అతడిని ఈ వైఖరికి తయారుచేసిన విషయాలను అతడు ఎలా దర్శించాడు? ఇది ఎంతో ఆసక్తికరంగా వుంటుంది. నువ్వు ఒకవేళ దీనిని చేసినట్లైతే కోపం తెచ్చుకోవటాన్ని వెంటనే ఆపేస్తావు. మొదటి అంశం, నువ్వు ఎప్పటికీ కోపగించుకోవు. కనుక ఇది అప్పటికి నువ్వు పొందిన గొప్ప లాభం. ఇంకా ఇతరులు కోపంగా వుండటాన్ని కొనసాగించినా అది నీపై ప్రభావం చూపదు.

అటు పిమ్మట ఇంకా పరిపూర్ణంగా ఏకతను పొందటానికి ప్రయత్నించవచ్చు. విభజనకు, విరూపానికి దారితీసే చలనాలను నివారించి, ఘర్షణలను ఆపివేయవచ్చు. ఇది ఎంతో ప్రయోజనకరమైనది.

CWM 6: 424- 25

ప్రచారకర్త ఆత్మ నిశ్చయం

భగవంతుని మొత్తం సంక్లిష్టతలో ప్రపంచం భగవంతుడి ప్రకటన అన్న భావ

నకు నువ్వు చేరుకున్నట్లైతే, ఆ సంక్లిష్టత, భిన్నతల ఆవశ్యతకను గుర్తించాలి. అప్పుడు ఇతరులను నీలా ఆలోచించి, అనుభూతి చెందేటట్లు చేయాలని నీ వను కోవడం నీకు సాధ్యమవుతుంది.

ప్రతి ఒక్కరికీ ఆలోచనలో, భావనలో, ప్రతిచర్యలో తనదైన స్వంత విధానం వుండాలి: ఇతరులు నువ్వు చేసినట్లుగానే చేస్తూ, నీలాగే వుండాలని ఎందుకు అను కుంటావు? ఇతరుల కన్నా నీ సత్యం గొప్పదని భావించడం కూడా అర్థం లేనిదే, ఒకానొక దృక్పథంలో అన్ని సత్యాలు ఒకటే; అవన్నీ సాక్షికమైనవి, కానీ అవి సత్యమే, ఎందుకంటే అవి అల్ప సత్యాలు. నీ పొరుగువాడి కన్నా నీ సత్యం గొప్పదనుకున్న మరు నిముషమే నీవు సత్యం నుండి దూరం కావటం మొదలవుతుంది.

నీలాగే ఇతరులు ఆలోచించాలని వత్తిడి చేసే అలవాటు ఎప్పటికీ నాకు కొత్తగానే కనిపిస్తుంది; దీనినే నేను "ప్రచారకర్త ఆత్మ నిశ్చయం" గా పిలుస్తాను. ఇది చాలా దూరం తీసుకెళుతుంది. ఇంకొక్క అడుగు ముందుకు వెళ్ళి నువ్వు చేసేదాన్ని ఇతరులు చేయాలని, నీలాగే భావించాలని కోరుకుంటావు. అప్పుడు అది ఒక దారుణమైన సమరూపకత అవుతుంది.

CWM 8: 105

నీ పని మీద శ్రద్ధ పెట్టు

తాను సత్యమని తలచే దానికి ఇతరులను ఒప్పించవలసిన అవసరం ఎంత మాత్రమూ లేదని భావించే ఒక సమయమొస్తుంది. దీన్ని నేను నీకు ధృవీకరించగలను.

నా గురించి గానీ నేను సాక్షాత్కరించుకునే సత్యం గురించిగానీ ఎవరైనా విమర్శిస్తే...

వారితో మర్యాదగా చెప్పు. "నీ పని నువ్వు చూసుకో" అని. అక్కడితో దాన్ని వదిలిపెట్టాలి. నువ్వు విమర్శించే వ్యక్తిని అలా విమర్శించటం తప్పు అని ఒప్పించాలని అనుకుంటావా? అలా ఎంత ఎక్కువగా అతడితో నువ్వు చెబితే అంత ఎక్కువగా అతడు తనది యుక్తమైనదని విశ్వసిస్తాడు.

CWM 8:106



ప్రపంచం ఒక దర్పణం

ఒక వ్యక్తిలో ఏదైనా కొంత నీకు పూర్తి అసమ్మతంగా లేదా అసంబద్ధంగా కని పిస్తే, "అతను అలాగే వుంటాడు అలాగే ప్రవర్తిస్తాడు, అలాగే అంటాడు, అలాగే చేస్తాడు మంచిది, అదే విషయాన్ని ఎరుక లేకుండా నేనూ అలాగే చేస్తానేమో. అతడిని విమర్శించడానికి బదులు నా అంతరంలోకి నేను చూసుకోవటం ఉత్తమం. దానివలన అదే విషయాన్ని కొంచెం భిన్నంగా నేను చేయటం లేదన్నది నిర్ధారణవు తుంది." అని నీకు నీవు చెప్పుకోవాలి. ఇటువంటి వివేచన, వివేకాలను, కలిగి ఉం టే ఇంకో వ్యక్తి ప్రవర్తనకు అఘాతపు తాకిడికి గురయిన ప్రతిసారి, జీవితంలో ఇత రులతో నీ అనుబంధాలు ఒక దర్పణం లాంటివని, దానివలన నీలో నువ్వు కొనసాగి స్తున్న బలహీనతలను ఇంకా సులభంగా, స్పష్టంగా చూడగలవని అర్థం చేసుకుంటావు.

ఒక సాధారణమైన, సమగ్ర విధానంలో ఇతరులలో నిన్ను మానసిక వ్యాకులతకు గురిచేసేది నీలో నువ్వు కొంత ఎక్కువ, తక్కువలుగా ముసుగుతో కొనసాగించేదే, స్వల్పంగా భిన్నవేషంలో వుంటూ నిన్ను భ్రమింపజేసేదైనప్పటికీ, కొంచెం ఎక్కువ తక్కువగా అది నీలో దాగివున్న రూపం. నీలో వున్నది నీకు తగినంత ఆక్షేపించ రానిదిగా, కనిపించినా ఇతరులలో చూసినప్పుడు అది భూతంలా అవుతుంది.

దీనిని అనుభవించడానికి ప్రయత్నించు; నిన్ను నువ్వు పరివర్తన చెందించుకోడానికి ఇది గొప్పగా సహాయపడుతుంది. అదే సమయంలో ఇతరులతో ఉన్న నీ అనుబంధా లలో ఒక ప్రకాశమాన సహిష్ణుతనది తీసుకువస్తుంది. అర్థం చేసుకోవటంలో సహృదయత కొనితెస్తూ, తరచుగా ఈ అర్థరహిత కలహాలను అంతమొందిస్తుంది.

CWM 10:21- 22

కలహించకుండా జీవించవచ్చు

కలహించకుండా యెవరైనా జీవించవచ్చు. ఇలా అనుకోవటం కొత్తగా అనిపించ వచ్చు. ఎందుకంటే విషయాలు దీనికి విరుద్ధంగా జీవితం అంటే ఘర్షణ అన్నట్లుగా కనిపిస్తాయి. ఒక అర్థంలో మనుష్యులు కలిసి వుంటే వాళ్ళ ముఖ్యమైన చర్య బాహాటంగా లేదా మర్మంగా కలహించడమే. ఆ కలహం మాటలదాకా, అదృష్టవశాత్తు, దెబ్బలాటలదాకా రాకపోవచ్చుగానీ, అంతరంలో నిరంతరమూ ఒక చికాకు స్థితి

వుంటుంది. ఎందుకంటే నువ్వు ఏ పరిపూర్ణతను వాస్తవం చేసుకోవాలని కోరుకుంటావో దానిని నీ చుట్టూ కనుగొనలేకపోతున్నావు, విశేషించి, అలా వాస్తవం చేసుకోవడం పూర్తిగా కష్టం అనుకుంటావు. కానీ యితరులు దానిని వాస్తవం చేసుకోవాలని సహజంగా అనుకుంటావు.

"వాళ్ళు అలా ఎలా వుండగలరు?" అనుకుంటావు.... కానీ నువ్వు "అలా వుండకుండా వుండటం!" ఎంత కష్టమో, అన్నదాన్ని మరచిపోతావు. నీలో నీవు తెలుసుకోవటం మరచిపోయావు. ప్రయత్నించు నీకే తెలుస్తుంది. అప్పుడు నువ్వు ప్రతిదానిని ఒక ఔదార్యంతో కూడిన దరహాసంతో పరికిస్తావు.

నిన్ను చీకాకు పరచే విషయాలన్నింటినీ నీకోసం వున్న ఒక పాఠంలాగ తీసుకో, నీ జీవితం ఇంకా ప్రశాంతంగా, మరింత ప్రభావవంతంగా వుంటుంది. నీ శక్తిలోని అధిక శాతం నువ్వు నీలో వాస్తవం చేసుకోవాలనుకున్న పరిపూర్ణతను ఇతరులలో కనిపెట్టకపోవటం చేత నువ్వు పొందే చీకాకులో వ్యర్థమవుతుంది.

ఇతరులు వాస్తవం చేసుకోవాలనే పరిపూర్ణతవద్ద కొంచెంసేపు నువ్వు ఆగిపోతావు, నీ కోసం నీవు అన్వేషించే గమ్యం గురించిన యెరుకవుండదు. ఆ చైతన్యంతో నువ్వు వుంటే నీకు ఇవ్వబడిన కార్యంతో ప్రారంభించు. అంటే ఇతరులతో సంబంధం పెట్టుకోకుండా నీవు ఏం చేయాలనుకొన్నావో దాన్ని వాస్తవం చేసుకో, ఎందుకంటే అది నీ పని కాదు. నిజమైన వైఖరి ఉత్తమ మార్గమేమంటే, "నా చుట్టూ వున్నవాళ్ళు, నా జీవింతలోని పరిస్థితులు, నాకు దగ్గరగా వున్న వ్యక్తులు, ఇదంతా నేను పురోగమించవలసిన దాన్ని నాకు చూపించడానికి దివ్యచైతన్యం నిలబెట్టిన ఒక దర్పణం. ఇతరులలో ఏదైనా నన్ను తీవ్ర చీకాకుకు గురిచేస్తుంది అంటే నేను నా కోసం చేయవలసిన ఒక కార్యం వుందని అర్థం." అని చెప్పుకోవాలి.

ఒకవేళ నిజమైన పరిపూర్ణతను ఎవరైనా సాధిస్తే, ఎంతో తరచుగా ఇతరులలో దానిని కనుగొంటారు.

CWM 10:22- 23

నీ చైతన్యాన్ని సార్వత్రికం కానివ్వు

ముందుగా ఇప్పుడు నేను నీతో ఏం చెప్పానో నీకు తెలిసి వుండాలి. నువ్వు మొత్తంలో ఒక భాగానివి, ఈ మొత్తం ఇంకొక గొప్ప మొత్తంలోని భాగం, అది

ఇంకా గొప్ప మొత్తంలోని భాగం. దీని పూర్తి రూపం ఒక ఏక సమస్తము. ఒకసారి ఇది నువ్వు తెలుసుకుంటే యధార్థానికి నీకు, నీకన్నా ఒక గొప్పదానికి మధ్యన ఎటువంటి వేర్పాటు లేదని, నువ్వు దానిలో ఒక భాగమేనన్న ఎరుక నీలో ప్రారంభ మౌతుంది. ఇది ప్రారంభం. కానీ నువ్వు దీని గురించి ఆలోచన మాత్రమే కాకుండా అనుభూతిలోకి, దానిలో జీవించడంలోకి ప్రవేశించాలి. అప్పుడు అజ్ఞానగోడ పతన మవుతుంది. ఈ ఏకతను ప్రతిచోట అనుభవిస్తూ తాను తనకన్నా విస్తారమైన విశ్వంలోని, ఒక మొత్తంలోని అంశీకరణ భాగమేనని అర్థం చేసుకోవాలి. అప్పుడు మరింత సార్వత్రిక చైతన్యంతో వుండటం ప్రారంభమవుతుంది.

CWM 7:233 *అనువాదం: సునీత శేఖర్ (9346235467)*

ఏకత్వ పునరావిష్కరణ

ప్రత్యేక వ్యక్తిత్వపు భ్రమ

నీవు నీ అంతర్యం లోపలికి బాగా లోతుగా పోగలిగితే, అక్కడ నీ ఆత్మ యొక్క సనాతన సారాన్ని, నీలోనే ఉన్న సజీవ యధార్థాన్ని కనుక్కోగలుగుతావు. ఒకసారి దాన్ని కనుక్కోగలిగావంటే అది అనన్యమైనదని, అందరిలోనూ సమానంగా ఉంటుందని తెలుసుకుంటావు. అప్పుడిక నీ ప్రత్యేక వ్యక్తిత్వం ఎక్కడుంది? ఇక అలాంటిదేమీ లేదని తెలుస్తుంది.

అందరూ సత్యాన్ని నమోదు చేసే యంత్రాలే. కాబట్టి సత్యాన్ని నమోదు చెయ్యడంలో కొన్ని వికారాలు సంభవిస్తాయి. కొన్ని వికారాలు ఉన్నతమైనవి అయితే, మరికొన్ని అధమమైనవి. నమోదు చేసే ప్రయత్నంలో గొప్ప మార్పులు జరిగే అవకాశం వుంది. అంతర్యంలో, చైతన్యలక్షణంలో అపారమైన వైవిధ్యం ఉం టుంది. కనుక విషయం ఒకవ్యక్తినుంది మరోవ్యక్తికి మారుతున్నప్పుడు గ్రహించబడ్డ సత్యసారం ఉన్నదున్నట్లుగా పునరుత్పత్తి చెందదు. ఎందుకంటే వ్యక్తి చైతన్యం యొక్క సాధన సామగ్రి ఎంతో సంక్లిష్టంగా ఉంటుంది. కానీ మళ్ళీ అందరినీ అది లించే సచేతన సంకల్పం ఒక్కటే. వ్యక్తిగత సంకల్పాలతో ప్రమేయం లేకుండా అదే అందరినీ ప్రేరేపిస్తుంది.

ఈ విషయాల గురించి తన శిష్యులకి చెప్పేటప్పుడు బుద్ధుడు ఇలా అనేవాడు

— మీరు ఒక ప్రకంపనము. ఒక కోర్కెను, ఒక విషయంపట్ల కోర్కెను మీలోనుండి బయటికి పంపినప్పుడు, అది వ్యక్తినుండి వ్యక్తికి మారుతూ ప్రపంచం అంతా ప్రసారమై తిరిగి మీ వద్దకే వస్తుంది. అలా వచ్చింది ఏకైక విషయం కాదు. అసంఖ్యాక విషయాల సమ్మేళనం. ఎందుకంటే ఇక్కడ నీ వొక్కడివే ప్రసారకేంద్రానివి కావు. ఎంతోమంది వ్యక్తులు ఇక్కడ ప్రసారకేంద్రాలుగా పని చేస్తున్నారు. ఆ గందరగోళంలో నీవెవరో, నీవు కోరుకొన్న దేమిటో అగమ్యగోచరరం అవుతుంది. కాని యీ ప్రకంపన లన్నీ, ఒక యేకైకమైన, పూర్తిగా సరిసమానమైన క్షేత్రంలో ప్రసారం అవుతాయి. అయితే దాన్ని గ్రహించే ప్రయత్నంలో వచ్చే వికారాలవల్ల నీలో పూర్తిగా ప్రత్యేకమైన, స్వతంత్రమైన అంశమేదో ఉందనే భ్రమ కలుగుతుంది.

కాని ఇక్కడ ప్రత్యేకమైనది గాని, స్వతంత్రమైనది గాని ఏమీ లేదు; ఉన్నది ఒకే పదార్థం. ఒకే బలం, ఒకే చైతన్యం, ఒకే సంకల్పం. అయితే అపరిమిత వైవిధ్యం గల ఆత్మ బేధాలలో అది సంచరిస్తుంది.

ఈ ప్రక్రియ చాలా సంక్లిష్టంగా ఉంటుంది గనుక దాని అవగాహన కలుగదు. కాని అంతర్యం లోపలికి ఒక్క అడుగు వేసి, ఆ చలనాన్ని అనుసరిస్తే, అది ఎలాంటి చలనమైనా సరే, ఆ ప్రకంపనలన్నీ ఒకదాని వెంట ఒకటి, ఒకదాని వెంట మరొకటి, ప్రసారం కావటం కనిపిస్తుంది. వాటి వెనుక ఉన్న ఏకత్వం గోచరమవుతుంది. అది పదార్థంలోని ఏకత్వం, చైతన్యంలోని ఏకత్వం, సంకల్పంలోని ఏకత్వం. అదే అనన్యమైన యథార్థం. పైపైన చూసినప్పుడు మాత్రం ఒక భ్రమ ఏర్పడుతుంది — మనం ప్రత్యేకం అన్న భ్రమ, మనం భిన్నులం అనే భ్రమ.

CWM 8: 52-53

అంతశ్చర్య యొక్క, సంపర్కం యొక్క ధర్మం

ఈ విషయాన్ని గుర్తించడం అంత కష్టం కాదు; యవ్వనంలోనే కాదు, అసలు బాల్యంలో కూడా జాగ్రత్తగా చూస్తే ఈ విషయాన్ని సులభంగా అర్థం చేసుకోవచ్చు. సమష్టి సూచనలతో నిండిపోయిన వాతావరణంలో మనం అనుక్షణం బతుకుతుంటాము. ఉదాహరణకి మీరు అంత్యక్రియలు జరిగే చోటుకి ఎప్పుడైనా వెళ్లారో లేదో తెలియదు. ఎవరి ఇంట్లోనైనా అప్పుడే ఎవరైనా చనిపోయినట్లయితే వారి ఇంటికి వెళితే తెలుస్తుంది. ఆ సమయంలో మిమ్మల్ని మీరు నిశితంగా పరిశీలించు

కోవాలి. లేకపోతే ఏమీ తెలియదు. ఆ ఫలానా వ్యక్తి పోయినందువల్ల మీలో శోకం గాని, బాధగాని కలుగవలసిన అవసరం లేదని కూడా మీకు తెలుసు. ఎంతో మంది లాగానే అతడు కూడా మరణించాడంతే. ఏవో కొన్ని సామాజిక కారణాలవల్ల మీరు ఆ సమయంలో ఆ ఇంటికి వెళ్లడం జరిగింది. అంతలో ఉన్నట్టుండి నీ హృదయంలో ఓ ప్రగాఢమైన ఆవేదన పెల్లుబుకుతుంది. చెప్పలేని బాధ మిమ్మల్ని కలచి వేస్తుంది. "నేను ఎందుకు ఇంత బాధపడుతున్నాను?" అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకుంటారు. చుట్టూ ఉండే ప్రకంపనలు మీలోకి ప్రవేశించాయంతే. అంతకన్నా మరేమీ లేదు.

ఈ సత్యాన్ని గుర్తించడం చాలా సులభం అని చెప్పగలను. ఎందుకంటే చాలా చిన్నతనంలోనే నాకు ఆ అనుభవం కలిగింది. అప్పటికే నేను యోగసాధన ప్రారంభించాను గాని సచేతనంగా కాదు. ఈ సత్యాన్ని మాత్రం చాలా స్పష్టంగా గుర్తించాను. నా మనసులో నేను ఇలా అనుకున్నాను – "నాలో నాకు తెలుస్తున్న బాధ నాది కాదని స్పష్టంగా తెలుస్తోంది. ఎందుకంటే ఆ ఫలానా వ్యక్తి చనిపోయిన కారణంగా నేను బాధపడవలసిన అవసరం ససేమిరా లేదు." కాని ఉన్నట్టుండి కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి. గొంతులో ఏదో అడ్డుపడ్డట్టు అయ్యింది. ఏడుపొచ్చింది. లోనుండి బాధ తన్నుకొచ్చింది. అప్పటికి ఇంకా చిన్నపిల్లని. కాని వెంటనే అర్థమయ్యింది. "అదన్నమాట, వాళ్ళ బాధ నాలోకి ప్రవేశించింది."

కోపం విషయంలో కూడా అదే జరుగుతుంది. అందులో సందేహమే లేదు. తటాలున దాన్ని గ్రహిస్తాము. అది మరో వ్యక్తి నుండి కూడా కాదు. చుట్టూ ఉన్న వాతావరణంలోనుండి మనలోకి ప్రవేశిస్తుంది. అదక్కడ ముందే వుంది. ఉన్నట్టుండి మీలోకి ప్రవేశిస్తుంది. క్రింది నుండి మీలోకి ప్రవేశించి మిమ్మల్ని వశం చేసుకుని, పైకి లేచి మిమ్మల్ని ప్రేరేపిస్తుంది. దాని ప్రభావానికి స్పందించి బయలుదేరుతారు. ఒక్క క్షణం ముందు మీలో కోపం లేదు. చాలా శాంతంగా, నిబ్బరంగా ఉన్నారు. మీకు కోపం తెచ్చుకునే ఉద్దేశమే ఉండకపోవచ్చు. కాని మరుక్షణం అది మిమ్మల్ని ఆవహిస్తుంది. మీరు దాన్ని త్రోసి పుచ్చలేరు. ఎందుకంటే మీరు పూర్తిగా సచేతనంగా లేరు. అందుకే దాన్ని లోనికి రానిచ్చారు. అది మిమ్మల్ని వాడుకుంటుంది. దేనినైతే "నువ్వు" అని తలపోస్తావో దాన్ని, అంటే మీ దేహాన్ని వాడుకుంటుంది. మీ శరీరం మీ పక్కన వున్నవారి శరీరంకన్నా, పూర్తిగా వేరుగా వున్నట్టు అనిపిస్తుంది. అది

"అనిపిస్తుంది" అని ఎందుకు అంటున్నానంటే అది కేవలం ఒక దృశ్యభ్రాంతి. ఎందుకంటే అనుక్షణం మనలో నుండి కొన్ని రకాల రేణువులు — అవి భౌతిక రేణువులు కూడా కావచ్చేమో— ఒక రకమైన వికిరణాలలో మన దేహం లోనుండి బయటికి ప్రవహిస్తు అన్యుల దేహాలతో కలిసిపోతూ ఉంటాయి. ఆ కారణం చేతనే సునిశితమైన మనస్సు ఉంటే దూరంగా జరుగుతున్న విషయాలపట్ల కూడా స్ఫురణ కలుగుతుంది.

CWM 8: 53- 55

ఏకత్వం అంటే అన్నీ ఒకేలా ఉండడం కాదు

అందరితోనూ ఒకే విధంగా వ్యవహరించడం వల్ల చెప్పరాని గందరగోళం ఏర్పడుతుంది! దైవం అందరితోనూ ఒకే విధంగా వ్యవహరించాలి అని తలచే పొరపాటు వంటిదే ఇదీను. అలా అనుకుంటే ఇక ప్రపంచంలో వైవిధ్యానికి ప్రయోజనమే ఉండదు. ఇద్దరు వ్యక్తులు ఒక్క రీతిలో ఉండవలసిన అవసరం ఉండదు. అదే జరిగితే వైవిధ్యపు ధర్మాన్ని వ్యతిరేకించినట్లు అవుతుంది.

విశ్వంలో ప్రతి విషయంపట్ల సమానమైన అవగాహన, సానుభూతి, ఏకత్వపు భావన, ప్రేమ, సంపూర్ణ కరుణార్ద్ర దృష్టి ఉండాలనుకోవడం మంచిదే. కాని అలాంటి దృష్టి లేని పక్షంలో దానికోసం ప్రయత్నించడం అవసరం. కాని అలాంటి దృష్టి ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క విధంగా వర్తిస్తుంది. ఆ సందర్భానికి చెందిన సత్యాన్ని బట్టి, ఆవశ్యకతని బట్టి అది మారుతుంది. అంతరంగంలోని ఉద్దేశంగాని, మూలం గాని ఒక్కటే కావచ్చు. కాని రెండు సందర్భాలలో చేసే చర్యలు, ఆ సందర్భాలకి చెందిన సత్యాన్ని బట్టి పూర్తిగా పరస్పర వ్యతిరేకంగా ఉండొచ్చు. కాని ఆ విధంగా చర్య చెయ్యాలంటే అత్యున్నతమైన, అత్యంత ప్రగాఢమైన, సత్యవంతమైన, పరిస్థితులకు పూర్తిగా అతీతమైన మనోభావం ఉండాలి. అప్పుడే మనం మూలంలోని సత్యాన్నే కాక చర్యలోని సత్యాన్ని కూడా అనుక్షణం స్పష్టంగా చూడగలము. ప్రతీసందర్భంలోను చర్యకి సంబంధించిన సత్యం వేరుగా ఉంటుంది. అయినా కూడా చేసే పని వెనుక ఉండే "తలంపు" ఇదంత సముచితమైన పదం కాకపోవచ్చు — లేదా చైతన్యస్థితి మాత్రం ఒకే విధంగా ఉంటుంది.

అయితే విషయం యొక్క ప్రగాఢమైన లోతుల్లోకి ప్రవేశిస్తే గాని, అత్యున్నత

శిఖరాలనుండి చూస్తేగాని ఈ విషయం అర్థం కాదు. ఆ అత్యున్నతమైన, అతి ప్రగాఢమైన చైతన్య కేంద్రం నుండి, కాంతి కేంద్రం నుండి అన్నింటినీ వాటి మూలాలలోనే కాక, వాటి అభివ్యక్త రూపాలలో కూడ ఏకకాలంలో సమదర్శించడానికి వీలవుతుంది. చైతన్య కేంద్రం ఒక్కటే అయినా అభివ్యక్త జగతిలో వైవిధ్యంఉన్నట్టే చేసే చర్యలో కూడా ఎంతో వైవిధ్యం ఏర్పడుతుంది. అభివ్యక్తిలో దివ్యసత్యం యొక్క సిద్ధి అంటే ఇదే. అలా చెయ్యలేకపోతే విశ్వమంతా విలసిల్లే వైవిధ్యాన్ని త్రోసిపుచ్చినట్లే అవుతుంది. విశ్వాన్ని మౌలికమైన అవ్యక్తమైన ఏకత్వం లోనికి తీసుకుపోయినట్లు అవుతుంది. ఎందుకంటే అవ్యక్తంలోనే ఏకం, ఏకంగా అనుభవమవు తుంది. కాని అభివ్యక్తం లోనికి ప్రవేశించగానే ఏకం అనేకత్వంగా వ్యక్తమవుతుంది. మరి అనేకత్వం అంటే అనేకకోటి చర్యల, విధానాల సంకలనం అన్నమాట.

పైన చెప్పుకున్న దాన్ని సారాంశం ఇది. పర్యవసానాలని లెక్కచెయ్యకుండా చెయ్యవలసింది చెయ్యాలి. అభివ్యక్తంలోని అనేకత్వానికి చెందిన సత్యానికి అను గుణంగా చర్య చెయ్యాలి.

సంచలిత బలం లోని ఏకత్వం

అన్నింటినీ కదిలించే సంచలిత బలం ఒకటుంది. మీలో దాని గురించిన స్పృహ ఏర్పడితే అన్నింటినీ కదిలించే ఏకైక బలం తెలుసుకుంటారు. మీలో ఆ స్పృహ పెరుగుతున్న కొద్దీ దాని చలనాన్ని అనుసరించగలుగుతారు. మనుష్యుల్లోను, ప్రపంచంలోను అది ఎలా పని చేస్తుందో చూడగలుగుతారు.

మీలో ఏకత్వపు స్పృహ కలిగిన మరుక్షణమే — ఏకత్వం అంటే క్రియాశక్తి ఏకత్వం. సంకల్పంలో ఏకత్వం. — మీరు అన్యులకన్నా భిన్నంగా ఉన్నారన్న భావన తొలగిపోతుంది. అవతలివారు మీరు వేరన్న భావన ఉన్నప్పుడే వారిలో ఏం జరుగుతోందో మీకు అర్థం కాదు. వారు మీకు అపరిచితులుగా కనిపిస్తారు. మీరు మీ దేహంలో బందీలుగా ఉంటారు. అన్యులతో కేవలం బాహ్యమైన, — చైతన్యంలో క్రియాశక్తి సంకల్పంలోని ఏకత్వానికి చెందిన భావన కలుగకపోవడమే. పార్థివ ప్రకంపనలలోని ఏకత్వాన్ని కూడా మీరు గుర్తించలేదన్నమాట.

సంక్లిష్టత వల్ల అలాంటి గుర్తింపు సాధించడం కష్టం అవుతుంది. ఎందుకంటే మన ఇంద్రియాలు రేఖీయంగా, ఏకపక్షంగా పనిచేస్తాయి. మనం ఏదైనా అర్థం చేసుకోసుకోవాలని ప్రయత్నించినప్పుడు ఒక దాంతో ఒకటి పొంతన లేని అసంఖ్యా

కమైన విషయాలు మనని ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. అనేక రకాల అంశాలు కలగా పులగంగా కలిసిపోవడంవల్ల వివిధ విషయాల పరిణామ రేఖలని గుర్తించడం అసంభవం అవుతుంది. ఒక దుమారంలోకి అగు పెట్టినట్లు ఉంటుంది.

CWM 8: 55-56 *అనువాదం: డా. వి. శ్రీనివాస చక్రవర్తి (9500069322)*

రహస్య ఏకత్వము

మధురమయీ శ్రీమాతా, ఇక్కడ ఈ విధంగా వ్రాయబడింది. "అందరినీ ఒక రహస్య ఏకత్వం కలిపివుంచింది."

ఆ రహస్య ఏకత్వమేమిటి?

కచ్చితంగా చెప్పాలంటే అది దివ్య సన్నిధి

దైవమన్నది ఒక్కటే అయిననూ, అతడు తనను తాను అన్ని ప్రాణులలోనూ పునర్విభజించుకుని ఈ విధంగా ఆద్యమైన ఏకత్వాన్ని పునః సృష్టి చేశాడు. అన్ని ప్రాణులలోను శకలాలుగా కానవచ్చినప్పటికీ ఈ దివ్యఏకత్వ కారణంగా ఏకత్వము సారతః తిరిగి ప్రతిష్టించబడుతుంది. ఈ విషయం గురించి చైతన్యవంతులైనవారు ఈ ఏకత్వముయొక్క చేతనానందాన్ని పొందుతారు. కాని ఎవరయితే ఈ చేతనను కలిగి ఉండరో వారు ఆ చేతనానందానుభూతిని ఎరుగరు. కాని ఆ నిజం నిజంగానే ఉండిపోతుంది.

శ్రీఅరవిందులు అంటారు: ఆ ఏకత్వము ఉంటుంది, దాని గురించి నీకు తెలిసినా సరే, తెలియకున్ననూ సరే, నిజానికి అందులో ఏమీ తేడా ఉండదు. అది నీకు మాత్రం వేరుగా కాన్పిస్తుంది. నువ్వు చైతన్యం కలిగి ఉంటే ఆ ఆనందం నీకు కలుగుతుంది. నీకు చైతన్యం లేనప్పుడు ఈ ఆనందాన్ని నువ్వు కోల్పోతావు. అది దానంటతదే జరుగుతుంది.

నీకు తెలిసినాసరే, తెలియకపోయినా సరే, నువ్వు కావాలనుకున్నా, లేకున్నా, మీ రందరూవిభజించబడినట్లు కనబడినా ఏకీకృతమై ఉన్న ఆ దివ్య అస్తిత్వముచే కలుపబడి ఉన్నారు. ఆ దైవము ఒక్కటే. వస్తువులలోను, ప్రాణులలోను అతడు భిన్నముగా కాన్పడతాడు. ఈ ఏకత్వమనేది నిజము కనుక అది నీకు తెలిసినా, తెలియకున్నా ఆ నిజాన్ని అది మార్చలేదు. నువ్వు కావాలనుకున్నా, అక్కర లేదనుకున్నా, ఏది ఏమయినా ఈ ఏకత్వంలో భాగస్వామివి కాక తప్పదు.

ఈ విషయాన్ని మీకు ఎన్నిసార్లు తెలియచెప్పానో, ఎన్నిసార్లు బోధించానో నాకే తెలియదు, మీ రందరూ ఒకరి నుండి మరొకరు వేరని మీరనుకుంటారు. కాని ఈ ఒకే ఒక్క పదార్థం మీ అందరిలోనూ ఉంది. కనబడటంలో తేడాలున్నా ఒకరిలోని కంపనలు ఇంకొకరిలో తనంత తానుగా ప్రకంపనలు పుట్టిస్తాయి.

CWM 8: 75-76

ఐక్యత మరియు ఏకత్వముల పునః ప్రతిష్ట

ఒకరు తమలో ఆ దివ్యత్వాన్ని కలిగి ఉండనప్పుడు, తమ ప్రాణగత సారంగా అదిలేనప్పుడు ఆ దైవాన్ని గూర్చి వారెన్నడూ తెలుసుకొనలేరు, అది ఒక అసాధ్య సాహసమే అవుతుంది. అప్పుడు నువ్వు ఆ సమస్యను తిరగ తోడితే, ఏదో ఒక విధంగా ఒక క్షణంలో నువ్వు దాని గురించి ఊహించినా లేక అనుభవించినా, లేక కనీసం ఆ దైవం నీలోనే ఉన్నాడని మరియు నువ్వు ఆ దైవంలోనే ఉన్నావని ఒప్పుకోవడం మొదలు పెడితే అప్పుడు అదే జ్ఞానప్రాప్తికి ఎక్కువగా కాదు, కాని కొంచెం ఓరగా తలుపు తెరుస్తుంది. అప్పుడు, అటు తరువాత తెలుసుకొని, అది కావాలనే ప్రగాఢమైన అవసరం, ఆకాంక్ష కలుగుతాయి. ఆ తీవ్రమైన అవసరమే అతడు అందులో అల్లుకొనబడేటంతవరకు దానిని విశాలంగా తెరచి ఉంచుతుంది. అతడు అందులోనికి ప్రవేశించిన తరువాత తానెవరు అనే విషయం అతనికి తెలుస్తుంది. సరిగ్గా అదే విషయాన్ని శ్రీఅరవిందులు చెబుతారు. వ్యక్తులు మరచిపోతారు. సత్, చిత్, ఆనందము ఈ మూడు వేరుపడటం వలన మరుపు కలుగుతుంది. వారు ఏమిటి? అన్న విషయాన్ని వారు మరచిపోయి, వారు తమను తాము ఎవరో ఒకరనుకుని, బాలుడో, బాలికో, పురుషుడో, స్త్రీయో, కుక్కో, గుఱ్ఱమో, ఏదో ఒకటి, రాయో, సముద్రమో, సూర్యుడో, తమని తాము ఇదంతా అని అను కుంటారు తప్ప తమను తాము ఆ ఒకే ఒక్క దైవమని అనుకోరు. కారణం, ఎవ రైనా తమని తాము ఆ ఒకే ఒక్క దైవమని భావించుకున్నప్పుడు ఈ విశ్వమనేదే లేకుండా పోయేదేమో?

అదే నేను అతనికి చెప్పాలనుకున్నాను. (ఒక పిల్లవాని నుద్దేశించి) ఈ భిన్నత్వమనే సిద్ధాంతం ప్రపంచానికి అనివార్యమనిపిస్తుంది. లేకపోతే అది ఎల్లప్పటికీ మునుపటిలాగే ఉండిపోయేదేమో? కాని మనం ఈ ఏకత్వాన్ని ఈ మలుపు తిరగ

నిచ్చిన తరువాత ఈ అనేకత్వపు ఏర్పాటు వలన లబ్ధి పొంది మన ఒక ఉన్నత గుణమైన ఏకత్వమును తిరిగి ప్రతిష్టించినపుడు తనకి తాను తెలుసుకోనక్కరలేని ఏకత్వమునకు బదులు తనని తాను తెలుసుకొన్న ఏకత్వము, వేరొక దానిని గూర్చి తెలుసుకొనవలసినదేమీ లేదు కనుక, అది కేవలం యేకత్వమౌతుందో అప్పుడు ఎప్పుడయితే ఆ ఏకత్వాన్ని ఎవరు తెలుసుకొనగలుగుతారు? కనీసం మనకి ఒక ఊహాచిత్రమైనా కావాలి. అదేమిటో అర్థం చేసుకోవడానికి అది ఒక క్రమపద్ధతిలో లేకపోయినా ఏదో ఒకటి మనకి కనబడాలి. అదే ఈ విశ్వరహస్యమని నేను నమ్ముతున్నాను. బహుశా ఆ దైవము తనని తాను నిజంగా తెలుసుకోవాలని అనుకొని ఉండాలి. కనుక ఇప్పుడు అతడు వెలికి వచ్చి, తనను తాను చూచుకొని తనకి తానుగా తన ఎరుకకి సంబంధించిన సంపూర్ణ జ్ఞానంతో ఈ అవకాశాన్ని ఆనందిద్దామని అనుకుంటాడు. అప్పుడది ఇంకా అభిరుచికరమైనదవుతుంది.

CWM 7:236- 37

ఆంతరిక గందరగోళము మరియు అవ్యస్థయొక్క నివారణ

విశాలదృక్పథము కలిగి ఉన్ననూ సరే, మనం విషయాన్ని పూర్తిగా తెలుసుకొనజాలము — విషయాన్ని కొంతవరకు మాత్రమే, చాలా కొద్ది భాగము మనం తెలుసుకొనగలము — కనుక మన దృష్టి అటు ఇటు పరుగెడుతూఉంటుంది. అయినప్పటికీ మిగతా కొన్ని విషయాలు అచటనే ఉంటాయి. ప్రమాదకరమైనవి మరియు హానికరమగు కొన్ని విషయాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వడం వలన నువ్వు వానికి బలం చేకూర్చిన వాడవవుతావు

అటువంటి అక్రమమైన గందరగోళ స్థితికి నువ్వు లోబడినప్పుడు నువ్వు ఒకే ఒక్కటి చెయ్యాలి. ఎచ్చటయితే ఏకైక సత్ ఏకైక చిత్ ఏకైక శక్తి ఉంటుందో ఆ చేతన ఆ దివ్యత్వం లోనే ఇదంతా జరుగుతూ ఉంటుంది. ఎటువంటి విలువలేని మన దర్శనాలు మన తెలివితేటలు, నిర్ణయాలు, అవన్నీ ... అదంతా కేవలం ఏమీ కానిది. అన్నిటిమీదా ఆధిపత్యం వహించే చైతన్యంతో పోలిస్తే అది ఒక రవంత మాత్రమే. కనుక ఎవరికైనా ఎందుకు విభిన్న వ్యక్తిత్వాల అస్తిత్వం ఉంటుందో, కొంచెమైనా తెలుసుకొనగలుగుతారో వారు అభిప్రా ఆకాంక్షలు ఉండడానికి, తన్ను తాను అర్పించుకోవడానికి, స్వాధీన పరచుకొనబడడానికి, నమ్మకానికి,

విశ్వాసానికి దానిని కారణమని భావిస్తారు. కనుక ఈ కారణంగానే వ్యక్తులు సృష్టించబడ్డారు. పూర్తి శ్రద్ధా సక్తులతో అలా అవడం నీ చేతులలో ఉంది.

కావలసినదంతా అదే, ఆ ఒకే ఒక్క విషయం, మిగిలేది అదే. మిగిలిందంతా ఇంద్రజాలము.

CWM11:184 - 85 *భావానువాదం: డా. విజయలక్ష్మి*

సాముదాయక యోగం

వివిధ సంఘాలు మరియు దివ్యజ్ఞాన సమాజం

ఉదాహరణగా మనం ఒక మతసంఘాన్ని తీసుకుంటే దానికి ఒక మత భవనం, అందులో వారందరికీ ఒకే రకమైన దుస్తులు ఒకే రకమైన పనులు ఒకే రకమైన నడతలచే, సంప్రదాయ బద్ధం చేయబడతారు. నేనింకా ఇంకా వివరంగా చెప్తాను — ప్రతి ఒక్కరు ఒకే రకమైన దుస్తులు వేసుకుంటారు. అందరూ ఒకే సమయానికి నిద్ర లేస్తారు. ఒకే రకమైన ఆహారం తీసుకుంటారు. ఒకే ప్రార్థన కలిసి చేస్తారు. అంతటా ఒకటే విధానం అందుచేత సహజంగానే అక్కడివారి అంతఃకరణ (మానసికంగా) గజిబిజికి లోనై లోపల ఎవరికి తోచిన విధంగా వారు చేస్తుంటారు.

ఆ దైవ సన్నిధిలో సదా జీవించు, ఆ అస్తిత్వమే నీ గమనానికి, నీవు చేసే ప్రతి పనికి కారణమనే భావనతో జీవించు. నీ ప్రతికదలికను దానికి సమర్పించు. కేవలము మానసిక కార్యమేగాక, ప్రతి ఆలోచన, ప్రతి భావన, అతి సాధారణ బాహ్య కార్యకలాపాలన్నీ, ఎటువంటి వంటే భుజించడం లాంటివన్నీ దానికి సమర్పించు. నువ్వు తింటున్నప్పుడు ఆ దైవమే నీ ద్వారా భుజిస్తున్నాడని నువ్వు భావించాలి. ఆ విధంగా నువ్వు నీలోని కదలికలన్నింటినీ ఒక్క జీవితంలో కూడగట్టుకున్నప్పుడు నీలో వేర్పాటుకు బదులు ఏకత్వము చోటు చేసుకొంటుంది.

CWM 3:23-24 *భావానువాదం: డా. విజయలక్ష్మి*

ఎందుకంటే ఈ విధానం కేవలం ఆ మత విశ్వాసానికి ఒక గుర్తింపుకోసం ఆచరించేది — అది ఒక భ్రామికమైన గుర్తింపు.

ఇది ఒక సామాన్యమైన మానవ సమూహంలోని విధానాలు. ఒక సంఘంగా ఏర్పడటం, సంబంధాలు ఏర్పరచుకోవడం ఒకే ఆదర్శం కోసం ఏకమవడం, ఒకే రకమైన స్పృహ కల్గి ఉండటం — కాని ఇదంతా ఒక కృత్రిమమైన పద్ధతి.

శ్రీఅరవిందులు దీనికి వ్యతిరేకంగా ఇలా అంటారు: నిజమైన సాధన బృందం అన్నది — అందులోని ప్రతి ఒక్కరూ యోగ లేదా అతిమానస సమూహంలో భాగంగా ఆంతరిక సత్యానుభవాన్ని ఆధారంగా చేసుకొన్నవారై ఉండాలి. అంటే ప్రతి ఒక్కరూ ఆ సంఘంలో ఒక సభ్యుడిగా కాక అందరూ తనలోని ఒక భాగంగా అంటే తన శరీరంలో భాగంగా అనుకోవాలి — అది కృత్రిమంగా కాకుండా అందరి సమష్టి చేతన యందు ఏకీభావం కలిగి ఉండాలి.

అంటే ఈ రకమైన సాధనా సమాజంగా ఏర్పడాలంటే ముందుగా ప్రతి వ్యక్తి తనను తాను తెలుసుకొనే యోగసాధకుడై ఉండాలి — కనీసం యోగసాధన ప్రారంభించి ఉండాలి. మామూలుగా వ్యక్తిగత ప్రయత్నం ముందుగా జరగాలి. తరువాతనే సామూహిక ప్రయత్నాన్ని అనుసరించాలి. కాని అదే సమయంలో ఏరకమైన భావ నియంత్రణ లేకుండానే వ్యక్తి యొక్క సాధన అభివృద్ధి ఈ (సంఘ) సమూహ భావనతో నియంత్రించబడుతుంది. వ్యక్తికి సంఘానికి మధ్య పరస్పరం ఆధారపడే ఒక లక్షణం ఉండటంవల్ల ఎవరూ సమూహంలోంచి పూర్తిగా విడివడలేరు. ఒక మనిషి తన యోగసాధనతో ఈ భూమినుండి ఈ మానవ చేతన నుండీ పూర్తిగా విముక్తుడవ్వాలి అనుకున్నా బంధితుడే అవుతాడు. అతని అధోచేతనలో సాధారణ స్థితిలోకి వెనుకకు లాగబడతాడు. సాధకుడు వేగంగా ముందుకు పోతూ ఈ సంబంధ బాంధవ్యాలను బరువు, బాధ్యతలను ఉన్న పళంగా వదిలేసి ఆత్మ సిద్ధి పొందినా, పరిణామ కవాతులో శిఖరాన్ని చేరినా, సమిష్టి సిద్ధిపై తాను ఆధారపడాల్సి వస్తుంది. అది నిజంగా అతడిని ఎరుకకు ఎంతవరకు లోగొంటుందంటే ఈ పృథ్వి ఆ సత్య సిద్ధి కై సంసిద్ధం కావడానికి ఒక మనిషి కొన్ని శతాబ్దాలు వేచి ఉండాల్సి వస్తుంది.

అందుచేత శ్రీఅరవిందులు అంటారు— వ్యక్తి మరియు సమూహం సాధనా మార్గంలో ఒకేసారిగా కలిసి మెలసి సాగడం అవసరం — వ్యక్తిగత సిద్ధి, సామూహిక సాధనా సిద్ధి పరస్పరం కలసి ముందడుగు వెయ్యాలి. ఇలా చేయడం వల్ల అది

వ్యక్తి ఇంకా ముందుకు పోవడానికి అనుమతిస్తుంది.

CWM9:141- 42

సామూహిక సాధనా సమావేశాల శక్తి

వ్యక్తులు ఏకత్వభావంతో ఒకే ఆదర్శం కోసంగాని, ఉపదేశం కోసంగాని ఒక పనిని నేర్చవడంకోసం గాని, ఒక సంబంధాన్ని ఒకే ఉద్దేశ్యంతో ఒకే ఆకాంక్ష మరియు విశ్వాసంతో కూడినవారై సంఘంగా ఏర్పడాలి. వీళ్ళు ఒక క్రమశిక్షణతో కూడి ఒక పద్ధతి ప్రకారం ఒక ప్రార్థనను ఒక ధ్యాన పద్ధతిని అనుసరిస్తూ ఒకవేళ వాళ్లు ఒక బలమైన ఆదర్శం మీద లక్ష్యం ఉంచి ప్రార్థనలు ధ్యానం కొనసాగిస్తే — అది లోక (ప్రపంచ) రీతి — వారి వ్యక్తిగత అంతరంగ అభివృద్ధి సామూహిక అభి వృద్ధి చేప్పుకోతగ్గ విధంగా జరగడానికి కారణమౌతుంది. ఇటువంటి సంఘాలు ఎంతో ఉచితమైనవేకాని, వీటికి మామూలు అల్లరి మూకలకుండే మూర్ఖపూరితమైన బలం ఉండదు. అల్లరిమూకల ఉద్రేకం స్థానంలో ఒక అంతఃకరణ చైతన్యతీవ్రత ఉంటుంది.

ఈ భూమి మీద అన్ని కాలాల్లో ఇటువంటి సంఘాలు ఏర్పరచబడ్డాయి. కొన్ని చారిత్రాత్మక జీవితం గల్గి వున్నందున లోకంలో చారిత్రాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. కాని సూత్రాన్ని అనుసరించి ఇవి ఏవీ కూడా ఒక ఉన్నత వ్యక్తి సంపాదించినంత విజయాన్ని సంపాదించలేదు. ఈ సంఘాలు ఎల్లప్పుడు ఒక అనుమానంతో ముట్టడులు, దాడులు ఎదుర్కొని అమానుషంగా, అవివేకంతో చెల్లా చెదురు చేయబడ్డాయి. కొన్ని మతపరమైన మరియు విప్లవాత్మక సాహసోపేతమైన సంఘాలు ఒక విశ్వాసంతో ఒక సరైన లక్ష్యంతో ఏర్పడి ప్రపంచంలో ఒక ఆసక్తికరమైన చరిత్రను మిగిల్చాయి. ఈ సంఘాలు తప్పకుండా వాటి వ్యక్తిగత ప్రయత్నంతో సామాజిక అభివృద్ధిని సాధించాయి. ఒక ఆదర్శవంతమైన సంస్థ అది నిజంగా కృతకృత్యమైనదైతే అది వారి సంస్థలోని వారందరూ బలంగా ఏకమవ్వడానికి దోహద పడుతుంది. ఎలా అంటే — అందరికీ ఒకే లక్ష్యం, ఒకే ఆకాంక్ష. మరియు అంతఃకరణ అభివృద్ధి పొంది, ఆ ధర్మానికి ఆకాంక్షకు ఒక సామరస్య పూర్వకమైన శరీర భాగంగా రూపొందాలి. అన్ని సమయాల్లోనూ ఉపదేశ కేంద్రాలు దీనికి ప్రయత్నించి కొద్దో, గొప్పో వియజవంతమైయ్యాయి. అన్ని మార్మిక సంప్రదాయల్లోనూ ఇదొక అత్యంత శక్తివంతమైన కార్యసాధనంగానే ప్రస్తావించబడింది.

సమీకృతమైన సమూహం ఒకే విధమైన సంతులనాన్ని ఒక వైయక్తిక సమూహంగా పొందగల్గితే అది వ్యక్తి శక్తిని కార్యాన్ని అధికాధికంగా ద్విగుణీకృతం చేస్తుంది. సాధారణంగా అసభ్యంగా విడివడి వ్యక్తులను కలిపి ఒకచోటుకు చేర్చినా, సామూహిక గుణశ్రేష్టతను లెక్కిస్తే అది వ్యక్తియొక్క ప్రత్యేక విలువ కంటే తక్కువగా ఉంటుంది. కాని తగినంత సచేతనమైన సమన్వయపూర్వకమైన, నిర్వహణ ద్వారా విలక్షణంగా, వైయక్తిక కార్యాచరణ శక్తిని ద్విగుణీకృతం చేస్తుంది.

CWM 9:369 - 70 శ్రీమాత

అనువాదం: ఎమ్. విజయపద్మ (9908600833)

సమిష్టియోగము

"తరచుగా అతడు (సాధకుడు) అతని వ్యక్తిగత యుద్ధాన్ని నిరంతరం కొనసాగిస్తూ విజయాన్ని పొందిన తరువాత కూడా మరలా మరలా అతను విజయం సాధిస్తూనే ఉండాలి..." అంటే అతని సాధనతో ఇతరులు ప్రయోజనం పొందుతారని అర్థమా?

ప్రతి ఒక్కరికీ ఆ విధంగానే ఉంటుందని నీవు అర్థం చేసుకోవాలి. ఒక్కరు మాత్రమే ఉన్నప్పుడు అది ఆ విధంగానే ఉంటుంది; అతను ఒక్కడే అందరికోసం దానిని ఆచరించాలి. అయితే ప్రతి ఒక్కరూ ఆచరిస్తే... అర్థం చేసుకో...

పూర్ణయోగాన్ని చేసేవారు మీరు యాభైమంది వున్నారు. యాభైమందిలో ఒక్కరు మాత్రమే దానిని చేస్తున్నప్పుడు, అతను మొత్తం యాభైమందికోసం చేస్తాడు. అయితే యాభైమందిలో ప్రతి ఒక్కరూ చేస్తున్నప్పుడు ప్రతి ఒక్కరూ మొత్తం యాభైమంది కోసం చేస్తారు. వాస్తవానికి అతను అతనికోసం మాత్రమే చేసినట్లవుతుంది. అందరూ ప్రతి ఒక్కరికోసం చేయడమే దానికి కారణం. ఆ కార్యం మరింత క్లిష్టతరం, మరింత సంపూర్ణమైనప్పుడు ఉన్నతమైన శక్తి, అత్యంత విశాల భావన, అత్యధిక ఓర్పు, అధికమైన సహనం, సహన శక్తి ఇవన్నీ అవసరమౌతాయి. వాస్తవానికి, ప్రతి ఒక్కరూ వారు చేయవలసిన దానిని పరిపూర్ణంగా చేసినపుడు, అంతటినీ ఒక వ్యక్తి మాత్రమే చేయవలసిన అవసరం ఉండదు; ఒక్క వ్యక్తి కూడా అందరికోసం చేయనక్కరలేదు, అయితే అందరూ కూడా పూర్తి బృందం కోసం చేస్తున్నప్పుడు ఒక వ్యక్తిగానే ఉంటారు.

దీనికోసం చేస్తున్న వారందరిలో తగినంత ఐకమత్యం ఉండాలి. దానివలన వారు వ్యత్యాసాలను గమనించరు. దానిని చేసే ఉత్తమ విధానం ఇదే: వారు ఇపుడు ఒకే ఒక శరీరంగా, ఒకే ఒక వ్యక్తిత్వంగా ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా ప్రతిసారి తమకోసం అట్లాగే ఇతరుల కోసం చేసినట్లవుతుంది.

వాస్తవంగా చెప్పాలంటే, శ్రీఅరవిందులు కలిసినపుడు నాకు వచ్చిన మొదటి ప్రశ్న అదే! దాని గురించి మీకు గతంలో చెప్పినట్లున్నాను. నాకు గుర్తులేదు. అయితే ఇటీవల దాని గురించి మాట్లాడాను. ఎవరైనా యోగసాధన చేసి తమ లక్ష్యాన్ని చేరుకున్న తరువాత ఇతరులతో కలిసి పనిచేయాలా లేక ఒకే రకమైన ఆకాంక్షలు కలిగినవారు అతనిని కలిసిన వెంటనే అందరూ కలిసి లక్ష్యం దిశగా ముందుకు సాగాలా?

గతంలోని నా పని వలన నేను ప్రయత్నించిన అన్నింటి కారణంగా చాలా ఖచ్చితంగా రూపొందించుకున్న ప్రశ్నతో శ్రీఅరవిందులను కలిసాను. అప్పుడు రెండు సంభావ్యతలు కన్పించాయి. ఇతరులతో ఎటువంటి సంబంధాలు లేకుండా ప్రపంచం నుండి విరమించుకుని తీవ్రమైన వ్యక్తిగత సాధన చేసుకొనుట లేదా సహజంగా మరియు స్వతఃసిద్ధంగా బృందంగా రూపొందుట, బృందం రూపు దిద్దుకొనుటను నిరోధించకుండా, అది రూపొందుటకు వీలు కల్పిస్తూ మార్గంలో అందరూ కలిసి ప్రారంభించుట. అయితే, ఆ నిర్ణయం ఒక మానసిక ఎంపిక కాదు. అది స్వతఃసిద్ధంగా వచ్చింది. మరొక ఎంపిక లేని విధంగా పరిస్థితులు ఉన్నాయి. అంటే చాలా సహజంగా, స్వతఃసిద్ధంగా మిక్కిలి ఆవశ్యకమనే విధంగా సమూహం రూపొందినది. ఆ విదంగా మనము ఒకసారి ప్రారంభించిన తరువాత అది పూర్తయినది. మనము చివరి వరకు అలాగే కొనసాగాలి.

CWM 7:408- 09

ప్రాతినిధ్య బృదం

ప్రతి ఒక్కరూ ఒంటరిగా, ఏకాంతంగా పూర్ణత్వాన్ని పొందవచ్చు. వారు తన చేతనలో అనంతంగా, పరిపూర్ణంగా మారవచ్చు. అయితే కార్యానికి సంబంధించినపుడు అది ఎల్లప్పుడూ పరిమితంగానే ఉంటుంది.

నన్ను సరిగ్గా అర్థం చేసుకున్నారోలేదో నాకు తెలియదు. అయితే వ్యక్తిగత

జ్ఞానానికి పరిమితులు లేవు. ఒకరు అంతర్గతంగా తమలో పరిపూర్ణంగా, అనంతంగా మారవచ్చు. అయితే బాహ్యవిషయాల జ్ఞానానుభవం తప్పనిసరిగా పరిమితంగానే ఉంటుంది. ఒక సాధారణ చర్య జరగాలనుకుంటే, భౌతిక దేహధారులు కనీస సంఖ్యలో నైనా అవసరం.

చాలా పురాతన సాంప్రదాయంలో పన్నెండు మంది సరిపోతారని చెప్పేవారు. అయితే అధునాతన జీవనశైలిలో వైవిధ్యాల వలన అది అసాధ్యమవుతుందని అనిపించడంలేదు. ఒక ప్రాతినిధ్య బృదం తప్పనిసరిగా ఉండాలి. అంటే... మీకు దాని గురించి ఏమీ తెలియదు లేదా దాని గురించి మీరు అద్భుతంగా ఊహించుకో లేరు. అయితే మీలో ప్రతి ఒక్కరూ పరిణామక్రమంలో జయించవలసిన ఇబ్బందులలో ఒక దానికి మీరు ప్రాతినిధ్యం వహిస్తారు. ఇది మరిన్ని ఇబ్బందులను కలుగజేస్తుంది! (శ్రీమాత నవ్వుతూ ఉన్నారు) నేను ఎక్కడో వ్రాసాను. దానిని ఒక ఇబ్బంది అనే కంటే ప్రతీ ఒక్కరూ అసాధ్యమైన దానిని పరిష్కరించుటలో ప్రాతినిధ్యం వహిస్తారని నేను తెలిపాను. ఈ అన్ని అసాధ్యతల సమూహం కార్యంగా రూపాంతరీకటణ చెందడమే సత్యానుభవం. ప్రతీదీ పపరిష్కరించేటప్పుడు ఒక అసాధ్యమైనదిగానే ఉంటుంది. ఈ అన్ని అసాధ్యతలను పరిష్కరించినప్పుడు కార్యం సిద్ధిస్తుంది. కాని ఇపుడు నేను చాలా వినమ్రంగా చెబుతున్నాను నేను "అసాధ్యాన్ని" తీసివేసి దాని స్థానంలో 'ఇబ్బంది' అనే పదం పెడతాను. బహుశా దీర్ఘకాలిక అసాధ్యతలు ఉండకపోవచ్చు.

ప్రారంభంనుండి ఇప్పటివరకు మన బృందం గణనీయంగా పురోగతి సాధించింది. ప్రతీసారి కొంతమంది వచ్చి "నా యోగా గురించి వచ్చామని చెప్పేవారు" అపుడు నేను " ఓహో అలా అయితే రావద్దు, ఇతర ప్రదేశాలకంటే కూడా ఇక్కడ అది చాలా కష్టమని చెప్పేదానిని". దానికి కారణం శ్రీఅరవిందులు ఇలా తెలిపారు.

"నేను పనిచేయడానికి వచ్చాను, 'నాకు నేనుగా ఉపయోగపడేందుకు వచ్చాను." అని ఎవరైనా నాతో చెబితే అది మంచిదే. కానీ ఎవరైనా వచ్చి నాకు బాహ్యప్రపంచంలో చాలా ఇబ్బందులు ఉన్నాయి. ఈ ఇబ్బందులను నేను అధిగమించలేకపోతున్నాను. ఈ వాతావరణం నాకు సహాయపడుతుంది గనుక ఇక్కడకు రావాలనుకుంటున్నాను.' అని మాత్రం చెబితే అపుడు నేను "వద్దు, వద్దు! ఇక్కడ మరింత ఇబ్బందిగా ఉం టుంది. మీ ఇబ్బందులు తీవ్రంగా పెరిగిపోతాయని" చెపుతాను. దాని అర్థమేమిటంటే,



గాను ఒక సామరస్యపూర్వకమైన మరింత ఏకత్వంతో కూడిన సమాజాన్ని ఏర్పరచడానికిగాను, తద్వారా జీవితాన్ని మరింత క్రియాశీలం గావించడానికిగాను మన మీ ఆశ్రమంలో కలిసి వున్నాము.

నేను భౌతికంగా మీ అందరితో వున్నతంకాల, నా ఉనికి ఈ అహాన్ని అధిగమించ డంలో, మీరు నిష్ణాతులు కావడానికి సాయపడింది. కాబట్టి తరచుగా మీతో వ్యక్తి గతంగా మాట్లాడవలసిన అవసరం చాలా తరచుగా రాలేదు.

కానీ ఇప్పుడు ఈ ప్రయత్నం ప్రతివ్యక్తి యొక్క ఉనికికి ఆధారం కావాలి., ప్రత్యేకించి మీలో ఎవరైతే బాధ్యతాయుత స్థానంలో వుంటూ ఇతరులబాగోగులకు బాధ్యతవహిస్తారో వారికో నాయకుడెపుడు ఒక నమూనాగా ప్రవర్తించాలి. తమ ఆశ్రితులనుంచి ఎలాంటి విలువలను కోరుతారో వాటిననుసరించి నడుచుకోవాలి, ఆదర్శంగా నిలవాలి, వారు అవగాహనతోను, సహనంతోను, ఓర్పుతోను సానుభూతి తోను, ఆదరాభిమానంతోను కూడిన స్నేహపూర్వక సద్భావనతోను, వుండాలి; తమకోసం స్నేహితులను గెలుచుకొనే అహంభావంలో కాదు, ఇతరులను అర్థం చేసుకొనే సహాయం చేసే ఔదార్యత కలిగి వుండాలి.

ఒక నిజమైన నాయకుడు కావాలనుకుంటే మనల్ని మనం మరచిపోవడం, మన ఇష్టాలను ప్రాధాన్యతలను వదులుకోవడం అనివార్యం.

నేనెపుడు మిమ్మల్ని అడిగేది అదే; ఆ విధంగా మీరు మీ బాధ్యతలను ఏ విధంగా నిర్వర్తించాలో అలా నిర్వర్తించ గలుగుతారు. తద్వారా ఎక్కడయితే అక్రమాలు, అనైక్యతలు వుంటాయో, అవి మాయమయిపోయి, వాటి స్థానంలో సామరస్యత, శాంతి, ఆనందాలు చోటుచేసుకొంటాయి.

మీకు తెలుసును నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నానని, మిమ్ములను ఆదుకోవడానికి, మీకు సాయం చేయడానికి, మీకో మార్గం చూపడానికి నేను ఎల్లవేళలా మీతో వుంటానని.

CWM 12:355-56

"నిగ్రహం లేని ప్రసంగం వల్ల కలిగే హాని"

చాలాసార్లు మీకు నేను చెప్పాను. అనవసరంగా మాట్లాడిన ప్రతిమాట ఒక ప్రమాదకరమైన ప్రేలేపనలాంటిదని. కానీ ఇక్కడ పరిస్థితి పరిమితిని మించింది — చెప్పవలసిన విషయాలు, పదేపదే చెప్పబడ్డాయి — ఎవరయితే పరిపూర్ణ మానవత్వంకోసం పరితపించారోవారు పదేపదే చెప్పారు. కానీ దురదృష్ట వశాత్తు కావలసినంత ఫలితం దక్కలేదు — ఈ ప్రశ్న ఒక దురుద్దేశంతో కూడిన పుకారు గురించి... అపవాదును గురించి, ఇతరులగురించి చెడుగా మాట్లాడ్డంలో కలిగే ఆనందమది; ఎవరైనా ఇలాంటి పుకార్ల వ్యాప్తిలో నిమగ్నులయివుంటే వారు, వారి చేతనను దిగజార్చుకొంటారు. ఈ వదురుబోతుతనానికి అసభ్యకర కలహాలు తోడయితే, అది అశ్లీలమైన పదజాలంలో వ్యక్త పరచబడినపుడు, అది ఆత్మహత్యకు, ఆధ్యాత్మిక ఆత్మ హత్యకు సమానమౌతుంది.

నేనీ విషయాన్ని నొక్కి చెపుతున్నాను. దానిని మీరు శ్రద్ధా పూర్వకంగా తీసుకోవడం ఆవశ్యకం.

CWM 9: 144

శ్రీమాత

సామాజిక జీవితము, స్వేచ్ఛ:

ఒక సమాజంలో నివసిస్తున్నప్పుడు, తనకు తాను నిర్దేశించుకొన్న క్రమశిక్షణను పాటించే బదులు ఇతరులచే విధించబడ్డ చట్టాలకు తరచూ బద్ధులై ఉండటం అవసరమా?

నీవొక సమాజంలో వుండాలని ఎంచుకున్నప్పుడు లేదా అంగీకరించినపుడు, ఆ సమాజంలో వుండే చట్టాలను తప్పనిసరిగా అవలంబించాలి లేకపోతే నువ్వే ఒక అయోమయ గందరగోళానికి మూలం అవుతావు అనేది సుస్పష్టం.

కానీ నీ ఆంతరంగిక అభివృద్ధి, ఉన్నత చైతన్యాభివృద్ధి ఏ క్రమశిక్షణనయితే నీవు మనఃపూర్వకంగా, అంగీకరించావో అది హానికరం కాదు.

CWM 10: 256

బహుముఖ ఆధ్యాత్మిక పరిణామం:

ఆధ్యాత్మిక సత్యమనేది ఆత్మకు సంబంధించినసత్యం, మేధకు సంబంధించిన సత్యం కాదు. అలాగే గణిత సిద్ధాంతం లేక తార్కిక సిద్ధాంతం కూడా కాదు. ఇది అనంత తత్వం యొక్క సత్యం, అనంతత్వపు నానా రూపాల్లో ఒకటి. ఇది అనంతమైన విభిన్న దశలను, లక్షణాలను ఊహించగలదు; ఆధ్యాత్మిక పరిణామంలో ఒకే ఒకటైన పరమసత్యాన్ని చేరుకోవడంలో విభిన్నమైన మార్గాలను అనుసరించడం అనివార్యం, దానిని బహుముఖమైన రీతిలో గ్రహించాలి. ఈ విభిన్న మార్గంలో గ్రహించడమనేది ఆత్మ ఒక సజీవ వాస్తవికతను చేరుకోవడానకి సహాయపడాలేకానీ ఒక ఉపసంహారణకు లేక ఒక జీవంలేని లేక కఠినమైన సిద్దాంతాన్నేర్పరచుకోవడానిగి గాని, స్తబ్ధతను కలిగించడానికి విషయాలను రూపుదిద్దడం కాదు. అతి కఠినమై, తార్కికమైన మేధో పరంగా వుద్భవించిన ఆలోచన తాలూకు సత్యం అనీ, దీన్ని అందరు ఒప్పుకోవాలన్న ఒకే ఆలోచనా కాదు, ఒక భావం లేదా భావాల సమూహం మిగతా భావాలన్నింటినీ ఓడించేది కాదు. ఒకే పరిమిత వాస్తవంలో అందరూ గుర్తించే అనేక వాస్తవాలసూత్రం కాదు. భౌతిక క్షేత్రపరిమిత సత్యంనుండి., జీవితం మరియు మనస్సు మరియు ఆత్మ యొక్క మరింత క్లిష్టమైన కృత్రిమ క్షేత్రానికి చట్ట విరుద్ధ బదలీ కాదు.

ఆధ్యాత్మిక వ్యక్తి యొక్క పరిణామక్రమంలో తప్పనిసరిగా అనేక దశలుంటాయి. ప్రతిదశలోను అస్తిత్వ చేతన, జీవితం, ప్రకృతి, భావాలు, శీలం, లలో చాలా వైవి

ధృత లున్నాయి. సాధనంగా వున్న మనస్సుయొక్క స్వభావం మరియు జీవితంతో వ్యవహరించవలసిన అవసరాలే ఖచ్చితంగా అన్వేషకుని వ్యక్తిత్వం ప్రకారం మరియు అభివృద్ధి దశను బట్టి అనంతమైన వైవిధ్యాన్ని సృష్టిస్తాయి. అయితే అదే కాకుండా స్వచ్ఛమైన ఆధ్యాత్మిక ఆత్మ-సాక్షాత్కారము మరియు ఆత్మ- ప్రకటన ఎప్పటికీ మార్పు చెందనిదిగా వుండనక్కర్లేదు. ఇక్కడే ప్రాథమిక ఐక్యతలో గొప్ప వైవిధ్యం వుంటుంది; పరమాత్మ ఒకటే కానీ ఆత్మ యొక్క అంతరాత్మలు అనేకం. ప్రాకృతిక అంతరాత్మ రూపాన్ని బట్టి, దాని ఆధ్యాత్మిక ఆత్మ— ప్రకటన వుంటుంది. ఏకత్వంలో భిన్నత్వం అనేది అభివ్యక్తి నియమం. వైవిధ్యతలను, అతిమానసిక ఏకత, సమగ్రత తప్పక సామరస్యపరచడమేగాని, వాటిని రద్దు చేయడం అనేది ప్రకృతిలోని ఆధ్యాత్మ ఉద్దేశ్యం కాదు.

CWSA 22: 919- 21 అనువాదం: టి. లక్ష్మి (9014239277)

స్వేచ్ఛ- సేవ

శ్రీమాతా! ఈ పంక్తుల అర్థం ఏమిటి? "స్వేచ్ఛ అంటే వ్యక్తి తన అపరిమితమైన ఐక్యతలో ఉండే తత్వం. అది ప్రకృతియొక్క రహస్యమైన అధిపతి. సేవ అంటే వ్యక్తిలోని ప్రేమతత్వం. తనను తాను స్వచ్ఛందంగా, తన అనేకమయిన యితర రూపాల లీలకు సమర్పించుకోవటం"

SABL Vol: 16, p. 386

తలపులు దర్శనాలు

ఉపరితలంలో చూసినపుడు ఈ రెండు విషయాలు అత్యంత విరుద్ధంగా, ఒకదానికొకటి పొసగనట్లుగా కనిపిస్తాయి. బాహ్యంగా చూస్తే, ఒక వ్యక్తి ఒకేసారి స్వేచ్ఛగా ఉండటం, సేవ చేయటం ఎలా సాధ్యమో, ఊహించలేరు. కానీ రెంటినీ సమన్వయపరచి, వాటిని ఈ పదార్థ జగత్తులో ఆనందమయ స్థితులుగా చేసే ఒక వైఖరి ఉంటుంది.

స్వేచ్ఛ అనేది ఒక సహజ, అంతర్గత అవసరం. వ్యక్తి సమగ్రమయిన అభివృద్ధికి ఆవశ్యకం. కాని నిజ స్వరూపంలో అది అత్యున్నత చైతన్యపు పరిపూర్ణ సాక్షాత్కారం. అది ఐక్యత యొక్క వ్యక్తీకరణ, మరియు దైవంతో ఏకం కావటం. ఆది మూలతత్వం

సఫలత. కాని ఈ ఏకత్వం అనేకత్వంలో ప్రతిష్టిత మవటం వలన మూలానికి, అవ తరణకీ మధ్య అనుసంధానంగా ఏదో పని చేయాలి. అందుకు ఎవరైనా ఊహించగలిగిన అత్యంత పరిపూర్ణమయిన సంసర్గం ప్రేమతత్వం. ప్రేమయొక్క తొలి అభివ్యక్తి ఏమిటి? తనను తాను సమర్పించుకోవటం, సేవ చేయటం. వెంటనే అప్రయత్నంగా తప్పనిసరిగా తననుండి వచ్చే స్పందన ఏమిటి? సేవ చేయటం. సంతోషంగా, పూర్తిగా, సంపూర్ణమయిన ఆత్మ నివేదనతో సేవ చేయటం.

ఈ విధంగా తమ స్వచ్ఛతలో, సత్యంలో ఈ రెండూ స్వేచ్ఛ, సేవ విరుద్ధమ యినవి కాక పరస్పర పూరకముల లాంటివి. పరమోన్నత సత్యంతో పరిపూర్ణ ఐక్యతవలన, పరిపూర్ణమయిన మోక్షం లభిస్తుంది. ఎందుకంటే అజ్ఞానము, అచేతన అంతా మిమ్మల్ని అసమర్థులుగా పరిమితీకరించబడిన వారిగా, బలహీనులుగా చేస్తుంది. స్వేచ్ఛ కోల్పోతారు. వ్యక్తిలో అచేతన మున్నంతవరకు అది పరిమితిని బంధాన్ని కలుగజేస్తుంది. సర్వోన్నత సత్యంలో పరిపూర్ణమైనన స్వేచ్ఛ ఉంటుంది. ఈ ఐక్యతను నిర్ధింపచేసుకోవడం ఎలా? స్వచ్ఛందంగా ఆత్మ సమర్పణ చేసుకోవటం ద్వారా కాక, ఇది ప్రేమయొక్క బహుమానం. నేను చెప్పినట్లుగా ప్రేమయొక్క తొలి వ్యక్తీకరణ సేవ.

ఇలా ఈ రెండూ సత్యంలో సన్నిహితంగా ఏకమై ఉన్నాయి. కానీ భూమిపైన ఈ అజ్ఞానమయ అచేతనాయుత ప్రపంచంలో స్వచ్ఛందంగా ప్రేమభరితమై, ప్రేమయొక్క అభివ్యక్తిగా ఉండవలసిన సేవ జీవన పోషణకూ, ఉనికిని కొనసాగించ టానికి తప్పనిసరి ఆవశ్యకతగా మారింది. అది అలా వికార రూపాన్ని, దుఃస్థితిని అవమానాన్ని పొందింది. ఏదైతే పుష్పంలా వికసించవలసినదో సంతోషకరం కావలసినదో అది అసహ్యంగా మారింది. అలసిపోయింది. ఒక నీచమయిన నిర్బం ధమైంది. ఈ భావన స్వేచ్ఛ యొక్క ఈ అవసరం కూడా వికృతరూపాన్ని పొంది స్వతంత్రతత కోసం దాహంగా మారి తిన్నగా తిరుగుబాటుకు, వేర్పాటుకు, విడిపోవ టానికి నిజమైన స్వేచ్ఛకు విరుద్ధంగా మారింది.

CWM 9: 50-51

పరమోన్నత క్రమబద్ధత, సామరస్యత

ప్రాణిక సంకల్పం మానసిక శక్తికి విధేయమయినపుడు వ్యక్తి లేదా సంఘం

యొక్క జీవితం నైతికమవుతుంది. కానీ ఈ ప్రాణికసంకల్పం, మానసిక శక్తి రెండూ ఒక ఉన్నతమైన దానికి అతిమానసానికి విధేయమయినపుడే మానవ జీవితం ఔన్నత్యాన్ని పొంది నిజమైన ఆధ్యాత్మిక జీవనం ప్రారంభమవుతుంది అది మానవా తీతుని జీవితం. ఎందుకంటే అతని ధర్మాలు అంతరంగంనుండి వస్తాయి. అది దివ్యధర్మం. ఆవిష్కరణలో అనేకమయినా మూలంలో ఒక్కటే. వ్యక్తి కేంద్రంలో ప్రకాశిస్తూ, జీవితాన్ని పరిపాలిస్తూ ఉంటుంది. ఐక్యత వలన ఈ ధర్మం సర్వోన్నత క్రమానికి, సామరస్యతకీ చెందింది. అలా వ్యక్తి తన అహంకార జనితమయిన ఉద్దేశ్యం, న్యాయాలు ఆచారాలతో, నడిపించబడకుండా తన స్వార్థపూరితమయిన ధ్యేయాలన్నింటినీ విడిచి పెడతాడు. అతని నియమం సంపూర్ణమయిన నిరాసక్తత వ్యక్తిగతమైన లాభాలకోసం ఈ ప్రపంచంలో లేదా పైలోకాలలో పనిచేయడం అతనికి ఊహకందని అసాధ్యత. ప్రతి పనీ తనకు స్ఫూర్తి నిచ్చే భగవద్దర్శనానికి పూర్తి సరళమయిన సంతోషమయిన విధేయతతో ఏ విధమైన ప్రతిఫలం, ఫలితాలను ఆశించకుండా చేయటం. ఎందుకంటే అత్యున్నతమయిన ప్రతిఫలం అటువంటి స్ఫూర్తితో పని చేయటంలో ఉండే ఆనందమే. అంతరంగంలో సంకల్పంలో ఆ దివ్యతత్వంతో తాదాత్మ్యం కావటమే.

ఈ ఉన్మీలన వలన మానవాతీతుడు కూడా తన సాంఘిక ప్రమాణాన్ని తెలుసుకుంటాడు. తనలోని దివ్యతత్త్వంతో మమేకం అవుతాడు. తన దివ్యత్వాన్ని గుర్తించగలగడం చేత అందరిలో ఉండే అదే దివ్యధర్మాన్ని గుర్తిస్తాడు. తనలోని దివ్యత్వంతో మమేకం కావటం వలన అందరిలోని దివ్యత్వంతో మమేకమవుతాడు, ఆ విధంగా కేవలం సారంలోనూ, పదార్థంలోనూ మాత్రమే కాక జీవనం యొక్క బాహ్యస్తరాలలోనూ, రూపాలలోనూ అందరి ఐక్యత యొక్క ఎరుకను కలిగి ఉంటాడు. అతడు కేవలం మనస్సు, ప్రాణం, శరీరమేకాక వాటిని కలిగి ఉండే జ్ఞానవంతమూ, నిశ్శబ్దమూ, ప్రశాంతమూ, శాశ్వతమూ అయి పరిపాలించే అంతరాత్మ లేక ఆత్మ. ఈ ఆత్మ సర్వత్రా అన్ని ప్రాణులను, మనస్సులను, పరిశీలిస్తూ, జ్ఞానవంతంచేస్తూ వాటిని వహిస్తూ ఉంటుంది. అతను ఈ ఆత్మను దివ్యమైన సృష్టికర్తగా, అన్ని కర్మలను చేసే వాడిగా, సకల చరాచరాలలో ఉండే ఒకే తత్వంగా తెలుసుకుంటాడు. ఎందుకంటే అనేకాత్మలుగా విశ్వంలో ఆవిర్భవించిన దైవంయొక్క ముఖాలు మాత్రమే. అతను ప్రతి వ్యక్తిని అనేక ముఖాలతో దర్శనమిస్తున్న విశ్వాత్మకమయిన

దైవంగానే భావిస్తాడు. అతను అందులో లీనమైపోతాడు. తన మనస్సు, ప్రాణం, శరరం ఆ ఏకైక ఆత్మ యొక్క అభివ్యక్తిగా గ్రహిస్తాడు. యిప్పుడు మనం యితరులుగా భావిస్తున్నావారంతా అతని ఆత్మ యొక్క యితర మనస్సులు, ప్రాణాలు, శరీరాలుగా భావిస్తాడు. తన శరీరం అందరి శరీరాలతో ఏకమై ఉండటం చూస్తాడు. పదార్థఐక్యత ఎరుకను అతను నిరంతరంకలిగి ఉంటాడు. అందరి ఉనికితో మనసులోనూ, హృదయంలోనూ మమేకమై ఉంటాడు. క్లుప్తంగా చెప్పాలంటే, అందరిలోతనను చూసుకుంటాడు. తనలో అందరినీ చూస్తాడు. ఈ విధంగా నిజమైన ఐక్యతని, ఐక్యతయొక్క పరిపూర్ణతలో గ్రహిస్తాడు.

CWM 2: 167-68

శ్రీమాతా! మన జనసంఘంలో మీరు తప్పనిసరి అని భావించే ప్రవర్తనా నియమాలు ఏమిటి?

సహనం, ఓర్పు, విశాలహృదయం, అంతరావలోకనం, నిశ్చలత, అర్థం చేసుకోగల దృఢత్వం,. పూర్తిగా వశమయ్యే వరకూ తొలగిపోయే వరకూ అహంపై నియంత్రణ

CWM12: 374 శ్రీమాత

అనువాదం: సరోజాప్రసాద్ (9704198298)

ప్రపంచ ఐక్యత దిశగా

అంతర్జాతీయ వ్యవహారాలలో చిత్తశుద్ధి ఆవశ్యకత

మనుషులు కేవలం వారి అంతర్జాతీయ వ్యవహారాలలో సైతం తప్పక సత్యసంధతతో, నిజాయితీతో ఉండాలనే విషయాన్ని అర్థం చేసుకొన్నప్పుడు మాత్రమే ఈ పృథ్వి నిరంతరంగా, సజీవమైన ప్రశాంతతను పొందుతుంది.

ప్రభుత్వాలనిజాయితీ కేవలం వాళ్ళేంచేస్తున్నారో చెప్పటంలోనే మాత్రమే కాకుండా వారు చెప్పింది చేస్తున్నారా అనే దాంట్లోనూ ఉండాలి.

*

రాజకీయ చతురత (డిప్లమసి) రెండు నాల్కల వ్యవహారం మరియు అసత్యం మీద ఆధారపడటానికి బదులుగా దివ్యసత్యం, దివ్యానుగ్రహ సాధనంగా అవగలిగినట్లైతే మానవ ఐక్యత, సామరస్యతల దిశగా ఒక పెద్ద అడుగు వేయడమే అవుతుంది.

కేవలం మానవ ఐక్యతయొక్క చైతన్యపువృద్ధి, వ్యవస్థల ఏర్పాటుద్వారానే పృథ్విపై నిజమైన శాశ్వత ప్రశాంతత సాధ్యం కాగలదు. బాహ్యంలోని వాటికి చాలా పరిమితమైన ప్రభావం ఉన్నప్పటికీ, ఈ దిశగా పనిచేసే సాధనాలన్నింటికీ స్వాగతం. ఏమైనాకానీ, అన్నింటిలోకి అత్యంత ముఖ్యమైనది అత్యంతావశ్యకమైనది, అనుల్లంఘనీయమైనది, తనకు తానుగా మానవ చేతనా పరివర్తన దాని కార్యసరళిలో జ్ఞానవృద్ధి, మార్పిడి.

అది జరిగే మధ్యకాలంలో ఉపయోగకరమైన రీతిలో కొన్ని బాహ్యచర్యలను చేపట్టవచ్చు. వాటిలో ఒకటి ద్వంద్వ జాతీయతా విధానాన్ని ఆమోదించటం. దానికి ఎల్లప్పుడూ ఎదురయ్యే ప్రధానమైన ఆక్షేపణ, ఎవరైతే ద్వంద్వ జాతీయతలను (పౌరసత్వాలను) స్వీకరించారో, వారికి రెండు దేశాల మధ్య యుద్ధం వచ్చినప్పుడు తలెత్తే ఇబ్బందికర పరిస్థితి.

కాని ఎవరైతే చిత్తశుద్ధితో ప్రశాంతతను కోరుకుంటున్నారో, వారు తప్పకుండా అర్థం చేసుకోవాల్సిన విషయం యుద్ధం గురించి ఆలోచించడం, యుద్ధంగురించి మాట్లాడటం, యుద్ధాన్ని ముందుగా చూస్తూ అంచనా వేయటం అనేది చేయడం జరిగితే దానికి తలుపులు తెరవడమే అవుతుంది.

దానికి వ్యతిరేకంగా, ఎంత ఎక్కువమందికి యుద్ధాన్ని రద్దు చేయడానికి

ఏక రూపకతవలన నీవు ఐక్యతను పొందలేవు.

ఏకరూపకతా కార్యక్రమాలవలన, విధానాలవలన విద్యలో ఐక్యతను పొందలేవు.

ప్రధాన ఆదర్శానికి ప్రధానమైన శక్తి లేక ప్రకాశానికి మన విద్యయొక్క ఉద్దేశానికి, ధ్యేయానికి నిరంతర నిర్దేశనం (సూచన) తో మరియు అవసరాన్ని బట్టి నిశ్శబ్దంతో లేదా వ్యక్తీకరించడంలో ఐక్యతను పొందడం జరుగుతుంది.

అసలైన, పరమోత్కృష్ట ఐక్యత భిన్నత్వంలోనే తనను తాను ప్రకటించుకొంటుంది. కేవలం మానసిక తర్కం మటుకు ఒకే విధంగా ఉండాలని గట్టిగా కోరుతుంది. ఆచరణలో, ప్రతి ఒక్కరు తప్పకుండా తాము అర్థం చేసుకొన్న, అనుభవించిన సొంతపద్ధతిని తెలుసుకొని ఉపయోగించాలి. కేవలం ఈ విధంగా మాత్రమే విద్య ప్రభావశీలమైనది కాగలదు.

CWM12: 191 — *అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ*

ప్రాణికమైన ఆసక్తి ఉంటుందో, అంతగా ఎక్కువ సమర్థంగా స్థిరమైన ప్రయత్నం దిశగా అవకాశాలుంటాయి. మనిషిలో నూతన చైతన్యం అవతరించేవరకు యుద్ధ నియంత్రణ ఆలోచనలు అసాధ్యం.

*

మొత్తం సంకుచితత్వాన్ని, స్వార్థపరత్వాన్ని పరిమితులను విదిళించివేసేయి. సర్వ మానవాళి ఐక్యత యొక్క చేతనకు మేలుకో. కేవలం ఇది మాత్రమే ప్రశాంతత, సామరస్యతలను సాధించే మార్గం.

CWM15: 58- 59

జాతుల సమైక్యత

అత్యంత ముఖ్యమైన భావన ఏమిటంటే ఏకరూపతవలనగాని, లేదా నిరంకుశత్వం, లొంగ తీసుకోవడం వలన కాని మానవజాతి ఐక్యత సాధించడం శక్యంగాదు. ప్రతి ఒక్క జాతి తన నిజమైన స్థానాన్ని తన ప్రతిభ మరియు మొత్తం తాను పోషించవలసిన పాత్ర ప్రకారంగా, కేవలం జాతులన్నింటి సంయోజిత వ్యవస్థతో మాత్రమే ఒక విస్తృతమైన ప్రగతిశీలమైన ఐక్యతను తీసుకురాగలదు. దానికి మాత్రమే శాశ్వతంగా ఉండే అవకాశం ఉంటుంది. ఈ సంయోజితం సజీవమైనదిగా ఉండాలంటే అది ఒక కేంద్రీయ (ప్రధాన) భావనచుట్టూ సాధించబడాలి. అది ఎంత ఉన్నతంగా ఉండటానికి సాధ్యమౌతుందో అంత ఉన్నతంగా ఉండాలి.

ఆ విధంగా అందులో అన్ని ధోరణులు, అత్యంత వ్యతిరేకమైనవి సైతం వాటికి అనుకూలమైన స్థానాలను పొందే అవకాశం ఉంటుంది. ఉన్నతోన్నతమైన ఈ భావన మనుషులకు వారికి ఆవశ్యకమైన జీవన స్థితిగతులను ఇస్తుంది. ఆ విధం గా రేపటి జాతిని సృష్టించే నూతనశక్తి అభివ్యక్తతకు తమనుతాము సంసిద్ధం చేసుకోగలుగుతారు.

అన్ని శత్రుత్వ ప్రేరణలు,అగ్రగామిత్వానికి నిరంకుశత్వానికి చేసే అన్ని సంఘర్షణలు తప్పక అదృశ్యమవ్వాలి. అది సామరస్యపూర్వకమైన వ్యవస్థను, స్పష్టంగా గోచరించే సమర్థవంతమైన భాగస్వామ్యానికి దారిచూపే ఇచ్ఛను పాట మరింప జేస్తుంది.

CWM12: 40 శ్రీమాత

మానవజాతి ఆధ్యాత్మిక మతమే భవిష్యత్తుకు ఆశాకిరణం. కాని దీనర్థం సర్వసాధారణంగా అనుకునే విశ్వజనీనమతం, ఒక వ్యవస్థ, ఒక మతవిశ్వాసం సంగతి, మేధోపరమైన విశ్వాసం, సిద్ధాంతం, బాహ్య కర్మకాండలు కావు. వాటితో ఐక్యత కోసం మావజాతి ప్రయత్నించింది. అది వైఫల్యం చెందింది, దాని కది తగినదే. కారణం మానసికమైనటువంటి మత విశ్వాసం, ప్రాణిక రూపం ఉన్నచోట ఎక్కడా విశ్వజనీన మతవ్యవస్థ అంటూ ఉండబోదు. యధార్థానికి అంతరంగ ఆత్మ ఒక్కటే కాని అన్నింటి కంటే మించి ఆధ్యాత్మిక జీవితం స్వేచ్ఛకు వ్యత్యాసాలకు దాని స్వ వ్యక్తీకరణలోను, అభివృద్ధి సాధనాలలోను ఒత్తిడి చేస్తుంది. మానవజాతి మతం అంటే ఒక రహస్య ఆత్మ ఒక దివ్యవాస్తవికత ఉన్నదనే విషయపరిజ్ఞానం వృద్ధి చెందుతూ ఉండడమే. అందులో మనమందరము ఒకటేనని ప్రస్తుత మానవజాతి పృథ్విపై దాని అత్యుత్తమవాహకమని, మానవజాతి, మానవ అస్తిత్వం సాధనములని, వాటి ద్వారా అది ఇక్కడ తనను తాను క్రమానుగతంగా వెల్లడించుకుంటుందని అర్థం. అది ఇంకా తెలియజేసేదేమంటే, ఈ జ్ఞానంలో నివసించడానికి వృద్ధిజెందే యత్నంతోపాటు భూతలంపై దివ్యశక్తి సామ్రాజ్యాన్ని తీసుకురావడం. మనలో దాని వృద్ధితో, మన తోటిమనుషులలో ఏకత్వమనేది మన జీవిత మంతటినీ నడిపించే ప్రధానసూత్రమౌతుంది. అది కేవలం, సహకారసూత్రమే కాకుండా ఒక గాఢమైన సౌభ్రాతృత్వం, ఒక వాస్తవికత, ఒక వాస్తవికమైన ఐక్యత మరియు సమానతలయొక్క అంతరంగ భావన, కేవలం తన తోటి-మనుషుల జీవితం సంపూర్ణతలోనే తన సొంతజీవితం సంపూర్ణమౌతుందని తెలుస్తుంది. కేవలం వ్యక్తియొక్క స్వేచ్ఛాయుత మైన సంపూర్ణజీవితంమీద మాత్రమే దాని సొంత పరిపూర్ణత, శాశ్వతానందం స్థాపించబడుతుందని జాతికి తప్పక తెలుస్తుంది. అక్కడ కూడా తప్పకుండా ఈ మతాన్ననుసరించి ఒక క్రమశిక్షణ, ఈ మతంద్వారా విమోచనానికి మార్గం, అనగా, ప్రతిమనిషి తనకు తానుగా సాధనసామగ్రిని అభివృద్ధి చేసుకొనగలగటం జరగవచ్చు. ఆ విధంగా అది జాతి జీవితంలో కూడా అభివృద్ధి చెందవచ్చు. ఆ విషయంలోకి చివరికంటా పోవాలంటే ప్రస్తుతంలో అది చాలా విస్తృతమైన విషయమని అర్థమవుతుంది. ఈ మార్గం గుండా వెడితే కొన్ని నిర్దిష్ట పరిస్థితుల పర్యవసానంగా

ఫలితానికి దారి ఉంటుందనే సూచన చేస్తే చాలు. సందేహం లేకుండా, మిగతావాటి వలెనే ఇది కూడా ఒక భావనే అయితే, అన్ని భావనలమాదిరిగానే ఇదీ అవుతుంది. ఇది మన అస్తిత్వ సత్యమైతేగనుక, అప్పుడు సమస్తమూ దేనివైపైతే కదలిపోతున్నదో ఆ సత్యమే అవుతుంది. దానిలో ఒక మౌలికమైన, ఒక అంతరికమైన ఒక సంపూర్ణమైన, ఒక వాస్తవిక మానవ ఐక్యతా సాధనములను తప్పక కనుగొంనటం జరుగుతుంది. అదే మానవ జీవితంయొక్క ఏకీకరణకు ఒక సురక్షిత ఆధారమౌతుంది.ఒక ఆధ్యాత్మిక ఏకత్వం ఒక మానసిక ఏకత్వాన్ని సృష్టిస్తుంది, అది ఏ మేధోపరమైన లేదా బాహ్య రూపంమీద ఆధారపడదు. అంతేకాక, దాని యాంత్రికమైన పద్ధతులతో ఏకీకరించే దాని మీద ఆధారపడటానికి జీవిత ఏకత్వాన్ని బలవంతం చేసేదిగా ఉండదు. కాని దాని సురక్షిత వైక్యతకు స్వేచ్ఛాయుతమైన అంతరంగ వ్యత్యాసం ద్వారా, స్వ-వ్యక్తీకరణకు బాహ్యంలో ఒక విధమైన స్వతంత్రతతో ఎల్లప్పుడూ పెంపొందింప జేయటానికి తయారుగా ఉంటుంది. ఇదే మానవజాతి ఉనికి ఉన్నతోన్నత నమూనాకు ఆధారభూమిక.

CWSA 25: 577-78

సౌభ్రాతృత్వం

కేవలం ఒక బాగా లోతైన సౌభ్రాతృత్వం, ఇప్పటికీ స్థాపించబడనటువంటి ప్రేమసూత్రం మాత్రమే పరిపూర్ణమైన సామాజిక పరిణామానికి కచ్చితమైన పునాది. ఇక ఏ ఇతరమూ దాని స్థానాన్ని ఆక్రమించశక్యం కాదు. కాని ఈ సౌభ్రాతృత్వం ప్రేమ ప్రాణిక పరమైన సహజ ప్రేరణలద్వారానో, లేదా తర్కాలతో మరియు ఇతరమైనటువంటి పరస్పర విరుద్ధమైన సహజప్రేరణలతో కలవర పరచడంతోనో లేక పక్కకు తిప్పేయడంతోనో అది ముందుకు పోవడం జరగదు. లేక అటువంటి మనిషి యొక్క ప్రకృతి సిద్ధమైన హృదయంలోనూ ఎక్కడైతే దానిని పోటాపోటీగా ఎదుర్కొనడానికి సమృద్ధిగా వాంఛలుంటాయో అక్కడకూడా అది తనకు తానుగా తెలియబడదు. కేవలం తన ఆత్మలోనే దాని మూలాన్ని తప్పక కనుగొనాలి.మన అస్తిత్వ గాఢతర సత్యంమీద స్థాపించబడిన ప్రేమయే, సౌభ్రాతృత్వం లేక దానికి ఇలా మనం అనగలం — ఏలనంటే, ఇది ప్రాణికమైన లేక మానసికమైన భావనలకంటే ఇతరమైన సౌభ్రాతృత్వ భావన, ఒక ప్రశాంతతరమై ఎక్కువ కాలముండే ప్రేరణాశక్తి

— ఏకత్వపు అంతరంగ సాక్షాత్కారం యొక్క వ్యక్తీకరణ అయినటువంటి ఆధ్యాత్మిక సహచరత్వం (కామ్రేడ్ షిప్). కేవలం ఆ కారణంగా మాత్రమే స్వార్థాహంకారం అదృశ్యమవగలదు. ప్రతిమనిషి తనకుతానుగా అసదృశమైన దైవత్వం యొక్క అసలైన వ్యక్తివాదం, తనకు తానుగా జాతిలోని సమానదైవత్వం యొక్క అసలైన సామ్యవాదం(కమ్యూనిజం) స్థాపింపబడగలదు. ఏలననగా, పరాత్పరుని శక్తి అత్యంత లోలోతులలోని, ఆత్మప్రతి అస్తిత్వంలోని విశ్వజనీన దైవత్వం, ఏదైతే, ఏ విధమైన యేకత్వం ఆతని అసలైన ప్రకృతియో! (లక్షణమో) అది దాని వ్యక్తిగత జీవితమును, ప్రకృతిని సమస్త ఉనికిలో, విశ్వజనీన జీవితంలో, మరియు ప్రకృతిలో సాక్షాత్కరించు కొనవలసి యున్నది.

ఇది ఒక పరిష్కారం. దీనిని వ్యతిరేకించే అవసరం ఉంది. కారణ అది ఇంకా మంచి మానవ సమాజ లక్ష్య ప్రాప్తి రోజును జాతి భవిష్య పరిణామంలో ఎంతో దూరానికి నెట్టి వేస్తుంది. కారణం వ్యక్తిని లేదా సమిష్టి మానవుని పరిపూర్ణం చేయగలిగిన యంత్రసామగ్రి ఏ హేతువుతోను ఆవిష్కరించబడలేదు. మానవ ప్రకృతిలో ఒక ఆంతరంగిక మార్పు ఆవశ్యకత ఉంది. ఆ మార్పు ఎంత కష్టమైనదంటే చాలా కొద్దిమందిచేత మాత్రమే అది నెరవేర్చబడింది. ఇది కచ్చితమేమీకాదు. కాని ఏది ఏమైనా సమస్యకు ఇది పరిష్కారం కాకపోతే, అప్పుడు మానవాళికి ఏదారీలేదు. అప్పుడు జంతువును దాటి దూరంగా పోయి తీరాలి. ఆధ్యాత్మిక మార్పుకు సామర్థ్యం కలిగిన ఒక మహత్తరమైన జాతి తప్పక రావాలి, దివ్యత్వానికి దగ్గరగా ఉండే రూపం కలిగిన జీవం తప్పక జన్మించాలి.

CWSA 25:220-221 — *శ్రీఅరవిందులు*

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ (9441813100)

ఒక ఆధ్యాత్మిక సమాజం

ఒక ఆధ్యాత్మిక సమాజం, తన సామాజిక దృక్పథంలో, మాహాత్ముని దగ్గర్నుండి, నేరస్తునివరకూ, వ్యక్తిని నైపుణ్యాంగల యంత్రాంగ దృష్టి నుండి చూడవలసిన సమాజ మూసలో చదును చేయవలసిన లేక అణచివేయవలసిన ఒక సామాజిక సమస్యకు సంబంధించిన ప్రత్యేక వ్యక్తులుగా చూడదు. కాని, మనం రక్షించవలసినవున్న, ఒక వలలో చిక్కుకుపోయి బాధపడుతున్న అంతరాత్మలుగా, యెదుగుతున్న

అంతరాత్మలుగా, యెదగడానికి ప్రోత్సహించవలసిన అంతరాత్మలుగా, యింకా పెద్దగా యెదగనటువంటి అల్పాత్మలు యెవరి దగ్గర్నుండి సహాయాన్ని, శక్తిని పొందగలవో ఆ యెదిగిన అంతరాత్మలుగా వారిని పరిగణిస్తుంది. దాని ఆర్థిక వ్యవహారాల లక్ష్యం పోటీ తత్వంగల లేక సహకారతత్వంగల ఒకభారీ ఉత్పాదక యంత్రాంగాన్ని తయారుజేయడం, మాత్రమేగాక మనుషులకు — కొద్ది మందికి మాత్రమేగాక, మనుషులందరికీ, ప్రతీవానికీ అతనికి సంబంధించిన అత్యున్నత ప్రమాణంలో — వారి స్వభావాన్ననుసరించి, ఆంతరంగికంగా యెదగడానికి స్వేచ్ఛా సమయాన్ని అనుసరించి పనిచేసే ఆనందాన్నందించడం, అలాగే అందరికీ ఒక సుసంపన్న, సుందర జీవితాన్నందించడం, ప్రభుత్వాన్ని తన భగవంతునిగా, తన బృహత్తరాత్మగా ఆరాధించే ప్రభుత్వమనే యంత్రాన్ని చెక్కుచెదరకుండా, శక్తివంతంగా, మరింత విశాలంగా ఎప్పటికీ నిలిచి వుండేదిగా మరింత సంకీర్ణమూ, మరింత యిబ్బందికరమూ మరింత యాంత్రికంగా సమర్థవంతమూ సమగ్రమూ అయ్యేందుకనువుగా, ప్రప్రథమ పిలుపుకే, తన బలిపీఠంపై యితరులను బలి చేయడానికి, స్వయంగా తన రక్తాన్ని ధారపోయడానికి సమ్మతించే జాతులను, వాటి స్వకీయ ఆంతరిక జీవన పరిధిలోనే మనిషిని నియమబద్ధుని చేసి, తన రక్షణ కవచంగా చేసి, భారీ యంత్రాలుగా ఆధ్యాత్మిక సమాజం తన రాజకీయ వ్యవహారాలలో పరిగణించదు. వారి పరస్పర సంబంధబాంధవ్యాలలో శాంతి సమయాల్లో ఒకరి మీద మరొకరు విషవాయువులను ప్రయోగించడానికి, యుద్ధవేళలలో ఒకరు మరియొకరి సాయుధ బలగాలమీద, నిరాయుధ లక్షలాది పౌరుల మీద, ఆధునిక యుద్ధ క్షేత్రాలలో యుద్ధ విమానాలు, లేక శతఘ్నులలాగా హతమార్చడానికి, ప్రయోగించే తుపాకీ తూటాలను, సైనికులను నియమించి పెళపెళార్భటులతో విరుచుకు పడడానికుద్దేశించినట్లుగా యీ జాతులు లేక ప్రభుత్వాలను పెంచి పోషించడంతో ఆధ్యాత్మిక సమాజం సంతృప్తి చెందదు.

సామూహిక అంతరాత్మ

అది ప్రజలను సామూహిక-అంతరాత్మలుగా, తన మానవ సమూహాలలో ఆత్మావిష్కరణ చేసుకోవలసివున్న ఆచ్ఛాదితమైవున్న దైవత్వంగా ఆధ్యాత్మిక సమాజం పరిగణిస్తుంది. సామూహిక అంతరాత్మలు అంటే అర్థం వ్యష్టిలాగానే,

వాటి స్వభావాన్ననుసరించి ఎదగడం ఆ యెదుగుదల వల్ల పరస్పరసహాయం చేసుకోని మానవత అనే యేకైక సామాన్యకార్యంలో మొత్తం జాతి యెదగడం. ఆ సామాన్య కార్యం, వ్యష్టిలోను, సమిష్టిలోను పరమాత్మను కనుగొనడం ఆధ్యాత్మికంగా, మానసికంగా, ప్రాణికంగా, భౌతికంగా దాని మహనీయ, విశాలతకు, సంపన్నతకు, అత్యంత లోతైన సంభావ్యతలను, సమస్త జనుల ఆంతరిక జీవనంలోనూ, వారి బాహ్య కర్మ, స్వభావంలోనూ నిజం చేసుకోవడం, సిద్ధింప జేసుకోవడం.

ఎందుకనంటే బయటనుండి విధించబడిన ఒక భావన లేక ఒక నియమంచేతగాక తమలోనే వున్న దైవంలోనికి, మనుషులు, మానవజాతి యెదుగవలసివుంది. మానవజాతి ఆధ్యాత్మిక యుగంలో యెంతో గొప్పగా గౌరవించబడిన విషయం, ఆంతరిక స్వేచ్ఛా వికాసధర్మం అందుచేత అయ్యింది. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందుకో గలిగినంత దగ్గరకు మనిషి రానంత కాలం, ఆ వైపుకతడు తిరుగనంతకాలం, బాహ్యవత్తిడి అనే ధర్మంనుండి అతడు తప్పించుకోలేడనే అలా తప్పించుకునేందు కతడు చేసే ప్రయత్నాలన్నీ వ్యర్థమౌతాయనేమాట,యధార్థం.అదలా కొనసాగుతున్నంతకాలం, అతడు యితరులకు బానిసగా, తన కుటంబానికి బానిసగా, తనకులానికి, తన తెగకు తన ప్రార్థనా మందిరానికి, తన సంఘానికి తన జాతికి బానిసగా అవుతాడు. బానిసగా వుండిపోతాడు. అతడు మరోలాగాక అలా వుండిపోక తప్పదు, ఎందుకనంటే, అవికూడా అతనిమీద తమ మాలిన్యాన్ని యాంత్రిక ఒత్తిడిని అతని మీద మోపకుండా వుండలేవు. కారణం అవి కూడా తమ స్వీయాహంకారానికి బానిసలే, స్వీయనిమ్న ప్రకృతికి బానిసలే....

CWSA 25:220-257

ప్రపంచాన్ని ఒత్తిడి చేస్తున్న భవిష్యత్తు, సమస్త వైక్యత. కాని సమస్య జాతుల యేకత సంభవమవ్వాలంటే మొదట ప్రతి జాతి తన యేకత్వాన్ని సిద్ధింపజేసుకోవాలి

CWSA 12:250

మానవజాతి ఆధ్యాత్మికయుగం

ఈ సత్యాన్ని మానవజాతి ఆధ్యాత్మికయుగం అవగాహన చేసుకొంటుంది. దర్శిస్తుంది. యంత్రాంగం ద్వారా మనిషిని పరిపూర్ణంచేయడానికి లేదా అవయవా లన్నింటినీ కట్టిపడవేసి, అతనిని నిటారుగా నిలబెట్టడానికి అది యత్నించదు. పోలీసు ల్లోను అధికారి, ఉద్యోగులలోను లేక ఒక సామ్యవాద అధికార లేక ఒక శ్రామికసమితి రూపంలోనో అతని ఉన్నత ఆత్మ వున్నట్లుగా అది సమాజ సభ్యునికి చెప్పదు. చూపదు. అంతరంలోని ఆధ్యాత్మ దివ్యవత్తిడిని మేలుకొలుపడంద్వారా వీలైనంత త్వరగా సాధ్యమైనంతవరకూ మానవ జీవితంలో బయటినుండి కలిగే వత్తిడికి సంబంధించిన ఒక అవసరాన్ని క్షీణింపజేయడం దానిలక్ష్యం. అందుకది ఉపయోగించే సమస్త ప్రాథమిక సాధనోపాయాల లక్ష్యం కూడా అదే. అంతిమంగా అది ఏకైక గాకపోయినా ప్రధానంగా ఉపయోగించే సాధనోపాయం ఆధ్యాత్మిక ఒత్తిడి. ఈ ఒత్తిడిని ఆధ్యాత్మిక వ్యక్తిసైతం తన చుట్టూవున్న వారి మీద కలిగించగలడు. అంతకంటె ఇంకెంత అధికంగా ఒక ఆధ్యాత్మిక సమాజం అలా చేయగలుగుతుంది. ఆంతరిక నిరోధం బాహ్య తిరస్కృతి వున్నప్పటికీ తన స్వీయ స్వభావం ద్వారా దైవంలోనికి యెదగడానికి గలకోరిక, శక్తి దివ్యవెలుగు ఒత్తిడి మనలను మేలు కొలుపుతుంది. ఎందుకనంటే, ఒక ఆధ్యాత్మిక నిరంకుశుడు కలగనే ఆధ్యాత్మీకరించబడిన సమాజం ఎలా వుంటుందంటే, ప్రజలందరూ ప్రగాఢ స్వేచ్ఛతో వుంటారు. అలా ఎందుకనంటే ప్రాథమిక షరతు నెరవేరింది గనుక. ఆ స్థితిలో ప్రతి మనిషి తనకు తానే ఒక చట్టం కాదు, కాని చట్టం దివ్యచట్టం. కేవలం తన లాభం కోసం, తన కోసం ప్రధానంగా నివసించే ఒక అహం కాదు. అతడు దివ్యసత్యతలో నివసించే ఒక అంతరాత్మ. అహంనుండి ముక్తమైన తన స్వకీయ దివ్య స్వభావ ధర్మంచేత తన జీవితాన్ని సాగిస్తాడు.

CWSA 25:257 - 58

నూతన శక వైతాళికులు

ఒక ఆధ్యాత్మిక పరిణామమే భవిష్యత్తు గనుక అదే మానవునికి గొప్పఅవసరం అని యెవరు గుర్తిస్తారో వారు మానవజాతి భవిష్యత్తుకు చాలా సహాయం చేసే

వ్యక్తులవుతారు. పశుమానవుడు మానసిక మానవుడిగా, శిఖరాయమానంగా మానసీకరించబడిన మానవజాతి శిఖరంగా, చాలావరకు మార్పు చెందినట్లుగానే, యిప్పుడూ అలాగే లేక భవిష్యతులో — యే రూపాన్ని ఉపయోగిస్తామో, దాన్ని బలపర్చడానికి యే సిద్ధాంతాన్ని స్వీకరిస్తామో అనేది పెద్ద విషయంకాదు. ప్రస్తుత మానవజాతి, ఆధ్యాత్మీకరించబడిన మానవజాతిగా ఒక పరిణామం లేక మార్పు అనేది జాతి ఆవశ్యకత, అదే తప్పకుండా ప్రకృతి ఉద్దేశ్యంకూడా. పరిణామం లేక మార్పు వారి ఆదర్శం, కృషి కూడా. ప్రత్యేక నమ్మకానికి, రూపానికి, యితరులతో పోల్చి చూచినపుడు పూర్తిగా ఉదాసీనంగా ఉంటారు. జనం దేనికి సహజంగా ఆకర్షితులౌతారో ఆ నమ్మకాలకు, ఆ రూపాలకు, వాళ్ళను వదిలివేస్తారు. ఈ ఆధ్యాత్మిక మార్పిడిలో విశ్వాసం తప్పక ఉండాలని దానిని నిజజీవితంలో జీవించే ప్రయత్నం యే జ్ఞానంమైనా సరే — అదియే అభిప్రాయంగా బయటపెడ్తున్నారనేది పెద్దవిషయం కాదు— ఈ నిజ జీవితంలోనికి మార్పు చేయగలం అనే దాని మీద వాళ్ళు పట్టు బడ్తారు. ఈ పరివర్తనాన్ని యంత్రాంగం ద్వారా తదితర బాహ్యసంస్థల ద్వారా ఫలప్రదం చేయవచ్చుననే పొరపాటు ఆలోచనను, ముఖ్యంగా వాళ్ళు చేయరు. ప్రతి మనిషిచే అది ఆంతరికంగా జీవించవలసిన విషయమనీ, లేక దానిని మొత్తం వర్గానికి సత్యతగా చేయకూడదనీ వాళ్ళెన్నటికీ మరచిపోరు. మనిషి తన అంతరంగంలోనే భవిష్యద్రహస్యాన్ని అన్వేషించేటట్లు యేది ఆదేశిస్తుందో ఆ తూర్పు దేశాల ఆంతరిక దృక్పథానికిగల కేంద్రీయ అర్థాన్ని వాళ్ళు తీసుకుంటారు. దానికి ఒక భిన్నమైన అర్థాన్ని కల్పించినప్పటికీ, పశ్చిమదేశాలు, జీవితాన్ని గురించి మనకు తెలిసిన దానిని ఉత్తమంగా తయారుచేయడానికి, సమస్త జీవనానికి ఒక సామాన్య నియమాన్ని సాధించడానికిగల ప్రాముఖ్యతను గూడా వాళ్ళు అంగీకరిస్తారు.

CWSA 25:265- 66 అనువాదం: కె.వి.రావు,*9849929254*

ప్రాక్పశ్చిమాలు

తూర్పు దేశాలు పడమర దేశాలకు ఇచ్చే సందేశమే సరియైన సందేశం. "నీ అంతరంగాన్ని అర్థం చేసుకుంటేనే మానవుని మనుగడకు అర్థం ఉంటుంది," ఇదే దాని సారాంశం నీ ఆత్మను నీవు పోగొట్టుకున్న తరువాత అంతకన్నా నీకు ఎక్కువ లాభం వస్తుందా?

పశ్చిమదేశాలు ఈ సందేశాన్ని విన్నాయి. భౌతిక సత్యంకంటె అంతరంగంలోని సత్యానికే విలువ ఎక్కువ ఉంటుందని గ్రహించి దాన్ని అన్వేషించటం ప్రారంభించాయి. "ఆత్మ" పనిచేసే తీరును అంతరంగంలోని లోతు పాతులు తెలుసుకొని అది బాహ్యపదార్థముకంటె విభిన్నమైనదని సమున్నతమైనదనీ, వారు గ్రహిస్తున్నారు.

యాంత్రికీకరణకు భౌతిక విషయ పరిజ్ఞానానికి, అత్యధిక ప్రాధాన్యం ఇవ్వటం వలన పాశ్చాత్యుల కళ్ళు భౌతికం వలన మసక బారి, భౌతికాన్ని మాత్రమే చూచి, అదే సత్యమని నమ్ముతున్నారు.

ఆ విధంగా బ్రిటన్, అమెరికాలు యాంత్రిక విజ్ఞానవెల్లువలో తలమునకలై, ఆధ్యాత్మిక రాహిత్యం వలన గుణాతీత "నిరపేక్ష సత్యం" గురించి లోప భూయిష్ట అభిప్రాయాలుకలిగివుండి (అతీత) భౌతిక మార్గాలనే అనుసరిస్తున్నారు.

ఆసియా ఖండంలో మాత్రం "ఆత్మజ్ఞానమే" నిజమైన వెలుగు అనీ, మనోమయ జీవితం "పరమసత్యమైన ఆత్మను చేరటానికే" అని నమ్మి, అదే సూత్రాన్ని మహోన్నత లక్ష్యంగా నిర్దేశించుకొని, బాహ్య జీవనం కాని, సాంఘిక కట్టుబాట్లు కాని, ఆ మూసలోనే మలచుకొని, వ్యక్తికీ, సంఘానికీ మంచి జరగాలని కృషిచేస్తున్నది. ఇదే న్యాయమైన దని నమ్మి, మనం దీన్ని పూర్తిగా సమర్థించాలి. కాని ప్రత్యేకంగా మన దేశంలో దీని ఉద్దేశమునకు, ఆచరణకు ఎంతో దూరం ఏర్పడింది. జాతియొక్క మానసిక మరియు భౌతిక విలువలకు ఎంతో వ్యతిరేకత ఏర్పడిందికూడా!

నిజానికి భౌతికతయొక్క పరిపూర్ణ వికాసం ఆధ్యాత్మిక వికాసం మీదే ఆధారపడాలి. పూర్వకాలంలో ప్రాచ్యదేశాలలోని విజ్ఞులు ఈ విధంగానే మనుగడ సాగించారు. కాని ఈనాడు భౌతికమైన విషయపరిజ్ఞానం ఎక్కువై, ఈ జ్ఞానం మసక బారింది బాహ్యంలోని వాటికి చాలా పరిమితమైన ప్రభావం ఉన్నప్పటికీ, తరువాతి తరాల ఆచరణలో అది లేకుండా పోయింది.

పాశ్చాత్యప్రపంచం ఇస్తున్న సందేశం ప్రాచ్య (తూర్పు) దేశాలకు కూడా అవసరమే " మానవుడే దైవం, అతని పరిణామమే దివ్యత్వానికి సోపానం. జీవనము కూడా దివ్యత్వమే!" అనేది దాని సారాంశం. క్రమ క్రమంగా జీవితం పరిపూర్ణత్వాన్ని సంతరించుకోవటం అంటే, "పరబ్రహ్మ మానవ జీవితంలో వ్యక్తం కావటమే!" అందువలన జీవితాన్ని నిర్లక్ష్యం చేయటం అంటే, దైవాన్ని నిర్లక్షం చేసినట్లే!

పాశ్చాత్యులు తూర్పు దేశాలకు అందిస్తున్న సత్యం ఇదే. భౌతిక, ఆధ్యాత్మిక

సత్యాలు సమ్మేళనం కావాలి. ఆ విధంగా మన ప్రాచీన విజ్ఞానం మార్పు చెందాలి.

ఇప్పుడు తూర్పు దేశాలు క్రమంగా ఈ విషయాన్ని అర్థం చేసుకుంటున్నాయి. కాని ఇందులో ఒక ప్రమాదం కూడా ఉన్నది. ఆసియాదేశాలు పాశ్చాత్య సందేశాన్ని, "పాశ్చాత్య విధానంలో" అనుసరించే ప్రమాదం కూడా ఉన్నది. దీనివలన తూర్పుదేశాల స్వరూప స్వభావాలు అంతరించే ప్రమాదం ఉన్నది. ఆ విధంగా పాశ్చాత్యులను గ్రుడ్డిగా అనుకరించటం జరగవచ్చు! అట్లా కాకపోయినా, ప్రాచ్య పాశ్చాత్య రూపాలు సంకర రూపాలను సంతరించుకొని తూర్పు దేశాలపై 'దురాక్రమణ' కూడా జరుపవచ్చు!

CWSA 13: 144-145

భిన్నత్వంలో ఏకత్వం

" ఆధ్యాత్మికంలో అంతా ఏకత్వేమే. కాని అందులోనే భిన్నత్వం కలిసివుంది. అందువలన భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించటమే ఆధ్యాత్మికత అదే పరిపూర్ణత్వానికి పునాది"

ప్రశ్నలు- జవాబులు 4-8-1929

విశ్వసృష్టికి మూలం ఇదే. ఏకత్వమే, బహుత్వంగా పరిణామం చెందింది. బహుత్వ భావన వలన ప్రతి విభాగమూ తనదైన ప్రయోజనాన్ని అందిస్తున్నాయి, తమతమ ధర్మాలను నిర్వర్తిస్తున్నాయి. ఈ భావాన్నే మనం పెంపొందించాలి. అదే సమయంలో భిన్నత్వానికి ప్రాథమిక కారణమైన ఏకత్వభావనను కూడా మేల్కొలపాలి. ఇదే "భిన్నత్వంలో ఏకత్వాన్ని" సాధించే ప్రక్రియ. ఏకత్వంలో పరిపూర్ణత్వం సాధించాలంటే ప్రతివ్యక్తిలో దానికి అనువైన మార్పు రావాలి.

CWSA 13: 4- 323

ముఖ్యంగా గ్రహించాల్సింది ఏమంటే "దివ్యత్వం" అనే శిఖరాగ్రాన్ని చేరుకొవటమే అందరి కర్తవ్యం. పరిపూర్ణత శిఖరాగ్రాన్ని చేరుకోవటానికి విధి నిర్వహణలో, ప్రతివ్యక్తి తనదైన శైలిలో "దివ్యత్వం" అనే ఏకత్వాన్ని ప్రదర్శించాలి. ఈ మధ్య మనం ప్రస్తావించుకున్న అంశం కూడా ఇదే. వ్యక్తి తనదైన స్వభావం ద్వారా దివ్యత్వాన్ని ప్రకటించాలి. ఇతరుల మార్గాలను అన్వేషించనవసరం లేదు. ప్రతివారు వారివారి మార్గాలలోనే ముందుకు సాగి ఒకే ఒక్కటైన శిఖరాగ్రాన్ని చేరుకోవచ్చు. కాని

అక్కడ కూడా ఆగకూడదు. లక్ష్యం సుదూరంగానే వుంటుంది. ప్రతి వ్యక్తి తాను ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించుకోవలసిందే. ఇతరుల లక్ష్యాలను దృష్టిలో పెట్టుకో కూడదు.

CWM 4: 350

భవిష్యత్తుపై ఆశ

చేతనలో వచ్చే మార్పుల మీదే ప్రపంచ భవితవ్యం ఆధారపడి యుంటుంది. ఇది మానవ చేతనలో రావలసిన పరిణామం. ఈ మార్పు అనివార్యం. ఈ మార్పుకు సహకరించాలా, వద్దా అనేది మానవుడే నిర్ణయించుకోవాలి. సహకరించకపోయినా పరిస్థితుల ప్రభావం వలన బలవంతంగా మారవలసి వస్తుంది. కాబట్టి మనం జాగృతమై (పరిణామానికి) సహకరించాలి.... ఆశీస్సులు

మూలంపై ధ్యాస

1. మానవులలో ఏకత్వాన్ని పెంపొందించే మార్గం?

సమా: ఆధ్యాత్మిక విద్య. అంటే ఆత్మశక్తిని పెంపొందించే విద్య. దానికి మతంతోనూ నైతికతతోనూ, భౌతిక విజ్ఞానం తోను సంబంధం లేదు!

2. "చేతనలో మార్పు" అంటే ఏమిటి?

సమా: అదొక నూతన జననం. ఉన్నతమైన ఉనికిలోనికి జన్మించటం.

3. "చేతనలో" మార్పు వలన భూమి మీద జీవితం ఎలా మారుతుంది?

సమా: ఒక ఉన్నత శక్తిపాతం భూమి మీద అవతరిస్తుంది. అది స్వచ్ఛమైన వెలుగు; పరిపూర్ణ సత్యం. చేతనలో తీవ్రమైన మార్పు వస్తేనే మానవాళికి రక్షణ లభిస్తుంది. ప్రపంచ దుస్థితిలో కూరుకున్న ఈ తరుణంలో మరేదీ ప్రపంచాన్ని రక్షించలేదు!

"ఆచరణయోగ్యం" అని పిలవబడే విధానాలన్నీ కళ్ళకు గంతలతో చిన్న పిల్లలు ఆడే ఆటల వంటివి. అట్టివారు రాబోయే అవసరాన్ని గమనించలేరు గదా! నివారణ ఎలా అన్వేషించగలరు?

4. ప్రపంచానికి "శాశ్వతఐక్యత" సాధించగల సరియైన మార్గం ఏమిటి?

సమా: ఏకైకుని దివ్యచేతనను సాధించటం

CWM15: 60-61

ప్రపంచం ఎప్పుడూ ఐక్యమే!

దైవ కృతమైన ఈ ప్రపంచం ఒక్కొక్క అడుగు వేసుకుంటూ ముందుకు సాగుతుంది. ముందుగా చిన్న, చిన్న విషయాలను సాధించి, తరువాత తీవ్రమైన సమస్యలను పరిష్కరించటానికి పూనుకుంటుంది. ముందు జాతీయ సమైక్యతను సాధించకపోతే, ప్రపంచాన్ని సమైక్యం చేయటం వీలుపడదు. ఒకే మతాన్ని నమ్మి ఒకేభాష మాట్లాడి, ఒకే జాతికి చెందటమే "దేశం" కాదు. ఇవి కొంతవరకు సహకరిస్తాయి. అంతే! కాని వ్యక్తులు ఒకే కుటుంబ వ్యవస్థకు చెందకపోయినా, వారి మనోభావాలు, ఆకాంక్ష ఒకటిగా వుండి, ఒకే సాంప్రదాయానికి చెందినవారై, అభివృద్ధి కాముకులై, ఒక ప్రత్యేకమైన భవితను కాంక్షించే వారైతే ఒక జాతీయ భావాలుగల దేశంగా మనుగడ సాగించగలరు.

ఎప్పుడైతే "నా కుటుంబం" అనే భావన బదులుగా "దివ్యత్వ భావన" ఏర్పడుతుందో అప్పుడు కులం, గోత్రం, తెగ అనేవి బలహీనపడి, "జాతీయత" ఏర్పడుతుంది.

CWM 10: 307

"ప్రపంచం" అనే భావనలోనే "సమైక్యత" ఉంది. అది అప్పుడు, ఇప్పుడు ఎప్పుడూ ఇంతే. ఈ భావన బైటనుండివచ్చి ప్రపంచాన్ని ప్రభావితం చేసేది కాదు. ఇది "ప్రపంచం" అనే భావనలోనే అంతర్లీనంగా ఉంది!

ఈ విషయమై ప్రపంచం ఇంకా చైతన్యం కాలేదు. ఆ చైతన్యం దానికి కలిగించాలి. అటువంటి కృషి ప్రారంభించడానికి ఇదే అనుకూలమైన సరియైన సమయం!

ఎందుకంటే ఇప్పుడు ఒక నూతన శక్తి, దానిని "చేతన" అనిగాని, "తేజం" అనిగాని అనండి, ఫరవాలేదు ప్రపంచంలో – ఆవిర్భవించింది. ప్రపంచం అట్టి చేతనను గ్రహించగల సామర్థ్యాన్ని పుంజుకుంది.

CWM15: 62 *అనువాదం: కె. ఆర్. యల్. నరసింహారావు*

ఐక్యతాసూత్రాలు

నేను నా పొరుగువారిని ప్రేమించాలి. పొరుగువాడు అనే భావనతో కాదు.

పొరుగు దూరాల్లో ఏముంది? అతడు నీ సోదరుడని మతాలన్నీ చెప్పడంవల్ల కాదు. ఆ సోదరభావం మూలం ఎక్కడ ఉన్నది? కానీ అతను నేనే కావున. పొరుగు, దూరం,శరీరాన్ని ప్రభావితం చేస్తాయి, హృదయం దాని ఆవలకు పోతుంది. సోదర భావమనేది రక్త, దేశ, మత సంబంధమైనది. కాని స్వార్థం గొంతెత్తితే సోదరభావం ఎటుపోతుంది? భగవంతునిలో నివసించడం వల్ల మాత్రమే, హృదయం మనస్సు దేహం సార్వత్రిక యేకతా ప్రతిబింబంగా మారినపుడు మాత్రమే లోతైన, తిరుగులేని ప్రేమ సాధ్యమౌతుంది.

సంఘీభావానికి పరస్పరప్రేమకు మానవుని కారణాలకు చాలా కొద్దిప్రభావం, బహుతక్కువ విలువ మాత్రమే ఉంటాయి. దివ్య చైతన్యంతో ఐక్యమైనప్పుడు మాత్రమే నిజమైన ఐక్యతను తెలుసుకుంటారు.చేరుకుంటారు.

CWM10: 347

అతనిని హతమార్చినప్పుడు కూడా దైవాన్ని చూడండి. అప్పుడు యే ఒక్కరికీ నరకం ప్రాప్తించదు.

విరోధుల గురించి మాట్లాడుతారు కానీ వారు ఎక్కడ? ఈ విశ్వమనే గోళంలో ఒక పార్టీ మరొక పార్టీతో కుస్తీపట్టడాన్ని మాత్రమే నేను చూస్తాను. మానవాళి అంతా ఒక్కటే అనే ఐక్యతా భావనను మేల్కొల్పడానికి ఇదంతా వ్రాశారు. ప్రతి ఒక్కరు ఈ ఐక్యతా ఎరుక కలిగి ఉంటే అందరిలోనూ దైవాన్ని చూడగలిగితే దాని ననుభూతి చెందడం సులభతరమౌతుందని శ్రీఅరవిందో సిఫార్సు చేశారు.

CWM10: 279

తన ఐక్యతనెరిగిన యేకత్వంనుండియే చేతనా విభజన ప్రారంభమైంది. ఏక త్వంలో తన నానాత్వాన్నెరిగిన యేకత్వం దగ్గరకు చేరడానికే యీ చేతన విభజన జరిగింది. అది శకాలాలుగా అవ్వడంచేత యీ మార్గం మనకు స్థలకాలాలుగా తర్జుమాయైంది. అలాంటి శకలాలలో మనం ఒకటిగనుక, యీ చేతనకు సంబంధించిన ప్రతి బిందువు, తనను తానెరిగి, ఆది యైక్యతను గూడా యెరుగ గలగడం సాధ్యమే. బలవంతులచే బలహీనులు అణచి వేయబడనటువంటి ఒక క్రమశిక్షణ సమాజ జీవనంలో ఆవశ్యకం. సమాజంలో నివసించే వారందరూకూడా ఆ క్రమశిక్షణను గౌరవించాలి. సమాజమంతా సంతోషంగా ఉండాలంటే ఈ క్రమశిక్షణ విశాల హృదయంగల వ్యక్తి లేదా వ్యక్తులలో నెలకొల్పాలి. దైవానికి సమర్పించుకొని దైవం ఉనికిలో ఉండేవారై

ఉండాలి. ప్రపంచమంతా సంతోషంగా ఉండాలంటే దైవం సంకల్పంతో చైతన్యం కలిగిన వారి చేతుల్లోనే ప్రపంచం అధికంగా ఉండాలి. ప్రస్తుతానికది అసంభవం అనిపించవచ్చు. దైవ సంకల్పం పట్ల నిజంగా ఎరుకతో ఉండేవాళ్ళు బహుతక్కువ కాబట్టి వారికి అలా ఉండాలనే కోరికకూడా ఉండదు.

CWM12: 381- 82

భారతదేశాన్ని భాషా సమస్య పీడిస్తుంది. ఈ విషయం పట్ల మన ఖచ్చితమైన వైఖరి ఏమిటి?

ఒక సజీవ వాస్తవికతైవుండాలి, అంతేగాని అది యేకపక్షంగా విధంచబడిందై వుండకూడదు. భారతదేశమంతా ఐక్యమైనప్పుడు అందరికీ అర్థమయ్యే ఒక భాష అప్రయత్నంగా లభిస్తుంది.

CWM13:363

మీరంతా పడమటివారనీ ఇతరులంతా తూర్పువారనీ ఆలోచించడం నిలిపి వేయాలి. మానవులంతా మౌలికంగా దైవాన్నుండే ఉద్భవించారు. ఆ మూలానికి చెందిన ఏకత్వాన్ని భూమిపై అభివ్యక్తం చేయడానికే ఉన్నారు.

CWM13:379 శ్రీమాత

అనువాదం: జె. పద్మావతి (9295608568)
